

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

టీడీపీకి ఓట్లు వేశారని.. తలలు పగులగొట్టారు


గాయాలతో నూకరత్నం

- విశాఖలో కర్రలు, రాడ్‌తో దాడి
- తల్లి, ఇద్దరు పిల్లలకు గాయాలు
- స్థానిక వైసీపీ నేత అండ
- నలుగురిపై కేసు నమోదు
- 'వ్యక్తిగత కక్షలు'గా చూపేలా పోలీసుల యత్నం

14

శుక్రవారం | 17-5-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 48 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: నవమి ఉ. 8.49 తదుపరి దశమి; నక్షత్రం: పుబ్బ రా. 9.18 తదుపరి ఉత్తర; వర్జ్యం: తె. 5.25 మొదలు; దుర్ముహూర్తం: ఉ.8.20-9.11, మ.12.37-1.28; అమృతఘడియలు: మ.2.04-3.53; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 5.46; సూర్యాస్తమయం: 6.36 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


తెలంగాణలో భూముల మార్కెట్ విలువలను మరోసారి సవరించనున్నారు. వాటితోపాటే రిజిస్ట్రేషన్ చార్జీలు, స్టాంప్ డ్యూటీలను కూడా సవరించనున్నారు. ఈ మేరకు సంబంధిత అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచాలని, ఇందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని నిర్దేశించారు. వార్షిక లక్ష్యానికి అనుగుణంగా ఆదాయం పెరిగేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని, ఇందుకు అవసరమైన సంస్కరణలు చేపట్టాలని సూచించారు. అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని, పన్నుల ఎగవేతలు లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.

మళ్లీ భూమ్

రాష్ట్రంలో భూముల మార్కెట్ విలువల సవరణ

- రిజిస్ట్రేషన్ చార్జీలు, స్టాంపు డ్యూటీలు కూడా.. అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు
- చార్జీలను శాస్త్రీయంగా నిర్ధారించాలని నిర్దేశం.. సమన్వయంతో ఆదాయం పెంచాలి
- ఎగవేతలు, అవినీతి, అక్రమాలకు చెక్ చెప్పాలి.. సామాన్యులకు ఇసుక కొరత రావొద్దు
- రాబడుల శాఖల అధికారులతో సమీక్ష.. నిరుడు ఆశాజనకంగా లేదని అసంతృప్తి

హైదరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి ప్రధానంగా ఆదాయం తెచ్చి పెట్టే వాణిజ్య పన్నులు, స్టాంపులు-రిజిస్ట్రేషన్లు, ఎక్సైజ్, మైనింగ్ విభాగాల అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు గురువారం సచివాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భూముల మార్కెట్ విలువలు, రిజిస్ట్రేషన్ చార్జీలు, స్టాంపు డ్యూటీలపై చర్చ జరిగింది. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని చోట్ల భూములు, స్థిరాస్తుల విలువల భారీగా పెరిగాయని, కానీ.. అదే స్థాయిలో రెవెన్యూ రాబడుల్లో రిజిస్ట్రేషన్లు-స్టాంపు డ్యూటీల ద్వారా వచ్చే ఆదాయం పెరగలేదని గుర్తించారు. చాలాచోట్ల భూముల మార్కెట్ విలువకు, వాస్తవ క్రయ విక్రయాల రేట్లకు పొంతన లేకపోవటం ప్రధాన కారణమని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలోనే, "గత ప్రభుత్వం 2021లో భూముల విలువను, రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచింది. ఇప్పటికీ చాలా చోట్ల భూముల మార్కెట్ విలువకు, క్రయ విక్రయ ధరలకు భారీ తేడా ఉంది. నిబంధనల ప్రకారం ఏటా భూముల మార్కెట్ విలువను సవరించాల్సి ఉంటుంది. ఈ ధరల సవరణకు చర్యలు చేపట్టండి" అని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఎక్కడెక్కడ, ఏయే ప్రాంతాల్లో ధరలను సవరించాలో.. వ్యవసాయ భూములు, ఖాళీ

మిగతా 13వ పేజీలో...



'విద్యుత్ విచారణ' షురూ!

- ఛత్తీస్‌గఢ్‌తో ఒప్పందంపై ఫిర్యాదుల స్వీకరణ
- యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్లాంట్ల నిర్మాణంపైనా
- నోటిఫికేషన్ ఇచ్చిన నర్సింహారెడ్డి కమిషన్

13

125 సీట్లొచ్చినా.. కేంద్రంలో అధికారం మాదే

- కాంగ్రెస్‌కు మిత్రపక్షాలు మద్దతిస్తాయి
- బీజేపీకి 250 దాటితేనే అవకాశం
- ఓ వెబ్‌సైట్ ఇంటర్వ్యూలో సీఎం రేవంత్

13


గురువారం ఢిల్లీలో ఈసీ ముందు హాజరైన ఏపీ సీఎస్ జవహర్‌రెడ్డి, డీజీపీ హరీశ్ గుప్తా

బాధ్యత

మరిచారా!?

ఏపీ సీఎస్, డీజీపీలపై ఎన్నికల సంఘం కన్నెర్ర

- పోలింగ్ అనంతరం హింసపై తీవ్ర ఆగ్రహం
- పల్నాడు, అనంతపురం ఎస్పీల సస్పెన్షన్
- తిరుపతి ఎస్పీ, పల్నాడు జిల్లా కలెక్టర్ బదిలీ
- డీఎస్పీ నుంచి ఎస్సై దాకా 12 మందిపై వేటు
- వీరందరిపైనా శాఖాపరమైన విచారణ
- డీజీపీ నుంచి ఎస్సై వరకు చర్యలు ఇదే తొలి!
- హింసాత్మక ఘటనలపై దర్యాప్తునకు సిట్
- రెండు రోజుల్లో సమగ్ర నివేదికకు ఆదేశం
- నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
- కోడ్ ముగిసేలోగానే చార్జిషీట్లు వేయాలి
- కౌంటింగ్ తర్వాతా కేంద్ర బలగాల కొనసాగింపు
- 15 రోజులపాటు 25 కంపెనీలతో బందోబస్తు

అమరావతి/న్యూఢిల్లీ, మే 16(ఆంధ్రజ్యోతి): ఏపీలో పోలింగ్ అనంతరం చోటు చేసుకున్న హింసాత్మక ఘటనలపై కేంద్ర ఎన్నికల కమిషన్ భగ్గుమంది. మునుపెన్నడూ లేని విధంగా.. అసాధారణ రీతిలో ఎస్పీలు, జిల్లా కలెక్టర్లు, 12మంది దిగువస్థాయి పోలీసు అధికారులపై బదిలీ, సస్పెన్షన్ వేటు, శాఖాపరమైన విచారణకు ఆదేశాలు జారీ చేసింది. పల్నాడు, తిరుపతి, అనంతపురం జిల్లాల్లో విచ్చలవిడిగా దాడులు జరుగుతున్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై మండిపడింది. 'ఏపీలో ఏం జరుగుతోంది? స్వయంగా వచ్చి వివరణ ఇవ్వండి' అని ఆదేశించడంతో... గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి, డీజీపీ హరీశ్ గుప్తా, ఇంటెలిజెన్స్ డీజీ విశ్వజీత్ ఢిల్లీలో ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్, కమిషనర్లు జ్ఞానేశ్ కుమార్, సుఖ్‌బీర్‌సింగ్ సంధూ ముందు హాజరయ్యారు. ఈ భేటీలో జరిగిన చర్చ, తీసుకున్న నిర్ణయాలపై ఈసీ అధికారిక ప్రకటన జారీ చేసింది. "ఏపీలో పోలింగ్ అనంతరం జరిగిన హింసాత్మక ఘటనలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం

మిగతా 3వ పేజీలో...



నిందితులు సమన్లకు హాజరైతే..

అరెస్టు చేసే అధికారం

ఈడీకి లేదు

- చేయాల్సి వస్తే ప్రత్యేక కోర్టు అనుమతి తప్పనిసరి
- కారణాలపై సంతృప్తి చెందితేనే కస్టడీకి అంగీకారం
- ఈడీ అరెస్టులపై సుప్రీంకోర్టు అత్యంత కీలక తీర్పు
- మనీలాండరింగ్ యాక్ట్ సెక్షన్ 19 అధికారాలపై స్పష్టత

న్యూఢిల్లీ, మే 16: నగదు అక్రమ చెలామణీ నివారణ చట్టం (పీఎంఎల్‌ఏ) సెక్షన్-19 కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కు ఉండే అధికారాలపై స్పష్టతనిస్తూ సుప్రీంకోర్టు గురువారం అత్యంత కీలక తీర్పునిచ్చింది. ప్రత్యేక కోర్టు జారీ చేసిన సమన్లకు స్పందించి.. నిందితులు హాజరవుతున్నట్లైతే అరెస్టు చేసే అధికారం ఈడీకి లేదంటూ స్పష్టం చేసింది. సమన్లకు సమాధానం ఇవ్వడానికి ముందు మాత్రం అరెస్టు చేయలేరని కుండబద్దలు కొట్టింది. ఒకవేళ ఇలాంటి సందర్భాల్లో అరెస్టు చేయాల్సిన పరిస్థితి వస్తే, ముందుగా కోర్టు అనుమతి

మిగతా 2వ పేజీలో...

రాజధానిలో జడివాన

హైదరాబాద్‌లో కుండపోత.. యూసుఫ్‌గూడలో 9 సెం.మీ., మలక్‌పేటలో 8 సెం.మీ.పైనే

- లోతట్టు ప్రాంతాల జలమయం
- ట్రాఫిక్‌తో వాహనదారుల ఇక్కట్లు
- జిల్లాల్లోనూ మోస్తరు వర్షాలు
- పిడుగుపాటుకు ముగ్గురి మృతి
- తడిసిన ధాన్యం.. పంటలకు దెబ్బ
- నేడు, రేపు కూడా వానలు
- అధికారులూ అప్రమత్తం: సీఎం


హైదరాబాద్‌లోని వీఎస్టీ వద్ద వర్ష బీభత్సం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో కుండపోత వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై భారీగా వరద నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చెట్లు, కొమ్మలు విద్యుత్తు తీగలపై విరిగిపడటంతో పలుచోట్ల సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గురువారం మధ్యాహ్నం వరకు నగరంలో ఎర్రటి ఎండలే కాయగా.. 3 గంటల తర్వాత పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశం పూర్తిగా మేఘావృతమై భారీ వర్షం పడింది. యూసుఫ్‌గూడలో 9 సెం.మీ., బంజారాహిల్స్ వెంకటేశ్వరకాలనీ 8.7 సెం.మీ, మలక్‌పేటలో 8.5, బేగంబజార్‌లో 8.3 సెం.మీ. వర్షపాతం నమోదైంది. జూబ్లీహిల్స్, అమీర్‌పేట, ఎర్రగడ్డ, నాంపల్లి, అంబర్‌పేట, బేగంబజార్, గోల్కొండ, గౌలిగూడ, ఖైరతాబాద్, ఆసిఫ్‌నగర్, షేక్‌పేట, ఫిల్మ్‌నగర్, చార్మినార్, మూసాపేట, మోతీనగర్, మాదాపూర్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, బోరబండ ప్రాంతాల్లోనూ వాన దంచికొట్టింది. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 9 ఉదయనగర్ కాలనీలో నాలా రిటైనింగ్‌వాల్ కూలడంతో రోడ్లపై నిలిచిన వాహనాలు కొట్టుకుపోయాయి. ఆగాపురా, ఆస్మాన్‌గఢ్, మల్కాజిగిరి, రామచంద్రాపురంలో చెట్లు, కొమ్మలు విద్యుత్తు తీగలపై విరిగిపడటంతో సరఫరా నిలిచిపోయింది. విద్యుత్తు శాఖ అధికారులు తక్షణమే మరమ్మతులు

మిగతా 11వ పేజీలో...


మాల్‌ను స్వాధీనం చేసుకుంటున్నట్లు ఫ్లెక్సీ

ఆర్మూర్‌లో జీవన్‌రెడ్డి

మాల్ స్వాధీనం

- తాళం వేసిన టీఎస్‌ఆర్టీసీ అధికారులు
- రూ.2.51కోట్లకు పైగా అద్దె బకాయి
- చెల్లించకపోవడంతో చర్యలు

ఆర్మూర్ టౌన్/హైదరాబాద్, మే 16(ఆంధ్రజ్యోతి): అద్దె బకాయిలు చెల్లించని నేపథ్యంలో ఆర్మూర్‌లోని జీవన్‌రెడ్డి మాల్‌ను ఆర్టీసీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం ఉదయం మాల్ వద్దకు చేరుకున్న అధికారులు భవనానికి నోటీసులు అతికించి.. తాళం వేశారు. ఒప్పందం ప్రకారం విష్ణుజిత్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రైవేటు లిమిటెడ్ బాధ్యులు అద్దె చెల్లించనందు వల్ల హైకోర్టు ఆదేశాల మేరకు జీవన్‌రెడ్డి మాల్‌ను స్వాధీనం చేసుకుంటున్నట్టు మైక్‌లో ప్రకటించారు. మాల్‌లో ఉన్న షాపుల యజమానులు సహకరించాలని కోరారు. 2013 జూన్ 1న అప్పటి రాష్ట్ర ప్రభుత్వం.. నిజామాబాద్ జిల్లాలోని

మిగతా 13వ పేజీలో...

ఎవరికీ ప్రత్యేక మినహాయింపు లేదు

- ఏది న్యాయమని భావించామో అదే చెప్పాం
- తీర్పుపై విమర్శనాత్మక విశ్లేషణను స్వాగతిస్తాం
- 'కేజ్రీవాల్‌కు స్పెషల్ ట్రీట్‌మెంట్'.. అమిత్‌షా వ్యాఖ్యలపై సుప్రీం స్పందన

2



అప్పు తగ్గించుకుందాం!

ప్రాజెక్టుల రుణాల రీస్ట్రక్చరింగ్ దిశగా సర్కారు యత్నాలు



- తక్కువ వడ్డీకి రుణాలిచ్చే జైకా, ఏడీబీ, కొరియన్ బ్యాంక్ ఐడీఆర్‌డీ వంటివాటికి అప్పులను మళ్లించే ఆలోచన
- ఈ దిశగా ఇప్పటికే ఆర్థిక శాఖ అధికారులకు ఆదేశాలు
- రఘురామ్‌రాజన్ సూచనతో మోదీతో సీఎం భేటీ
- రీస్ట్రక్చరింగ్ ద్వారా నాలుగు శాతానికి తగ్గనున్న వడ్డీ రేటు
- తద్వారా నెలకు రూ.700-900 కోట్ల మేర వడ్డీ ఆదా

హైదరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాజెక్టుల కోసం కార్పొరేషన్ల పేర తీసుకున్న గ్యారంటీ అప్పులను రీస్ట్రక్చర్ చేసుకునే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు 'రుణాల రీస్ట్రక్చరింగ్'పై పరిశీలన చేయాలంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆర్థిక శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గడిచిన పదేళ్లలో రాష్ట్రం అప్పులకుప్పలా మారిపోయిందని.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అడ్డగోలు అప్పులు గుదిబండలా మారాయని రేవంత్ సర్కారు ఆందోళన వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. డిసెంబరులో అధికారం చేపట్టిన తర్వాత.. కొద్దినెలల వ్యవధిలోనే పార్లమెంటు ఎన్నికలు రావడం, మార్చి నెలలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ కోసం అసెంబ్లీ సమావేశాలు నిర్వహించడంతో ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై అంతగా దృష్టి సారించలేకపోయింది. ఇప్పుడు ఎన్నికలు పూర్తి కావడంతో ఆ అంశంపై దృష్టి పెట్టి.. అప్పుల సమస్యను పరిష్కరించుకునే మార్గాలను అన్వేషిస్తోంది. అందునా ప్రధానంగా కార్పొరేషన్ల గ్యారంటీ అప్పులను రీస్ట్రక్చర్ చేయించుకోవాలని ఆలోచిస్తోంది. ఈ రుణాలను ఇతర అంతర్జాతీయ ఆర్థిక సంస్థలకు బదిలీ చేయించుకుని, వడ్డీ సొమ్మును ఆదా చేసుకోవాలన్నది సర్కారు ఆలోచన. ఇలా కనీసం నెలకు రూ.700-900 కోట్లు ఆదా అవుతాయని భావిస్తోంది. అంటే సంవత్సరానికి ఎంత

మిగతా 11వ పేజీలో...



బీఆర్ఎస్‌లో ఎమ్మెల్సీ చిచ్చు!

పట్టభద్రుల అభ్యర్థి ఎంపికపై గులాబీ పార్టీ నాయకుల గుర్రు

- పల్లా వర్గం నేతకు టికెట్ పట్ల అసంతృప్తి.. కొత్తగా చేరిన వ్యక్తికి ఎలా ఇస్తారని గుస్సా
- కేటీఆర్‌తో భేటీకి పలువురు గైర్హాజరు.. ఉప ఎన్నికపై ప్రభావం చూపుతుందన్న ఆందోళన

వరంగల్, మే 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక బీఆర్ఎస్‌లో చిచ్చు పెట్టింది. తమను సంప్రదించకుండా ఏకపక్షంగా అభ్యర్థిని ప్రకటించి, 'గెలిపించుకు రండి' అంటే ఎలా కుదురుతుందంటూ అధిష్ఠానంపై గులాబీ నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చిన్నబాస్ కేటీఆర్ నిర్వహించిన సమావేశాన్ని పలువురు నేతలు బహిష్కరించి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ నెల 27న జరగనున్న వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఉపఎన్నికకు అభ్యర్థిగా అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన ఏనుగుల రాకేశ్‌రెడ్డిని అధిష్ఠానం ఎంపిక చేసిన విషయం తెలిసిందే. కాగా, రాకేశ్‌రెడ్డికి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అనుచరుడిగా పేరుంది. దీంతో కొందరు గులాబీ నేతలు తమపై పల్లా పెత్తనమేంటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ అసంతృప్తుల కారణంగా.. నాలుగుసార్లు గెలిచిన ఎమ్మెల్సీ స్థానంలో బీఆర్ఎస్ ఎదురీదుతోందనే చర్చ జరుగుతోంది. వాస్తవానికి ఈ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక గులాబీ పార్టీకి అగ్నిపరీక్షగా మారింది. శాసనమండలి పునరుద్ధరణ తరువాత వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 2007, 2009లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా కపిలవాయి దిలీప్‌కుమార్ వరుసగా రెండుసార్లు విజయం సాధించారు. అనంతరం 2015, 2021లో వరుసగా రెండుసార్లు పల్లా రాజేశ్వర్‌రెడ్డి బీఆర్ఎస్ తరఫున పోటీ చేసి గెలిచారు. ఇలా 2007 నుంచి 2021 వరకు నాలుగు పర్యాయాలు జరిగిన ఎన్నికల్లో గులాబీ పార్టీ విజయం

మిగతా 13వ పేజీలో...



అబ్ కీ బార్?

మహారాష్ట్ర సీఎం శిందే లగేజీ తనిఖీ

నాసిక్: ఎన్నికల్లో ఓటర్లకు పంచడానికి నగదు తరలిస్తున్నారనే ఆరోపణలు రావడంతో మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ శిందే లగేజీని ఎన్నికల సంఘం అధికారులు తనిఖీ చేశారు. గురువారం మహారాష్ట్రలో నాసిక్ జిల్లా పంచవటి పర్యటనకు శిందే వచ్చినపుడు ఆయన వెంట తెచ్చుకున్న బ్యాగులను అధికారులు పరిశీలించారు. శిందే హెలికాప్టర్‌లో నగదు ఉన్న బ్యాగులు తీసుకుని నాసిక్ వచ్చారంటూ శివసేన(యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ ఆరోపించడంతో తనిఖీలు చేశారు.

నేను జైలుకు వెళ్లకూడదంటే
చీపురుకు ఓటేయండి

- పంజాబ్ ప్రజలకు కేజ్రీవాల్ వినతి


స్వర్ణదేవాలయంలో ప్రార్థనలు చేస్తున్న కేజ్రీవాల్

అమృత్‌సర్, మే 16: తాను మళ్లీ జైలుకు వెళ్లకూడదని అనుకుంటే చీపురుకట్ట గుర్తుకు ఓటేయాలని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పంజాబ్ ప్రజలను కోరారు. గురువారం అమృత్‌సర్‌లో జరిగిన రోడ్డు షోలో ఆయన ప్రసంగిస్తూ తాను జైలుకు వెళ్లాలా, వద్దా అన్నది ఓటర్ల తీర్పుపై ఆధార పడి ఉంటుందని చెప్పారు. "మీరు ఝాడూ మీటను నొక్కితే నేను జైలుకు వెళ్లాల్సిన పని ఉండదు" అని అన్నారు. కేజ్రీవాల్‌కు స్వేచ్ఛ ఇచ్చేందుకు బటన్ నొక్కుతారో, జైలుకు పంపించేందుకు నొక్కుతారో తేల్చుకోవాలని అన్నారు. చీపురుకు ఓటేస్తే రాజ్యాంగాన్ని, దేశాన్ని కాపాడినట్టవుతుందని చెప్పారు. తాను ఢిల్లీలో 2.5 కోట్ల మందికి ఉచితంగా మందులు పంపిణీ చేసినా తనకు మాత్రం జైలులో 15 రోజుల పాటు ఇన్సులిన్ లభించలేదని అన్నారు. తన సుగర్ లెవల్ 300 నుంచి 350 పాయింట్లకు పెరిగిందని, ఇది ఇలాగే ఉంటే కాలేయం, మూత్రపిండాలు దెబ్బతింటాయని చెప్పారు. తనకు ఇన్సులిన్ ఇవ్వకుండా ఏమి చేయాలని అనుకున్నారో తెలియదని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆయన స్వర్ణ మందిరానికి వెళ్లి పూజలు చేశారు.



ఎన్డీఏకు 200 సీట్లు కష్టమే

- బీజేపీ అధికారం చేపట్టే అవకాశమే లేదు: ఖర్గే

భువనేశ్వర్, మే 16: ప్రస్తుత ఎన్నికల్లో ఇండియా కూటమి విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. గురువారం భువనేశ్వర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొత్తం 200 సీట్లు సంపాదించడానికే ఎన్డీఏ తంటాలు పడుతోందని, అందువల్ల కేంద్రంలో ఆ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశమే లేదని చెప్పారు. దక్షిణాదిలో బీజేపీకి సీట్లేమీ రావని, ఉత్తరాదిలో సీట్లు సగానికి సగం తగ్గుతాయన్నారు. ఒడిసాలోనూ బీజేడీ, బీజేపీలతో ప్రజలు విసిగిపోయారని, అందువల్ల కాంగ్రెస్‌ను ఆదరిస్తున్నారని చెప్పారు. బీజేపీకి గెలిచే స్థానాలు ఇంకెక్కడ ఉన్నాయని ప్రశ్నించారు. సంక్షేమ పథకాలు అమలు చేసి, ఎస్సీ, ఎస్టీ, బీసీల హక్కులు కాపాడేది కాంగ్రెస్ మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. ఖర్గే వ్యాఖ్యలను బీజేపీ సీనియర్ నాయకుడు, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఖండించారు. ఇండియా కూటమిలోని పార్టీలకు ఉమ్మడి అజెండా లేదని విమర్శించారు.

మొదటి నాలుగు దశల్లో 67% పోలింగ్: ఈసీ

న్యూఢిల్లీ, మే 16: లోక్‌సభ ఎన్నికల మొదటి నాలుగు దశల్లో మొత్తం 66.95 శాతం పోలింగ్ నమోదైందని కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రకటించింది. దాదాపు 97కోట్ల మంది ఓటర్లలో ఇప్పటివరకూ 45.10 కోట్ల మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని వెల్లడించింది. రానున్న దశల్లో ఓటర్లు పెద్దసంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటు వేయాలని గురువారం ఓ ప్రకటనలో కోరింది. మిగిలిన దశలకు సంబంధించి ఓటర్లకు సమాచారం అందించడం, ఓటు వేసేలా ప్రోత్సహించడంతో పాటు ఓటింగ్ ప్రక్రియను సులభతరం చేసే చర్యలు ముమ్మరం చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారులను ఆదేశించినట్లు వివరించింది. పోలింగ్ రోజు సెలవుదినం కాదని, ప్రజాస్వామ్య పండుగలో పాల్గొనడానికి గర్వకారణమైన రోజుగా భావించి, ఓటర్లు పెద్దసంఖ్యలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ కోరారు.

ఇండియా కూటమిలోనే ఉన్నా: మమత

- ఆమెను విశ్వసించలేం: అధీర్ రంజన్




న్యూఢిల్లీ, మే 16: 'ఇండియా' కూటమి సభలకు దూరంగా ఉంటున్న తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ సీఎం మమతాబెనర్జీ మరోమారు స్పందించారు. "ఇండియా కూటమిని నేనే నిర్మించాను. ఆ కూటమిలోనే ఉన్నాను. ఒకవేళ కేంద్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడితే మా పార్టీ బయటనుంచి మద్దతు ఇస్తుంది." అని మమత స్పష్టం చేశారు. కూటమి విషయంలో తన వైఖరిని చాలామంది తప్పుగా అర్థం చేసుకుంటున్నారని, దానివల్లే తాను ఈ వివరణ ఇస్తున్నానని కూడా ఆమె తెలిపారు. బీజేపీకి కాంగ్రెస్, సీపీఎం తెరవెనుక మద్దతు ఇస్తుండటం వల్లే బెంగాల్‌లో ఇండియా కూటమి ఏర్పడలేదన్నారు. అయితే, మమత మాటలను తాను విశ్వసించబోనని బెంగాల్ పీసీసీ అధ్యక్షుడు అధీర్ రంజన్ చౌధరీ అన్నారు. "కూటమిని మమత వదిలి పారిపోయారు. ఆమె బీజేపీతో కలిసినా ఆశ్చర్యం లేదు. కాంగ్రెస్ పార్టీ సర్వనాశనం అవుతుందని నిన్నటిదాకా మాట్లాడారు.. మా పార్టీకి 40 ఎంపీ సీట్లు కూడా రావని కూడా అన్నారు. అలాంటిది ఇప్పుడు మమత మాట మారిందంటేనే.. కేంద్రంలో కాంగ్రెస్, కూటమి పార్టీలు అధికారంలోకి రానున్నాయనేది స్పష్టమవుతోంది. అవకాశవాద రాజకీయాలతో మమత విశ్వసనీయతను కోల్పోయారు" అని అధీర్ విమర్శించారు.

మోదీ కష్టాల్లో ఉన్నప్పుడు సాయం చేశా: శరద్ పవార్

ముంబై, మే 16: మోదీ కష్టాల్లో ఉన్నప్పుడు తాను ఎంతో సాయం చేశానని, అలాంటిది ఇప్పుడాయన తనపైనే విమర్శలు గుప్పిస్తున్నారని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ అన్నారు. 2004-14 మధ్యలో తాను కేంద్ర వ్యవసాయమంత్రిగా ఉన్నప్పుడు అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రి మోదీ వ్యవసాయ రంగంలోని సమస్యలపై తన వద్దకు వచ్చేవారని చెప్పారు. అప్పుడు గుజరాత్‌లో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో ఉండేదని గుర్తుచేశారు. ఒకానొక సమయంలో గుజరాత్ ముఖ్యమంత్రి మోదీ తనకు ఫోన్ చేసి ఇజ్రాయెల్‌లో విశిష్టమైన వ్యవసాయ పద్ధతులను అధ్యయనం చేసేందుకు అక్కడకు వెళ్లాలనుకుంటున్నానని చెప్పారని, దానికి అంగీకరించి తనతో పాటు ఆయన్ను అక్కడకు తీసుకెళ్లానని చెప్పారు. అలాగే తనను గుజరాత్‌కు ఆహ్వానిస్తే వెళ్లినట్లు తెలిపారు. అలాంటిదిప్పుడు రైతుల కోసం శరద్ పవార్ ఏం చేయలేదని మోదీ అంటున్నారని, ఆయన వ్యాఖ్యలను తాను పట్టించుకోనని చెప్పారు.

సుప్రీం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కపిల్ సిబల్



న్యూఢిల్లీ, మే 16 (ఆంధ్రజ్యోతి): అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ గురువారం ఎన్నికయ్యారు. ఆయనకు 1066 ఓట్లు రాగా, సమీప ప్రత్యర్థి ప్రదీప్ రాయ్‌కి 689 ఓట్లు లభించాయి. ప్రస్తుతం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్న సీనియర్ ఆదిష్ అగర్వాల్ కూడా పోటీ పడినప్పటికీ ఆయనకు కేవలం 296 ఓట్లు వచ్చాయి. ఈ పదవికి మొత్తం ఆరుగురు పోటీ పడడం గమనార్హం. 1995-96, 1996-97, 2001 సంవత్సరాల్లో కూడా సిబల్ ఈ పదవిని చేపట్టారు. అత్యంత భారీ మెజారిటీతో కపిల్ సిబల్ ఎన్నిక కావడం ఉదారవాద, లౌకిక, ప్రగతిశీల శక్తులకు భారీ విజయమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాంరమేశ్ అన్నారు.

41 రకాల మందుల ధరల తగ్గింపు

న్యూఢిల్లీ, మే 16 : మధుమేహం, గుండె, కాలేయ సంబంధిత సమస్యల చికిత్సలో వినియోగించే 41 రకాల మందులు, ఆరు రకాల ఫార్ములేషన్ల ధరలను కేంద్ర ప్రభుత్వం తగ్గించింది. ధరలు తగ్గించిన మందుల్లో కొన్ని యాంటీ బయాటిక్స్, మల్టీవిటమిన్లు, యాంటాసిడ్స్ ఉన్నాయి. ధరల తగ్గింపునకు సంబంధించి నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ(ఎన్‌పీపీఏ) గురువారం ఓ నోటిఫికేషన్ జారీ చేసింది. ధరల తగ్గింపుపై డీలర్లకు వెంటనే సమాచారం ఇవ్వాలని, తగ్గింపును తక్షణమే అమలు చేయాలని ఔషధ తయారీ కంపెనీలను ఆదేశించింది. ప్రభుత్వ నిర్ణయం వల్ల కొన్ని రకాల మందుల ధరలు భారీగా తగ్గనున్నాయి.

సీఏఏని ఎవరూ తీసేయలేరు!

ఏం చేస్తారో చేసుకోండి.. 'ఇండీ' కూటమికి ప్రధాని సవాల్

- ఆ చట్టం అమలు మొదలైంది
- శరణార్థులకు పౌరసత్వం ఇచ్చేస్తున్నాం
- ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లు లాక్కునేందుకు విపక్షాల కుట్ర
- యూపీ ప్రచారంలో మోదీ ఫైర్


యూపీలోని జౌన్‌పూర్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మోదీ

ఆజంగఢ్/జౌన్‌పూర్, మే 16: తాము అధికారంలోకి వస్తే పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) తీసేస్తామన్న విపక్ష 'ఇండీ' కూటమిపై ప్రధాని మోదీ విరుచుకుపడ్డారు. ఆ చట్టాన్ని ఎవరూ తీసివేయలేరని, ఏం చేస్తారో చేసుకోండని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. గురువారం ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రల్లో పలు చోట్ల ఎన్నికల ప్రచార సభల్లో ఆయన ప్రసంగించారు. బుధవారం 16 మంది శరణార్థులకు భారత పౌరసత్వం ప్రదానం చేయడాన్ని ప్రస్తావిస్తూ.. దేశంలో సీఏఏ అమలు మొదలైపోయిందన్నారు. విపక్షాలు అసత్యాలు ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. 'పౌరసత్వం పొందిన శరణార్థులు హిందువులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు. దీర్ఘకాలంగా దేశంలో శరణార్థులుగా జీవిస్తున్నారు. మతప్రాతిపదికన జరిగిన దేశవిభజన బాధితులు వీరు. గద్దెనెక్కితే సీఏఏని తీసివేస్తామని ఇండీ కూటమి అంటోంది. కానీ ఎవరూ ఈ చట్టాన్ని తొలగించలేరు. వేల మందికి పౌరసత్వం ఇవ్వబోతున్నాం' అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ మోసకారి పార్టీ అని.. మతతత్వ జ్వాలల్లో దేశం తగులబడేలా చేసిందని ధ్వజమెత్తారు. జమ్మూకశ్మీరుకు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే 370 అధికరణను కూడా తాము తీసివేశామన్నారు. శ్రీనగర్ లోక్‌సభ స్థానానికి ఇటీవల జరిగిన పోలింగ్ సందర్భంగా.. ప్రజాస్వామ్య పండుగలో ప్రజలు సగర్వంగా పాల్గొన్నారని.. ఈ అధికరణను ఎవరూ పునరుద్ధరించలేరనడానికి ఇది నిదర్శనమని తెలిపారు. సమాజ్‌వాదీ పార్టీ, దాని అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్‌పై ప్రధాని మండిపడ్డారు. గతంలో ఆజంగఢ్‌ను ఉగ్రవాద కేంద్రంగా తయారుచేశారని.. బాంబు పేలుళ్లకు పాల్పడినవారికి క్షమాభిక్ష పెట్టారని.. రాజకీయాల ముసుగులో స్లీపర్ సెల్స్ పనిచేశాయని.. ఈ కారణంగా దేశమంతటా ఉగ్రవాదం విస్తరించిందని ఆరోపించారు. 'కాంగ్రెస్, సమాజ్‌వాదీ వేర్వేరు పార్టీలైనా రెంటికీ ఒకే దుకాణం ఉంది. బుజ్జగింపు రాజకీయాలు, అబద్ధాలు, కుటుంబ వాదం, అవినీతిని అక్కడ అమ్ముతుంటారు. ఈ ఎన్నికల్లో బుజ్జగింపుల ట్రిపుల్ డోస్‌తో ముందుకొచ్చారు. రాజ్యాంగం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు ఇచ్చిన రిజర్వేషన్లను లాక్కుని.. తమ ఓటుబ్యాంకుకు కట్టబెట్టాలనుకుంటున్నారు. అలాగే ఈ కూటమి మీ (ప్రజల) ఆస్తిలో సగం తీసుకుని తమ ఓటుబ్యాంకుకు ఇవ్వాలనుకుంటోంది. మైనారిటీలకు ప్రత్యేక బడ్జెట్ పెడతామంటోంది. నేను బతికున్నంతవరకు ఇలాంటివి జరగనివ్వను. కాంగ్రెస్ వాళ్లు ఎక్స్‌రే మెషీన్ (కులగణన) తెచ్చారు. గత వారం రోజులుగా వారి ఎజెండాను బయటపెడుతున్నాను. ఆ మెషీన్‌పగిలిపోయినట్లే కనిపిస్తోంది' అని అన్నారు. 500 ఏళ్ల నిరీక్షణ తర్వాత అయోధ్యలో రామాలయం నిర్మించుకున్నామని.. యావద్దేశంతో పాటు ప్రపంచంలోని ప్రతి భారతీయుడు ఇందుకు ఆనందిస్తున్నారని.. కానీ కుటుంబవాదులు మాత్రం దూషిస్తున్నారని విమర్శించారు. సమాజ్‌వాదీ యువరాజు (అఖిలేశ్), ఆయన బాబాయి రామాలయం పనికిమాలినదని అంటున్నారని, కాశీని కూడా ఎద్దేవా చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రపంచంలో భారత్ సత్తాను చాటే ప్రధానిని ఎన్నుకోవడానికి ప్రస్తుత ఎన్నికలు అవకాశమని మోదీ అన్నారు. ఐదేళ్లలో ఐదుగురిని ప్రధాన మంత్రులను చేయాలని ఇండీ కూటమి అనుకుంటోందని ఎద్దేవాచేశారు. జూన్ 4 తర్వాత ఈ కూటమి విచ్ఛిన్నమవుతుందని చెప్పారు. ఫలితాలు వచ్చాక ఢిల్లీ, లఖ్‌నవూ యువరాజులు (రాహుల్‌గాంధీ, అఖిలేశ్) వేసవి విహార యాత్రకు విదేశాలకు వెళ్తారని ఆయన అన్నారు.

హిందూ బడ్జెట్.. ముస్లిం బడ్జెట్!

మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం ఉన్నప్పుడు.. మైనారిటీలకు బడ్జెట్‌లో 15% కేటాయించాలని కాంగ్రెస్ ప్రతిపాదించిందని మోదీ తెలిపారు. అప్పట్లో తాను గుజరాత్ సీఎంగా ఉన్నానని.. బీజేపీ దీనిని పూర్తిగా వ్యతిరేకించిందని, దాంతో వెనక్కి తగ్గారని చెప్పారు. ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ ఆ ప్రతిపాదన తెస్తోందన్నారు. 'కాంగ్రెస్‌ను ఎన్నుకుంటే బడ్జెట్‌ను హిందూ బడ్జెట్, ముస్లిం బడ్జెట్‌గా విభజిస్తుంది. దీనిని నేను అనుమతించను. మతప్రాతిపదికన రిజర్వేషన్‌కూ అంగీకరించను. బాబాసాహెబ్ అంబేడ్కర్ కూడా దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు' అని తెలిపారు. మోదీ వ్యాఖ్యలను కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఖండించారు. 2013లో ముస్లిం బడ్జెట్ తేవాలని కాంగ్రెస్ అనుకోలేదని.. ఇది పూర్తిగా తప్పని, ఈ వ్యాఖ్యలు దారుణమని, మోదీ ప్రసంగ రచయితలకు మతిభ్రమించినట్లుగా ఉందని ధ్వజమెత్తారు. వాస్తవానికి 2013లో వ్యవసాయంపై ముఖ్యమంత్రులతో కమిటీ వేయాలని నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ భావించారని.. ఆ తర్వాత మోదీ ప్రధాని అయ్యారని జైరాం తెలిపారు.

లోకం తీరు




ఆరో దశ బరిలో 92 మంది మహిళలు

న్యూఢిల్లీ, మే 16 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభకు ఆరో దశలో జరగనున్న ఎన్నికల్లో 92 మంది మహిళలు పోటీ చేస్తున్నారు. ఈ దశ ఎన్నికల బరిలో ఉన్న 869 మంది అభ్యర్థుల్లో 866 మంది అఫిడవిట్లను అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) విశ్లేషించింది. ఆ వివరాలను గురువారం వెల్లడించింది. 866 మందిలో 338 మంది (39%) కోటీశ్వర్లున్నారు. బీజేపీ తరఫున హరియాణాలోని కురుక్షేత్ర నుంచి బరిలోకి దిగిన నవీన్ జిందాల్‌కు అత్యధికంగా రూ.1,241 కోట్ల ఆస్తులున్నాయి. అభ్యర్థులందరి సగటు ఆస్తులు రూ.6.21 కోట్లుగా ఉన్నాయి. ఇక మహిళా అభ్యర్థులు 11శాతం ఉన్నారు. 180 మంది అభ్యర్థులపై క్రిమినల్ కేసులు, 141 మందిపై తీవ్రమైన క్రిమినల్ కేసులున్నాయి. 12 మంది వివిధ కేసుల్లో దోషులుగా తేలారు. ఆరుగురు తమపై హత్యకేసులు, 21మంది తమపై హత్యాయత్నం కేసులున్నట్టు అఫిడవిట్లలో పేర్కొన్నారు. మహిళలపై దాడులకు సంబంధించి 24 మందిపై కేసులు నమోదు కాగా వారిలో ముగ్గురిపై అత్యాచారం కేసులున్నాయి. విద్వేష ప్రసంగాలు చేసినందుకు 16 మందిపై కేసులు నమోదయ్యాయి. ఇక విద్యార్హతల విషయానికొస్తే 332 మంది ఐదు నుంచి 12వ తరగతి వరకు చదువుకోగా, 487 (56%) మంది డిగ్రీ, ఆపై ఉన్నత విద్యను అభ్యసించారని ఏడీఆర్ పేర్కొంది. ఆరో దశ ఎన్నికలు ఈనెల 25వ తేదీన జరగనున్నాయి.

సంతానలేమికి కారణం తెలిసింది!

టీఈఎక్స్13బీ జన్యువు లేమితో వీర్యకణాల్లో లోపం.. పురుషులకు తల్లి నుంచి సంక్రమించే జన్యువు

- అందకపోతే సంతానలేమి సమస్యలు
- సీసీఎంబీ శాస్త్రవేత్తల పరిశోధనలో వెల్లడి



హైదరాబాద్, మే 16: పురుషుల్లో వీర్యకణాల లోపం సమస్యకు టీఈఎక్స్13బీ జన్యువు లేకపోవటం ప్రధాన కారణమని సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) శాస్త్రవేత్తలు కనుగొన్నారు. సీసీఎంబీ సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ కె.తంగరాజ్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ స్వస్తిరాయ్ చౌదరి బృందం పరిశోధనలో ఇది వెల్లడైంది. ప్రపంచంలో ప్రతి ఏడు జంటల్లో ఒక జంట సంతానలేమి సమస్యతో బాధపడుతోంది. వీరిలో సగం మందిలో మగవారి వీర్యకణాల లోపం కారణంగా నిలుస్తోంది. వీర్యకణాలు తగినన్ని లేకపోవడం, కణాలు అసాధారణంగా కదలడం, కొందరిలో వీర్యమే లేకపోవడం సమస్యగా మారింది. జన్యులోపాలవల్లే ఈ సమస్య తలెత్తుతోందని తెలిసినప్పటికీ.. ఏ జన్యువులు కారణంగా నిలుస్తున్నాయో ఇప్పటి వరకూ వెల్లడికాలేదు. దీనిపై సీసీఎంబీ శాస్త్రవేత్తలు మరో మూడు పరిశోధన సంస్థలతో కలిసి అధ్యయనం చేపట్టారు. వీర్యకణాల లోపం ఉన్న వారి వీర్యం నమూనాలను, ఎలాంటి లోపంలేని వారి వీర్యం నమూనాలను అధునాతన సీక్వెన్సింగ్ ప్రక్రియ ద్వారా పరిశీలించారు. ఈ క్రమంలో రెండు టీఈఎక్స్13బీ జన్యు మ్యుటేషన్లను గమనించామని.. మొదటి మ్యుటేషన్ సంతానంలేని వారి వీర్యంలో కొంతమేర కనిపించగా, రెండో మ్యుటేషన్ సంతానం ఉన్న వారి వీర్యంలో స్పష్టంగా కనిపించిందని పరిశోధనలో కీలక పాత్ర పోషించిన సీసీఎంబీ శాస్త్రవేత్త, ప్రస్తుతం అమెరికాలోని మిషిగన్ విశ్వవిద్యాలయంలో పోస్ట్ డాక్టరేట్ చేస్తున్న డాక్టర్ ఉమేష్ కుమార్ తెలిపారు. ఎలుకల్లో పరిశోధనలు జరిపినప్పుడు టీఈఎక్స్13బీ కారణంగా వీర్యకణాలు శ్వాసించే సామర్థ్యం కోల్పోతున్నాయని అంతకుముందే శాస్త్రవేత్తలు గుర్తించారు. మొత్తమ్మీద ఈ జన్యువు లేమి వల్ల వీర్యకణాల అభివృద్ధి జరగడంలేదని శాస్త్రవేత్తలు నిర్ధారణకు వచ్చారు. దీనిపై డాక్టర్ తంగ రాజ్ మాట్లాడుతూ.. 'ఈ జన్యువు ఎక్స్ క్రోమోజోమ్‌లో ఉంటుంది. ఇది తండ్రి నుంచి కాకుండా తల్లి నుంచి పురుషులకు సంక్రమిస్తుంది. తల్లి నుంచి టీఈఎక్స్13బీ జన్యువు అందకపోతే మగవారు సంతానలేమి సమస్యను ఎదుర్కొంటారు' అని తమ పరిశోధనలో తేలిందని తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన మమత ఫెర్టిలిటీ హాస్పిటల్, కోల్‌కతాకు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిప్రొడక్టివ్ మెడిసిన్, ముంబైలోని జెనెటిక్ రిసెర్చ్ సెంటర్‌తో కలిసి సీసీఎంబీ ఈ పరిశోధన జరిపింది. దీని తాలూకు వివరాలు హ్యూమన్ రిప్రొడక్షన్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

నిందితుడు సమన్లకు హాజరైతే అరెస్టు చేసే అధికారం ఈడీకి లేదు

(మొదటి పేజీ తరువాయి)

తప్పనిసరి అని తేల్చిచెప్పింది. జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పునిచ్చింది. నేరాన్ని గుర్తించిన అనంతరం నిందితుడిని పీఎంఎల్ఏ సెక్షన్-19 కింద అరెస్టు చేసే అధికారం ఈడీకి లేదని పేర్కొంది. ప్రత్యేక న్యాయస్థానం జారీ చేసిన సమన్లకు హాజరై సమాధానం ఇచ్చిన తర్వాత కూడా నిందితుడిని కస్టడీలోకి తీసుకోవాలనుకుంటే.. అందుకు దరఖాస్తు చేయాలని సూచించింది. కస్టడీ విచారణ అవసరమని కోర్టు నమ్మితేనే అనుతిస్తుందని తెలిపింది. నిందితులు సమన్లకు సమాధానమివ్వడంలో విఫలమైనప్పుడు మాత్రమే అరెస్టు వారెంటు జారీ చేయాల్సి ఉంటుందని వివరించింది. సమన్లకు నిందితులు సరైన సమాధానం ఇస్తే వారు కస్టడీలో ఉన్నట్లు చూడలేం అని పేర్కొంది. ఈడీ ఎఫ్ఐఆర్ నమోదు చేసేవరకు నిందితులను అరెస్టు చేయని కేసుల్లో.. ఆ తర్వాత కూడా అరెస్టు చేయలేరని వ్యాఖ్యానించింది. కాగా, వ్యక్తి నేరం చేసినట్లుగా లిఖితపూర్వక ఆధారాలుంటే అరెస్టు చేసేందుకు సెక్షన్ 19 కింద ఈడీకి అధికారం ఉంటుంది. అరెస్టుకు గల కారణాలను నిందితుడికి ముందుగానే తెలియజేయాలి.

ఎవరికీ ప్రత్యేక మినహాయింపు లేదు

- 'కేజ్రీవాల్‌కు స్పెషల్ ట్రీట్‌మెంట్'.. అమిత్‌షా వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ, మే 16: ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు తాత్కాలిక బెయిల్ మంజూరు చేసిన విషయంలో తామేమీ ప్రత్యేక మినహాయింపు ఇవ్వలేదని సుప్రీంకోర్టు పేర్కొంది. 'ఎవరికీ ఎలాంటి మినహాయింపు ఇవ్వలేదు. ఏది న్యాయసమ్మతమని భావించామో దానిని మేం మా తీర్పులో స్పష్టం చేశాం' అని తెలిపింది. తాత్కాలిక బెయిల్ అంశంలో కేజ్రీవాల్‌కు కోర్టు ప్రత్యేక ట్రీట్‌మెంట్ ఇచ్చిందని దేశంలో పలువురు భావిస్తున్నారంటూ కేంద్ర హోంమంత్రి, బీజేపీ కీలక నేత అమిత్‌షా చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో సుప్రీంకోర్టు ఈ విధంగా స్పందించింది. ఢిల్లీ మద్యం విధానం కేసులో ఈడీ తనను అరెస్టు చేయటాన్ని సవాల్ చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ దీపాంకర్‌దత్తాలతో ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా కేజ్రీవాల్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. అమిత్‌షా పేరు ప్రస్తావించకుండా ఆయన చేసిన వ్యాఖ్యలను ఉదహరించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. తాము ఆ అంశంలోకి వెళ్లదల్చుకోలేదని చెబుతూనే, ఎవరికీ ఎలాంటి మినహాయింపు ఉండబోదని తెలిపింది. అయితే, తీర్పుపై విమర్శనాత్మక విశ్లేషణను తాము స్వాగతిస్తామని ధర్మాసనం పేర్కొనటం విశేషం. కాగా, ఈడీ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ.. ఆమ్ ఆద్మీ పార్టీకి (ఆప్) ఓట్లు వేసి గెలిపిస్తే జూన్2న తాను తిరిగి జైలుకు వెళ్లాల్సిన అవసరం ఉండబోదని ఇటీవల ఓ సభలో కేజ్రీవాల్ చెప్పారని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యల ద్వారా కేజ్రీవాల్ బెయిల్ షరతులను ఉల్లంఘించారన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. 'ఆయన జూన్2న లొంగిపోవాలని మా ఆదేశాలు స్పష్టంగా ఉన్నాయి. అది సుప్రీంకోర్టు ఆదేశం. చట్టబద్ధ పాలనకు అదే ఆధారం. కేసు విషయంలో ఆయన ఏమీ మాట్లాడకూడదని మేం చెప్పలేదు. కాబట్టి ఆయన ఏం అనుకుంటున్నారనేది మాకు అనవసరం. దానిపై మేమేమీ చెప్పలేం' అని వ్యాఖ్యానించింది. ఆప్‌ను గెలిపిస్తే తాను జైలుకు వెళ్లాల్సిన అవసరం ఉండదని కేజ్రీవాల్ వ్యాఖ్యానించలేదని, కావాలంటే దానిపై ఆయన అఫిడవిట్ సమర్పిస్తామని సింఘ్వీ తెలిపారు. ఢిల్లీ మద్యం కేసులో అరెస్టై తిహాడ్ జైల్లో ఉన్న కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు జూన్ 1 వరకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. కేజ్రీవాల్‌పై త్వరలో ప్రాసిక్యూషన్ ఫిర్యాదును నమోదు చేస్తామని సుప్రీంకోర్టుకు ఈడీ తెలిపింది.

జడ్జిల ఉద్దేశాన్నే షా ప్రశ్నిస్తున్నారు: సిబల్

కేజ్రీవాల్‌కు కోర్టు ప్రత్యేక ట్రీట్‌మెంట్ అంటూ అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను రాజ్యసభ ఎంపీ, సీనియర్ న్యాయవాది కపిల్‌సిబల్ తప్పుబట్టారు. ఆయన సుప్రీంకోర్టు న్యాయమూర్తుల ఉద్దేశాన్నే ప్రశ్నిస్తున్నారన్నారు. లైంగిక వేధింపుల కేసులో చార్జిషీటు దాఖలైనప్పటికీ బీజేపీ నేత బ్రిజ్‌భూషణ్‌సింగ్ ఎన్నికల ప్రచారం చేస్తున్నారని, ఒక కేసులో బెయిల్ లభించిన వ్యక్తి ఎవరైనా ఎన్నికల్లో పాల్గొనవచ్చని స్పష్టంచేశారు. 400 సీట్లు లభిస్తే పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనం చేసుకుంటామన్న అమిత్‌షా వ్యాఖ్యపై స్పందిస్తూ.. తొలుత చైనా ఆక్రమించుకున్న 4వేల కి.మీ.ల భారత భూభాగాన్ని స్వాధీనం చేసుకోండి అని సూచించారు.

కొవాక్సిన్‌తోనూ దుష్ప్రభావాలు!

- ఏఈఎస్ఐ, స్ట్రోక్, గిలన్-బెరె ముప్పు!!
- ఏడాది తర్వాత.. జనరల్, న్యూరో డిజార్డర్లతో సతమతం



న్యూఢిల్లీ, మే 16: కొవిడ్-19 దేశీయ టీకా కొవాక్సిన్ తీసుకున్న వారిలో ఏడాది తర్వాత దుష్ప్రభావాలు ఎదురవుతున్నట్లు బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం(బీహెచ్‌యూ) పరిశోధకులు నిర్వహించిన అధ్యయనంలో తేలింది. కొవాక్సిన్ తీసుకున్న 926 మంది(635 మంది కౌమార దశలో ఉన్నవారు, 291 మంది పెద్దలు)పై 2022 జనవరి నుంచి 2023 ఆగస్టు వరకు నిర్వహించిన అధ్యయనంలో 30% మందిపై తీవ్ర దుష్ప్రభావాలు కనిపించాయని పరిశోధకులు వెల్లడించారు. వీరి అధ్యయన వివరాలు స్ప్రింగర్ నేచర్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఈ టీకా తీసుకున్న కొందరిలో అడ్వర్స్ ఈవెంట్స్ ఆఫ్ స్పెషల్ ఇంట్రెస్ట్(ఏఈఎస్ఐ) లక్షణాలు కనిపించాయని, స్ట్రోక్, గిలాన్-బెరె డిజార్డర్ వంటి రుగ్మతలు ఏఈఎస్ఐ కోవలో ఉంటాయని ఈ పరిశోధన తెలిపింది. కొవాక్సిన్ 2 డోసులు తీసుకున్న వారి కంటే.. 1, 3 డోసులు తీసుకున్నవారిలోనే రుగ్మతలు 2-4 రెట్లు అధికంగా కనిపించినట్లు బీహెచ్‌యూ అధ్యయనంలో వెల్లడైంది. కాగా.. అస్ట్రాజెనెకా టీకా తీసుకున్న వారిలో వ్యాక్సిన్ ఇండ్యూస్డ్ ఇమ్యున్ థ్రోంబోసైటోపెనియా అండ్ థ్రోంబోసిస్(వీఐటీటీ) లక్షణాలు బయటపడుతున్నట్లు మరో పరిశోధనలో తేలింది. కెనడా, ఉత్తర అమెరికా, జర్మనీ, ఇటలీకి చెందిన శాస్త్రవేత్తలు గత ఏడాది ఈ పరిశోధన నిర్వహించారు. అస్ట్రాజెనెకా తీసుకున్నవారిలో ప్రమాదకరమైన పీఎఫ్4(ప్లేట్లెట్ ఫ్యాక్టర్-4) రుగ్మత కనిపించిందని ఈ అధ్యయనం వివరించింది.

చార్‌ధామ్ యాత్రకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

డెహ్రాడూన్, మే 16: మే 10న ప్రారంభమైన ఉత్తరాఖండ్‌లోని చార్‌ధామ్ యాత్రకు మొదటి 3 రోజుల్లోనే యాత్రికులు లక్షల్లో పోటెత్తారు. యాత్ర ప్రారంభమైననాటి నుంచి సుమారు 11 మంది యాత్రికులు మరణించారన్న వార్తలతో ఆ రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. యాత్రికుల నియంత్రణకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేస్తూ గురువారం ప్రకటించింది. ఆమేరకు సీనియర్ పోలీస్ అధికారి అర్పన్ యదువంశీ ఎక్స్‌లో స్పందిస్తూ.. 'గంగోత్రి, యమునోత్రి వచ్చే భక్తులు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ చేసుకోకుండా మీ ప్రయాణాన్ని నిర్ణయించుకోకండి' అని విజ్ఞప్తి చేశారు. ఉత్తరాఖండ్ ప్రధాన కార్యదర్శి రాధా రాటూరి మాట్లాడుతూ, 'రిజిస్ట్రేషన్ లేకుండా భక్తులు యాత్రకు రావడానికి అనుమతివ్వడంలేదని స్పష్టం చేశాం. యాత్రకు సంబంధించి తప్పుడు సమాచారాన్నిచ్చే వీడియోలు, రీల్స్ చేసే వారిపై చర్యలు తీసుకుంటాం'అని తెలిపారు. యమునోత్రి, గంగోత్రి, కేదార్‌నాథ్ క్షేత్రాలు 10నే తెరవగా బద్రీనాథ్ క్షేత్రాన్ని మే 12న తెరిచారు. కేదార్‌నాథ్‌కు 1.55 లక్షల మంది యాత్రికులు ఇప్పటికే రాగా, యమునోత్రికి సుమారు 70వేల మంది, గంగోత్రికి సుమారు 63 వేలమంది వచ్చారు. బద్రీనాథ్‌కు 3 రోజుల్లో 45వేల మంది యాత్రికులు వచ్చారని పర్యాటక శాఖ పేర్కొంది.

ఆత్మహత్య చేసుకుంటానని భార్యకు బెదిరింపు కాల్

- ఆ ప్రయత్నంలో ప్రాణం పోగొట్టుకున్న జిమ్ ట్రైనర్

బెంగళూరు, మే 16(ఆంధ్రజ్యోతి): చిన్నచిన్న గొడవలతో దూరంగా ఉంటున్న భార్యను భయపెట్టే ప్రయత్నంలో ఓ జిమ్ ట్రైనర్ ప్రాణాలు పోగొట్టుకున్నాడు. బెంగళూరు నగరంలోని బాగలగుంట పోలీసుస్టేషన్ పరిధిలో బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు, బిహార్‌కు చెందిన అమిత్‌కుమార్ (28) బెంగళూరులో జిమ్ ట్రైనర్‌గా పని చేస్తున్నారు. జిమ్ సెంటర్ పక్కనే నివసిస్తున్న హాసన్‌కు చెందిన యువతిని ప్రేమించి ఏడాది క్రితం పెద్దలను వ్యతిరేకించి పెళ్లి చేసుకున్నారు. ఆ తర్వాత అమిత్ భార్య నర్సింగ్ కోర్సులో చేరారు. ఆమె ఫ్రెండ్స్‌తో తరచూ ఫోన్ మాట్లాడుతుండటంతో భార్యాభర్తల మధ్య అప్పుడప్పుడు గొడవలు జరుగుతుండేవి. ఈ నేపథ్యంలో భర్తకు దూరంగా ఆమె మరో చోట ఉంటున్నారు. అమిత్ బుధవారం సాయంత్రం భార్యకు అనేకసార్లు ఫోన్ చేసి ఇంటికి రావాలని కోరారు. ఆ తర్వాత వీడియో కాల్ చేసి.. ఇంటికి రాకపోతే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించే ప్రయత్నం చేశారు. సైకప్పునకు తాడు తగిలించి స్టూల్ మీద నిలబడి గొంతుకు తాడు బిగించుకుని వీడియోకాల్ మాట్లాడుతున్నారు. 'ఇప్పుడు ఇంటికి వస్తానంటే సరి. లేదంటే ఆత్మహత్య చేసుకుంటా' అని బెదిరించారు. ఆ సమయంలో చేతిలో ఉన్న ఫోన్ ఒక్కసారిగా జారి కిందపడింది. ఫోన్ పట్టుకునే ప్రయత్నంలో అదుపుతప్పి స్టూల్ కిందపడింది. దీంతో అమిత్ గొంతుకు తాడు బిగుసుకుని అక్కడికక్కడే మృతి చెందారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పల్నాడులో ఏం జరిగిందో ప్రపంచం మొత్తం చూసింది!

ప్రత్యేకంగా ఆధారాలు చూడక్కర్లేదు

హింసాత్మక ఘటనలపై హైకోర్టు ఆందోళన

అమరావతి, మే 16 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ రోజు, ఆ తర్వాత పల్నాడు జిల్లాలో చోటు చేసుకున్న హింసాత్మక ఘటనలపై హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. జిల్లాలో జరిగిన ఘటనలకు ప్రపంచం మొత్తం చూసిందని, ఆధారాలను ప్రత్యేకంగా పరిశీలించాల్సిన అవసరం ఏముందని వ్యాఖ్యానించింది. రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా పల్నాడు జిల్లాలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకోకుండా తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో), డీజీపీ, పల్నాడు జిల్లా కలెక్టర్, ఎస్పీలను ఆదేశించింది. అవాంఛనీయ ఘటనలు జరక్కుండా చర్యలు తీసుకోవలసిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొంది. అదనపు బలగాలను మోహరించాలని పిటిషనర్ సమర్పించిన వినతిని పరిశీలించాలని ఎన్నికల సంఘం(ఈసీ), అధికారులను ఆదేశించింది. వ్యాజ్యాన్ని పరిష్కరించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పల్నాడు జిల్లాలో హింసాత్మక ఘటనలు నిలువరించడంలో పోలీసులు విఫలమయ్యారంటూ వినుకొండకు చెందిన న్యాయవాది ఎస్.రామకోటేశ్వరరావు పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం గురువారం విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫున న్యాయవాది పదిరి రవితేజ వాదనలు వినిపించారు. పల్నాడువ్యాప్తంగా హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయని.. శాంతిభద్రతలకు విఘాతం కలిగిందని.. అదనపు బలగాలు మోహరించాలని పిటిషనర్ వినతి సమర్పించినప్పటికీ ఎలాంటి చర్యలూ లేవని తెలిపారు. ఎన్నికల సంఘం తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. అదనపు బలగాలను మోహరించాలన్న పిటిషనర్ వినతి ఈసీ పరిశీలనలో ఉందన్నారు. అల్లర్ల కట్టడికి చర్యలు తీసుకోవలసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున న్యాయవాది నిర్మల్ కుమార్ వాదనలు వినిపించారు. పల్నాడువ్యాప్తంగా ఇప్పటికే 144 సెక్షన్ విధించామని.. అదనపు బలగాలను మోహరించామని తెలిపారు. ఈసీ, ప్రభుత్వం ఇప్పటికే తగిన చర్యలు తీసుకుంటున్నాయని.. ఈ నేపథ్యంలో వ్యాజ్యాన్ని పరిష్కరిస్తున్నట్లు న్యాయమూర్తి ప్రకటించారు.

మాకు భద్రత కల్పించండి

హైకోర్టుకు పులివర్తి నాని, కుటుంబం

తనపై హత్యాయత్నం జరిగిన నేపథ్యంలో భద్రత కల్పించేలా ఆదేశాలివ్వాలని చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని, ఆయన సతీమణి, కుమారుడు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం గురువారం జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ముందు విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు. పోలీసుల తరఫున న్యాయవాది ఏజీపీ నిర్మల్‌కుమార్ స్పందిస్తూ.. నానికి భద్రత కల్పించామని.. ఆయనపై దాడి చేసినవారిని అరెస్టు చేశామని వివరించారు. నాని సతీమణి, కుమారుడికి భద్రత కల్పించే విషయంలో వివరాలు సమర్పించేందుకు సమయం కోరారు. అందుకు అంగీకరించిన న్యాయమూర్తి విచారణను ఈ నెల 23కి వాయిదా వేశారు.

బాధ్యత మరిచారా!?

(మొదటి పేజీ తరువాయి)

చేశాం. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఎస్పీలు తగిన చర్యలు తీసుకునేలా చూడాలని సీఎస్, డీజీపీలకు ఘాటుగా, సూటిగా చెప్పాం" అని ఈసీ వెల్లడించింది. ఆయా ఘటనలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నివేదికను, సిఫారసులను పరిశీలించి... దానికి అనుగుణంగా ఉత్తర్వులు జారీ చేసింది.

కఠిన చర్యలకు ఆదేశం...

అల్లర్లు అదుపు చేయడంలో పూర్తిగా విఫలమైన పల్నాడు ఎస్పీ గరికపాటి బిందుమాధవ్, అనంతపురం ఎస్పీ అమిత్ బర్దార్‌లను ఈసీ సస్పెండ్ చేసింది. తిరుపతి ఎస్పీ కృష్ణకాంత్ పటేల్‌ను బదిలీ చేసింది. పల్నాడు జిల్లా కలెక్టర్ శివ శంకర్‌పైనా బదిలీ వేటు వేసింది. పల్నాడు, అనంతపురం, తిరుపతి జిల్లాల్లో విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ఎస్ఐ నుంచి డీఎస్పీ స్థాయి వరకు 12 మంది అధికారులను సస్పెండ్ చేయాలని ఆదేశించింది. అంతటితో ఆగకుండా... వీరందరిపై శాఖాపరమైన చర్యలకు ఆదేశించింది. ఈ మొత్తం వ్యవహారాలపై ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేసి రెండు రోజుల్లో ఎన్నికల కమిషన్‌కు నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. ఆయా సంఘటనలపై ఇప్పటికే దాఖలైన ఎఫ్ఐఆర్‌లను సవరించి అవసరమైన మేరకు అదనపు సెక్షన్లు జోడించాలని ఆదేశించింది. ఈ కేసుల్లో నిందితులపై చట్ట ప్రకారం చార్జిషీట్లు దాఖలు చేయాలని... అది కూడా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముగిసేలోగానే చేయాలని సీఎస్, డీజీపీలను ఆదేశించింది. ఈ ప్రక్రియను నిశితంగా పర్యవేక్షించాలని స్పష్టం చేసింది.

కేంద్ర బలగాల కొనసాగింపు...

ఫలితాల వెల్లడి తర్వాతా హింసాత్మక ఘటనలు చోటు చేసుకునే అవకాశాలున్నందున 25 కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు బలగాల(సీఏపీఎఫ్)ను ఇక్కడే కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఈ నేపథ్యంలో... ఆ బలగాలను కౌంటింగ్ తర్వాత 15 రోజులపాటు ఏపీలోనే ఉంచాలని కేంద్ర హోంశాఖను ఈసీ ఆదేశించింది.

అసంతృప్తి... ఆగ్రహం!

ఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో జరిగిన భేటీలో... రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియపై తీసుకున్న చర్యలు, ప్రశాంత పోలింగ్‌కు చేపట్టిన ఏర్పాట్ల గురించి సీఎస్, డీజీపీ, ఇంటెలిజెన్స్ డీజీలు ఎన్నికల కమిషన్‌కు వివరించారు. సుమారు 40 నిమిషాలపాటు ఈ సమావేశం జరిగింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం... రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నట్లుగా పకడ్బందీ చర్యలు తీసుకున్నట్లు తమ దృష్టికి రాలేదని, ఎన్నికల పరిశీలకుడు మిశ్రా పరిశీలనలోనూ కనిపించలేదని ఈసీ పెదవి విరిచింది. పోలింగ్ అనంతరం జరిగిన హింసపై తీవ్రంగా స్పందించింది. అక్కడ పని చేస్తున్న దిగువ స్థాయి అధికారుల బాధ్యత ఏంటని ప్రశ్నించింది. "ఫలితాల ప్రకటన దాకా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుందని మరిచిపోయారా? గత మూడు రోజులుగా వివిధ ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు జరిగిన తీరు చూస్తుంటే... పోలింగ్ ముగియగానే మీ బాధ్యత మరిచిపోయినట్లనిపిస్తోంది" అని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ మండిపడినట్లు సమాచారం. పోలీసు అధికారులను బదిలీ చేసిన చోట, మొదటి నుంచీ వ్యక్తిగత కక్షలు కార్పణ్యాలు ఉన్న చోట మాత్రమే హింసాత్మక ఘటనలు జరిగాయని, తాము అప్రమత్తంగానే ఉన్నామని సీఎస్, డీజీపీ ఇచ్చిన నివేదిక, పవర్ పాయింట్ ప్రజంటేషన్‌పైనా ఈసీ పలు సందేహాలు వ్యక్తం చేసినట్లు తెలిసింది. "సమస్యాత్మక ప్రాంతాలను ముందే గుర్తించినట్లయితే తగిన జాగ్రత్త చర్యలు ఎందుకు తీసుకోలేదు? అల్లర్లను ఎందుకు అదుపు చేయలేకపోయారు? ఈ సంఘటనలకు ఎవరు బాధ్యత వహించాలి? మీరా, మేమా? మీ వద్ద ఇంటెలిజెన్స్ సమాచారం ఉండదా?" అని వరుస ప్రశ్నలు సంధించినట్లు తెలిసింది. పోలీసు యంత్రాంగం తమకు పట్టనట్లు అలసత్వం వహించినట్లు పరిశీలకుల నివేదికల ద్వారా తమకు తెలిసిందని ఎన్నికల కమిషన్ పేర్కొంది. అభ్యర్థులపైనా దాడులు జరిగాయంటే శాంతి భద్రతలు అదుపు తప్పినట్లు కాదా అని ప్రశ్నించింది. ఇదే క్రమంలో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు గుర్తించిన డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐల పేర్లతో కూడిన జాబితాను డీజీపీ అందించారు. వారిపై చర్యలకు ఈసీ ఆదేశించింది. పోలీసు మాన్యువల్ ప్రకారం పనిచేయని ప్రతి అధికారిపై చట్ట ప్రకారం చర్య తీసుకోవాలని స్పష్టం చేసింది. నిర్లక్ష్యంతోపాటు పర్యవేక్షణ లోపం ఉన్న ప్రతి పోలీసు అధికారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి చర్య తీసుకోవాలని గట్టిగా చెప్పింది.

ఈసీ చర్యలు	
సస్పెన్షన్	**బదిలీలు**
గరికపాటి బిందు మాధవ్, ఎస్పీ, పల్నాడు జిల్లా	శివశంకర్, పల్నాడు జిల్లా కలెక్టర్
అమిత్ బర్దార్, ఎస్పీ, అనంతపురం జిల్లా	కృష్ణకాంత్ పాటిల్, ఎస్పీ, తిరుపతి

చరిత్రలోనే తొలిసారి.. డీజీపీ నుంచి ఎస్ఐల వరకు చర్యలు

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల నేపథ్యంలో జగన్ సర్కార్ విపరీత పోకడల కారణంగా మొత్తం పోలీసు శాఖపైనే మచ్చ పడింది. ఎన్నికల్లో రాజకీయ లబ్ధికోసం పోలీసు యంత్రాంగాన్ని అడ్డగోలుగా వాడుకోవాలన్న వ్యూహం బెడిసికొట్టింది. దీని ఫలితంగా... డీజీపీతో మొదలుకుని ఎస్ఐల దాకా బలి కావాల్సి వచ్చింది. ఇంత మందిపై చర్యలు తీసుకోవడం, పోలింగ్ తర్వాతా ఈసీ కొరడా ఝుళిపించడం బహుశా దేశ చరిత్రలోనే ఇదే తొలిసారి. పోలింగ్‌కు ముందే డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డితోపాటు ఇంటెలిజెన్స్ అధిపతి పీఎస్ఆర్ ఆంజనేయులు, విజయవాడ సీపీ కాంతి రాణా తాతా, గుంటూరు ఐజీ పాలరాజు, అనంతపురం ఎస్పీ అన్బురాజన్, చిత్తూరు ఎస్పీ జాషువా, నెల్లూరు ఎస్పీ తిరుమలేశ్వర్ రెడ్డి, ప్రకాశం ఎస్పీ పరమేశ్వర రెడ్డి, పల్నాడు ఎస్పీ రవిశంకర్ రెడ్డిపై వేటు ఈసీ వేసింది. జిల్లా కలెక్టర్లపైనా ఈసీ చర్యలు తీసుకుంది. పోలింగ్ అనంతరం జరిగిన హింసపై తీవ్రంగా స్పందిస్తూ... ఎస్ఐ స్థాయి అధికారులనూ సస్పెండ్ చేయాలని ఆదేశించింది.

విధి నిర్వహణలో వీరు విఫలం...

పోలింగ్ అనంతరం జరిగిన హింసాత్మక ఘటనలకు సంబంధించి 12 మంది పోలీసు అధికారుల నిర్లక్ష్యం, వైఫల్యమే కారణమని డీజీపీ హరీశ్ గుప్తా స్పష్టం చేశారు. "చట్టప్రకారం చర్యలు తీసుకోవడంలో వీరు విఫలమయ్యారు. నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీనివల్లే హింస పెచ్చరిల్లింది. ఆయా ఘటనలకు సంబంధించిన సమాచారాన్ని అందించడంలోనూ వీరు విఫలమయ్యారు. చట్టపరమైన విధులు నిర్వహించడంలో వీరి సమగ్రత అనుమానాస్పదం" అని డీజీపీ పేర్కొన్నారు. వీరందరినీ సస్పెండ్ చేయాలని ఈసీ ఆదేశించింది. ఇదీ ఆ జాబితా...

తిరుపతి జిల్లా

- ఏ. సురేందర్ రెడ్డి, డీఎస్పీ, తిరుపతి
- కె రాజశేఖర్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్
- ఎం. భాస్కర్ రెడ్డి, డీఎస్పీ, ఎస్‌బీ
- ఓ.రామచంద్రా రెడ్డి, సీఐ, అలిపిరి

పల్నాడు జిల్లా..

- ఎ. పల్లపు రాజు, డీఎస్పీ, గురజాల
- వీఎస్ఎన్ వర్మ, డీఎస్పీ, నరసరావు పేట
- కె. ప్రభాకర్ రావు, సీఐ, స్పెషల్ బ్రాంచ్
- ఈ.బాలనాగిరెడ్డి, సీఐ, స్పెషల్ బ్రాంచ్
- ఎం.రామాంజినేయులు, ఎస్ఐ, కారంపూడి
- డీవీ కొండారెడ్డి, ఎస్ఐ, నాగార్జున సాగర్

అనంతపురం జిల్లా

- సీఎం గంగయ్య, డీఎస్పీ, తాడిపత్రి
- ఎస్.మురళీ కృష్ణ, సీఐ, తాడిపత్రి

ఇదీ జరిగింది..

రాష్ట్రంలో హింసపై ఈసీకి డీజీపీ నివేదిక

పోలింగ్ తర్వాత హింసాత్మక ఘటనలు జరగడానికి కారణాలను ఎన్నికల కమిషన్‌కు డీజీపీ హరీశ్ గుప్తా నివేదించారు. "పల్నాడు జిల్లాలో పోలింగ్ రోజు, ఆ మరుసటి రోజు ఎస్పీ బిందు మాధవ్ నేతృత్వంలో అదనపు బలగాలను మోహరింపజేశాం. అన్ని సూచనలు ఇచ్చాం. అయినా హింసాత్మక ఘటనలు జరగడానికి స్థానిక అధికారుల వైఫల్యమే కారణం. కలెక్టర్ శివశంకర్‌తోపాటు ఎస్పీ బిందు మాధవ్ శాంతి భద్రతల పరిరక్షణలో విఫలమయ్యారు. తాడిపత్రిలో ముందస్తు అప్రమత్తత ఉన్నప్పటికీ హింసను అరికట్టడంలో పోలీసులు విఫలమయ్యారు. తిరుపతిలో పోలీసులు ఒక వర్గంపై భక్తితో కూడిన అభిమానం చూపడంతో హింస చెలరేగి అభ్యర్థిపై హత్యాయత్నం వరకూ వెళ్లింది" అని డీజీపీ నివేదించారు. దీని ఆధారంగా 'సిట్' ఇచ్చే నివేదిక మేరకు చర్యలు తీసుకునే అవకాశముంది.

తాడిపత్రి నుంచి బలవంతంగా...

జేసీ కుటుంబం తరలింపు

- పోలింగ్ ఘర్షణల నేపథ్యంలో కఠిన ఆంక్షలు
- దివాకర్‌రెడ్డి ఆరోగ్య బాలేదన్నా పట్టించుకోని పోలీసులు

తాడిపత్రి టౌన్/ఉరవకొండ, మే 16: అనంతపురం జిల్లా తాడిపత్రిలో మాజీ ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి కుటుంబంపై పోలీసులు కఠినఆంక్షలు అమలు చేస్తున్నారు. అనారోగ్యంతో ఇంటికే పరిమితమైన జేసీ దివాకర్ రెడ్డిని, ఆయన సతీమణి విజయమ్మ, సోదరిని ఊరు విడిచి వెళ్లాలని హెచ్చరించారు. బలవంతంగా వారిని హైదరాబాద్‌కు తరలించారు. జేసీ తనయుడు పవన్ రెడ్డి హైదరాబాద్ నుంచి గురువారం ఉదయం తాడిపత్రికి చేరుకున్నారు. అక్కడ ఉన్న పోలీసులు ఆయనను ఇంట్లోకి వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారు. వాదోపవాదాలు జరిగాక పవన్‌రెడ్డిని ఇంటిలోకి అనుమతించారు. మధ్యాహ్నం సమయంలో హౌస్ అరెస్ట్ చేస్తున్నట్లు జేసీ పవన్‌రెడ్డికి నోటీసులు అందించారు. ఆ తరువాత గంటల వ్యవధిలోనే ఊరువిడిచి వెళ్లాలని పవన్‌రెడ్డికి హెచ్చరికలు జారీచేశారు. శాంతిభద్రతల దృష్ట్యా తాడిపత్రిలో జేసీ కుటుంబ సభ్యులు ఎవరూ ఉండకూడదని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉన్నాయని, వెంటనే హైదరాబాద్‌కు వెళ్లాలని పోలీసులు సూచించారు. తాను నడవలేని స్థితిలో ఉన్నానని, తన సోదరి కోమాలో ఉన్నారని జేసీ దివాకర్ రెడ్డి చెప్పినా వారు వినిపించుకోలేదు. దీంతో చేసేది లేక జేసీ దివాకర్‌రెడ్డి, ఆయన సతీమణి, సోదరి, కుమారుడు పవన్ రెడ్డి, జేసీ ప్రభాకర్‌రెడ్డి సతీమణి ఉమారెడ్డి బందోబస్తు మధ్య హైదరాబాద్‌కు తరలివెళ్లారు.

టీడీపీ నేతపై వైసీపీ మూకల హత్యాయత్నం

పెనుకొండ: ఏపీలో శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలం మావటూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు సంపత్ కిష్టప్పపై అదే ఊరికి చెందిన వైసీపీ వర్గీయులు గురువారం దాడి చేసి, గాయపరిచారు. సంపత్‌కిష్టప్ప ఎన్నికల్లో టీడీపీ తరఫున చురుగ్గా ప్రచారంలో పాల్గొన్నారు. దీంతో మావటూరు వైసీపీ మద్దతు సర్పంచ్ నాగరాజు తమ్ముడు జీజే శేఖర్ తదితరులు .. అతడిపై కక్ష పెంచుకున్నారు. గురువారం కర్ణాటకలోని దొమ్మితిమర్రి గ్రామంలో కాపుకాసి సంపత్‌కిష్టప్పను కర్రలు, రాడ్లతో విచక్షణారహితంగా కొట్టారు. తీవ్ర గాయాలతో అక్కడే పడిపోయిన సంపత్‌కిష్టప్పను స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

పల్నాడులో బయటనపడ్డ బాంబుల డంప్..

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో వైసీపీ నేతల ఇళ్లలో దాచిన పెట్రోలు బాంబులు, వేట కొడవళ్లు భారీగా స్వాధీనపరచుకున్నారు. పోలీసులు అల్లర్లు జరిగిన గ్రామల్లో విస్తృత తనిఖీలు నిర్వహించేక్రమంలో ఇవి బయటపడ్డాయి. గురజాల నియోజకవర్గంలోని పిన్నెల్లి, సత్తెనపల్లి నియోజకవర్గం మాదల గ్రామాల్లో నిర్వహించిన సోదాల్లో బాంబుల డంప్‌లు బయటపడ్డాయి. నరసరావుపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, దాచేపల్లి, గురజాల, కారంపూడి, మాచర్ల పట్టణాల్లో దుకాణాలను పోలీసులు మూయించారు. ఎమ్మెల్యేలు కాసు మహేశ్‌రెడ్డి, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిల గృహ నిర్బంధం గురువారం కూడా కొనసాగింది.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పత్రికాస్వేచ్ఛకు ఊరట

ఇంగ్లీషు వార్తా వెబ్‌సైట్ 'న్యూస్ క్లిక్' వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్‌కాయస్థకు ఏడు నెలల నిర్బంధం తరువాత ఊరట దొరికింది. బుధవారం నాడు సుప్రీంకోర్టు, విధివిధానాలను పాటించనందుకు గాను, అరెస్టు చెల్లదని చెబుతూ ఆయనను విడుదల చేయమని ఆదేశించింది. గత ఏడాది మనీలాండరింగ్ చట్టం కింద జరిగిన ఒక అరెస్టులో ఇచ్చిన తీర్పును, ఉదాహరిస్తూ, దానిని ఊపా చట్టానికి కూడా అనువర్తింపజేస్తూ జస్టిస్ బి.ఆర్. గవాయ్ నాయకత్వంలోని న్యాయమూర్తుల బెంచ్ తీర్పు చెప్పింది. ఒక పూర్వ ఉదాహరణ ఆధారం చేసుకుని ఇచ్చిన ఈ తీర్పు కూడా మున్ముందు అనేక కేసుల విషయంలో పూర్వ ఉదాహరణగా మారే అవకాశముంది.

చైనా ప్రభుత్వ సొమ్ము తీసుకుని, భారతదేశానికి అప్రదిష్ట కలిగించే, భద్రతకు హానిచేసే వార్తాప్రచురణ చేస్తున్నారనే ప్రధాన అభియోగం మీద, అతి భయానక చట్టమైన 'ఊపా' కింద ప్రబీర్‌ను, న్యూస్ క్లిక్ ఉన్నతోద్యోగి అమిత్ చక్రవర్తిని 2023 అక్టోబర్ 3వ తేదీ తెల్లవారుజామున ఢిల్లీలో అరెస్టు చేశారు. అప్పటి నుంచి బెయిల్ కోసం ప్రబీర్ ఎన్నిసార్లు న్యాయస్థానాలను ఆశ్రయించినా ఫలితం లేకపోయింది. అమిత్ చక్రవర్తి అప్రూవర్‌గా మారడంతో ఢిల్లీ హైకోర్టు ఈ నెల 8వ తేదీన విడుదల చేసింది.

ప్రబీర్ పుర్‌కాయస్థ మీద ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ తీవ్రమైన అభియోగాలు మోపింది. ఊపా చట్టంలోని సెక్షన్లు 13 (చట్టవ్యతిరేకమైన పనులు), 16 (టెర్రరిస్టు చర్య), 17 (టెర్రరిస్టుచర్యల కోసం ధనసమీకరణ), 18 (కుట్ర), 22సి (కంపెనీల, ట్రస్టుల నేరాలు), భారత శిక్షాస్మృతిలోని 153సి (వివిధ ప్రజావర్గాల మధ్య శత్రుభావాన్ని పెంపొందించడం), 120బి (నేరపూరిత కుట్ర) కింద ప్రబీర్ మీద నేరారోపణ చేశారు. ప్రబీర్ పుర్‌కాయస్థ జర్నలిస్టుగా, ప్రజాస్వామికవాదిగా ప్రఖ్యాతులు. 1975 నాటి అత్యవసర పరిస్థితి కాలంలో కూడా ఆయన నిర్బంధాన్ని ఎదుర్కొన్నారు. 'న్యూస్ క్లిక్' నిజానికి విస్తృత ప్రజాదరణ కలిగిన వెబ్‌సైట్ కూడా కాదు. కానీ, ప్రజా ఉద్యమాల వార్తలను, ప్రభుత్వ వ్యతిరేక కథనాలను ప్రముఖంగా ప్రచురిస్తుంది. ఢిల్లీలో సిఎఎ వ్యతిరేక ఆందోళన వార్తలను, రైతుల ఉద్యమం విశేషాలను 'న్యూస్ క్లిక్' నిరంతరంగా ప్రచురించింది. ప్రబీర్ మీద పెట్టిన అభియోగాల వివరణలో, చైనా ప్రభుత్వం డబ్బుతో ఈ ఉద్యమాలకు దోహదం చేస్తున్నారని కూడా ఉంది.

ఇప్పుడు సుప్రీంకోర్టు ప్రాసిక్యూషన్ అభియోగాల మంచిచెడ్డల ఆధారంగా ఆదేశాలు ఇవ్వలేదు. ప్రబీర్ మీద కేసులు కొనసాగుతాయి. ఆయన బెయిల్ మీద మాత్రమే, అది కూడా కిందికోర్టు విధించిన పూచీకత్తు షరతుల మీదనే విడుదల అవుతారు. కానీ, జెయిలే ఆనవాయితీ, బెయిలే మినహాయింపు పద్ధతిలో సాగే ఊపా కేసులో, ప్రబీర్‌కు ఊరట లభించడం పెద్ద విశేషంగా మారింది. పత్రికాస్వేచ్ఛతో ముడిపడిన పుర్‌కాయస్థ విడుదలలో, కఠినచట్టాలకు సంబంధించిన కొత్త సంప్రదాయానికి తెరలేచింది కూడా.

పిఎంఎల్ఎ కానీ, ఊపా కానీ, కఠినమైనవే కాదు, క్రూరమైనవి కూడా. అరెస్టు చేసే అధికారులు నమ్మిన దానికే విలువ. నిందితులకు రక్షణ అవకాశాలు, సహజ న్యాయం కింద లభించే వెసులుబాట్లు కూడా అతి తక్కువ. పుర్‌కాయస్థను అరెస్టు చేసిన రోజునే, 2023 అక్టోబర్ 3వ తేదీనే, సుప్రీంకోర్టు పంకజ్ బన్సల్ వెర్సస్ భారత ప్రభుత్వం అన్న కేసులో ఇచ్చిన తీర్పు ప్రబీర్ విడుదలలో కీలకమైంది. పంకజ్ బన్సల్‌ను పిఎంఎల్ఎ కింద అరెస్ట్ చేశారు. కానీ, ఆయనను అరెస్టు చేసేటప్పుడు కారణాలను లిఖితపూర్వకంగా ఇవ్వలేదు. పిఎంఎల్ఏలోని 19(1) సెక్షన్ ప్రకారం అట్లా ఇచ్చితీరాలి. ఈడీ అధికారులు ఆ నియమాన్ని పెద్దగా ఖాతరు చేయకుండా, మౌఖికంగానో, యథాలాపంగానో వివరాలు చెప్తారు. పంకజ్ బన్సల్ విషయంలో కూడా అదే జరిగింది. ఆ ఉల్లంఘనను ఆధారం చేసుకుని బన్సల్‌ను విడుదల చేశారు. పిఎంఎల్ఎలోని 19(1) ఊపాకూ వర్తింపజేసుకోవాలని సుప్రీంకోర్టు బుధవారం నాటి ఆదేశంలో చెప్పింది. ప్రబీర్ పుర్‌కాయస్థను అక్టోబర్ 3 ఉదయం 6.30కు అరెస్ట్ చేస్తే, మరునాడు ఉదయం జడ్జిముందు ప్రవేశపెట్టారు. అప్పటికి ప్రబీర్‌కు అభియోగాల వివరాలు ఇవ్వలేదు. గట్టిగా పట్టుబడితే, వాట్సాప్‌లో ప్రబీర్ న్యాయవాదులకు పంపారు. వారు వాటిని సవాల్ చేయడానికి న్యాయస్థానానికి వచ్చేసరికే న్యాయమూర్తి పోలీసుకస్టడీ ఆదేశాలు ఇచ్చారు. కస్టడీ ఆదేశాల కాయితం మీద సమయం, కోర్టులో ప్రవేశపెట్టడానికి ముందటి సమయం కావడం మరో విశేషం.

తీవ్రమైన అభియోగాల విషయంలో ప్రాసిక్యూషన్ మరింత ఖచ్చితంగా, పారదర్శకంగా ఉండాలని, కఠినమైన కేసుల విషయంలో నియమబద్ధత అవసరమని సుప్రీంకోర్టు చెప్పింది. ఏడు నెలల నిర్బంధం దీర్ఘమైనదే. కానీ, నాలుగైదేళ్లుగా జైలులో ఉన్న ఊపా బందితులుగా ఉన్నవారి కష్టం ఇంకా పెద్దది. సుప్రీంకోర్టు తన విచక్షణను మరింత విస్తరించుకోవలసిన అవసరం కనిపిస్తోంది.

'హిందుత్వ' రాజకీయ పదం కనుకనే భయం!

విశ్వహిందూ పరిషత్ ప్రతినిధి పగుడాకుల బాలస్వామి మోదీ ప్రభుత్వాన్ని సమర్థిస్తూ 'హిందుత్వం బలపడితే భయమెందుకు?' అనే వ్యాసాన్ని రాశారు (మే 4, 2024). ఆయన ఆ వ్యాసంలో 2014 ఎన్నికల్లోనూ, మరలా 2019 ఎన్నికల్లోనూ మోదీ నాయకత్వాన బీజేపీ పార్టీ చేసిన ఎన్నికల వాగ్దానాలేమిటో, వాటి అమలు తీరు ఎలా ఉన్నదో సమీక్షించి, దాని వల్ల దేశంలోని మెజారిటీ ప్రజలైన హిందువుల జీవితాలు ఏ రకంగా మెరుగుపడ్డాయో రాసి ఉంటే హేతుబద్ధంగా ఉండేది. అలా చేయకుండా 'హిందుత్వం', 'హిందూ సమాజం', 'మనోభావాలు', 'ఈ దేశపు భూమిని హిందువులకు దూరం చేయటం'... ఈ ధోరణిలో అసంబద్ధ వాదనలు చేశారు. ముందుగా 'హిందుత్వం' అనే పదం గురించి చెప్పుకోవాలి. చాలామంది ఈ పదం 'హిందూ మతం' అనే పదానికి సమానార్థకంగా అర్థం చేసుకుంటారు. కానీ 'హిందుత్వం' అనేది ఒక రాజకీయ సిద్ధాంతం. దీనికి భిన్నంగా, 'హిందూ మతం' ఒక ఆధ్యాత్మిక తత్వానికి సంబంధించినది.

హిందుత్వం అంటే మనుస్మృతి ఆధారంగా, ప్రజాస్వామ్య హక్కులు లేకుండా, హిందూ మతాధిపత్యం కింద పనిచేసే రాజ్యాంగాన్ని ఏర్పరచడం. ఆ వ్యవస్థలో ముస్లింలు, క్రిస్టియన్లు, కమ్యూనిస్టులు... హిందూ మత రాజ్య ఆధిపత్యానికి లోబడి రెండవ తరగతి పౌరులుగా మాత్రమే బతకాలి. దానినే 'హిందూ రాష్ట్ర' అని పిలుస్తారు. ఈ సిద్ధాంతం ఆధారంగా 'హిందూ రాష్ట్ర' ఏర్పాటు లక్ష్యంగా ఏర్పడినదే ఆరెస్సెస్. ఈ లక్ష్యసాధన కోసం అనేక సంస్థలను ఏర్పరిచి సమన్వయం చేస్తున్నది ఆరెస్సెస్. ఈ సంస్థల సముదాయాన్ని సంఘ్ పరివార్ అని పిలుస్తారు. దానిలో విభాగాలే విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్, బీజేపీ, ఏబీవీపీ, వనవాసి కళ్యాణ్ ఆశ్రమ్... మొదలైనవి.

వ్యాసకర్త చెబుతున్నట్టు ప్రతిపక్షాలు హిందూ మత విశ్వాసాలను విమర్శించటం లేదు. అవి తమ విమర్శలను ఎక్కుపెడుతున్న అంశాలు వేరే ఉన్నాయి: ఆరెస్సెస్ ప్రణాళికను అనుసరించి బీజేపీ ప్రభుత్వం చేస్తున్న విద్వేష ప్రచారం, ప్రశ్నించే గొంతుకలను అణిచివేయడం, రాజ్యాంగబద్ధ వ్యవస్థలను చెప్పుచేతుల్లో పెట్టుకుని పౌరుల ప్రజాస్వామిక హక్కులను కాలరాయడం, రాష్ట్ర ప్రభుత్వాలను చెప్పుచేతల్లో పెట్టుకోవడం, సహకరించని ప్రతిపక్ష ప్రభుత్వాలను కూలదోయడం, సంఘ్ పరివార్ సంస్థలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని మైనారిటీల మీద దాడులు చేయడం, రైతుల ప్రజాస్వామిక హక్కులను కాలరాయడం, మీడియాను గోదీ మీడియాగా మార్చివేయడం, రాజ్యాంగ వ్యవస్థల స్వతంత్ర ప్రతిపత్తిని ధ్వంసం చేయడం, సీబీఐ ఐటీ ఈడీ ఎన్ఐఏ వంటి సంస్థలను దుర్వినియోగం చేయడం... మొదలైన అంశాల మీద ప్రతిపక్షాలు ఐక్యంగా స్పందిస్తున్నాయి. ప్రజాస్వామిక వ్యవస్థలో ఇది సహజంగా జరిగేదే. ఇటువంటి రాజ్యాంగ వ్యతిరేక 'హిందుత్వం' బలపడటం ప్రతిపక్షాలకే కాదు ప్రతి ఒక్క బాధ్యతాయుత పౌరునికి ఆందోళన కలిగించే విషయమే! అలా ఆందోళన కలగకపోతేనే ఆశ్చర్యపడాలి.

విశ్వహిందూ పరిషత్ మతవిశ్వాసాలకు మాత్రమే పరిమితం అయిన సంస్థ అయినప్పుడు అది ప్రతిపక్ష పార్టీలను విమర్శించడం తప్పు కాదూ, 'హిందుత్వ' రాజకీయ సిద్ధాంతానికి జవాబుదారీ అనుకుంటే దానిని బాహాటంగా అంగీకరించాలి. అది ఏ రకంగా భారత ప్రజల సంక్షేమానికి మంచిదో వివరించే ప్రయత్నం చేయాలి. అంతేగానీ 'విషం కక్కుతున్నారని ఆడిపోసుకుంటే సరిపోదు.

ఈ దేశపు భూమిని హిందువులకు దూరం చేయటం గురించి: భారతదేశపు గ్రామాల్లోని నిరుపేదలలో హిందువులే ఎక్కువ. వాళ్ళకు మోదీ ప్రభుత్వం భూమి ఇచ్చి పుణ్యం కట్టుకుంటే అందరూ సంతోషిస్తారు! కరోనా వచ్చినప్పుడు ఉచిత వాక్సిన్లకు డబ్బు లేదని మోదీ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు చెప్పింది. సుప్రీంకోర్టు రాజ్యాంగం ప్రకారం ఇవ్వాల్సిందే అని తీర్పు ఇచ్చాకనే అమలు జరిపింది! ఇదేనా మోదీకి హిందువులంటే ఉన్న ప్రేమ?

– రావి సుబ్బారావు
సికింద్రాబాద్

'ఆమె' ఓటుతోనే రాజ్యాధికారం!




■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

జూన్ 4న లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడుతుండగా, రాజకీయ ఉద్దండులు, మీడియా మేధావులు, వివిధ రంగాల నిపుణులు టెలివిజన్ స్టూడియోలలో ప్రజల తీర్పుపై కుల, వర్గ, మత ఓటు బ్యాంకుల ప్రభావాల గురించి చర్చిస్తున్నప్పుడు ఒక విషయాన్ని గుర్తు చేసుకుని తీరాలి: ఎన్నికలలో ఆయా పార్టీల, అభ్యర్థుల జయాపజయాలు వాస్తవంగా అతి పెద్ద ఓటు బ్యాంకుతో నిర్ణయాత్మకంగా ప్రభావితమవుతాయి. భారతీయ మహిళా ఓటర్లే ఆ మహా ప్రభావశీల ఓటు బ్యాంకు.

18వ లోక్‌సభ ఎన్నికలలో 'M' అంశం ప్రధాన పాత్ర వహిస్తోంది. మోదీ, ముస్లింలు, మంగళసూత్రాలు, ఇంకా మటన్, మచిలీ (మత్స్యాలు) మొదలైనవి ఎన్నికల శబ్ద కోశంలో భాగమయ్యాయి. తమ క్లిష్ట పరిస్థితికి ప్రతిపక్షాలు మరో మూడు 'M' (మీడియా, మార్కెటింగ్, మనీ)లను కూడా తప్పుపడుతున్నాయి కాని, ఈసారి ఒకే ఒక్క 'M' మాత్రమే, అధికారానికి పోటీపడుతున్న పార్టీల జయాపజయాల నిర్ణయాత్మక అంశంగా రుజువు అవనున్నది : భారతదేశ ఎన్నికల చరిత్రలో మున్నెన్నడూ లేని రీతిలో, ప్రస్తుత సార్వత్రిక పోరులో మహిళా ఓటు గొప్ప ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. ఈ అతి ప్రధాన, నిర్ణాయక 'పవర్ ఆఫ్ 49–' (మొత్తం భారతీయ ఓటర్లలో మహిళల శాతం) ఓటు బ్యాంకే, ఏ పార్టీకి తిరుగులేని విజయావకాశాలు లేనట్టుగా కనిపిస్తున్న ప్రస్తుత ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీకి ఒక పెద్ద అనుకూలతను సమకూర్చోంది. కనుకనే ఈ 'హవా రహిత' ఎన్నికల్లో ఓటర్ల మొగ్గు అధికార పక్షం వైపే ఉన్నదని చెప్పవలసివస్తోంది.

తొలుత ఓటింగ్ లెక్కలు చూద్దాం. పురుషుల కంటే మహిళా ఓటర్లు అధికంగా పోలింగ్‌లో పాల్గొనడం ప్రప్రథమంగా 2019లో సంభవించింది. పురుష ఓటర్లలో 67.02 శాతం మంది ఓటు వేయగా, 67.18 శాతం మంది మహిళా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు వేసిన స్త్రీల శాతం స్వల్ప స్థాయిలో మాత్రమే ఎక్కువగా ఉన్నప్పటికీ అది విస్మరించలేని ప్రాధాన్యమున్న పరిణామం. 2024లో నమోదయిన మహిళా ఓటర్ల సంఖ్యలో గతంలో కంటే 7.5 శాతం పెరుగుదల ఉన్నది. కాగా పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 5 శాతానికి మించి ఎక్కువగా ఉండడం గమనార్హం. ఇప్పుడు 471 మిలియన్ మహిళల ఓటర్లుగా నమోదయ్యారు. స్త్రీ పురుష ఓటర్ల నిష్పత్తి 2019లో 8 రాష్ట్రాలలో మహిళలకు అనుకూలంగా ఉండగా, 2024లో ఆ సానుకూలత 12 రాష్ట్రాలలో ఉన్నది. 2019లో 46 శాతం మంది మహిళా ఓటర్లు బీజేపీకి ఓటు వేయగా, పురుష ఓటర్లు 44 శాతం మంది మాత్రమే ఆ పార్టీకి ఓటు వేశారని యాక్సిస్ మై ఇండియా పోల్ సర్వేలో వెల్లడయింది. మహిళా ఓటర్ల ఓటింగ్ తీరుతెన్నులపై 2019లో లోక్‌నీతి సిఎస్‌డిఎస్ (సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్) నిర్వహించిన ఒక అధ్యయనంలో కుటుంబంలోని పురుష సభ్యులు నిర్దేశించిన లేదా సూచించిన ప్రకారం కాకుండా సొంత నిర్ణయంతో ఓటు వేసిన మహిళల సంఖ్య 59 శాతంగా ఉన్నట్టు వెల్లడయింది. పురుషస్వామ్య బంధనాల నుంచి మహిళా విముక్తికి ఇదొక తిరుగులేని నిదర్శనం.

ఎన్నికల రంగంలో మహిళా ఓటర్ ప్రాధాన్యం పెరగడం కేవలం 2014 అనంతర పరిణామమేమీ కాదు. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలితే ఆ ప్రాధాన్యానికి తొలి నిదర్శనం. ఎన్నికలలో ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించేందుకు ఆమె ఉద్దేశపూర్వకంగా మహిళా ఓటర్లకు ఎనలేని ప్రాధాన్యమిచ్చారు. మహిళల శ్రేయస్సుకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారు. పలు రాయితీలు కల్పించారు. మహిళా ఓటర్లను దృష్టిలో పెట్టుకునే ఆమె ప్రత్యేకంగా ఈ చర్యలు చేపట్టారు. జయ వినూత్న ఆలోచనలు ఆశించిన ఫలితాల నిచ్చాయి. వరుసగా రెండోమారు కూడా అధికారాన్ని కైవసం చేసుకోగలిగారు. బిహార్‌లో నితీశ్ కుమార్ బాగా వెనుకబడిన వర్గాల వారిని ఆకట్టుకోవడం ద్వారా లాలూ ప్రసాద్ యాదవ్ కుల సమీకరణాల ఆధిక్యతను బద్దలుగొట్టడమే కాకుండా మహిళలలో తనదైన ఒక ప్రత్యేక ఓటు బ్యాంక్‌ను సృష్టించుకోవడంలో కూడా విజయవంతమయ్యారు. 2006లో బిహార్, దేశంలోనే ప్రప్రథమంగా పంచాయత్‌లు, ఇతర స్థానిక పాలనా సంస్థలలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించింది. బెంగాల్‌లో మమతా బెనర్జీ 2021లో బీజేపీని విజయవంతంగా ఎదుర్కొని వరుసగా మూడోసారి అధికారానికి వచ్చారు. కన్యాశ్రీ మొదలైన మహిళా కేంద్రిత సంక్షేమ పథకాలను అమలుపరచడం ద్వారానే మమత ఆ విజయం సాధించగలిగారు. అలాగే బీజేపీ మధ్యప్రదేశ్‌లో అధికారాన్ని నిలబెట్టుకోవడమూ, ఛత్తీస్‌గఢ్‌ను మళ్లీ కైవసం చేసుకోవడమూ మహిళలకు నేరుగా నగదు ప్రయోజనాలు కల్పించడానికి ఉద్దేశించిన లాడ్లీ బెహనా, మహ్తారి వందన మొదలైన స్త్రీ సంక్షేమ పథకాల వల్లే సాధ్యమయిందనడంలో సందేహం లేదు. గత ఏడాది కర్ణాటకలో కాంగ్రెస్ అధికారానికి రావడానికి గృహిణికి నెల నెలా రూ.2000 ఆర్థిక సహాయమందించే 'గృహలక్ష్మి', రాష్ట్ర ప్రభుత్వ రవాణా సంస్థ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయ కల్పన ఇత్యాది హామీల వల్లే సుసాధ్యమయింది.

నరేంద్ర మోదీ సైతం మహిళా శ్రేయస్సుకు ఇతోధిక ప్రాధాన్యమిస్తున్నారు. నిరుపేద మహిళల సంక్షేమాన్ని సదా ఆకాంక్షిస్తున్నారు. ఉజ్వల యోజన, ధన్ యోజన, ఆవాస్ యోజన మొదలైన సంక్షేమ పథకాలే అందుకు రుజువులు. వాటితో పాటు ఇటీవలి కాలంలో ఆయన ప్రవేశపెట్టిన లాఖ్‌పతి దీదీ యోజన మొదలైనవి కూడా మహిళల సామాజిక, ఆర్థిక సాధికారతకు విశేషంగా దోహదం చేశాయి. అయితే ఈ సంక్షేమ పథకాలన్నీ నిర్దేశించిన లక్ష్యాలను పరిపూర్తి చేయడంలో సఫలం కానప్పటికీ మోదీ ప్రభుత్వం తమ సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారనే భావనను మహిళలలో సుస్థిరంగా నెలకొల్పాయి.

ఈ పరిణామాలు ఒక ప్రశ్నను లేవనెత్తుతున్నాయి: మహిళా ఓటరు నిజంగా ఎవరు? ఒక నిర్దిష్ట పార్టీ లేదా నేతకు ఓటు వేసేలా ఆమెను ప్రేరేపిస్తున్నదేమిటి? భారత్ లాంటి సువిశాల, వైవిధ్యభరిత దేశంలో ఇటువంటి విషయాలపై సాధారణీకరణలకు రావడంలో అనేక చిక్కులు ఉన్నప్పటికీ ఒక నిర్దిష్ట ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. స్వల్పాదాయ మహిళా ఓటర్లు రెండు సవాళ్లను అధిగమించేందుకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. అవి: జీవనాధారం, భద్రత. విద్యావతి అయిన మహిళా ఓటరు వృత్తి, ఉద్యోగం, ఇంకా ఆవల సమాన అవకాశాల కోసం పోరాడుతుండగా, సగటు మహిళా ఓటరుకు పరిమిత ఆకాంక్షలు మాత్రమే ఉన్నాయి. భౌతిక రక్షణ, ఆర్థిక శ్రేయస్సు అనే అంశాలు సగటు మహిళా ఓటరు రాజకీయ అనుబంధాలను నిర్ణయిస్తున్నాయి.

దేశవ్యాప్తంగా మా పర్యటనల్లో ఎంతో మంది పేద మహిళలు మరో 'M' మెహంగాయి (ద్రవ్యోల్బణం) విషయమై ఆగ్రహావేశాలు వ్యక్తం చేయడాన్ని మేము గమనించాము. అయితే నెలకు ఐదు కిలోల ఉచిత ఆహార ధాన్యాలను ఉచితంగా పంపిణీ చేస్తే తమకు ఎంతో ఉపశమనం కలుగుతుందనే ఆశాభావాన్ని కూడ వారు వ్యక్తం చేస్తున్నారు. ధరల పెరుగుదలతో దిగజారుతున్న తమ ఆర్థిక పరిస్థితిని ఉచిత రేషన్ కొంతలో కొంత నివారించగలదనే భావన కూడా వారిలో బాగా ఉన్నది. వ్యవసాయరంగం తీవ్ర దురవస్థలో ఉన్న మహరాష్ట్రలో ఉచిత రేషన్ తమను ఎంతగానో ఆదుకుంటుందని గ్రామీణ కుటుంబాలలోని మహిళలు భావిస్తున్నారు. ఉత్తర ప్రదేశ్‌లో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పాలనలో శాంతిభద్రతల పరిస్థితి ఇతోధికంగా మెరుగుపడడంతో మహిళా లోకంలో ఆయనకు మంచి ఆదరణ, విశేష మద్దతు లభిస్తోంది. బెంగాల్‌లో సందేశ్ ఖాలి వ్యవహారం మమత ప్రతిష్ఠను దెబ్బ తీసింది. అయితే మహిళా శ్రేయస్సునకు ఉద్దేశించిన లక్ష్మీర్ భాండార్ పథకం ఆ నష్టాన్ని భర్తీ చేస్తోంది. తన ప్రభుత్వంపై వ్యతిరేకతను అధిగమించేందుకు మహిళలకు ఉద్దేశించిన ప్రత్యక్ష నగదు లబ్ధి కార్యక్రమాలపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి భరోసా పెట్టుకున్నారు.

మహిళా ఓటర్ల మద్దతును పొందడంలో జాతీయ స్థాయిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీయే అగ్రగామిగా ఉన్నారు. ప్రజ్వల్ రేవణ్ణ, బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ ఉదంతాలు 'నారీ శక్తి', 'బేటీ పఢావో, బేటీ బచావో' మొదలైన నినాదాల బోలుతనాన్ని, ప్రయోజన రాహిత్యాన్ని బహిర్గతం చేసినప్పటికీ, అవేవీ బ్రాండ్ మోదీని ఇంకా దెబ్బ కొట్టలేదు. పాలనాదక్షత, శక్తిమంతమైన నాయకత్వానికి మూర్తీభవించిన ప్రతీకగా నరేంద్ర మోదీ మహిళా ఓటర్ల గౌరవాదరాలను విశేషంగా పొందుతున్నారు. రాహుల్ గాంధీ అందుకు పూర్తిగా భిన్న రీతిలో కన్పిస్తున్నారు. మృదుస్వభావి, దయాళువు అయిన నాయకుడుగా ఆయన్ని భావిస్తున్నారు. ఆయన ఉపయోగిస్తున్న 'మొహబ్బత్‌కి దుకాన్' మాటలకు మద్దతుగా స్పష్టమైన కార్యాచరణ కన్పించవలసి వున్నది. పేద కుటుంబ గృహిణికి ఏడాదికి లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించేందుకై కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదించిన 'మహాలక్ష్మి' పథకం మంచి సంకల్పం అనడంలో సందేహం లేదు.

మేము సందర్శించిన చాలా ప్రదేశాలలో ప్రతి ఒక్కరూ 'మోదీ కి గ్యారంటీ' గురించి బాగా విన్నవారే కాకుండా దాని గురించి ఆసక్తిగా మాట్లాడుతున్నారు. అయితే మహిళా ఓటర్లకు కాంగ్రెస్ ఇచ్చిన హామీల గురించి తెలిసినవారు చాలా అరుదుగా మాత్రమే కన్పించారు! సరే, జూన్ 4న లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడుతుండగా, రాజకీయ ఉద్దండులు, మీడియా మేధావులు, వివిధ రంగాల నిపుణులు టెలివిజన్ స్టూడియోలలో ప్రజల తీర్పుపై కుల, వర్గ, మత ఓటు బ్యాంకుల ప్రభావాల గురించి చర్చిస్తున్నప్పుడు ఒక విషయాన్ని గుర్తు చేసుకుని తీరాలి: ఎన్నికలలో ఆయా పార్టీల, అభ్యర్థుల జయాపజయాలు వాస్తవంగా అతి పెద్ద ఓటు బ్యాంకుతో నిర్ణయాత్మకంగా ప్రభావితమవుతాయి. భారతీయ మహిళా ఓటర్లే ఆ మహా ప్రభావశీల ఓటు బ్యాంకు.

తాజా కలం: అయోధ్యకు సమీపంలోని ఒక గ్రామంలో దైవభక్తి నిష్ఠాపరులైన మహిళలు కొంతమందితో మాటా మంతీ జరిపాము. రామ మందిర స్వప్నం ఎట్టకేలకు సాకారమయినందుకు వారు మహదానందం వ్యక్తం చేశారు. 'మరి ఏ అంశం ప్రాతిపదికన మీరు ఓటు వేస్తారు?' అని ప్రశ్నించగా వారు సూటిగా ఇలా సమాధానమిచ్చారు: 'రామ్ సె పేట్ తో నహి భర్ తా. పెహ్లే రేషన్, ఫిర్ రామ్' (రాముడు మా ఆకలి తీర్చడు. మొదట రేషన్, ఆ తరువాతే అభిరాముడు).

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

ఆపరేషన్ 'కగార్'కు వ్యతిరేకంగా రేపు బహిరంగ సభ

ఆదివాసీలను శవాలుగా మార్చి, వారి పోరాటాన్ని నిశ్శబ్దం చేసి, సంపదను కార్పొరేట్లకు అందించడమే ఆపరేషన్ కగార్ లక్ష్యం. పీడిత ప్రజలకు చెందిన మనదేశ సహజ సంపదను కార్పొరేట్లకు అందించడం కోసం 2005 నుంచి సాల్వాజుడుం పేరుతో, 2009లో ఆపరేషన్ గ్రీన్ హంట్ పేరుతో, 2017లో ఆపరేషన్ సమాధాన్ పేరుతో, 2024లో ఆపరేషన్ కగార్ పేరుతో ప్రభుత్వాలు ప్రజలపై యుద్ధాన్ని ప్రకటించాయి. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఈ ప్రయత్నం పూర్తిగా అప్రజాస్వామికమేగాక, రాజ్యాంగం కల్పిస్తున్న అన్ని చట్టాల ఉల్లంఘన కిందకు వస్తుంది. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి; ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న ఆదివాసీ హత్యాకాండ, మావోయిస్టుల బూటకపు ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ జరిపించాలి; పెసా చట్టాన్ని, రాజ్యాంగంలోని 5, 6 షెడ్యూళ్లను అమలు చేయాలి; ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం శాంతి చర్చలకు అనువైన వాతావరణం కల్పిస్తూ, చర్చలు కొనసాగించాలి; ఛత్తీస్‌గఢ్‌లో ఉన్న సాయుధ మిలిటరీ క్యాంపులన్నింటినీ ఎత్తివేయాలి; ఛత్తీస్‌గఢ్‌లోని హక్కుల సంఘాలు, ప్రజా సంఘాలు, ప్రజాస్వామిక వాదులకు నిజనిర్ధారణ చేయడానికి అవకాశం కల్పించాలనే డిమాండ్లతో రేపు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల బహిరంగ సభ జరుగనున్నది. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఈ సభకు వేదిక.

ఇందులో ప్రొ. లక్ష్మణ్ గడ్డం, ప్రొ. హరగోపాల్, సోనిసోరి, ప్రొ.మాడభూషి శ్రీధర్, డి.జినర్సింగరావు, ప్రొ. కాత్యాయిని విద్మహే, ప్రొ. పద్మజా షా, వేణుగోపాల్, పాణి, నారాయణరావు, చంద్రశేఖర్, కూనంనేని సాంబశివరావు, వేములపల్లి వెంకటరామయ్య, అనురాధ, విమలక్క, సజయ, నందిని సిధారెడ్డి, పాశం యాదగిరి, శివారెడ్డి, పోటు రంగారావు, రహమాన్, ప్రొ. సమున్నత, సి. వనజ, కన్నెగంటి రవి, పద్మకుమారి, బల్ల రవీంద్రనాథ్ పాల్గొంటారు.

– పౌరహక్కుల సంఘం, తెలంగాణ సిఎల్‌సి,
ప్రజాస్వామిక హక్కుల సంఘాల సమన్వయ సంస్థ (సిడిఆర్‌వో)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా

ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్,
హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్,
హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

మతరహిత రిజర్వేషన్లకు చిరునామా ఎక్కడ?


■ రాహుల్ కుమార్

కులాలకు హిందూమతంలో సమర్థనే లేకపోతే అవి ఇన్నేళ్లుగా నిలబడేవే కావు. కులం ప్రాతిపదికగా రిజర్వేషన్లను ఇవ్వాల్సిన అవసరం మతంపేరుతో నిర్దేశితమైన కట్టుబాట్లు, ఆచారాల నుంచే ప్రధానంగా ఉత్పన్నమైంది. అందుకే రాజ్యాంగంలో ఫలానా మతం వారికి ఎటువంటి రిజర్వేషన్లు కల్పించకూడదనే నిబంధన ఎక్కడా కనపడదు. సామాజిక, విద్యా వెనుకబాటే అందులో ప్రధాన ప్రాతిపదికగా ఉంది. దీని వర్తింపులో మైనారిటీలను మినహాయించలేం!



రిజర్వేషన్ల చుట్టూ ఎత్తులూ జిత్తులూ కొత్తకాకపోయినా ప్రస్తుత ఎన్నికల్లో అవే ప్రధానంగా మారాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందాల్సిన రిజర్వేషన్లను ముస్లింలకు కట్టబెట్టటానికి ఇండియా కూటమి ప్రయత్నిస్తోందని మోదీ మొదలుకుని బీజేపీ నేతలందరూ ఆరోపణలతో హోరెత్తించారు. మతం ప్రాతిపదికన రిజర్వేషన్లను కల్పించటం రాజ్యాంగ విరుద్ధమని పదేపదే చెబుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, కర్ణాటకల్లో ముస్లింలకు 4శాతం రిజర్వేషన్లను కల్పించటం ద్వారా కాంగ్రెస్ దారుణానికి పాల్పడిందనీ ఆరోపించారు. అంతేకాదు బీసీ రిజర్వేషన్లలో కోత వేసి మరీ ఏపీలో వాటిని కల్పించారనీ విమర్శించారు. జరిగింది మాత్రం దీనికి భిన్నం. సత్యాసత్యాలతో పనిలేని ఆరోపణల పర్వంలోకి మన ప్రజాస్వామ్యం ఎప్పుడో దిగజారింది. ముస్లిం రిజర్వేషన్లను వ్యతిరేకించటం బీజేపీ/సంఘ్‌పరివార్‌కు కొత్తకాదు. ఆ వర్గాన్ని ప్రత్యేకంగా చూడటం ఎప్పుడూ సమ్మతం కాదు. ట్రిపుల్ తలాక్ రద్దు, హజ్‌యాత్రకు ఇచ్చే రాయితీల ఉపసంహరణలే అందుకు నిదర్శనం.

ముస్లిం రిజర్వేషన్లపై బీజేపీ ఇంతగా విరుచుకుపడటానికి ఇప్పుడో నేపథ్యం ఉంది. బీసీలకు వారి జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు పెంచుతామనీ ఇందుకోసం సుప్రీంకోర్టు విధించిన 50 శాతం పరిమితినీ ఎత్తేస్తామని ఇండియా కూటమి ప్రకటించింది. కులగణన వాగ్దానమూ అందులో భాగమే. ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతుల సర్వేను కూడా కులగణనతో పాటు చేపడతామని చెప్పింది. నవంబరు/డిసెంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఈ అంశాలతో బరిలోకి దిగినా తెలంగాణలో మాత్రమే గెలిచింది. అందుకే బీజేపీ ఈ ఎన్నికల్లో వీటికి మొదట్లో ప్రాధాన్యం ఇవ్వలేదు. రిజర్వేషన్లను మొత్తంగా రద్దుచేయటానికే 400 లోక్‌సభ సీట్లు గెలవాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకున్నదనే ప్రచారాన్ని కాంగ్రెస్ ముమ్మరం చేసిన తర్వాత పరిస్థితి మారిపోయింది. ముస్లిం రిజర్వేషన్లతో పాటు ఇండియా కూటమి ప్రధాన వాగ్దానమైన సామాజిక–ఆర్థిక–కులగణన సర్వేపై బీజేపీ విమర్శలను గురిపెట్టింది. హిందువుల ఆస్తుల వివరాలను తెలుసుకుని వాటిని ముస్లింలకు కట్టబెడుతుందనే ఆరోపణలతో ప్రచారాన్ని తీవ్రం చేసింది.

కులం, మతం, జాతి, భాషా, జన్మస్థలం ఆధారంగా వివక్షత చూపకూడదని రాజ్యాంగం నిర్దేశించింది. ఆచరణలోకి వచ్చేసరికి వీటన్నిటికీ మినహాయింపులూ ఉన్నాయి. రిజర్వేషన్ల కల్పనే పెద్ద మినహాయింపు. ఉద్యోగాల్లో, విద్యా సంస్థల్లో స్థానికులకు ప్రాధాన్యత దీని కిందకే వస్తుంది. గిరిజన ప్రాంతాల్లో ఆస్తుల కొనుగోలులో నిషేధాలూ అలాంటివే.. ఇలా చెప్పుకొంటే జాబితా పెద్దదిగానే ఉంటుంది. ప్రస్తుత వివాదం ముస్లింల రిజర్వేషన్లు, హిందువుల ఆస్తుల పంపకం గురించే కాబట్టి, వాటి పరిశీలన ద్వారా సత్యాసత్యాల మధ్య విభజన రేఖలు స్పష్టంగా గుర్తించొచ్చు. హిందువుల ఆస్తులను ముస్లింలకు పంచటం ఎప్పుడూ ఎక్కడా జరగలేదు. ఏ లెక్క ప్రకారం చూసినా ముస్లింలు వెనుకబడే ఉన్నారు. ముఖ్యంగా ఆస్తులు, ఉద్యోగాల విషయంలో హిందూ మధ్య, ఎగువ తరగతితో పోల్చితే వారి స్థానం అట్టడుగునే ఉంది.

ముస్లిం రిజర్వేషన్ల సమస్యను నిశితంగా పరిశీలిస్తే చాలా విషయాలు తెలుస్తాయి. అందరికీ తెలిసిన మండల్ కమిషన్ సిఫార్సులను చూద్దాం. దేశంలో ఓబీసీలు (అదర్ బాక్‌వర్డ్ క్లాసెస్) 52 శాతం ఉంటారని కమిషన్ అంచనా వేసింది. ఈ 52 శాతంలో ఉన్న వారందరూ హిందువులు కారు. హిందూయేతర మతాల్లో ఉన్న 8.40 శాతం ఓబీసీలను కూడా 52 శాతంలో కలిపి చూపించింది. హిందూ ఓబీసీలను 43.60 శాతంగానూ, హిందూయేతర ఓబీసీలుగా 8.40 శాతంగానూ లెక్కగట్టింది. 82 ముస్లిం గ్రూపులను ఓబీసీలుగా గుర్తించింది. ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో కల్పించాలని సిఫార్సు చేసింది. రిజర్వేషన్లు 50 శాతం దాటకూడదని 1980ల నాటికే సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఎస్సీ, ఎస్టీలకు 15 శాతం, 7.5 శాతం చొప్పున రిజర్వేషన్లు అప్పటికే అమలవుతున్నాయి. మండల్ కమిషన్ జనతా ప్రభుత్వం హయాంలో ఏర్పాటైంది. ఆ ప్రభుత్వంలో జన్‌సంఘ్ పార్టీ (బీజేపీకి పూర్వరూపం) కూడా భాగస్వామి. మండల్ కమిషన్ సిఫార్సులను ఆమోదించటం అంటే ఓబీసీ వర్గంలో భాగంగా ముస్లింలకు రిజర్వేషన్లను కల్పించటానికి అంగీకరించటమే! మండల్ సిఫార్సులపై సుప్రీంకోర్టులో దాఖలైన కేసుల్లో కూడా ముస్లింలను ఓబీసీలుగా పరిగణించటాన్ని సమస్యగా లేవనెత్తలేదు. అందుకే సుప్రీంకోర్టు కూడా ముస్లింలను ఓబీసీలుగా భావించటాన్ని తప్పుపట్టలేదు. ఇక 1955లో ఏర్పాటైన కాకా కలేల్కర్ బీసీ కమిషన్ కూడా 'మోస్ట్ బాక్‌వర్డ్' కేటగిరిలో ముస్లింలలోని వెనుకబడిన వర్గాలను చేర్చింది.

మండల్ కమిషన్ కంటే ముందే కొన్ని రాష్ట్రాలు ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించాయి. వాటి వర్గీకరణనూ చేపట్టాయి. వెనుకబడిన ముస్లిం వర్గాలకు రిజర్వేషన్లూ కల్పించాయి. మండల్ కమిషన్ వీటిని పరిగణనలోకి తీసుకుంది. అందుకే కేంద్ర ఓబీసీ జాబితాలో వెనుకబడిన ముస్లిం వర్గాలు/కులాలు/ సమూహాలు చాలానే చేరాయి. 2011 నాటికి రాష్ట్రాల వారీగా కేంద్ర ఓబీసీ జాబితాలో 2,423 కులాలు ఉంటే అందులో 411 కులాలు/వర్గాలు ముస్లింలకు చెందినవి. వీరందరికీ మతంతో సంబంధం లేకుండా వెనుకబాటుతనమే గీటురాయిగా జాబితాలో చోటు కల్పించారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకు చెందిన ముస్లిం కులాలూ కేంద్ర జాబితాలో ఉన్నాయి. ముస్లింలకు కల్పించిన అన్ని రిజర్వేషన్లూ మతప్రాతిపదికగానే జరిగాయని రాజకీయంగా వాదించొచ్చు. వాస్తవ దృష్టితో చూస్తే ఆ వాదన నిలబడదు. కాంగ్రెస్ ముస్లిం బుజ్జగింపు విధానంలో భాగంగా వాటిని కల్పించారని సర్దిచెప్పుకోటానికీ ప్రయత్నించొచ్చు. చారిత్రక దృష్టితో చూస్తే ఆ వాదనా నిలబడదు. బ్రిటిషు పాలననాటి స్వదేశీ సంస్థానాలకు బుజ్జగింపు అవసరాలు ఉన్నాయని భావించలేం. అప్పటికి ఓట్ల రాజకీయాల్లేవు. వివిధ వర్గాల సర్దుబాటు అవసరాలు ఉన్నాయి. ట్రావన్‌కోర్ (కేరళ), మైసూరులు హిందూ సంస్థానాలే. 1874లోనే మైసూరులో పోలీసు ఉద్యోగాల్లో ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించారు. ట్రావన్‌కోర్‌లో 1937లో ముస్లింలకు, క్రైస్తవులకు రిజర్వేషన్లు ఇచ్చారు. 1956లో ప్రత్యేక కేరళ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కొన్ని మార్పులతో వాటిని కొనసాగించారు. ప్రస్తుతం ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు అక్కడ ఉన్నాయి. లాటిన్ క్యాథలిక్కులతో పాటు ఎస్సీల నుంచి క్రైస్తవంలోకి మారిన వారికీ రిజర్వేషన్లు ఉన్నాయి. కర్ణాటకలో 1972లో హవనూర్ కమిషన్ సిఫార్సుల ప్రకారం, బాగా వెనుకబడిన కులాల కేటగిరిలో 4 శాతం రిజర్వేషన్లను ముస్లింలకు అమలు చేస్తున్నారు. తమిళనాడులో 95 శాతం ముస్లింలు ఏదోఒక బీసీల కేటగిరిలో ఉన్నారు. ముస్లింలను ప్రత్యేక కేటగిరిగా భావించి రిజర్వేషన్లు ఇవ్వటం కేరళ, కర్ణాటకలో మాత్రమే ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఈ పద్ధతిలో 5 శాతం రిజర్వేషన్లు ఇవ్వటానికి 2004 తర్వాత జరిగిన ప్రయత్నాలకు కోర్టులు అంగీకరించలేదు. 5 శాతం రిజర్వేషను 4 శాతానికి తగ్గిస్తూ (మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకుండా) ముస్లింల్లో వెనుకబడిన 14 కులాలు/వర్గాలకు వాటిని పరిమితం చేసినా రాష్ట్ర చట్టాన్ని హైకోర్టు కొట్టివేసింది. తాత్కాలికంగా వాటిని కొనసాగించటానికి మాత్రం సుప్రీంకోర్టు 2010లో అనుమతి ఇచ్చింది. ఈ 14 కులాలు/వర్గాలకు కేంద్ర ఓబీసీ జాబితాలో ఇప్పటికీ చోటు లభించలేదు. మొత్తంగా చూస్తే 20 రాష్ట్రాల్లో, 4 కేంద్రపాలిత రాష్ట్రాల్లో ముస్లింలను ఓబీసీలుగా పరిగణించి రిజర్వేషన్లను అమలు చేస్తున్నారు.

రాజకీయాలు వాస్తవాలను ఎలా మరుగుపరుస్తాయో తెలుసుకోవాలంటే ఇటీవలే భారతరత్న ప్రకటించిన బిహారీ దివంగత నేత కర్పూరీ ఠాకూర్ వ్యవహారాన్ని కొంత తెలుసుకోవాలి. ఉత్తరాదిన బీసీలకు రిజర్వేషన్లను సమగ్రంగా ఇవ్వటానికి కసరత్తు చేసింది కర్పూరీ ఠాకూరేనని చెప్పాలి. ముస్లింల్లో వెనుకబడిన వర్గాలకు కూడా బీసీ రిజర్వేషన్లలో చోటు కల్పించారు. దాని గురించి ఎవరూ ఇప్పుడు మాట్లాడటం లేదు. కర్పూరీకి భారతరత్న ఇచ్చినందుకు జేజేలు కొట్టినవారే అప్పుడు ఓబీసీ రిజర్వేషన్లను వ్యతిరేకించి అక్కడ ప్రభుత్వం పడిపోయేటట్లు చేశారు.

ఇప్పటికీ కులం ప్రాతిపదికగానే రిజర్వేషన్లు అమలవుతున్నాయి. సంపన్నశ్రేణిలోకి వచ్చే వారికి ఓబీసీ రిజర్వేషన్లు వర్తించని మాట నిజమే. కానీ ఆ పరిధిలోకి వచ్చేవారి సంఖ్య చాలాచాలా స్వల్పం. కుల వ్యవస్థ అనేది హిందూ మతానికే పరిమితమనే భావన వాస్తవ పరిశీలనకు నిలబడదు. కులానికి సంబంధించిన అవలక్షణాలన్నీ దేశంలోని ఇతర మతాల్లోనూ కనపడతాయి. ముస్లింలను పరిశీలిస్తే తెలిసేది అదే! ముస్లింలలో ప్రధానంగా నాలుగు సామాజిక విభాగాలు ఉన్నాయి. 1) అష్రఫ్‌లు: వీళ్లు తమ మూలాలను అరబ్బు, ఇరాన్, టర్కీ, అఫ్ఘనిస్తాన్‌ల్లో చూసుకుంటారు. 2) హిందూ అగ్రకులాల నుంచి ఇస్లాంలోకి మారిన వారు కూడా తమని అష్రఫ్‌లుగానే భావించుకుంటారు. 3) అజ్‌లఫ్‌లు: ఎక్కువగా వృత్తి పనివారు, మధ్య కులాల నుంచి వచ్చినవారు ఇందులో చేరతారు. 4) అర్జల్‌లు: అంటరాని కులాల నుంచి ఇస్లాంలోకి మారినవారు ఇందులో ఉంటారు. ఈ విభాగాలు ఇలా ఏర్పడటానికి కులవ్యవస్థ ప్రభావమే ప్రధాన కారణం. అందుకే వివాహాలు కూడా ఈ విభాగాల మధ్య చాలా తక్కువ. మత సిద్ధాంత పరంగా ఇస్లాంలో కులాలకు గుర్తింపు లేదు. అలాగే క్రైస్తవంలోనూ లేదు. కానీ కమ్మ, రెడ్డి, మాల, మాదిగ క్రైస్తవుల మధ్య కులాలు సృష్టించిన సామాజిక విభజనలు అలాగే కొనసాగుతున్నాయి. ముస్లింల్లోనూ అదే నడుస్తోంది. కులమే రిజర్వేషన్లకు ప్రాతిపదికైతే ఆ కులానికి సంబంధించిన అన్ని దారుణాలకు ఇంకా లోనవుతున్న తమకు రిజర్వేషన్లు ఎందుకు ఇవ్వరని ఈ వర్గాల నుంచి వస్తున్న ప్రశ్నకు సామాజిక న్యాయ దృష్టితో జవాబివ్వటం అంత తేలికకాదు. కులాలకు హిందూమతంలో సమర్థనే లేకపోతే అవి ఇన్నేళ్లుగా నిలబడేవే కావు. కులం ప్రాతిపదికగా రిజర్వేషన్లను ఇవ్వాల్సిన అవసరం మతంపేరుతో నిర్దేశితమైన కట్టుబాట్లు, ఆచారాల నుంచే ప్రధానంగా ఉత్పన్నమైంది. అందుకే రాజ్యాంగంలో ఫలానా మతం వారికి ఎటువంటి రిజర్వేషన్లు కల్పించకూడదనే నిబంధన ఎక్కడా కనపడదు. సామాజిక, విద్యా వెనుకబాటే అందులో ప్రధాన ప్రాతిపదికగా ఉంది. దీని వర్తింపులో మైనారిటీలను మినహాయించలేం!

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)



కేయూ ప్రక్షాళన జరిగేనా?



- భూ ఆక్రమణలపై కమిటీ నివేదికకు చెదలు
- అక్రమార్కులను కాపాడుతున్నదెవరు?
- అర్ష్ కాలేజీలో రూ.5కోట్ల ఫీజుల స్కాం ఏమైందో!
- అనుబంధ అధ్యాపకుల నియామకంలో నిబంధనలు తూచ్
- ఉత్కంఠ రేపుతున్న పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలపై విచారణ
- అధిక మెస్ బిల్లుల పేరుతో రూ.2.50కోట్లు కనుమరుగు
- ఫాం డీ కోర్సుల అనుమతుల్లో అక్రమాలపై కానరాని చర్యలు
- వీసీగా రమేష్ నియామకం నుంచే వివాదాలు మొదలు
- కేయూ ప్రక్షాళనపై సీఎం రేవంత్ ప్రకటనతో వి ద్యార్థులు, ప్రొఫెసర్లలో ఆశలు

వివాదాలకు కేరాఫ్‌గా కాకతీయ యూనివర్సిటీ

కబ్జాలు, అవినీతి, అక్రమాలతో కంపు కొడుతున్న కాకతీయ యూనివర్సిటీలో ప్రక్షాళన జరుగుతుందా? రూ.కోట్ల విలువైన కేయూ భూములు అన్యాక్రాంతంతో పాటు అధ్యాపకుల నియామకాల్లో అక్రమాలు, పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలపై విచారణ ముందుకు సాగుతుందా? మెస్ బిల్లులతో పాటు ఆర్ష్ కాలేజీ ఫీజుల నిధుల మాయ, ఫాం డీ అనుమతుల్లో అక్రమాలకు బాధ్యులపై చర్యలు ఉంటాయా? అనే ప్రశ్నలకు అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. కొన్నేళ్లుగా గాడి తప్పిన కాకతీయ యూనివర్సిటీ పాలనను ప్రక్షాళన చేస్తానని సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన విద్యార్థులు, అధ్యాపకుల్లో ఆశలు చిగురింపజేస్తోంది. ఈ నెలలో వీసీ రమేష్ పదవీకాలం ముగుస్తుండటంతో కొత్త పాలక మండలి నియామకంతో పాటు కేయూలో జరిగిన అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ విచారణకు ప్రభుత్వం ఆదేశిస్తుంద నే ప్రచారం జరుగుతోంది.

- వరంగల్, ఆంధ్రజ్యోతి ప్రతినిధి

7లో..



దందాలు @ ఓఆర్ఆర్

రింగు రోడ్డు పరిసరాల్లో అసాంఘిక కార్యకలాపాలు

- పేకాట కేంద్రాలుగా హోటళ్లు
- విద్యాసంస్థల్లో గంజాయి విక్రయాలు
- విచ్చలవిడిగా వ్యభిచార గృహాల నిర్వహణ
- దృష్టి సారించని రెండు పీఎస్‌ల పోలీసులు

వరంగల్ క్రైం, మే 16: ఔటర్ రింగ్ రోడ్డు అక్రమ దందాలకు కేంద్రంగా మారింది. రింగ్ రోడ్డు ప్రాంతం నిర్మానుష్యంగా ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ప్రధానంగా కేయూ, హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని ఓఆర్ఆర్‌పై ఈ దందాలు ఎక్కువగా నడుస్తున్నాయి. ఈ ప్రాంతంలో విద్యాసంస్థలు ఎక్కువగా ఉండటంతో గంజాయి విక్రయాలు సాగుచున్నట్లు తెలిసింది. ఓఆర్ఆర్‌పై వెలిసిన కమర్షియల్ కాంప్లెక్స్‌లలో పేకాట కేంద్రాలు నడుస్తున్నట్లు సమాచారం. ఇవే కాకుండా ప్రైవేటు భవనాలు అద్దెకు తీసుకుని కొంతమంది వ్యక్తులు వ్యభిచార గృహాలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఓఆర్ఆర్‌కు కూతవేటు దూరంలో రెండు పోలీస్‌స్టేషన్‌లు ఉన్నప్పటికీ ఈ దందాలు యథేచ్ఛగా సాగడం గమనార్హం.

గంజాయి విక్రయాలు

ఓఆర్ఆర్‌పై గంజాయి విక్రయాలు జోరుగా సాగుచున్నట్లు సమాచారం. విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని కొంతమంది గంజాయి దందా సాగిస్తూ పెద్దఎత్తున మూటగట్టుకుం టున్నట్లు తెలిసిం ది. సిగరెట్లు, చాక్లెట్స్ రూపేణా గంజాయి విక్రయిస్తున్నట్లు సమా చారం. ఒక సిగరెట్ రూ.300 వరకు చాక్లెట్ రూ.100 నుంచి రూ.200 వరకు ఉంటుందని తెలిసింది. సిగరెట్, చాక్లెట్లు మత్తును ఇస్తుండడంతో యువత గంజాయి బానిసలుగా మారుతున్నట్లు తెలుస్తోంది. రాత్రి అయిందంటే గుంపులుగా రోడ్డుపైకి చేరి వాట్సాప్ కాల్‌లో విక్రయదారుడికి సమాచారం ఇస్తారని తెలిసింది. విక్రయిం చేవారు క్షణాల్లో సరఫరా చేసి వెళతారని సమాచారం. టోల్ గేట్ నుంచి దామెర ఏరియా వరకు రోడ్డుపై మత్తుబాబులు దర్శనమిస్తారని తెలిసింది. గంజాయి సేవించే వారిలో ఎక్కు వగా సంపన్నుల పిల్లలే ఉండటంతో మత్తు కోసం ఎంతైనా వెచ్చిస్తారని, పట్టుబడితే పలుకుబడి ఉపయోగిస్తారని సమాచారం.

పేకాట కేంద్రాలు

ఓఆర్ఆర్‌పై వెలిసిన కమర్షియల్ కాంప్లెక్స్‌ల్లో పేకాట కేంద్రాలు నడుస్తున్నట్లు సమాచారం. బయట హోటల్స్ ఇతర వ్యాపారం చే స్తున్నట్లు కనిపిస్తున్నప్పటికీ లోపల పేకాట జోరుగా సాగుతుంటుంద నే ప్రచారం ఉంది. ఈ కేంద్రాల్లో వేల రూపాయలు పేకాటలో చేతు లు మారుతాయని సమాచారం. ఇటీవల ఈ రోడ్డుపై ఉన్న హోటల్ లో పేకాట ఆడుతుండగా పోలీసులు పట్టుకుని కేసు పెట్టిన విష యం తెలిసిందే. కమర్షియల్ కాంప్లెక్స్‌లతో పాటు ప్రైవేటు స్థలాల్లో వేసినటువంటి షెడ్డుల్లోనూ పేకాట జోరుగా సాగుచున్నట్లు సమా చారం. పేకాట కేంద్రాల్లో మందు, విందులను అందించే సౌకర్యం ఉంటుందని తెలిసింది. నిర్వాహకులకు బాగానే గిట్టుబాటు అవుతుందని తెలిసింది.

వ్యభిచార గృహాల నిర్వహణ

గంజాయి విక్రయాలు, పేకాట కేంద్రాల నిర్వహణతో పాటు వ్యభిచార గృహాలను నిర్వహిస్తున్నట్లు సమా చారం. రోడ్డుకు సమీపంలో భవనాలు అద్దెకు తీసుకుని వ్యభిచార గృహాలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. నగరా నికి చెందిన కొంతమంది వ్యక్తులు దీన్ని వ్యాపారంగా చేసుకుని దందా సాగిస్తున్నట్లు సమాచారం. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న యువతులను తీసుకువచ్చి వ్యభిచా రం నిర్వహిస్తున్నట్లు తెలిసింది. యువతులకు రోజు వారి చెల్లింపులు చేయడంతోపాటు భవన యజమాను లకు సైతం రోజువారిగా అద్దె చెల్లింపులు జరుపుతు న్నట్లు సమాచారం. నిర్మానుష్య ప్రాంతం కావడంతో ఈ దందా యథేచ్ఛగా సాగుతుందనే ప్రచారం ఉంది.

దృష్టి సారించని పోలీసులు

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ఓఆర్ఆర్ మా రినప్పటికీ రెండు ఠాణాల పోలీసులు దృష్టి సారించ కపోవడం పలు ఆరోపణలకు తావిచ్చినట్లు అవుతోంది. అక్రమ దందాలు సాగుతున్నాయనే సమాచారం ఉన్న ప్పటికీ పెట్రోలింగ్ పెంచకపోవడం, దాడులు చేయక పోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పెట్రోలింగ్ వాహనాలు అడపాదడపా తిరిగినప్పటికీ దందాల కట్ట డికి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవనే ఆరోపణలు న్నాయి. ఇప్పటికైనా పోలీసులు ఓఆర్ఆర్‌పై జరిగే దందాల కట్టడికి చర్యలు తీసుకోవాల్సి అవసరం ఉంది. లేదంటే అసాంఘిక కార్యకలాపాలు విచ్చలవిడిగా సాగే ముప్పు లేకపోలేదు.

నిఘా పెంచాం : జె.సురేష్, హసన్‌పర్తి సీఐ

ఓఆర్ఆర్‌పై నిఘా పెంచాం. నిరంతరం మా సిబ్బంది పెట్రోలింగ్ చేస్తున్నారు. గంజాయి విక్రయించే వారిపై కేసులు పెడుతున్నాం. నెలరోజుల్లో ఐదు వరకు కేసులు చేశాం. గంజాయి తీసుకోవడం వలనే జరిగే నష్టం గురించి యువతకు అవగాహన కలిగిస్తున్నాం. పేకాట కేంద్రాలపై దాడులు నిర్వహిస్తున్నాం. ఓఆర్ఆర్‌పై వ్యభిచార గృహాల నిర్వహణ అనే ప్రచారంలో వాస్తవం లేదు. స్టేషన్ పరిధిలో ఎక్కడ ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా స్థానికులు మా దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటాం. శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

నిబంధనల మేరకే భవన నిర్మాణ అనుమతులు

- నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- భవన నిర్మాణ స్థలాలు క్షేత్రస్థాయి పరిశీలన



బాలసముంద్రంలో తనిఖీలు చేస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, మే 16: వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిర్మాణం జరుగుతున్న ఇళ్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లకు నిబంధనల ప్రకారమే భవన నిర్మాణ అనుమతులు జారీ చేయనున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. గురువారం గ్రేటర్ పరిధిలోని హనుమకొండ, బాలసముద్రం, పోస్టల్ కాలనీ, ప్రకాశ్‌రెడ్డిపేట ప్రాంతాల్లో నిర్మిస్తున్న కట్టడాలని పర్యవేక్షించారు. భవన నిర్మాణ అనుమతి పత్రాలను పరిశీలించారు. భవన నిర్మాణ పత్రాలలో పొందుపర్చిన విధంగా స్థలాలు ఉన్నాయా? లేదా అని సిబ్బందితో కొలిచి చూశారు. ఈ కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన

వరంగల్ ఏనుమాముల మార్కెట్‌లో స్ట్రాంగ్ రూములను ఏఆర్‌వో, వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే గురువారం సందర్శించారు. ఇటీవల వరంగల్ లోక్‌సభ ఎన్నికలు జరిగిన నేపథ్యంలో వరంగల్ తూర్పు సెగ్మెంట్‌కు సంబంధించిన ఈవీఎంలను, ఎన్నికల సామగ్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు స్ట్రాంగ్ రూముల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఉంచాలని అక్కడి పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఇంకా స్ట్రాంగ్ రూముల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కంట్రోల్ రూములకు అనుసంధానంగా వీక్షించనున్నట్లు తెలిపారు. ఏఆర్‌వో వెంట వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్, సీఐ రమేష్, ఆర్ఐ జలపతిరెడ్డి పాల్గొన్నారు.

పాత ఫైళ్లతో బిల్లులు

- గత కమిషనర్ సంతకాలతో బిల్లులు చేస్తున్నవైనం
- ఇంజనీరింగ్ సిబ్బందిపై కమిషనర్ సీరియస్?

వరంగల్ కార్పొరేషన్, మే 16: గ్రేటర్ వరంగల్ నగర పాలకసంస్థలో కొందరు సిబ్బంది తీరు వివాదాస్పదంగా మారింది. బల్దియాకు కొత్త కమిషనర్ వచ్చి రెండు నెలలవుతున్నా.. ఇంకా పాత కమిషనర్ సంతకాలతో కూడిన ఫైళ్లకు సిబ్బంది గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నట్లు సమాచారం. దీంతో విషయం తెలిసిన కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే ఆగ్రహం వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

వరంగల్ ప్రధాన కార్యాలయంలో పాటు కాశిబుగ్గ, కాజీపేట సర్కిల్ కార్యాలయాల్లో డీబీ (డ్రాయింగ్ బ్రాంచ్) విభాగంతో పాటు కొందరు ఇంజనీర్లు అడ్డదారులు తొక్కుతున్నట్లు ఆరోపణలున్నాయి. కమిషనర్ పేషీలో పని చేస్తున్న ఓ ఉద్యోగి.. కాంట్రాక్టర్ల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు దండుకుని ఇంకా పాత కమిషనర్ నుంచి సంతకాలు చేసిన ఎంబీలు తెచ్చాడు. అధికారులను మచ్చిక చేసుకుని డీబీ, ఇంజనీరింగ్ ఉన్నతాధికారుల నుంచి బిల్లులు చేస్తున్నట్లు తెలిసింది. ఈ విషయం రెండు రోజుల కిందట కమిషనర్ దృష్టికి వచ్చినట్లు తెలిసింది. దీంతో రహస్యంగా దర్యాప్తు చేయించిన కమిషనర్.. తప్పు జరిగినట్లు ఆధారాలతో గుర్తించారు. బల్దియా ప్రధాన కార్యాలయం, కాశిబుగ్గ, కాజీపేట సర్కిల్ కార్యాలయాలలో పని చేస్తున్న డీబీ అధికారులు, కొందరు ఇంజనీరింగ్ విభాగం అధికారులను బుధవారం సాయంత్రం హుటాహుటిన తన కార్యాలయానికి పిలిపించుకున్నట్లు తెలిసింది. వారు చేసిన తప్పులతో కూడిన పత్రాలను చూపించి హెచ్చరించినట్లు సమాచారం. మరోమారు తప్పు జరిగితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించి పంపినట్లు తెలిసింది. కార్పొరేషన్‌లో ఇంకా పాత అధికారుల సంతకాలతో అడ్డదారిలో బిల్లులు పొందుతున్న విషయం చర్చనీయాంశంగా మారింది. కమిషనర్ వద్ద పని చేస్తూ అడ్డదారులు తొక్కుతున్న ఉద్యోగికి తన సామాజిక వర్గానికి చెందిన కొందరు ఉన్నతస్థాయి అధికారులు అండగా నిలుస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

కురిసింది వాన..

- జిల్లాలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం
- నీటమునిగిన లోతట్టు ప్రాంతాలు
- జలమయమైన హనుమకొండ బస్‌స్టేషన్



గురువారం సాయంత్రం నగరంలో మెరుపుల దృశ్యం

హనుమకొండ, మే 16 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాలో పలు చోట్ల సాయంత్రం నుంచి ఒక మోస్తరు భారీ వర్షం పడింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన ఈ వర్షం రాత్రి పొద్దుపోయే వరకు కురుస్తూనే ఉంది. సాయంత్రం 7 గంటల నుంచి వర్షం పడడం ప్రారంభమైంది. దీంతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. వర్షంతో హనుమకొండ బస్ స్టేషన్, కాకాజీకాలనీ, హనుమకొండ చౌరస్తా, టైలర్ స్ట్రీట్, ములుగురోడ్డుతో పాటు పలు లోతట్టు ప్రాంతాల్లో పెద్దఎత్తున వర్షపు నీరు నిలిచింది. వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. జన జీవనం స్తంభించిపోయింది. మరో ఐదురోజులపాటు ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. బుధవారం తూర్పు విదర్భ, దాని పరిసరప్రాంతాల్లో కొనసాగిన ఆవర్తనం.. గురువారం మధ్యప్రదేశ్ నైరుతి ప్రాంతాల్లో 0.9 కిలోమీటర్ల ఎత్తున కేంద్రీకృతమై ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. గురువారం హనుమకొండతోపాటు జయశంకర్ భూపాపల్లి, ములుగు జిల్లాల్లో గంటలకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.





భారీ వర్షంతో నిట్ వద్ద రహదారులపై చేరిన నీరు

బల్దియాలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ప్రజలకు అందుబాటులో 18004251980 టోల్‌ఫ్రీ నెంబర్

వరంగల్ కార్పొరేషన్: అకాల వర్షాల కారణంగా గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ప్రజల సహాయార్థం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. గురువారం బల్దియా కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. నగర ప్రజలకు సత్వర సహాయం అందించడానికి బల్దియా కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడంతో పాటు 24గంటలు సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. సమస్య ఉన్న ప్రాంతాల ఫొటోలు, డివిజన్ పేరు రాసి వాట్సాప్ నెంబర్‌కు పంపిస్తే వెంటనే డీఆర్ఎఫ్ టీములను పంపిస్తామని పేర్కొన్నారు. ప్రజలు 18004251980 టోల్‌ఫ్రీ నెంబర్‌తో పాటు 9701999645, 970 19 99676 నెంబర్‌లకు ప్రజలు సమాచారం అందించాలని కమిషనర్ కోరారు.

మహా త్రిపుర సుందరిగా భద్రకాళి

- అమ్మవారి సన్నిధిలో లక్ష కుంకుమార్చన
- ఉభయదాత సేవకులుగా పట్టణ ఆర్యవైశ్య సంఘం



అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

వరంగల్ కల్చరల్, మే 16: వరంగల్‌లోని చారిత్రక భద్రకాళి అమ్మవారి దేవస్థానంలో భద్రకాళి, భద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం ఏడో రోజుకు చేరగా, అమ్మవారు మహా త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అమ్మవారిని రథంపై ఊరేగించారు. ఉదయం 4గంటలకు నిత్యాహ్నికం, చతుష్టానార్చన కార్యక్రమాన్ని అర్చకులు నిర్వహించారు. అమ్మవారి బలి ఉత్సవం నిర్వహించారు. ఉభయదాత సేవకులుగా పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గుండా ప్రకాష్‌రావు దంపతులతో కలిసి వేయిమంది ఆర్యవైశ్యులు సంప్రదాయబద్ధంగా అమ్మవారి సేవలో పాల్గొన్నారు. ఆలయ ప్రధానార్చకుడు భద్రకాళి శేషు, ఆలయ ఈవో శేషు భారతిలతో కలిసి ప్రకాష్‌రావు దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలు, పూజా సామానులను వేదమంత్రాల మధ్య అందజేసి శోడషోపచార పూజల్లో పాల్గొన్నారు. వేయిమంది ఆర్యవైశ్య మహిళలు అమ్మవారి మహామండపంలో లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. శ్రీలలితా సహస్ర నామ పారాయణం, సౌందర్యలహరి పారాయణం చేశారు. దుర్గా, లక్ష్మీ హోమాలు నిర్వహించారు. పూర్ణాహుతి అనంతరం దాదాపు 3వేల మంది కి గుండా ప్రకాష్‌రావు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తొనుపునూరి వీరన్న, మల్యాల వీరమల్లయ్య, ప్రోగ్రాం కన్వీనర్లు ఐత గోపీనాథ్, నాగేశ్వర్‌రావు, కల్వ నాగరాజ్ పాల్గొన్నారు. సాయంత్రం ఆలయంలో అమ్మవారి రథ సేవ నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈవో శేషు భారతి పర్యవేక్షించారు.



ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతున్న పాలకురి అశోక్‌కుమార్

శాసన మండలికి పంపిస్తే ప్రశ్నించే గొంతుకనవుతా..

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి అశోక్ కుమార్

వడ్డెపల్లి, మే 16: తెలంగాణ ఉద్యమకారుడిగా, జర్నలిస్టుగా, చరిత్రకారుడిగా, అధ్యాపకుడిగా సుదీర్ఘ అనుభవం ఉన్న తనను శాసన మండలికి పంపిస్తే ప్రశ్నించే గొంతుక నవుతానని వరంగల్ , ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి పాలకురి అశోక్ కుమార్ అన్నారు. గురువారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగులు, ఉద్యోగులకు అండగా నిలుస్తానని అన్నారు. గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తానని, మెగా డీఎస్సీ కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. బ్లాక్‌మెయిలర్లను ఎమ్మెల్సీగా ఎన్నుకోవద్దని పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో గుగులోతు ప్రవీణ్, వినోద్ బోడ, తేజావత్ ప్రవీణ్, నవీన్ పట్నాయక్, వి. వంశీ, రవిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చేపపిల్లల పెంపకానికి నిర్మించిన హౌస్‌లు



చేపపిల్లల పెంపకానికి ఉపయోగించే ఫిష్ పాండ్

పేరుకే ఉచితం.. అంతా అనుచితమే..

- చేప పిల్లల పంపిణీలో దళారులు, అధికారుల చేతివాటం
- మత్స్యకారులకు చేరే లబ్ధి 30 నుంచి 40 శాతం మేరకే..
- సంఘాలకు నగదు బదిలీ చేయాలంటున్న మత్స్యకారులు

కాళోజీ జంక్షన్, మే 16 : రాష్ట్రంలో గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం వివిధ వృత్తిదారుల అభివృద్ధి, సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టింది. అందులో భాగంగానే చేపలు పట్టే వృత్తిలో ఉన్న మత్స్యకారుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను సరఫరా చేసే కార్యక్రమాన్ని 2016 నుంచి చేపట్టి అమలు చేస్తోంది. గొర్రెలు, మేకల మాంసం ధరలు రోజు రోజుకూ ఆకాశాన్నంటుతూ సామాన్యులకు అందుబాటులో లేని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో మత్స్య సంపద పెంపుదలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం బాగుందని అందరూ భావించారు. నిరుపేదలు సైతం కొనుగోలు చేసేందుకు చేపల పౌష్టికాహారం అందరికి అందుబాటులో ఉంటుందని తలపోశారు.



కాంట్రాక్టర్లకు అప్పగింత

మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలకు మేలురకం చేప పిల్లల పంపిణీని సరఫరా చేసే బాధ్యతను ప్రభుత్వం కాంట్రాక్టర్లకు అప్పగించింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టరు.. సాధారణంగా జూలైలో చెరువుల్లోకి నీరు చేరే సమయంలో కాకుండా అక్టోబరు నెల వచ్చే దాకా సరఫరా చేయకపోవడంతో మత్స్యకారులకు నష్టం వాటిల్లుతోంది. సుమారు 35 నుంచి 40 సెంటిమీటర్ల పొడవు గల చేప పిల్లలు సుమారు కిలో తూకం బరువు వచ్చే సరికి 8 నెలల సమయం పడుతోంది. కానీ కాంట్రాక్టరు ఆలస్యంగా చేప పిల్లలను సరఫరా చేయడంతో వేసవికాలం సమీపించి చెరువుల్లో నీరు తగ్గే వరకు సుమారు అర కిలో బరువు వరకు మాత్రమే ఎదగడంతో మత్స్యకారులకు నష్టం వాటిల్లుతోంది. ప్రభుత్వం ఉచిత చేపపిల్లల పంపిణీ చేపట్టక ముందు మత్స్యకారులు ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ, కైకలూరు నుంచి తామే స్వయంగా వెళ్లి సొంత డబ్బులతో తెప్పించి వర్షాలు పడగానే జూలైలోనే చేప పిల్లలను చెరువుల్లో వదిలేవారు. అంతేగాక మేలు రకం చేపపిల్లల కొనుగోలు చేసి తీసుకొచ్చేవారు. సుమారు 7 నుంచి 8 నెలల కాలంలో చేపలు పూర్తిగా ఎదిగి మత్స్యకారులకు ప్రయోజనం చేకూరేది. హనుమకొండ జిల్లాలో 168 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉండగా, వరంగల్ జిల్లాలో 184 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉన్నాయి.

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని సంఘాలన్నింటికి చేపపిల్లలను ఉత్పత్తి చేసి పంపిణీ చేసేందుకు హనుమకొండలోని భీమారం శివారులో సుమారు 25 ఎకరాల స్థలంలో ఫిష్‌ఫామ్ సుమారు దశాబ్దా కాలం కిందటే అందుబాటులో ఉంది. కానీ ప్రస్తుతం అది నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుతోంది. ఈ ఫామ్‌లో చేప పిల్లల ఉత్పత్తిని ప్రారంభిస్తే హనుమకొండ, వరంగల్ జిల్లాలతోపాటు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అన్ని మత్స్య సహకార సంఘాలకు మేలు రకం చేప పిల్లలను ఇక్కడి నుంచే సరఫరా చేసే అవకాశం ఉంటుంది. మత్స్య సంపద అభివృద్ధికి ఈ యేడు ఇంకా ప్రభుత్వం ఎలాంటి కార్యాచరణ ప్రణాళికలను రూపొందించకపోవడం శోచనీయం.

సంఘాలకు నగదు బదిలీ చేయాలి

నీరటి సదానందం, ముదిరాజ్ మహా సభ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి



ప్రభుత్వం రైతులకు నేరుగా పెట్టుబడి సహాయం అందిస్తున్న విధంగా మత్స్య సహకార సంఘాలకు చేప పిల్లల కొనుగోలుకు నేరుగా నగదు బదిలీ చేయాలి. దీంతో సంఘాలు సకాలంలో మేలు రకం చేప పిల్లల విత్తనాలను కొనుగోలు చేసేందుకు వీలవుతుంది. మత్స్యకారులు బాగుపడుతారు.

కాంట్రాక్టర్ వ్యవస్థను రద్దు చేయాలి..

బుస్స మల్లేశం, హనుమకొండ మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు



చేప పిల్లల పంపిణీలో కాంట్రాక్టర్ వ్యవస్థను రద్దు చేయాలి. నెలల తరబడి ఆలస్యంగా కాంట్రాక్టర్ చేప పిల్లలను సరఫరా చేయడం వల్ల మత్స్యకారులు నష్టపోతున్నారు. అంతేగాక నాసిరకం చేపపిల్లలను సరఫరా చేయడం వల్ల దిగుబడి తగ్గి సరైన ఆదాయం లభించడం లేదు.

అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల్లో వేగం పెంచండి

● నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ● వివిధ విభాగాల అధికారులతో సమావేశం

వరంగల్ కార్పొరేషన్, మే 16: గ్రేటర్ వరంగల్ పరిధిలోని అమ్మ ఆదర్శ పాఠశాలల పనులలో వేగం పెంచాలని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. గురువారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం అమ్మ ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న పనులపై అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఎలక్ట్రిఫికేషన్ మరుగుదొడ్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఏఈలకు సూచించారు. ఇంకా కొన్ని పాఠశాలలో పనులు ప్రారంభించలేదని తెలిసిందని, వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ప్రభుత్వం అన్నివిధాలుగా సహకారం అందిస్తోందని, పనులకు ముందస్తుగా 25 శాతం నిధులను కేటాయించిందన్నారు. ఇప్పటి వరకు మైనర్ పనులు పూర్తిచేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తామన్నారు. ఇంకా చైర్‌పర్సన్లు, పాఠశాలల ప్రధానోపాధ్యాయుల మధ్య సమన్వయం ఉన్నప్పుడే పనులు త్వరగా జరుగుతాయని అన్నారు. పనుల కోసం బల్దియా ఇంజనీరింగ్ అధికారులు సాంకేతిక సహకారం అందిస్తారని అన్నారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీపీఆర్‌వో రాజేశ్‌కుమార్, టీఎంసీ రమేష్, ఈఈలు రాజయ్య, సంజయ్‌కుమార్, డీఈలు రవికుమార్, సంతోష్‌బాబు, శివానంద్, శ్రీకాంత్, సీఈవోలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

నిరుద్యోగులను మోసం చేసిన కాంగ్రెస్

పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి

జనగామ, మే 16 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ జాబ్ క్యాలెండర్ పేరుతో ఓట్లు వేయించుకొని కాంగ్రెస్ నిరుద్యోగులను మోసం చేసిందని వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి విమర్శించారు. జనగామ మండలం పసరమడ్ల శివారులోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం నిర్వహించిన జనగామ నియోజకవర్గస్థాయి ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.4వేలు నిరుద్యోగ భృతి, 50 ఖాళీలతో మెగా డీఎస్సీ ఏమైందని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా జాబ్ క్యాలెండర్ ప్రకటన ఊసే లేదన్నారు. గతంతో పట్టభద్రులు మేధావులను మాత్రమే ఎన్నుకున్నారని, అదే పరంపరను కొనసాగిస్తూ తనను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న బ్లాక్ మెయిలర్ అని, ప్రశ్నిస్తానని చెప్పే మల్లన్న కాంగ్రెస్ పార్టీని ఒక్కసారైనా ప్రశ్నించారా అని నిలదీశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించేవాడు కావాలో, ప్రభుత్వాన్ని ప్రశంసించే వారు కావాలో ఆలోచించుకోవాలన్నారు. తన ఎదుగుదలను చూసి ఓర్వలేక బీజేపీలో తనను రాజకీయంగా హత్య చేస్తే కేసీఆర్ ఆదరించి అభ్యర్థిగా అవకాశం కల్పించారని అన్నారు.

తీన్మార్ మల్లన్న ఓ బ్లాక్‌మెయిలర్: పల్లా

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ఓ పెద్ద బ్లాక్‌మెయిలర్ అని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. పోలీసులను వాడుకొని తన సంస్థల మీద ఫిర్యాదులు చేయిస్తూ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడ్డాడని, రూ.2కోట్లు డిమాండ్ చేస్తే ఒక్క రూపాయి కూడా ఇవ్వనని తేల్చి చెప్పానని అన్నారు. తన భార్యకు తెలంగాణ ఏర్పాటుకు ముందే ఉద్యోగం వస్తే కేసీఆర్ వచ్చాక ఉద్యోగం వచ్చిందంటూ దుష్ప్రచారాలు చేశాడని, దేశంలో అన్ని రాష్ట్రాల కంటే తెలంగాణలోనే ఎక్కువ ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు. రాష్ట్రం రూ.7లక్షల కోట్ల అప్పు చేశారని శ్వేతపత్రాల పేరుతో కాంగ్రెస్ అబద్ధాలు ప్రచారం చేసిందని, ఆర్‌బీఐ ఇచ్చిన నివేదికలో రూ.3.80 లక్షల కోట్లు అని చూపించిందని గుర్తు చేశారు. ఈ సమావేశంలో జనగామ జడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మీ, మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, నాయకులు ఎడవెల్లి కృష్ణారెడ్డి, నర్సింగరావు, బాల్దె సిద్ధిలింగం, బక్క నాగరాజుయాదవ్, ఇర్రి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దొడ్డు వడ్లకూ బోనస్ ఇవ్వాలని నిరసన

రైతులు పండించే దొడ్డు రకం వడ్లకు కూడా బోనస్ ఇవ్వాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మండిపడిన ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో భాగంగా బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఎన్నికల వేళ బోనస్ ఇస్తామంటూ ప్రకటించి కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని, కేవలం సన్న వడ్లకే ఇస్తామంటూ రైతులను కాంగ్రెస్ మరోసారి దగా చేసిందన్నారు



సమావేశానికి హాజరైన కార్యకర్తలు, పట్టభద్రులు

కేయూ ప్రక్షాళన జరిగేనా?

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

- వివాదాలకు కేరాఫ్‌గా కాకతీయ యూనివర్సిటీ
- వీసీ రమేష్ నియామకం నుంచే వివాదాలు
- ప్రక్షాళనపై సీఎం ప్రకటనతో విద్యార్థులు, ప్రొఫెసర్లలో ఆశలు



ఎంతో ఘన చరిత్ర కలిగిన కాకతీయ యూనివర్సిటీలో అక్రమాలు రాజ్యమేలుతున్నాయి. కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతంతో పాటు అధ్యాపకులు నియామకాల్లో అక్రమాలు, పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలు, అధిక మెస్ బిల్లులతో పాటు ఆర్ట్స్ కాలేజీ ఫీజుల నిధుల మాయ, ఫాం డీ అనుమతుల్లో అక్రమాలు లాంటివి వర్సిటీ ప్రతిష్ఠను దిగజార్చాయి. కొన్నేళ్లుగా యూనివర్సిటీ పరిపాలన గాడితప్పిందని, దీనిని ప్రక్షాళన చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనతో వర్సిటీకి మంచిరోజులు రాబోతున్నాయని విద్యార్థులు, అధ్యాపకులు భావిస్తున్నారు.

వీసీగా రమేష్ నియామకం నుంచే వివాదాలు

వైస్ చాన్సలర్‌గా తాటికొండ రమేష్ నియామకం జరిగిన నాటి నుంచే వివాదాలు మొదలయ్యాయి. కేయూ వీసీ నియామకానికి 2019 జూలై 8వ తేదీన ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. వీసీగా పని చేయడానికి పదేళ్లకు పైగా ప్రొఫెసర్‌గా పని చేసిన అనుభవం ఉండాలనే నిబంధన ఉంది. అయితే తాటికొండ రమేష్ 2009 జూలై 14న ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారని, నోటిఫికేషన్ నాటికి రమేష్‌కు పదేళ్లు పూర్తవడంతో ఆయన వీసీకి అనర్హుడంటు అప్పట్లో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీనిపై కొందరు అధ్యాపకులు లోకాయుక్తను కూడా ఆశ్రయించారు. అయితే ఇవేవీ పట్టించుకోకుండా సెర్చ్ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా గత ప్రభుత్వం కేయూ వీసీగా రమేష్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో 2021 జూన్ 24న రమేష్ వీసీగా బాధ్యతలు స్వీకరించారు. కాగా, ఈ వివాదంపై నిజామాబాద్‌కు చెందిన ప్రొఫెసర్ విద్యాసాగర్‌రెడ్డి లోకాయుక్తలో ఫిర్యాదు చేయగా.. ఈ కేసును వాదించడానికిగాను కేయూ నిధుల నుంచి రూ.5లక్షలు వీసీ లాయర్‌కు చెల్లించారని అధ్యాపకులు, విద్యార్థులు ఆందోళనకు దిగారు. వీసీగా రమేష్ బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి కేయూ వివాదాలకు కేరాఫ్‌గా మారిందనే చర్చ జరుగుతోంది. అయితే ఈ నెలలో వీసీ రమేష్ పదవీకాలం ముగుస్తుండటంతో కొత్త పాలక మండలి నియామకంతో పాటు కేయూలో జరిగిన అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ విచారణకు ప్రభుత్వం ఆదేశిస్తుందనే ప్రచారం జరుగుతోంది.

కబ్జాలు, అక్రమాలపై నివేదికలేవీ?

కేయూలో పలు అక్రమాలు, అవినీతిపై వేసిన విచారణ కమిటీల నివేదికలు చెత్తబుట్టలోకి వెళుతున్నాయని విద్యార్థులు, అధ్యాపకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాకతీయ యూనివర్సిటీకి కేటాయించిన భూముల్లో వందల ఎకరాలు ఇప్పటికే అధికారుల నిర్లక్ష్యంతో కబ్జాకోరుల చేతుల్లోకి వెళ్లాయి. అయితే 229 సర్వే నెంబరులో కేయూ ఉద్యోగులతో పాటు కొందరు పోలీసులు, రాజకీయ నేతలు సుమారు 12ఎకరాల భూములను అక్రమంగా కబ్జా చేసి ఇళ్లు నిర్మించుకున్నారు. దీనిపై విద్యార్థులు, అధ్యాకులు ఆందోళన చేయటంతో 13మందికి నోటీసులు ఇచ్చారు. ముగ్గురు ప్రొఫెసర్లతో ల్యాండ్ కమిటీని ఏర్పాటు చేశారు. తొలుత అసిస్టెంట్ రిజిస్ట్రార్ అశోక్‌బాబు కన్వీనర్‌గా కమిటీని వేయగా, కబ్జా చేసినట్లు ఆరోపణలు వచ్చిన వారిలో అశోక్‌బాబు పేరు కూడా ఉండటంతో విద్యార్థులు, అధ్యాపకుల ఆందోళనతో అశోక్‌బాబు పేరు తొలిగించి ప్రొఫెసర్ చంద్రమౌళి కన్వీనర్‌గా, ప్రొఫెసర్లు మనోహర్, నాగేంద్రబాబు సభ్యులుగా ల్యాండ్ కమిటీ 2022 అక్టోబరులో కొలువు తీరింది. ఈ కమిటీ సుమారు ఏడాది పాటు భూ కబ్జాలు, అక్రమాలపై పరిశీలన చేసి 2023 డిసెంబరులో వీసీ రమేష్‌తో పాటు పాలకమండలికి నివేదికను అందించింది. అయితే ఇప్పటి వరకు ఈ నివేదికలో ఏముందో వీసీ బహిర్గతం చేయకపోవడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భూ కబ్జాలకు వీసీ అండగా నిలుస్తున్నారనే ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. అలాగే పీహెచ్‌డీ అడ్మిషన్లలో అక్రమాలు జరిగాయని 2023 సెప్టెంబరు నెలలో విద్యార్థులు ఆందోళనకు దిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పీహెచ్‌డీ అడ్మిషన్లలో జరిగిన అక్రమాలపై దృష్టి పెట్టింది. రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ వెంకటరమణ, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి, సాంకేతిక విద్యా సంయుక్త కార్యదర్శి వెంకటేశ్వర్లుతో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ నివేదిక ఆధారంగా పీహెచ్‌డీ అడ్మిషన్లలో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. అయితే ఈ కమిటీ ఇచ్చిన నివేదిక కూడా బహిర్గతం కాకపోవడంపై విద్యార్థుల్లో ఉత్కంఠ నెలకొంది. అలాగే ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో ఫీజుల పేరుతో సుమారు రూ.5కోట్లు స్వాహా చేసినట్టు ఆరోపణలున్నాయి. 2014-15 విద్యా సంవత్సరం నుంచి ఆర్ట్స్ కాలేజీలో ట్యూషన్ ఫీజు, టీసీల ఫీజు, కాలేజీ ఫీజుతో పాటు ఇతర ఫీజులకు సంబంధించి యూనివర్సిటీకి సంబంధం లేకుండా కాలేజీ పని చేసే ఓ ఉద్యోగి వసూళ్లు చేసి, బ్యాంకు ఖాతాలో జమ చేయలేదని ఫిర్యాదులు అందాయి. దీనిపై ప్రొఫెసర్ మనోహర్ ఒత్తిడి మేరకు వీసీ రమేష్ 2021, ఆగస్టు 24న అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీలతాదేవి, ఆడిట్ విభాగంలో పని చేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీలతలతో కూడిన ద్విసభ్య కమిటీని నియమించారు. 15రోజుల్లోపు కవిటీ నివేదిక అందించాలని వీసీ ఆ లేఖలో ఆదేశించి మూడేళ్లు కావస్తున్న నివేదికలు నిద్రపోతున్నాయి. ఈ కుంభకోణంలో సుమారు రూ.5కోట్లు మాయం అయినట్లుగా సమాచారం. కేయూలో జరుగుతున్న అక్రమాలపై ఎన్ని నివేదికలు వేసిన అవి నామమాత్రంగా మిగిలిపోతున్నాయి. పై అధికారుల ఒత్తిడి, రాజకీయ నేతల బెదిరింపులతో నివేదికలు చెత్తబుట్టల పాలవుతున్నాయి.

నిధులు మాయం, అక్రమాలపై మౌనమే..

కేయూలో అనుబంధ అధ్యాపకులను నిబంధనలకు విరుద్ధంగా నియమించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సెలక్షన్ కమిటీ లేకుండా కేయూలో గతేడాది జనవరి 30న 12మందిని, మార్చిలో నలుగురిని కలిపి మొత్తం 16మందిని పాలక మండలి అనుబంధ అధ్యాపకులుగా నియమించటంపై విమర్శలున్నాయి. వీరికి ఒక్కొక్కరికి నెలకు రూ.50వేల చొప్పున 16మందికి ప్రతినెల రూ.8లక్షల వేతనాలు చెల్లిస్తున్నారని, అయితే ఇప్పటి వరకు వీరు ఎలాంటి పరిశోధనలు చేయటం లేదని, క్లాసులు తీసుకోవటం లేదనే ఆరోపణలున్నాయి. వీరికి ఇప్పటి వరకు రూ.90లక్షల వరకు వేతనాలు చెల్లించారని దీనిపై ప్రభుత్వం విచారణ జరిపించాలని కేయూ అధ్యాపకులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే కేయూలో సీడ్‌మనీ పేరుతో నకిలీ పరిశోధన ప్రాజెక్టులతో రూ.20లక్షలకు పైగా నిధులు స్వాహ చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆరుగురు ప్రొఫెసర్లతో కలిసి సీడ్‌మనీ పేరుతో జరిగిన ఈ అక్రమాలపై విచారణ జరిపించాలని అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్ (అకుట్) బృందం డిమాండ్ చేసిన స్పందన లేదు. అలాగే ఆర్ట్స్ కాలేజీలో ఫీజుల పేరుతో రూ.5కోట్లకు పైగా స్వాహ అయినట్లుగా ఆరోపణలు రావటంతో ఓ కమిటీ వేసి చేతులు దులుపుకొన్నారు. అలాగే మెస్ బిల్లుల పేరుతో రూ.2.50కోట్ల స్కాం జరిగినట్లుగా ప్రచారం జరుగుతోంది. దీనిపై ఫిర్యాదులు వచ్చిన వీసీ, పాలక మండలి మౌనమే అనే విమర్శలున్నాయి. అలాగే కేయూ పరిధిలో మొత్తం 24ఫార్మసీ కాలేజీలు ఉండగా.. 12 కాలేజీలు డీ ఫార్మసీ కోర్సును ప్రవేశపెట్టేందుకు అనుమతులు కోరుతూ యూనివర్సిటీకి దరఖాస్తు చేసుకున్నాయి. అయితే ఫామ్ డీ కోసం దరఖాస్తు చేసుకున్న 12కాలేజీల్లో ఆరు ఫార్మసీకాలేజీలకు మాత్రమే 300 పడకల అస్పత్రులు అనుబంధంగా కలిగి ఉన్నాయి. మిగతా ఆరు కాలేజీలకు ఎలాంటి అనుబంధ వైద్యశాలలు లేకపోయినా యూనివర్సిటీ అనుమతులు ఇవ్వటం వివాదస్పదంగా మారింది. దీని వెనుక భారీగా చేతులు మారినట్లు ప్రచారం జరుగుతుంది. అలాగే అసోసియేట్ ప్రొఫెసర్ల, సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతుల్లో అక్రమాలు జరిగాయనే చర్చ కూడా జరుగుతోంది.

ప్రస్తుత వీసీ రమేష్ పదవి కాలం ఈ నెల 21న ముగుస్తోంది. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని యూనివర్సిటీలకు ప్రభుత్వం సెర్చ్ కమిటీలు నియమించగా కాకతీయ యూనివర్సిటీకి మాత్రం సెర్చ్ కమిటీని నియమించక పోవడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కేయూలో జరుగుతున్న అక్రమాలు, అవినీతిపై విజిలెన్స్ విచారణ చేపట్టే యోచనలో ఉన్న ప్రభుత్వం ప్రస్తుత వీసీనే ఇంచార్జిగా కొనసాగిస్తారా లేక కొత్త వీసీ వచ్చే వరకు ఎవరైనా సీనియర్ ప్రొఫెసర్‌కు బాధ్యతలు అప్పగిస్తారా అనేది చర్చనీయాంశంగా మారింది. మొత్తానికి పాలనను గాడిలో పెట్టేందుకు కేయూ ప్రక్షాళన చేయాలనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

సీఎం రేవంత్‌రెడ్డిపైనే ఆశలు



కాకతీయ యూనివర్సిటీలో జరుగుతున్న అక్రమాలు, కబ్జాలపై సీఎం రేవంత్‌రెడ్డికి పూర్తిస్థాయిలో అవగాహన ఉంది. 2023 సెప్టెంబరు 14న వరంగల్ నగరానికి టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో వచ్చిన రేవంత్‌రెడ్డి విద్యార్థులు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా నిలిచారు. వీసీ రమేష్‌ను పల్లా రాజేశ్వర్‌రెడ్డికి బంట్రోతుగా పోల్చుతూ.. విద్యార్థులు జీవితాలను వీసీ నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే వీసీ నియామకాన్ని రద్దు చేయటంతో పాటు ఆయన తీసుకున్న నిర్ణయాలను కూడా రద్దు చేస్తామని, వీసీ అక్రమలు, అవినీతిపై విచారణ జరిపిస్తామని అనాడు రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఆ మాటకు కట్టుబడి ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే పీహెచ్‌డీ అడ్మిషన్లలో జరిగిన అక్రమాలపై త్రిసభ్య కమిటీని వేసి నివేదిక తెప్పించుకున్నారు. అలాగే పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గతనెల 24న మడికొండలో జరిగిన జనజాతర బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి కాకతీయ యూనివర్సిటీని ప్రక్షాళన చేస్తానని, వీసీ రమేష్‌ను తొలిగించి, విచారణ చేయిస్తానని ప్రకటన చేశారు. దీంతో కొన్నాళ్లుగా వివాదాలకు కేరాఫ్‌గా మారిన కేయూపై సీఎం దృష్టిసారించారనే చర్చ యూనివర్సిటీలో జరుగుతోంది. ప్రస్తుతం వీసీ పదవీ కాలం ఈ నెల 21తో ముగుస్తుండటంతో కొత్త పాలక మండలి, వీసీ నియామకంతో పాటు విజిలెన్స్ విచారణకు ప్రభుత్వం ఆదేశించే అవకాశం ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది. రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం వీసీ రమేష్ హయంలో తీసుకున్న నిర్ణయాలతో పాటు అక్రమాలు, అవినీతిపైన విచారణ చేయించే అవకాశం ఉందని, జూన్ 6వ తేదీ వరకు రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా కోడ్ ముగిసిన తరువాత కేయూ ప్రక్షాళన దిశగా ప్రభుత్వం అడుగులు పడతాయన్న ఆశతో విద్యార్థులు, అధ్యాపకులు ఎదురుచూస్తున్నారు.

కేయూ వీసీ ఎంపిక ఇప్పట్లో లేనట్టేనా?

వరంగల్ ఎడ్యుకేషన్, మే 16 : కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఎంపిక లేనట్టేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాన్నింటికి వీసీలను నియమించేందుకు సెర్చ్ కమిటీలను ప్రభుత్వం.. కాకతీయ విశ్వవిద్యాలయానికిమాత్రం నియమించలేదు. దీంతో ఈ అనుమనాలకు బలం చేకూరుతోంది. వీసీ పదవీ కాలం ఈ నెలాఖరును ముగుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం సెర్చ్ కమిటీ ఏర్పాటు చేయకపోవడం చర్చనీయాంశంగా మారింది. దీంతో వర్సిటీలోని కొందరు తిరిగి పాత వీసీనే కొనసాగించే అవకాశం ఉందని అభిప్రాయపడుతుండగా.. యూనివర్సిటీకి పూర్తిస్థాయి పాలకమండలి లేకపోవడంతోనే ప్రభుత్వం సెర్చ్ కమిటీని నియమించలేదన్న మరో వాదన వినిపిస్తోంది. ఇదిలా ఉంటే యూనివర్సిటీలో గందరగోళ పరిస్థితులు ఉన్నాయని, వాటిని చక్కదిద్దాకే వీసీ నియామకం చేపట్టే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు ఇంకొందరు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుత వీసీపై అవినీతి అక్రమాల ఆరోపణలు వస్తుండటం, అకూట్ సభ్యులు నేరుగా వీసీపై అవినీతి అరోపణలు చేస్తుండటంతో ప్రభుత్వం అసలు విషయాన్ని తెలుసుకునేందుకు ఇంటలిజెన్స్ వర్గాలను ఆరా తీస్తున్నట్టు వర్సిటీలో ప్రచారం జరుగుతోంది.

ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కాజీపేట, మే 16: కాజీపేట ప్రభుత్వ ఐటీఐలో 2024- 2025 విద్యా సంవత్సరానికి మొదటి విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ కాజీపేట ప్రిన్సిపాల్ కె. అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ట్రేడ్‌లు, సీట్ల వివరాలు ఇలా ఉన్నాయి. ఎలక్ట్రీషన్‌లో - 20 సీట్లు, ఎలక్ట్రానిక్ మెకానిక్ - 24, టర్నర్ - 20, డ్రాఫ్ట్‌మాన్ సివిల్ - 24, డ్రెస్ మేకింగ్ - 40, స్టెనో (ఇంగ్లీష్) - 24 సీట్లు ఉన్నాయని తెలిపారు. 10వ తరగతి మార్కుల జాబితా, రూల్‌ఆఫ్ రిజర్వేషన్ ప్రాతిపదికన ఎంపిక జరుగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు జూలై 10వ తేదీలోగా iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె.అశోక్‌కుమార్ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న బొగ్గు లారీ

దంపతులకు గాయాలు

కృష్ణకాలనీ (భూపాలపల్లి), మే 16: ద్విచక్ర వాహనాన్ని బొగ్గు లారీ ఢీకొట్టగా వృద్ధ దంపతులు గాయపడిన సంఘటన భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి పట్టణంలోని కారల్‌మార్క్స్‌కాలనీకి చెందిన శిరుప సమ్మయ్య, విజయలక్ష్మి దంపతులు ద్విచక్ర వాహనంపై సుభాష్‌కాలనీలోని సంతకు బయల్దేరారు. ఈక్రమంలో అంబేద్కర్ కూడలిలో రోడ్డు దాటుతుండగా ద్విచక్రవాహనాన్ని కాటారం వైపు నుంచి వచ్చిన బొగ్గు లారీ ఢీకొంది. దీంతో ఇద్దరు లారీ కింద పడిపోయారు. విజయలక్ష్మికి తీవ్ర గాయం కాగా ఆమె భర్త స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికులు 108కు సమాచారం అందించినా అందుబాటులోకి రాలేదు. ఆ దీంతో భూపాలపల్లి మహిళా ఎస్సై సంధ్యారాణి పోలీసు వాహనంలో ఇద్దరిని మంజూర్‌నగర్‌లోని వంద పడకల ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతానికి రెండు గేదెల మృత్యువాత

కృష్ణకాలనీ (భూపాలపల్లి), మే 16: విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి చెందిన ఘటన భూపాలపల్లి మండలం పంబాపూర్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్థులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. రైతులు శాదం వెంకన్న, చింతకాయల కిరణ్‌కు చెందినగొడి గేదెలు ఎప్పటిలాగే మేతకు వెళ్లాయి. ఈ క్రమంలో గ్రామశివారులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తగలి అక్కడికక్కడే మృతి చెందాయి. ఒక్కో గేదె విలువ రూ. 1,15,000 ఉంటుందని బాధితులు తెలిపారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వేడుకున్నారు.

చల్లగరిగ శివారులో..

చిట్యాల : మండలంలోని చల్లగరిగ గ్రామ శివారులో మేతకు వెళ్లిన పాడి గేదె విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. బాధిత రైతు సిరిపెల్లి నరేష్ తెలిపిన వివరాల మేరకు.. రోజులాగే గురువారం మేతకు వెళ్లిన గేదెకు 11కేవీ విద్యుత్ తీగ తాకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. దీని విలువ రూ.50 వేలు ఉంటుందని, ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.



మారోజు వీరన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు


మారోజు వీరన్న సిద్ధాంతంతోనే సమసమాజ స్థాపన

ద్రావిడ సేవా సమితి అధ్యక్షుడు శ్రీకాంతాచారి

కాశీబుగ్గ జంక్షన్, మే 16: మారోజు వీరన్న సిద్ధాంతం ఆచరణ ద్వారానే దేశంలో సమసమాజ స్థాపన సాధ్యమవుతుందని ద్రావిడ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పూసాల శ్రీకాంతాచారి అన్నారు. గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని వివేకానంద పాఠశాలలో న్యాయవాది బండి మొగిలి అధ్యక్షతన నిర్వహించిన మారోజు వీరన్న వర్ధంతి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మారోజు వీరన్న సిద్ధాంతానికి భయపడిన ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వీరన్నను 1999లో బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపించాడని అన్నారు. మతోన్మాద, ఫాసిస్టు పాలన చెలరేగిన సమకాలీన సమాజంలో మారోజు వీరన్న సిద్ధాంతం చాలా అవసరమని ఆయన అన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్ మాట్లాడుతూ.. మారోజు వీరన్న లేవనెత్తిన కుల వర్గ జమిలీ పోరాట సిద్ధాంతం విప్లవ పార్టీల్లోనే కాకుండా దేశ వ్యాప్తంగా చర్చకు వచ్చిందని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కొంగ వీరస్వామి, ఎంసీపీఐ నాయకులు గోనె కుమారస్వామి, మాస్ సావిత్రి, తెలంగాణ రైతు సంఘం నాయకులు మోర్తాల చందర్‌రావు, అభ్యుదయ రచయితల సంఘానికి చెందిన నిధి, న్యాయవాదులు కూనూరు రంజిత్‌గౌడ్, వేముల రమేష్, మహేందర్, వివిధ సంఘాల నాయకులు ఏదునూరి రాజమౌళి, కేడల ప్రసాద్, వేణుచారి, రామారావు, దిడ్డి ధనలక్ష్మి, చాగంటి మంజుల, వల్లాల జగన్‌గౌడ్, సాయిబాబా తదితరులు పాల్గొని వీరన్న చిత్రపటానికి నివాళులర్పించారు.

పరారీలో ఉన్న ఖైదీని పట్టుకున్న పోలీసులు



పెద్దముప్పారంలో నిందితుడు వీరన్నను పట్టుకున్న పోలీసులు

మహబూబాబాద్ రూరల్, మే 16 : ఓ హత్య కేసులో పెరోల్‌పై వచ్చి.. తప్పించుకు తిరుగుతున్న మహబూబాబాద్ మండలం కంబాలపల్లికి చెందిన సందుల వీరన్నను దంతాలపల్లి మండలం పెద్దముప్పారం గ్రామం గురువారం పోలీసులు పట్టుకున్నట్టు రూరల్ సీఐ సర్వయ్య తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. కంబాలపల్లికి చెందిన సందుల వీరన్న 1982లో ఓ హత్య కేసులో వరంగల్‌లోని సెంట్రల్ జైలులో జీవితఖైదీగా శిక్ష అనుభవిస్తున్నాడు. 1984లో పెరోల్‌పై బయటికి వచ్చాడు. నాటి నుంచి నేటి వరకు సుమారు 40 సంవత్సరాలు పోలీసులకు, జైలు అధికారుల కళ్ళు కప్పి తిరుగున్నట్టు పేర్కొన్నారు. పెద్దముప్పారం గ్రామంలో ఓ ఇంట్లో ఉన్నట్టుపక్కా సమాచారంతో గుర్తించి, వీరన్నను పట్టుకున్నట్టు సీఐ సర్వయ్య తెలిపారు. అనంతరం ఆ నిందితున్ని వరంగల్ జైలు అధికారులకు ముప్పారంలోనే అప్పగించినట్టు పేర్కొన్నారు. ఈ దాడిలో ఎస్సైలు దీపికారెడ్డి, కరుణాసాగర్, జైలు అధికారులు శ్రీనివాసరావు, రామకృష్ణారెడ్డి, నాగరాజు, రఘు, యాసిన్ పాల్గొన్నారు.



ఆహా.. ఏమి రుచి..

- మహిళా డెయిరీ పాల పదార్థాలకు భలే గిరాకీ
- సమ్మర్‌లో కూల్‌కూల్‌గా ఉంటుందని వినియోగం
- డెయిరీ టెక్నాలజీతో రుచికరమైన పదార్థాలు తయారీ



భీమదేవరపల్లి, మే 16: వేసవి తాపాన్ని తగ్గించేందుకు వినియోగదారులు ఎక్కువగా పాల పదార్థాలను స్వీకరిస్తారు. ముల్కనూర్ మహిళా డెయిరీలో డెయిరీ టెక్నాలజీతో రుచికరమైన పదార్థాలను తయారు చేస్తున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వినియోగదారుడి అభిరుచులకు అనుగుణంగా కొత్త కొత్త పాలపదార్థాలను డెయిరీ మార్కెట్లోకి విడుదల చేసింది. నాణ్యమైన పదార్థాలను సరసమైన ధరల్లో అందిస్తున్నారు. దీంతో ముల్కనూర్ మహిళా డెయిరీ పాల పదార్థాలకు భలే గిరాకీ ఏర్పడింది. మహిళా డెయిరీ సిబ్బంది మారుతున్న కాలానికి అనుగుణంగా వివిధ రకాలైన పాల పదార్థాలను రుచికరంగా అందిస్తోంది. 2002లో ప్రారంభమైన ముల్కనూర్ మహిళా డెయిరీ.. పాలతో పాటు పాల పదార్థాలను తయారు చేసి అమ్మాలని నిర్ణయించింది. కొన్నేళ్ల నుంచి కొత్త కొత్త పాల పదార్థాలను తయారు చేసి మార్కెట్లోకి విడుదల చేసింది. ప్రస్తుతం మహిళా డెయిరీ యేటా రూ.వంద కోట్ల టర్నోవర్‌కు చేరింది.

డెయిరీ అందిస్తున్న పదార్థాలు

మహిళా డెయిరీలో పాలు, పెరుగు, మజ్జిగ, పన్నీర్, నెయ్యి, స్వీట్ లస్సీ, దూద్ పేడ, మిల్క్ కేక్, బాసుందీ, బాదం మిల్క్, మ్యాంగో లస్సీ తదితర పాల పదార్థాలను వినియోగదారుడికి అందుబాటులో ఉంచింది. వినియోగదారులు అవసరమైన పరిమాణంలో అందిస్తోంది. హనుమకొండ, వరంగల్, ఆదిలాబాద్, సిద్దిపేట, భూపాలపల్లి, కరీంనగర్, జనగామ, హైదరాబాద్ తదితర జిల్లాలలో 18 ఔట్‌లేట్లను ఏర్పాటు చేసి వినియోగదారునికి నాణ్యమైన, సరసమైన ధరలలో అందిస్తుంది.

నెల రోజుల వినియోగం ఇలా...

ముల్కనూర్ మహిళా డెయిరీ నెల రోజుల్లో 15.66 లక్షల లీటర్ల పాలు, 64,710 పది కిలోల పెరుగు బకెట్లు, 7,795 ఐదు కిలోల పెరుగు బకెట్లు, 89,904 రెండు వందల గ్రాముల పెరుగు ప్యాకెట్లు, 280 కిలోల పన్నీర్, 303 కిలోల దూద్ పేడ, 55 కిలోల మిల్క్‌కేక్, 4,130 లీటర్ల లస్సీ, 40 కిలోల కోవా, 2,075 కిలోల నెయ్యిని గత నెల రోజులుగా అమ్మినట్లు డెయిరీ సిబ్బంది తెలిపారు.

ఫ్రీజర్ వాహనాల వినియోగం

మహిళా డెయిరీ పరిధిలో వినియోగదారుడికి నాణ్యమైన, రుచికరమైన పాల పదార్థాలను అందించేందుకు ఫ్రీజర్ వాహనాన్ని వినియోగిస్తున్నారు. రూ.20లక్షల వ్యయంతో రెండు ఫ్రీజర్ వాహనాలను డెయిరీ కొనుగోలు చేసింది. వినియోగదారులు ఎక్కువ మొత్తంలో పెరుగు బక్కెట్లు, మజ్జిగ ప్యాకెట్లు ఆర్డర్‌పై అమ్మే రేటుకు ఫ్రీజర్ వాహనాల ద్వారా సమకూరుస్తారు. ఫ్రీజర్ వాహనాలకు ఎలాంటి రుసుం లేదు. పాల పదార్థాలను ఆధునిక యంత్రాల ద్వారా తయారు చేసి ప్రయోగశాలలో పరీక్షించిన తరువాతనే మార్కెట్లోకి విడుదలకు అనుమతిస్తారు. ఎంటెక్ డెయిరీ టెక్నాలజీ చదివిన విద్యార్థుల పరిజ్ఞానంతో పాటు ఆధునిక టెక్నాలజీని వినియోగించి, వినియోగదారుడికి రుచికరమైన పదార్థాలను తయారు చేస్తుంది. నిరంతరం మార్కెట్లో పాల పదార్థాల్లో కొత్త వెరైటీలను వినియోగదారుడు కోరుకుంటున్నాడు. అందుకు అనుగుణంగా ఉత్పత్తులను తయారు చేస్తున్నారు.

వినియోగదారుడి అభిరుచి మేరకు..

మార్పాటి భాస్కర్‌రెడ్డి, మహిళా డెయిరీ జనరల్ మేనేజర్



వినియోగదారుడి అభిరుచి మేరకు పాల పదార్థాలను తయారు చేస్తున్నాం. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా వాటి పరిమాణం తయారు చేస్తున్నాం. వివాహాది శుభకార్యాలలో మజ్జిగతో మొదలై, మీగడ పెరుగుతో భోజనం తీపి పదార్థంతో ముగింపు చేసేలా పాల పదార్థాలను తయారు చేస్తున్నాం. లాభాపేక్ష కన్నా వినియోగదారుడికి సరసమైన ధరలో నాణ్యమైన ఉత్పత్తులను అందించడమే మా లక్ష్యం. వినియోగదారులకు పాలు, పాల పదార్థాలను చేరడానికి ఆధునికమైన ఫ్రీజర్ వాహనాలను వినియోగిస్తున్నాం. మేము కష్టపడి సంపాదించే ప్రతీ పైసా మహిళలకు చెందుతుంది. నాణ్యత, రుచికి మారుపేరైన మహిళా డెయిరీ ఉత్పత్తులను ప్రజలు ఆదరించాలి.



పార్ట్‌టైమ్ అధ్యాపకులను కాంట్రాక్టు అధ్యాపకులకు కన్వర్షన్ చేయాలి



కేయూ రిజిస్ట్రార్ చాంబర్‌లో బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న పార్ట్‌టైమ్ అధ్యాపకులు

వరంగల్ ఎడ్యుకేషన్, మే 16: కాకతీయ విశ్వవిద్యాలయంలో పార్ట్‌టైమ్ అధ్యాపకులుగా పనిచేస్తున్న వారిని కాంట్రాక్ట్ అధ్యాపకులుగా కన్వర్షన్ చేయాలని పార్ట్‌టైమ్ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ వై.రాంబాబు డిమాండ్ చేశారు. గురువారం కేయూ పరిపాలన భవనముందు వారు ధర్నా చేశారు. అనంతరం రాత్రి వరకు రిజిస్ట్రార్ చాంబర్‌లో కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బుధవారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి ఇచ్చిన మాట తప్పారని ఆరోపించారు. విద్యాశాఖ ముఖ్యకార్యదర్శికి లేఖ రాస్తానని చెప్పి మాట తప్పారన్నారు. కన్వర్షన్ కోసం అఫిడవిట్ తీసుకురమ్మని చెప్పిన వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ కలవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జనరల్ సెక్రెటరీ నరేందర్ నాయక్, నాయకులు డాక్టర్ దేవేజీ, డాక్టర్ భాగ్యమ్మ, డాక్టర్ వినోద, డాక్టర్ సుజాత, డాక్టర్ విజయ, డాక్టర్ సుధీర్, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ మాధవి, డాక్టర్ వాణిదేవి, డాక్టర్ సుజాత, డాక్టర్ సృజన, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ఫణి తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యాపారి మృతి

ఐనవోలు, మే 16: లారీ ఢీకొని యువ వ్యాపారి మృతి చెందిన సంఘటన పంథిని శివారు లక్ష్మీపురం స్టేజి వద్ద జాతీయ రహదారి(563)పై గురువారం తెల్లవారుజామున జరిగింది. ఎస్సై అనిల్ కుమార్ కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం సిరిసపల్లి గ్రామానికి చెందిన యువకుడు దిగ్గిశెట్టి వినయ్‌కుమార్(30) వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో నివాసం ఉంటూ ఒక కంపెనీ (నిత్యావసర సరుకుల విక్రయ) ఏజెన్సీ డీలర్‌గా వ్యాపారం నిర్వహిస్తున్నాడు. 18 మాసాలుగా ఇల్లందలో ఇల్లు అద్దెకు తీసుకొని ఉంటూ ఆయా మండలాల్లోని గ్రామాల్లో కిరాణం షాపులకు సరుకులు సరఫరా చేస్తున్నాడు. ఐదు రోజుల కిందట తన మేనత్త మృతిచెందగా ఐదో రోజు కార్యక్రమంలో పాల్గొనేందుకు స్వగ్రామానికి ఉదయం ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. వరంగల్ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న లారీ అతివేగంగా ఎదురుగా వచ్చి అదుపుతప్పి వినయ్ కుమార్ బైక్‌ను ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. ప్రయాణికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించగా అంబులెన్స్ ద్వారా ఎంజీఎంకు తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. వినయ్‌కుమార్ అవివాహితుడు, తల్లిదండ్రులు ఒక సోదరుడు, సోదరి ఉన్నారు. తండ్రి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉప్పు వాడకాన్ని తగ్గించాలి

వరంగల్ మెడికల్, మే 16: ప్రజలు ఉప్పు వాడకాన్ని చాలావరకు తగ్గించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.సాంబశివరావు సూచించారు. మే 17 ప్రపంచ రక్తపోటు దినాన్ని పురస్కరించుకొని నెల రోజులపాటు రక్త పోటుకు సంబంధించి వివిధ మాధ్యమాల ద్వారా అవగాహన కార్యక్రమాలు, స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ తెలిపారు. జిల్లాలో ఇప్పటికే మూడో దశ అసంక్రమిత వ్యాధులకు సంబంధించి 30 యేళ్ల పైబడిన వారందరికీ ఎన్‌సీడీ స్క్రీనింగ్ నిర్వహిస్తామన్నారు.

జిల్లాలో 89,708 మంది బీపీ వ్యాధిగ్రస్తులు ఉన్నారని, ఇందులో 27,411 మందికి ప్రతీనెల ఉచితంగా మందులు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మారుతున్న జీవనశైలి కారణంగా 30 ఏళ్ల పైబడిన వారిలో 26శాతం మంది రక్త పోటు భారి పడుతున్నారని తెలిపారు. వైద్యులు సూచించిన ప్రకారం మందులు వాడి, క్రమంగా బీపీ చెక్ చేయించుకోవాలన్నారు.

డీటీడీవో అక్రమాలపై విచారణ జరిపించాలి

హనుమకొండ కలెక్టరేట్, మే 16: గిరిజన అభివృద్ధి అధికారి ప్రేమకళ అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు లంబా డా హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీరా వెంకట్ గురువారం ఫిర్యాదు చేశారు. ప్రేమకళ అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని వెంకట్ కలెక్టర్‌కు ఇచ్చిన పిర్యాదులో పేర్కొన్నారు.



కలెక్టర్‌కు ఇచ్చిన పిర్యాదును చూపుతున్న వెంకట్

బాక్సింగ్ కిట్ అందజేత



శిక్షణా శిబిరంలో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

హసన్‌పర్తి, మే 16: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న వేసవి బాక్సింగ్ శిక్షణా శిబిరానికి గురువారం కోచ్ కాయిత నిరంజన్‌రెడ్డి బాక్సింగ్ కిట్, గ్లౌజ్‌లను బహూకరించారు. ఈ సందర్భంగా కరీంనగర్ సీఐ ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులు వేసవి శిక్షణా శిబిరాలను వినియోగించుకుని మంచి క్రీడాకారులుగా ఎదగాలన్నారు. శిక్షణా శిబిరానికి కావలసిన వస్తువులను సమకూర్చిన నిరంజన్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో 66వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, కోచ్ శీలం పార్థసారధి, కాయిత యాదగిరిరెడ్డి, బాక్సర్ పి.స్వామి, బుక్క బాలు, గడ్డం వెంకటేశ్వర్లు, రమేశ్, శీలం వంశీ పాల్గొన్నారు.

సింగిల్ స్క్రీన్ థియేటర్ల మూత

• నేటినుంచి తొమ్మిది సినిమా టాకీస్‌లు బంద్
• కొత్త సినిమాలు, ప్రేక్షకులు రాక పోవడంనే ఈ నిర్ణయం

హనుమకొండ, మే 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సింగిల్ స్క్రీన్ థియేటర్లు శుక్రవారం నుంచి నెల రోజుల పాటు మూతపడనున్నాయి. ఇందులో భాగంగా హనుమకొండ, వరంగల్, కాజీపేట పట్టణాల్లో ఉన్న తొ విమ్మిది సింగిల్ తెర థియేటర్లు బంద్ పాటించనున్నాయి. మూతపడనున్న థియేటర్లలో కాజీపేటలో భవానీ, మినీ భవానీ, హనుమకొండలో అమృత, అశోక, వరంగల్‌లో జెమినీ, మినీ జెమినీ, రాధిక, వెంకట్రామ, దేవీ వీటిలో ఉన్నాయి. పెద్ద సినిమాలు లేకపోవడం, చిన్న సినిమాలకు ప్రేక్షకులు ఎవరూ రాకపోవడంతో సింగిల్ స్క్రీన్ థియేటర్లు నష్టాలను ఎదుర్కొంటున్నాయి. పట్టుమని పది మంది ప్రేక్షకులు కూడా రావడం లేదు. వారి కోసం సినిమావేస్తే ఉద్యోగులకు వేతనాలు, కరెంట్, నిర్వహణ ఖర్చులు కలుపుకొని నష్టాలు తడిసిమోపెడవుతున్నాయి. ఒక థియేటర్ నిర్వహణకు దాని సామర్థ్యాన్ని బట్టి నెలకు ఎంత లేదన్నా రూ.20 నుంచి రూ.30లక్షల వరకు ఖర్చవుతోంది. మంచి సినిమా పడి థియేటర్ హౌస్‌ఫుల్ అయితే పెద్దగా ఇబ్బంది లేదు. కానీ ఈ మధ్య కాలంలో ఏ థియేటర్‌లో ప్రేక్షకులే కనిపించడం లేదు. చిన్న సినిమాలైతే ఎవరూ రావడమే లేదని అమృత థియేటర్ మేనేజర్ మోహన్‌రావు తెలిపారు.

కాగా, థియేటర్ల మూతతో అందులో పనిచేసే సిబ్బంది ఉపాధిపై ప్రభావం పడే ప్రమాదం ఉంది. ఇప్పటికే చాలా థియేటర్లు మూత పడి ఉద్యోగులు వీధినపడ్డారు. నగరంలో ఒకప్పుడు 20కిపైగా సింగిల్ స్క్రీన్ థియేటర్లు ఉండేవి. వాటిలో చాలా వరకు మూతపడ్డాయి. అవన్నీ షాపింగ్ మాల్స్, షాపింగ్ కాంప్లెక్సులు, షోరూంలు, గోదాములుగా మారిపోయాయి. ఎంతో చారిత్రక నేపథ్యం ఉన్న లక్ష్మీటాకీస్, జీఆర్ టాకీస్, సరోజా టాకీస్ వంటి పాత థియేటర్లు కాలగర్భంలో కలిసి పోయాయి.

దెబ్బతీస్తున్న ఓటీటీ

ఓటీటీ ప్లాట్‌ఫారమ్ వచ్చిన వచ్చిన తర్వాత థియేటర్ల వ్యవస్థ కుదేలైంది. కేవలం సినిమాలే ప్రజలకు వినోద సాధనంగా అప్రతిహతంగా సాగుతున్న తరుణంలో ఓటీటీ ప్లాట్ ఫారమ్ థియేటర్లను చావు దెబ్బతీసింది. ప్రేక్షకులు థియేటర్లకు రావడమే మానివేశారు. ఇంటి వద్ద టీవీల్లో, లేదా సెల్‌ఫోన్లలో తమకు నచ్చిన సినిమాలను చూసుకుంటున్నారు. దీంతో కుటుంబ సభ్యులతో కలిసి థియేటర్లకు వెళ్లి సినిమా చూడడం వల్ల అయ్యే ఖర్చు తప్పుతోంది.



ప్రేక్షకులు లేక ఖాళీగా ఉన్న నగరంలోని ఓ థియేటర్

థియేటర్లకు దూరం

ఇటీవలకాలంలో ప్రేక్షకులు థియేటర్లు దూరమవుతున్నారు. లోక్‌సభ ఎన్నికలు, ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లతో పాటు ఇతరత్రా కారణాల వల్ల ప్రేక్షకులు థియేటర్లకు రావడం పూర్తిగా మానేశారు. దీంతో వారంలో ఏదో ఒకరోజు మాత్రమే అది కూడా కొద్దిమంది ప్రేక్షకులే సినిమాకు వస్తున్నారు. ఇది యజమానులకు గిట్టుబాటు కావడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో శుక్రవారం నుంచి జిల్లాలోని అన్ని సింగిల్ తెర థియేటర్లను తాత్కాలికంగా మూసివేయడానికి తెలంగాణ థియేటర్స్ అసోసియేషన్ నిర్ణయం తీసుకున్నట్టు థియేటర్ల యజమానులు తెలిపారు.

పత్తి విత్తనాల ధరలు పైపైకి..

• జిల్లాల్లో 80వేల ఎకరాల్లో సాగు • దాదాపుగా 1.80 లక్షల పత్తి ప్యాకెట్ల అవసరం • ఒక్కో ప్యాకెట్‌పై రూ. 11 ధర పెంపు



పత్తి ప్యాకెట్లు

భీమదేవరపల్లి, మే 16: మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా నష్టాల్లో ఉంటున్న పత్తి రైతులపై పత్తి ప్యాకెట్ల ధర పెంచి కేంద్ర ప్రభుత్వం అదనపు భారం మోపింది. గత రెండేళ్లుగా పత్తి రైతులు చీడ పీడల బెడదతో పాటు పత్తి దిగుబడి గణనీయంగా తగ్గింది. అంతేకాకుండా పత్తికి సరైనా దిగుబడి లేకపోవడంతో పత్తి అన్నదాత ఆగమై పోతున్నాడు. జిల్లాలో దాదాపుగా 80 వేల ఎకరాల్లో పత్తి సాగు అవుతోంది. బీటీ-2 పత్తి విత్తనాలు రైతులు సాగు చేస్తారు. గతంలో బీటీ-2 పత్తి విత్తనానికి ఒక ప్యాకెట్‌కు రూ. 853 ధర ఉండగా, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం పెంచిన ధర ప్రకారం రూ. 864 ప్యాకెట్ ధర నిర్ణయించింది. దాదాపుగా ప్రతి బీటీ-2 పత్తి ప్యాకెట్‌పై రూ. 11లు పెంచి నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వంలోని ఫార్మర్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ పత్తి ప్యాకెట్లకు రూ. 11 ధర పెంచుతూ నిర్ణయం తీసుకుంది. 80 వేల ఎకరాల్లో పత్తి సాగు అవుతుండగా, ఒక ఎకరాకు 2 పత్తి ప్యాకెట్లు అవసరమవుతాయి. అలాగే పోగుంటలకు పత్తి గింజలు అవసరం ఉంటాయి. మొత్తంగా 1.80 లక్షల పత్తి ప్యాకెట్లు హనుమకొండ జిల్లాకు అవసరమవుతాయి.

పెంచిన పత్తి ప్యాకెట్‌కు రూ. 11తో లెక్కిస్తే జిల్లా రైతాంగంపై రూ. 17.50 లక్షల అదనపు భారం పడుతుంది. పెంచిన పత్తి ప్యాకెట్ల ధరలు ఈ ఖరీఫ్ నుంచి అమలవుతాయని అధికారులు పేర్కొంటున్నారు. దాదాపుగా ఖరీఫ్ సీజన్ ఆరంభానికి ముందే మే 15 వరకు కొత్త బీటీ-2 పత్తి విత్తనాలు అందుబాటులోకి వస్తాయని అధికారులు పేర్కొంటున్నారు.

వానాకాలం నుంచి అమలు



పెంచిన పత్తి విత్తనాల ధరలు ఈ వానాకాలం నుంచే రైతులకు అందుబాటులోకి వస్తాయి. ప్రతి పత్తి ప్యాకెట్‌పై కేంద్ర ప్రభుత్వంలోని ఫార్మర్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ పత్తి ధరను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. మే 15 వరకు బీటీ-2 పత్తి విత్తనాలు అందుబాటులోకి రానుండగా, వర్షాకాలంలో పత్తి విత్తనాలు మార్కెట్లోకి వస్తాయి.

- దామోదర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ ఏడీ, హనుమకొండ

ధరలు ఈ విధంగా...

2019 సంవత్సరంలో బీటీ-2 పత్తి విత్తనం ప్యాకెట్ ధర రూ. 710 ఉండగా, 2020లో రూ. 730, 2021లో రూ. 767, 2022లో రూ. 810, 2023లో రూ. 853, 2024లో రూ. 864 ధరలు నిర్ణయించారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు

డెంగీపై అవగాహన కలిగి ఉండాలి

జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు

వరంగల్ మెడికల్, మే 16: జాతీయ డెంగీ డేను పురస్కరించుకొని గురువారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ బి.సాంబశివరావు మాట్లాడుతూ.. వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది, పంచాయతీ, నగరపాలక సిబ్బంది తదితర డిపార్ట్‌మెంట్లు సమన్వయంతో పనిచేస్తూ డెంగీ వ్యాధి లక్షణాలు, వ్యాపించే విధానంపై అవగాహన కల్పించాలన్నారు. త్వరలో వర్షాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో లార్వా చర్యలు, ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించడంలో ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని దోమలు కుట్టకుండా వ్యక్తిగత చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్య, ఆరోగ్యశాఖ అధికారి, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.మదన్ మోహన్‌రావు, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఉమాశ్రీ, డాక్టర్ హిమబిందు, డాక్టర్ ఇఫ్తార్ అహ్మద్, జిల్లా మాస్ మీడియా అధికారి అశోక్‌రెడ్డి, శ్రీనివాస్, లింగమూర్తి, పరంజ్యోతి, రమేశ్, జ్యోతి, రిశీష్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణ్‌ఖేడ్ ఆర్డీవోపై చర్యలు తీసుకోవాలి

వరంగల్ ఎడ్యుకేషన్, మే 16: ఉపాధ్యాయులపై లాఠీచార్జ్ చేయించిన నారాయణ్‌ఖేడ్ ఆర్డీవోపై చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పెండెం రాజు, సీహెచ్. రవీందర్‌రాజు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికల విధులు నిర్వర్తించిన సిబ్బందికి రాష్ట్రమంతా ఒకే విధమైన రెమ్యునరేషన్ ఇస్తే.. నారాయణ్‌ఖేడ్ ఆర్డీవో తక్కువగా చెల్లించడాన్ని వారు తప్పుబట్టారు. ఈ విషయాన్ని ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లిన ఉపాధ్యాయులపై ఆయన లాఠీచార్జ్ చేయించడాన్ని ఖండిస్తూ ఆర్డీవోపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రకటనలో వారు డిమాండ్ చేశారు.

ఉద్యోగులు, పెన్షనర్లకు డీఏలను చెల్లించాలి

గిర్మాజిపేట, మే 16: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను సత్వరమే చెల్లించడంతో పాటు వేతన సవరణను 35 శాతం ఫిట్‌మెంట్‌గా ప్రకటించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ వరంగల్ జిల్లా శాఖ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరింది. వరంగల్ చార్‌బౌళి రోడ్డులోని సరస్వతి విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో గురువారం తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ వరంగల్ జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం అసోసియేషన్ అధ్యక్షు డు టి.వీరయ్య అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ నెల 18న జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలపై తగు నిర్ణయం తీసుకోవాలని సమావేశం విజ్ఞప్తి చేసింది. అన్ని కార్పొరేట్ ఆస్పత్రులలో ఈహెచ్‌ఎస్ కార్డులకు నగదు రహిత వైద్య చికిత్స కల్పించాలని సమావేశం కోరింది. సమావేశంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.లక్ష్మీనారాయణ, కోశాధికారి మధుసూదన్, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

51 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ అమలు చేయాలి

వరంగల్ ఎడ్యుకేషన్, మే 16: 51 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీని వెంటనే అమలు చేయాలని పీఆర్టీయూ-తెలంగాణ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గురువారం హైదరాబాద్‌లో పీఆర్సీ కమిషన్‌కు నివేదికను సమర్పించారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని, ప్రతీ ఉద్యోగికి తల్లి, తండ్రి మరణించినప్పుడు కర్మకాండల నిమిత్తం 15 రోజులు వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని తదితర 25 అంశాలతో కూడిన నివేదికను పీఆర్సీ కమిషన్‌కు సమర్పించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గార్లపాటి ఉమాకర్‌రెడ్డి, పార్వతి సత్యనారాయణ పేర్కొన్నారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కోలెపాక సంగీత, కొండ్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుల నుంచి పత్తి కొనుగోలు చేయాలి

సీసీఐ మేనేజర్‌కు తెలంగాణ రైతు సంఘం వినతి



మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ రైతు సంఘం నేతలు

వరంగల్ చౌరస్తా, మే 16: రైతుల నుంచి నేరుగా సీసీఐ పత్తి కొనుగోళ్లు చేపట్టాలని తెలంగాణ రైతు సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని లక్ష్మీపురంలో ఉన్న సీసీఐ కార్యాలయంలో మేనేజర్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల ప్రైవేటు వ్యాపారులు మద్దతు ధర కంటే తక్కువకు పత్తిని కొనుగోలు చేస్తున్నారన్నారు. దీంతో గత నాలుగు రోజులుగా వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారులు కూడా తక్కువ ధరకు పత్తి కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. దీన్ని అరికట్టి కాటన్ కార్పొరేషన్ నేరుగా రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేయాలని కోరారు. మద్దతు ధర ప్రకారం సీసీఐ నేరుగా పత్తి కొనుగోలు చేయాలని, వ్యవసాయ మార్కెట్‌లో కొనుగోలు సెంటర్ ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వరంగల్ ఉమ్మడి జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, ఉపాధ్యక్షులు ఊరటి హంపాల్ రెడ్డి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

పరామర్శించిన అరూరి రమేశ్

పోచమ్మమైదాన్, మే 16: గ్రేటర్ వరంగల్ మూడవ డివిజన్ ఆరెపల్లి విలీన గ్రామానికి చెందిన బుద్దె చంద్రశేఖర్ అనే బీజేపీ కార్యకర్త గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఎంజీఎంలో చికిత్స పొందుతున్న బుద్దె చంద్రశేఖర్‌ను బీజేపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ రోజున అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పెద్దన్నతో పాటు మరికొంత మంది కాంగ్రెస్ శ్రేణు లు హనుమాన్ మాలదీక్షలో ఉన్న చంద్రశేఖర్‌ను దూషించారని ఆరోపించారు. మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని, ఘటనపై వెంటనే విచారణ జరిపి నిందితులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితుడిని పరామర్శించిన వారిలో బీజేపీ నాయకులు బుద్దె శ్రీనివాస్, దినేష్, రాజేష్, సాంబయ్య, రవీందర్‌రావు, జితేందర్, అనిల్, సతీష్ పాల్గొన్నారు.



ఆస్పత్రిలో బాధితుడిని పరామర్శిస్తున్న అరూరి రమేశ్

ఆయకట్టుకు అందని సాగునీరు

• చెరువులో నీరున్నా అందని వైనం • 300 ఎకరాల్లో పంటను కోల్పోతున్న రైతులు • తూమును మరమ్మతులు చేయాలని రైతుల వినతి



వేసవికి ముందు ఒంటిమామిడిపల్లి ఎల్లమ్మ చెరువులో నిండుగా నీరు

ఐనవోలు, మే 16: తలాపున చెరువును పెట్టుకొని నీళ్లకోసం ఊరంతా తిరిగినట్లు ఉంది.. ఒంటిమామిడిపల్లి రైతుల పరిస్థితి. చెరువునిండా నీటిని పెట్టుకొని రెండేళ్లుగా యాసంగి ఆయకట్టును సాగుచేసుకోలేక ఆర్థికంగా నష్టపోతున్నారు. చెరువు తూమును మరమ్మతులు చేసి సాగునీటిని అందించాలని కోరుతున్నా పట్టించుకునేవారులేరని వాపోతున్నారు.

ఒంటిమామిడిపల్లి రైతులు భూమి పుత్రులు. వారిలో చైతన్యం ఎక్కువ. తమ గ్రామంలో ఉన్న ఎల్లమ్మ చెరువులో 2015లో బాలవికాస సంస్థ సహకారంతో 40 వేల ట్రి ప్పుల రేగడి మట్టిని తమ పంట భూముల్లోకి తరలించి భూములను సారవంతంగా మార్చుకోవడంతోపాటు చెరువులో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుకొని రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచారు. అదే చైతన్యంతో వర్షపునీటిని వృథా కానివ్వకుండా నీటిని ఒడిసిపట్టే విధానాన్ని తెలుసుకోవడానికి మహారాష్ట్రలోని అన్నహజారే గ్రామం రాలేగావ్ సిద్దికి వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్కడి పద్ధతులను అనుసరిస్తున్నారు. అంతటి చైతన్యం ఉన్న వారి పట్ల ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు వాపోతున్నారు.

అభివృద్ధి పేరిట చెరువు తూము ధ్వంసం

కొండ నాలుకకు మందు వేస్తే.. ఉన్న నాలుక ఊడిన చందంగా ఉంది నీటిపారుదలశాఖ అధికారుల పనితీరు. ఎల్లమ్మ చెరువుకు కింద 375 ఎకరాల ఆయకట్టు ఉంది. మిషన్ కాకతీయ 3వ విడతలో చెరువును ఎంపిక చేసి రూ.కోటికిపైగా నిధులు మంజూరు చేశారు. పూడికతీత పనులతోపాటు కట్ట, తూము, కాలువల మరమ్మతులను సబ్ కాంట్రాక్టర్ చేపట్టాల్సి ఉంది. సదరు కాంట్రాక్టర్ పూర్తిస్థాయిలో పూడిక తీయలేదు. కాకతీయుల కాలంనాటి ప్రధాన తూమును మరమ్మతుల పేరిట పగులకొట్టి కొత్తగా నిర్మిస్తున్నామని నాసిరకంగా నిర్మించడంతో సమస్య తలెత్తింది. తూము షెట్టర్ పనిచేయకపోవడంతో నీరు నిల్వ లేకుండా వృథాగా పోతోంది. లీకేజీలు కనిపించడంతో వర్షాకాలంలో తూము వద్ద కట్టతెగుతుందని రైతులు ఆందోళన చెందినా మొరం మట్టితో తూమును మూసేశారు. గత సంవత్సరం ఇరిగేషన్ ఇన్‌చార్జి డీఈ రాజు దృష్టికి విషయాన్ని తీసుకెళ్లగా వెంటనే వెళ్లి పరిశీలించి మరమ్మతులు చేయిస్తామని చెప్పారు కానీ పనులు జరుగలేదని రైతులు తెలిపారు.

పంటలను కోల్పోయిన ఆయకట్టు రైతులు

తూమును మూసేయడంతో ఆయకట్టుకు సాగునీరు అందే పరిస్థితిలేక రెండేళ్లుగా పంటల సాగును వదిలిపెట్టి లక్షల్లో ఆర్థికంగా నష్టపోతున్నారు రైతులు. బావులు, బోర్లు ఉన్న రైతులు మాత్రమే సాగుచేసుకున్నారు. మరికొంత మంది రైతులు చెరువులో మోటార్లు పెట్టి నీటిని పైపుల ద్వారా ఆయకట్టుకు తరలించి భగీరథయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం చెరువులో నీరు లేదు, వర్షాకాలం సమీపిస్తున్నందున యుద్ధ ప్రాతిపదికన తూము మరమ్మతులు చేపట్టి ఆయకట్టుకు నీరందే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజును కోరుతున్నారు.

కాగా, ఈ సమస్యపై ఏఈ రాజు మాట్లాడుతూ.. సమస్య ఏమిటో తెలుసుకొని సరిచేస్తామని చెప్పారు. గత సంవత్సరం నుంచి ఇంత వరకు చెరువు వద్దకు వెళ్లి సమస్యను గుర్తించకపోవడంపై రైతులు ఇరిగేషన్ శాఖ అధికారులపై మండిపడుతున్నారు. ఈ విషయాన్ని తహసీల్దార్ విక్రమ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా ఇరిగేషన్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు.



మరమ్మతులు చేయాల్సిన తూము

నవ్య నివేదన

భగవంతుడు సర్వాంతర్యామి అనీ, రాజమందిరంలోని స్తంభంలో సైతం భగవంతుడు ఉన్నాడని చెప్పిన ప్రహ్లాదుడి మాటలను నిరూపించడానికే... దేవదేవుడైన శ్రీహరి అంతకుముందు నృసింహ రూపంలో అవతరించాడని 'శ్రీమద్భాగవతం' వివరిస్తోంది.



హరేకృష్ణ



21న నృసింహ జయంతి

సర్వోన్నత శక్తి ప్రదాత

పూర్వం హిరణ్యకశిపుడనే రాక్షస రాజు ఉండేవాడు. అతను అమరత్వం పొందాలనే కోరికతో... బ్రహ్మదేవుణ్ణి సాక్షాత్కరింపజేసుకోవడానికి కఠోరమైన తపస్సు చేశాడు. బ్రహ్మ వరాలతో అమిత శక్తిసంపన్నుడయ్యాడు. ఇంద్ర సింహాసనాన్ని ఆక్రమించాడు. ధర్మబద్ధంగా విశ్వాన్ని పాలిస్తున్న దేవతలందరినీ తరిమికొట్టాడు. అత్యంత క్రూరంగా లోకాన్ని పాలించసాగాడు. దేవదేవుడైన శ్రీమహావిష్ణువును, ఆయన పరమోన్నత స్థానాన్ని ధిక్కరించి... అందరూ తననే దేవదేవుడిగా కొలవాలని ఆదేశించాడు. వైదిక సదాచారాలను, నిత్యక్రతువులను సర్వ నాశనం చేస్తూ, సొంత పద్ధతులను ప్రవేశపెట్టాడు.

హిరణ్యకశిపుడి తనయుడైన ప్రహ్లాదుడు పరమ విష్ణుభక్తుడు. అయిదేళ్ళ పసిప్రాయంలోనే మహా భాగవతోత్తముడి స్థాయికి చేరుకున్నాడు. తను విరోధిగా భావించే శ్రీహరిని తన కుమారుడు సేవించడాన్ని హిరణ్యకశిపుడు సహించలేకపోయాడు. విష్ణు భక్తిని ప్రహ్లాదుడు విడనాడేలా పలు చర్యలు చేపట్టి విఫలుడయ్యాడు. మరోవైపు ప్రహ్లాదుడి సాంగత్యం వల్ల అతనితో చదువుతున్నవారందరూ విష్ణుభక్తిని పెంపొందించుకోసాగారు. ఈ పరిణామాలతో మనస్తాపం చెందిన హిరణ్య కశిపుడు "ఇవాళ నిన్ను యమపురికి పంపిస్తాను" అంటూ ప్రహ్లాదుడిపై తీవ్రంగా ఆగ్రహించాడు. "ఎవరి శక్తితో నువ్వు ఇంత మూర్ఖంగా, మొండిగా, భయం లేనివాడిలా ఉంటున్నావు? నేను శాసించినా ఎందుకు లెక్క చెయ్యడం లేదు?" అని ప్రశ్నించాడు. ప్రహ్లాదుడు బదులిస్తూ "మీరు ఎవరి ద్వారా శక్తియుక్తులు పొందుతున్నారో... నా శక్తికి కూడా అతడే మూలాధారం. అతడే సకల శక్తులకూ మూలమైన పరంధాముడు... శ్రీహరి" అని వినయంగా చెప్పాడు.

ప్రహ్లాదుడి మాటలకు ఆగ్రహించిన హిరణ్యకశిపుడు "నీవు నిరంతరం ఎవడినో నన్ను మించిన ఉత్తముడైనవాడంటూ... సమస్త సృష్టికీ అతీతుడు అంటూ, చరాచర జీవులను నియంత్రిస్తాడంటూ సర్వాంతర్యామిగా వర్ణిస్తూ ఉంటావు. ఎవడు వాడు? ఎక్కడున్నాడు? వాడే సమస్తంలోనూ ఉన్నట్టయితే... నా ముందున్న ఈ స్తంభంలో చూపించగలవా?" అని అడిగాడు. హిరణ్యకశిపుడి మాటల్లో ఈ ప్రశ్నకు ఎంతో ప్రాధాన్యం ఉంది. అతను తనను తాను ఎల్లప్పుడూ తానే పరమేశ్వరుణ్ణని చెప్పుకున్నప్పటికీ... నిజమైన పరమేశ్వరుడు ఎవరో ప్రహ్లాదుడికి తెలుసు. విష్ణువు లేదా కృష్ణుడే ఆ పరమేశ్వరుడని 'యస్మాత్ క్షరమతీతో...' అనే శ్లోకంలో..." నేను (శ్రీకృష్ణుడు) నశ్వరమైన ఈ భౌతిక పదార్థం కన్నా, నాశరహితమైన జీవాత్మ కన్నా అతీతీతమైనవాణ్ణి. కాబట్టి వేదాలలో, స్మృతులలో నేనే సర్వోత్కృష్ట దివ్య పురుషుడిగా ప్రశంస పొందాను" అని 'భగవద్గీత' చెబుతోంది.

సర్వవ్యాప్తుడైన భగవంతుడు ఆ స్తంభంలో కూడా తప్పక ఉన్నాడని ప్రహ్లాదుడు నిస్సంకోచంగా సమాధానం ఇచ్చాడు. అది విన్న హిరణ్యకశిపుడు వెంటనే తన సింహాసనం నుంచి లేచి... పిడికిలితో స్తంభాన్ని పగలగొట్టాడు. ఆ స్తంభం నుంచి నర-మృగ... శరీరంతో నరసింహావతారుడై స్వామి ఆవిర్భవించాడు. స్తంభోద్భవుడైన ఆ నరసింహుని దివ్య సుగుణం అదే. హిరణ్యకశిపునికి తన భక్తుడైన బ్రహ్మదేవుడు ఇచ్చిన వరాలను ఎన్నటికీ నిష్ఫలం కావించలేదు. ఆ వరాలలో లేని రూపాన్ని పొందాడు. భగవంతుడికి సైతం క్రోధం ఉండడం కొందరికి ఆశ్చర్యం కలిగించవచ్చు. కానీ సర్వోన్నతమైన శక్తికీ ఒక రూపం ఉందనీ, ఆ రూపం సమస్త భావాలకూ నిలయమనీ అందరూ తెలుసుకోవాలి. ఏ నేరం ఎరుగని ప్రహ్లాదుడి పట్ల హిరణ్యకశిపుడు క్రూరంగా వ్యవహరించినందుకు భగవంతుడు కోపోద్రిక్తుడయ్యాడు. సర్వానికీ మూలాధారమైన ఆ భగవంతుడే ప్రేమ, క్రోధం అనే భావాలకు కూడా మూలం. మనం అందరం ఆ పురుషోత్తముని అంశలం కాబట్టే మనలోనూ ఆ భావాలు ఉన్నాయి. కానీ మనలోని క్రోధం దుష్పరిణామాలకు హేతువైనది కాగా, భగవంతునిలోని క్రోధం ఆరాధనీయమైనది. ఇదే మనకూ, భగవంతుడికీ ఉన్న వ్యత్యాసం.

సమస్త జీవరాశుల్లోని శక్తికి మూలం నరసింహస్వామి. భక్తులు కానివారికి వారి కర్మ నిర్దేశితమైన గమ్యానుసారం శక్తిని ప్రసాదిస్తాడు. అయితే... విశుద్ధ భక్తి ప్రపత్తులను పెంపొందించుకున్నవారికి... వారి అభీష్టానుసారం తనతో సమానమైన శక్తియుక్తులను సైతం అనుగ్రహిస్తాడు.

హిరణ్యకశిపుడు తన తెలివితేటలతో మృత్యువును జయించాలని తలచినా... భగవంతుడు అంతకుమించిన తెలివితో.. తగిన రూపాన్ని ధరించాడు. అతని ముందు మృత్యువై నిలిచాడు. భగవంతుణ్ణి ఎందులోనూ, ఎవరూ జయించలేరు. 'సర్వోన్నతుడు' అనే మాటకు అర్థం అదే. భగవంతుడు సర్వాంతర్యామి అనీ, రాజమందిరంలోని స్తంభంలో సైతం భగవంతుడు ఉన్నాడని చెప్పిన ప్రహ్లాదుడి మాటలను నిరూపించడానికే... దేవదేవుడైన శ్రీహరి అంతకుముందు నృసింహ రూపంలో అవతరించాడని 'శ్రీమద్భాగవతం' వివరిస్తోంది. ఆ నరసింహుడు తన భక్తులకు దుష్టులైన శత్రువుల నుంచి పొంచిఉన్న ఆపదల నుంచి సదా రక్షించాలనీ, మనలోని దుష్ట గుణాలనుంచి మనల్ని కాపాడాలనీ ప్రార్థిస్తూ...

ఓం నమో భగవతే నరసింహాయ నమస్తేజస్తేజసే, ఆవిరావిర్భవ వజ్రనఖ వజ్రదంష్ట్ర

కర్మాశయాన్రన్ధయ రన్ధయ తమో గ్రస గ్రస ఓం స్వాహా, అభయమభయమాత్మని భూయిష్ఠా ఓం క్షౌమ్... అనే 'శ్రీమద్భాగవతం'లోని నృసింహ మంత్రాన్ని ఈ నృసింహ జయంతినాడు పఠిద్దాం.

"సమస్త శక్తికీ ములాధారమైన నృసింహ భగవానుడికి నా ప్రణామాలు. ఓ స్వామీ! వజ్రాయుధం లాంటి నీ గోళ్ళతో, దంతాలతో... ప్రాపంచిక కర్మలను కాంక్షించే మాలోని అసుర గుణాలను నశింపజేయి. మా హృదయంలో నెలకొన్న అజ్ఞానాన్ని పారద్రోలి మమ్మల్ని అనుగ్రహించు. అప్పుడు నీ కృపతో మేము ఈ భౌతిక ప్రపంచంలో సాగించే జీవన పోరాటంలో నిర్భయత్వాన్ని పొందగలం" అని దీని అర్థం.




శ్రీసత్యగౌర చంద్రదాస ప్రభూజీ
అధ్యక్షుడు, హరే కృష్ణ మూవ్‌మెంట్,
హైదరాబాద్, 9396956984

దైవమార్గం

నమ్మకం చేసిన అద్భుతం

కపెర్నహూము అనే ప్రాంతానికి ప్రధాన అధికారిగా ఒక వ్యక్తి ఉండేవాడు. అతనికి ఒక కుమారుడు. అనారోగ్యంతో మంచం పట్టిన ఆ బాలుడు చావు బతుకుల్లో ఉన్నాడు. ఎన్ని వైద్యాలు చేయించినా ఫలితం కనిపించలేదు. ఇంతలో... గెలెలియా తీరానికి ఏసు ప్రభువు వచ్చాడని ఆ అధికారికి తెలిసింది. ఉదయాన్నే ప్రభువును దర్శించుకున్నాడు. తన కుమారుడి దుస్థితి గురించి వివరించాడు. అతన్ని బతికించడానికి తన ఇంటికి రమ్మని వేడుకున్నాడు.

ఇది చూసి అక్కడ జనంలో గుసగుసలు బయలుదేరాయి. 'ఏసు చేసిన మహత్కార్యాలేవీ చూడకుండానే అతన్ని తన ఇంటికి వచ్చి, తన కుమారుణ్ణి బతికించాలని ఈ అధికారి ఎందుకు ఆహ్వానిస్తున్నాడు? ఈ నమ్మకం ఎలా కలిగింది?' అని ప్రజలు చర్చించుకుంటున్నారు. అవన్నీ విన్న ఆ అధికారి "ప్రభువా! నీ శక్తిని నమ్ముతున్నాను. నా బిడ్డ ప్రాణాలు పోవడానికి ముందే వచ్చి కాపాడండి" అని కోరాడు. అతను ప్రార్థనలో పరితాపాన్ని, తన పట్ల విశ్వాసాన్ని ఏసు గ్రహించాడు. "ఇక నువ్వు బయలుదేరు. ఈ రోజు ఒంటిగంటకల్లా నీ కుమారుడికి స్వస్థత కలుగుతుంది. అతను



బతుకుతాడు" అని చెప్పాడు. అలా... తాను ఉన్న ప్రదేశం నుంచే జరగబోయే అద్భుతాన్ని ప్రభువు ప్రకటించాడు.

ప్రభువు సంకల్పిస్తే తన కుమారుడికి తప్పకుండా నయం అవుతుందనే ధైర్యంతో ఆ అధికారి ఇంటికి తిరుగుముఖం పట్టాడు. మార్గమధ్యంలో భటులు అతనికి ఎదురొచ్చి "అయ్యా! ఎలా జరిగిందో తెలీదు కానీ... మీ అబ్బాయి పరిపూర్ణంగా కోలుకున్నాడు" అనే శుభవార్త అందజేశారు. 'ఇది అద్భుతం. క్రీస్తు చేసిన అద్భుతం' అనుకుంటూ ఆ అధికారి ఆనందంతో తన ఇంటివైపు పరుగులు పెట్టాడు. నమ్మకం ఎన్నడూ వమ్ముకాదనడానికి ఈ కథ ఉదాహరణ.

• డాక్టర్ దేవదాసు బెర్నార్డ్ రాజు, 9866755024

గీతాసారం


సమదృష్టి, సమతుల్యత

బంగారాన్ని, రాయినీ, మట్టినీ ఒకే మాదిరిగా చూడాలని, అటువంటి వాడే జ్ఞాని, యోగి అని 'జ్ఞాన విజ్ఞాన తృప్తాత్మా...' అనే శ్లోకంలో శ్రీకృష్ణుడు వివరించాడు. అపరిచితులను, స్నేహితులను, శత్రువులను, బంధువులను, ద్వేషించేవారినీ, మంచివారినీ, చెడ్డవారినీ ఒకే విధంగా చూసేవాడే యోగీశ్వరుడని 'సుహృన్మిత్రా ర్యుదాసీనా...' అనే శ్లోకంలో చెప్పాడు. మొదట ఆయన వస్తువులతో ప్రారంభించాడు. వాటిని సమానంగా చూడమన్నాడు. తరువాత మన జీవితాల్లో తటస్థపడే మనుషుల దగ్గరకు వచ్చాడు. మిత్రులను, విరోధులను, మంచివారినీ, చెడ్డవారినీ, అపరిచితులనూ, స్నేహితులనూ తేడాలు లేకుండా చూడాలన్నాడు.

మన చుట్టూ ఉన్న వ్యక్తుల మీద మనం ఏర్పరచుకున్న అభిప్రాయాలు, వారి మీద మనం వేసిన ముద్రలు... మంచిగానో, చెడ్డగానో మనం పరిగణించేవారిపట్ల మన ప్రవర్తనలు... వీటన్నిటినీ సూచిస్తుంది. ఆసక్తికరమైన విషయమేమిటంటే, మనకు మిత్రుడైన వ్యక్తి వేరొకరికి శత్రువవుతాడు, ఈ రోజు మనకు స్నేహితుడైన వాడే రేపు శత్రువుగా మారుతాడు. "ఆ మనుషులతో నాకు చేదు అనుభవం ఉంది, వారు గౌరవానికి ఏమాత్రం తగిన వాళ్ళు కాదు. అందుకే వారితో సంబంధ బాంధవ్యాలు తెంచుకున్నాను" అనే ఫిర్యాదు మనకు పదే పదే వినిపిస్తూ ఉంటుంది. వేరొకరిపై మనం ఏర్పరచుకొనే అభిప్రాయాలకు... వారికీ, మనకు మధ్య ఎదురైన సంఘటనలు లేదా పక్షపాతాలు కారణమవుతాయి. ఎదుటివారిపై ముద్రలు వేయడం మానాలనీ, వారిని మనతో సమానంగా పరిగణించాలని శ్రీకృష్ణుడు సూచించాడు. దీనిలో వ్యక్తులు, వారి మధ్య సంబంధాల విషయంలో ఒక స్పష్టమైన సందేశం ఉంది. అది ఏమిటంటే... మనుషులను, వారితో సంబంధాలను వినిమయ వస్తువులుగా పరిగణించకూడదు.

పై శ్లోకాలలో 'సమదృష్టి' గురించి చెప్పిన శ్రీకృష్ణ పరమాత్మ 'సమతుల్యత' గురించి వివరిస్తూ... "అపరిమితంగా తినేవాడికీ, ఏమాత్రం తిననివాడికీ, అతిగా నిద్రపోయేవాడికీ, నిద్రపోని వాడికీ 'యోగం' సిద్ధించదు" అని 'నా త్యశనతస్తు యోగోస్తి' అనే శ్లోకంలో హెచ్చరించాడు. ఇక్కడ తినడం, నిద్ర తదితరాలను ఇంద్రియ మార్గాలకు ఉపమానంగా తీసుకోవచ్చు. మనం మనస్సును, నాలుకను సంతృప్తి పరచడానికి తింటాం తప్పితే శరీర అవసరాలకు అనుగుణంగా మాత్రం కాదు. ఇది అనారోగ్యానికి దారి తీస్తుంది. అదే విధంగా ఇతరుల గురించి పరుషంగా, చెడ్డగా మాట్లాడడం, ఇంద్రియ జ్ఞానాలను విపరీతంగా ఉపయోగించడం దుఃఖానికి కారణం అవుతుంది. అందుకే... "ఇంద్రియాల విషయంలో సమతుల్యత ప్రధానం" అని కృష్ణుడు తెలియజేశాడు. పరిమితమైన ఆహారం, పరిమితమైన నిద్ర, మితమైన జాగరణ, మితమైన కర్మ, మితమైన సంచారం... వీటిని అనుసరించే వ్యక్తి యోగమార్గంలో దుఃఖాన్ని పోగొట్టుకోగలడని బోధించాడు.





కె. శివప్రసాద్
ఐఏఎస్

ధర్మపథం

బుద్ధుడి బోధలు శ్రేయోమార్గదర్శకాలు

ఒకప్పుడు మన భారతదేశంలో అంతర్భాగంగా ఉన్న నేపాల్‌లో... దాదాపు 2,600 ఏళ్ళ క్రితం గౌతమ బుద్ధుడు జన్మించాడు. వైరాగ్యభావంతో గృహ పరిత్యాగం చేసి, జ్ఞానోదయం పొంది, సత్యాన్ని తొలుత తాను గ్రహించి, తరువాత ఇతరులకు బోధించాడు. నిజానికి గౌతమ బుద్ధుడు ఎప్పుడు జన్మించాడనే విషయం కచ్చితంగా తెలియదు. కానీ ఆయన క్రీస్తు పూర్వం ఆరో శతాబ్దంలో జన్మించాడని నేడు మనం నమ్ముతున్నాం. బుద్ధుడి జన్మదినాన్ని వైశాఖ పౌర్ణమి రోజున జరుపుకొంటున్నాం.

ఈనాడు మనం సిద్ధార్థ గౌతముణ్ణి 'బుద్ధుడు' అంటున్నా... నిజానికి ఇది ఆయన అసలు పేరు కాదు. 'బుద్ధుడు' అంటే 'జ్ఞానోదయం పొందినవాడు' (సత్యాన్ని గ్రహించినవాడు) అని అర్థం. 'బుద్ధుడు' అనే పదం 'బుధ్' అనే మూల ధాతువు నుంచి ఆవిర్భవించింది. బౌద్ధ మతం విదేశాలకు చేరుకున్న తరువాత.. బుద్ధుడు అనే మాటను అక్కడివారు తమతమ స్వదేశీ పద్ధతుల్లో ఉచ్చరించడం ప్రారంభించారు. చైనీస్ భాషలో బుద్ధుణ్ణి 'ఫో' అనీ, జపనీస్ భాషలో 'బుట్సు', 'బుట్సుదా' అనీ, వియత్నామీస్ భాషలో 'ఫాత్' అని ఉచ్చరిస్తారు. కంబోడియాలో బుద్ధుణ్ణి 'ప్రేహ్-పుత్' అంటారు.

భార్యాపుత్రులను పరిత్యజించిన బుద్ధుడు సత్యాన్వేషణకు బయలుదేరాడు. దానికి కారణం... ఆయన చూసిన నాలుగు దృశ్యాలే. అప్పటివరకూ నిరంతర సుఖాలను మాత్రమే అనుభవించిన బుద్ధుడు... వృద్ధుణ్ణి, అనారోగ్యంతో ఉన్న వ్యక్తిని, చనిపోయిన వ్యక్తిని, సర్వసంగ పరిత్యాగి అయిన సన్యాసిని చూశాడు. దానితో ఆయన హృదయం చలించింది. ఇది మనకు తెలిసిన సాధారణ విషయమే. అయితే బౌద్ధ ధర్మంలో బుద్ధుడు ఒక్కడు కాదు. కొన్ని బౌద్ధ గ్రంథాల ప్రకారం... ఏడా ం [illegible] బుద్ధులు కూడా ఉన్నారు. కొంతమంది బుద్ధులు ఆ నలుగురినీ ఒకే రోజు చూశారు. విపస్సి బుద్ధుడు ఈ శకునాలను చాలాకాలం పరిశీలించి చూశాడు. తనకు జ్ఞానోదయం అయ్యాక... బ్రహ్మదేవుడి అభ్యర్థన మేరకు... తన జ్ఞానధారను ప్రజలకు అందించడానికి పూనుకున్నాడు. ఇలా ఆ బౌద్ధుడు తన మొదటి ధర్మ సందేశం ఇవ్వడానికి... బోధి వృక్షం దగ్గర నుంచి సారనాథ్ లోని ఋషి పట్టణానికి ఆకాశమార్గంలో ప్రయాణిస్తాడు. కానీ ఉపక అనే సన్యాసిని మార్గమధ్యంలో కలవాలని గౌతమ బుద్ధుడు అనుకున్నాడు కాబట్టి... కాలినడకన వెళ్ళాడు. బౌద్ధ ధర్మంలో మనకు తెలియని ఇలాంటి విషయాలు ఎన్నో ఉన్నాయి.

'త్రిపిటక' అనే పదాన్ని పరిశీలిస్తే... 'త్రి+ పిటక' అనే రెండు పదాల్లో... 'త్రి' అంటే 'మూడు' అని, 'పిటక' అంటే 'బుట్ట' అనీ అర్థం. దీన్నిబట్టి మన దేశంలో తాళపత్ర గ్రంథాలతో నిండిన మూడు బుట్టలు ఉండేవని తెలుస్తున్నది. ఈ పదం కూడా బుద్ధుని కాలంలో పుట్టినదే. బుద్ధుని ఉపదేశాలను అక్షరబద్ధం చేసి, పెట్టెల్లో పెట్టడం అప్పుడే మొదలై ఉంటుంది. అలా మూడు పిటకాలలో... అంటే బుట్టల్లో పెట్టడం వల్లే... ఈ గ్రంథాలకు 'త్రిపిటకాలు' అనే పేరు వచ్చింది.

బుద్ధత్వ ప్రాప్తి... అంటే బోధిని పొంది బుద్ధుడిగా మారడం. 'బుద్ధత్వం' అనేది జ్ఞానోదయం ద్వారా లభిస్తుంది. జ్ఞానం వల్ల వ్యక్తి బుద్ధుడు కాగలుగుతాడు. బుద్ధత్వం ప్రాప్తించిన తరువాత... గౌతమ బుద్ధుడు నలభై అయిదేళ్ళపాటు నిరంతరంగా తన బోధనలను భారతదేశంలోని వివిధ ప్రాంతాల ప్రజలకు అందించాడు. ఆ బోధనలన్నిటినీ... బుద్ధుడి పరినిర్వాణం తరువాత... ఆయన శిష్యులు సేకరించారు. అలా సేకరించిన బుద్ధుడి ఉపదేశాలనే మనం 'త్రిపిటకాలు' అంటున్నాం. ఈ త్రిపిటక గ్రంథాలు మొదట శ్రీలంకలో లిపిబద్ధం అయినట్టు ప్రచారంలో ఉంది. ఈ విషయాన్ని శ్రీలంక బౌద్ధ భిక్షువులే ప్రచారం చేశారు. నిజానికి త్రిపిటక గ్రంథాలను మొదట రాసింది భారతదేశంలోనే. ఆ తరువాత వచ్చిన అట్ఠకథా గ్రంథాలను కూడా మన ప్రాచీన భారతీయులే మొదట రాశారు. అపూర్వమైన అట్ఠకథా గ్రంథ రచయితల్లో అగ్రగణ్యుడైన బుద్ధఘోషుడు మన తెలుగువాడే. అశోకుని కాలానికి... అంటే క్రీస్తుపూర్వం మూడో శతాబ్దంలోనే భారతదేశంలో త్రిపిటకాలు లిఖితరూపంలో అందుబాటులో ఉండేవని ఇటీవలి పరిశోధనలో వెల్లడయింది. అశోకుని బాబ్రూ శిలాశాసనాన్ని అధ్యయనం చేయడం వల్ల కూడా ఈ విషయం మరింత విస్తృతంగా తెలుసుకోవచ్చు. అశోకుడి శాసనాల్లో ఆ శాసనానికి ప్రత్యేక స్థానం ఉంది. అందుకు కారణమేమిటంటే... కొన్ని ఎంపిక చేసిన పాళీ సూత్రాలను చదివి తెలుసుకోవాల్సిందిగా బౌద్ధ ధర్మం అనుసరించేవారిని ఆ శాసనంలో అశోకుడు కోరాడు. రాజస్థాన్‌లోని జైపూర్ సమీపంలో... బైరాత్ అనే ప్రాంతానికి పన్నెండు మైళ్ళ దూరంలో ఉన్న బాబ్రూ అనే ప్రదేశంలో ఈ శాసనం దొరికింది. కాబట్టి దీన్ని 'బైరత్ లేదా బాబ్రూ శాసనం' అంటారు. ప్రస్తుతం ఈ శాసనం కోల్‌కతాలోని బెంగాల్ ఆసియాటిక్ సొసైటీ మ్యూజియంలో ఉంది. అందుకని దీన్ని 'బైరత్- కలకత్తా శాసనం' అని కూడా పిలుస్తారు. ఆ శాసనం మీద చెక్కిన సూత్రాల పేర్లను అధ్యయనం చేస్తే... పాళీ భాషలో త్రిపిటక సూత్రాల లిపిబద్ధీకరణ భారతదేశంలోనే జరిగిందనే వాస్తవం స్పష్టం అవుతుంది. ఇక... శ్రీలంకలోనే పాళీ త్రిపిటకాలు తొలిసారి లిపిబద్ధం అయ్యాయనే ప్రస్తావన... 'దీపవంశ', 'మహావంశ' లాంటి గ్రంథాల్లో మాత్రమే కనిపిస్తుంది. కానీ పురావస్తు ఆధారాల రీత్యా అది సరికాదు.

బుద్ధుని అపూర్వమైన బోధనలు ఈ త్రిపిటకాలలో పొందుపరిచి ఉన్నాయి. నేటికీ అవి ఉపయోగకరమైనవి. బుద్ధుని ఉపదేశాలు ప్రాపంచిక దుఃఖాల వాస్తవిక స్వభావం, దానికి కారణాలు, వాటి నుంచి విముక్తికి మార్గం లాంటి అంశాలపై లోతైన అవగాహనను అందిస్తాయి. ఈ ఉపదేశాలు మతపరమైనవి కావు, ఎంతో అర్థవంతమైనవి. నేటి మనిషికి సంతృప్తికరమైన జీవితాన్ని ప్రసాదిస్తాయి. ఆచరణాత్మకమైన మార్గాన్ని అవి అందిస్తాయి. బుద్ధుడు బోధించిన ధ్యాన పద్ధతి... ఒత్తిడితో నిండిన నేటి ప్రపంచంలో చాలా విలువైనది. అది మానసిక భావోద్వేగాలను అదుపులోకి తెచ్చి, మనిషికి శాంతిని ప్రసాదిస్తుంది. సవాళ్ళను ఎదుర్కోవడానికి, శ్రేయోమార్గం సాధించడానికి సహాయపడుతుంది. అహింస, సత్ప్రవర్తన, కరుణ, దాతృత్వం లాంటి సద్గుణాలను బౌద్ధ ధర్మం ప్రసాదిస్తుంది. ఈనాటి సమాజంలో నెలకొన్న పర్యావరణ సంక్షోభాలు, వ్యక్తుల మధ్య వైరుధ్యాలు లాంటి సమస్యలను బుద్ధుని బోధలు తొలగిస్తాయి. సామాజిక న్యాయాన్ని ప్రోత్సహించి, సమాజ సంక్షేమానికి దోహదపడతాయి. అపూర్వమైన ఆయన సిద్ధాంతాలను, ఉపదేశాలను సానుకూలంగా అర్థం చేసుకొని... మన పూర్వపురుషుడైన బుద్ధభగవానుడి ఋషి ఋణం తీర్చుకోవాలి.



23న బుద్ధ జయంతి

ఆచార్య చౌడూరి ఉపేంద్ర రావు
జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం

సందేశం

ప్రవక్త పశ్చాత్తాపం

మహాత్ముడిగా ప్రసిద్ధి చెందిన యూనుస్ ప్రవక్త ఒక రోజు ఓడలో సముద్ర ప్రయాణం చేస్తున్నారు. ఆయనతో పాటు మరికొందరు కూడా ఆ ఓడలో ఉన్నారు. కొంతసేపటికి హఠాత్తుగా తీవ్రమైన గాలి చెలరేగింది. దాంతో ఓడ చిగురుటాకులా వణికిపోతోంది. పర్వతాల్లా ఎగసిపడుతున్న అలల తాకిడికి తల్లకిందులైపోతోంది. ఓడలో చాలా సామాను ఉంది. ప్రయాణికులు తమ సామాన్లను పడవలోంచి బయటకు విసిరేయసాగారు. అయినా పడవలో బరువు ఇంకా ఎక్కువగా ఉంది. కనీసం ఒక వ్యక్తిని బయటకు పంపితే... బరువు తగ్గుతుందనీ, మిగిలినవారందరూ బతుకుతారనీ అనుకున్నారు. చీటీలు వేశారు. అందులో యూనుస్ ప్రవక్త పేరు వచ్చింది. ఆయన గురించి వారందరికీ బాగా తెలుసు. ఎంతో మంచివాడు, గౌరవనీయుడు, సత్యవంతుడు. అలాంటి వ్యక్తిని సముద్రంలో వదిలేయడం వారికి ఇష్టం లేదు. అందుకని మళ్ళీ చీటీలు వేశారు. ఈసారి కూడా ఆయన పేరే వచ్చింది. అందులో అల్లాహ్ అభీష్టం ఉందని



యూనుస్ గుర్తించారు. లేచి నిలబడి, సముద్రంలోకి దూకారు. భారీ అలల్లో కలిసిపోయారు. ఆయన కళ్ళు తెరిచేసరికి... తడిగా, మెత్తగా ఉన్న ఒక నేల మీద ఉన్నట్టు అనిపించింది. తన చుట్టూ ఉన్న ప్రదేశం మూసివేసిన గుహలా ఉంది. పూర్తి చీకటిగా ఉంది. కానీ తను ఉన్న చోటు మృదువుగా, మెత్తగా ఉంది. అలల్లో పడవలా కుదుపులు తెలుస్తున్నాయి. చివరికి... తను ఒక పెద్ద చేప కడుపులో ఉన్నట్టు ఆయన గ్రహించారు. తుపాను సముద్రంలో తనను కాపాడడానికి... తనను చేప మింగేలా అల్లాహ్ చేశాడని తెలుసుకున్నారు. వెంటనే తను చేసిన పొరపాటును ఆయన గ్రహించారు.

ఆ కాలంలో ప్రవక్తలు చేసే ఏ కార్యానికైనా అల్లాహ్ అనుమతిని తీసుకోవాలి. కానీ సముద్రంలో దూకే ముందు అల్లాహ్ అనుమతిని యూనుస్ తీసుకోలేదు. "అల్లాహ్! నీ అనుమతి తీసుకోకుండా సముద్రంలోకి దూకాను. అయినా నన్ను కాపాడావు. ఇది నీ ఔన్నత్యం" అంటూ పశ్చాత్తాపంతో ప్రార్థన చేశారు. అనంత కరుణామయుడైన అల్లాహ్ ఆ ప్రార్థనను ఆలకించాడు. ఆయనను బయటకు విడిచిపెట్టేలా ఆ చేపకు అల్లాహ్ ఆజ్ఞ ఇచ్చాడు. తక్షణమే ఎవరో తనను బయటకు తోస్తున్న అనుభూతి యూనుస్‌కు కలిగింది. మరుక్షణంలో ఆయన నేల మీదకు వచ్చి పడ్డారు. అల్లాహ్‌కు శతకోటి వందనాలు అర్పించుకుంటూ... తన గమ్యానికి యూనుస్ ప్రవక్త బయలుదేరారు.

• మహమ్మద్ వహీదుద్దీన్

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
శుక్రవారం • 17 మే 2024
cinema@andhrajyothy.com

థియేటర్ల బంద్ నిజం కాదు



రెండు తెలుగు రాష్ట్రాల్లో సింగిల్ స్క్రీన్ థియేటర్లను మూసివేస్తున్నారంటూ వస్తున్న వార్తల్లో నిజం లేదని తెలుగు చలనచిత్ర పరిశ్రమలోని అపెక్స్ బాడీలు తెలుగు ఫిల్మ్ ఛాంబర్, తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్, తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి, తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ గురువారం స్పష్టం చేశాయి. ఈ మేరకు ఆ సంస్థలు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. థియేటర్లను మూసి వేస్తున్నట్లు ఒక సంఘం నిర్ణయం తీసుకుందంటూ వస్తున్న వార్తలను ఆ సంస్థలు ఖండించాయి. 'ఇప్పటివరకూ థియేటర్ల యజమానులు కానీ, వారికి సంబంధించిన సంఘాలు గానీ మాకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు. ఇదంతా అబద్ధపు ప్రచారం మాత్రమే' అని స్పష్టం చేశాయి. 'కొన్నాళ్లుగా వసూళ్లు తక్కువ రావడం వల్ల కొంతమంది థియేటర్ల యజమానులు వ్యక్తిగతంగా నిర్ణయం తీసుకుని ఉండవచ్చు, అపెక్స్ బాడీలకు దీంతో సంబంధం లేదు' అని పేర్కొన్నాయి. సింగిల్ స్క్రీన్ థియేటర్లను మూసివెయ్యాలనే నిర్ణయం తీసుకునే ముందు ఎగ్జిబిటర్లు తమను సంప్రదించలేదని ఫిల్మ్ ఛాంబర్ తెలిపింది.



కేన్స్‌కు ఐశ్వర్య కళ

ప్రతిష్ఠాత్మక 77వ కేన్స్ చలనచిత్రోత్సవాల్లో బాలీవుడ్ నటి, మాజీ ప్రపంచసుందరి ఐశ్వర్యారాయ్ బచ్చన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గురువారం ఆమె రెడ్‌కార్పెట్‌పై నడిచారు. బ్లాక్ అండ్ వైట్ దుస్తుల్లో చిరునవ్వులు చిందిస్తూ వేడుకకు ప్రత్యేక కళ తెచ్చారు. ఫ్రాన్స్‌లో జరుగుతోన్న ఈ వేడుకల్లో ఐశ్వర్యతో పాటు కియారా అద్వాణీ, శోభితా ధూళిపాళ, అదితీరావ్ హైదరీ పాల్గొన్నారు.

పెద్ద హిట్ అవుతుంది

'ఈ సినిమాకు అరుణ్, నాగ బలం. నేను ఇంతవరకూ దర్శకుల్ని పరిచయం చేశాను. తొలిసారిగా నాగను నిర్మాతగా ఇంట్రడ్యూస్ చేస్తున్నాను. ట్రైలర్ చూస్తే టీమ్ పడిన కష్టం తెలుస్తుంది.

ఇది న్యూ ఏజ్ లవ్ స్టోరీ అవుతుంది. ఈ నెల 25న వస్తున్న మా సినిమా పెద్ద హిట్ అవుతుందని ఆశిస్తున్నా' అన్నారు దిల్ రాజు. ఆశిష్, వైష్ణవి చైతన్య జంటగా నటించిన హారర్ థ్రిల్లర్ 'లవ్ మీ' ట్రైలర్‌ను గురువారం విడుదల చేసిన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి ఈ సినిమాను నిర్మించారు.

దర్శకుడు అరుణ్ భీమవరపు మాట్లాడుతూ 'యుద్ధం చేయడం కంటే ప్రేమించడానికి గట్స్ కావాలి. మనిషి ప్రేమను పొందడమే కష్టం అనుకుంటే దెయ్యాన్ని ప్రేమించడం ఇంకెంత



కష్టమో ఆలోచించండి. ఆశిష్ ఈ పాత్రను అద్భుతంగా పోషించాడు. గంగాదేవిలాంటి పాత్రను వైష్ణవి చేశారు. ఈ ప్రపంచాన్ని ప్రేమే నడిపిస్తోంది. 'వై' అనే క్వశ్చన్ లేకుండా 'వావ్' అనుకుని ఈ సినిమాను చూసి ఎంజాయ్ చేయండి' అన్నారు.

'ఇంత మంచి సినిమా చేసే అవకాశం కల్పించిన దర్శకనిర్మాతలకు కృతజ్ఞతలు. మా సినిమాతో మళ్లీ థియేటర్లు కళకళలాడతాయి' అన్నారు ఆశిష్. ఈ చిత్రంలో డిఫరెంట్‌గా, టఫ్‌గా ఉండే పాత్రను పోషించానని వైష్ణవి చైతన్య చెప్పారు.

కెరీర్‌లో స్పెషల్ ప్రాజెక్ట్



కాజల్ అగర్వాల్ లీడ్ రోల్ పోషించిన 'సత్యభామ' చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమైంది. నవీన్‌చంద్ర కీలక పాత్ర పోషించిన ఈ సినిమాకు సుమన్ చిక్కాల దర్శకుడు. బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మాతలు. త్వరలోనే ఈ చిత్రం విడుదల కానుంది. ఈ నేపథ్యంలో బుధవారం హైదరాబాద్‌లో మ్యూజికల్ ఈవెంట్‌ను నిర్వహించి, అందులో 'వెతుకు వెతుకు' పాటను రిలీజ్ చేశారు. చంద్రబోస్ రాసిన ఈ పాటను సంగీత దర్శకుడు కీరవాణి పాడడం విశేషం. సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకాల తన టీమ్‌తో పాటలు పాడి హోరెత్తించారు. లైవ్ ఆర్కెస్ట్రాలో సింగర్స్ పాడిన పాటలకు ఈవెంట్‌కు హాజరైన ఆడియన్స్ ఎంజాయ్ చేశారు. ఈ సందర్భంగా కాజల్ మాట్లాడుతూ 'నా కెరీర్‌లో 'సత్యభామ' ఓ స్పెషల్ ప్రాజెక్ట్. ఇటువంటి పాత్ర చేయడం కెరీర్‌లో తొలిసారి. నేను ఓ బిడ్డకు జన్మ ఇచ్చిన తర్వాత నటించిన సినిమా ఇది. షీ సేఫ్ యాప్‌ను ఉపయోగించి సేఫ్‌గా ఎలా ఉండాలో చిత్రంలో చూపించాం. యువతులంతా క్షేమంగా ఉండాలనే కథలోని పాయింట్ నన్నెంతో ఆకట్టుకుంది.' అన్నారు.

తప్పని తెలిసినా చేయక తప్పదు

కాంట్రకోట మిస్టరీ అంటూ యథార్థ సంఘటనల ఆధారంగా రూపుదిద్దుకుంటున్న చిత్రం 'నింద'. వరుణ్ సందేశ్ హీరోగా నటించిన ఈ



చిత్రాన్ని రాజేశ్ జగన్నాథం స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ సినిమా టీజర్‌ను నటుడు నవీన్ చంద్ర రిలీజ్ చేసి, యూనిట్‌కు అభినందనలు తెలిపారు. 'జీవితంలో కొన్నిసార్లు తప్పని తెలిసినా చేయక తప్పదు' అనే డైలాగ్‌తో మొదలైన ఈ టీజర్‌లో ఎన్నో కోణాలు ఉన్నాయి. ప్రేమకథతో పాటు మర్డర్ మిస్టరీ అంశాలు ఉన్నట్లు కనిపించింది. టీజర్‌లో విజువల్స్ సహజంగా ఉన్నాయి. థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌ను ఫీల్ అయ్యేలా నేపథ్య సంగీతం సాగింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోందనీ, త్వరలోనే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామనీ నిర్మాత చెప్పారు. ఆనీ చిత్రంలో కథానాయికగా నటించింది.

రాజ్ తరుణ్ కొత్తగా కనిపిస్తారు



రాజ్ తరుణ్ హీరోగా నటించిన చిత్రం 'పురుషోత్తముడు'. హాసినీ సుధీర్ హీరోయిన్‌గా పరిచయమవుతున్న ఈ చిత్రానికి రామ్ భీమన దర్శకుడు. డాక్టర్ రమేశ్ తేజావత్, ప్రకాశ్ తేజావత్ నిర్మాతలు. త్వరలో ఈ సినిమా విడుదల కానున్న నేపథ్యంలో బుధవారం సాయంత్రం టీజర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రాజ్ తరుణ్ మాట్లాడుతూ 'ఈ సినిమాకు కావాల్సినంత ఖర్చు పెట్టి, సినిమా బాగా వచ్చేలా చూశారు నిర్మాత రమేశ్. అలాగే దర్శకుడు రామ్, నేను ఒక అండర్‌స్టాండింగ్‌తో వర్క్ చేశాం. జూన్ 6న సినిమాను విడుదల చేయాలనుకుంటున్నాం. సెన్సార్ పూర్తయ్యాక విడుదల తేదీ ప్రకటిస్తాం' అని చెప్పారు. 'సినిమా తీయాలన్నది నా 30 ఏళ్ల కల. దర్శకుడు రామ్ చెప్పిన కథ నచ్చి వెంటనే ప్రారంభించాం. నా సోదరుడు ప్రకాశ్, నా సతీమణి, పిల్లలు ప్రొడక్షన్ వ్యవహారాలు చూసుకున్నారు. ఓ మంచి సినిమా ప్రేక్షకులకు అందిస్తున్నాం' అన్నారు నిర్మాత రమేశ్. దర్శకుడు రామ్ భీమన మాట్లాడుతూ 'రాజ్ తరుణ్‌ని తెరపై కొత్తగా ప్రజెంట్ చేసే సినిమా ఇది. ప్రేక్షకులకు ఐ ఫీస్ట్‌లా ఉంటుంది. బడ్జెట్ గురించి ఆలోచించకుండా పెద్ద ఆర్టిస్టులను ఇచ్చి సహకరించిన నిర్మాతలకు నా కృతజ్ఞతలు' అని చెప్పారు.

ఐదు భాషల్లో 'ప్రేమించొద్దు'



బస్తీ నేపథ్యంలో సాగే యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్ 'ప్రేమించొద్దు'. అనురూప్ రెడ్డి, దేవా మలిశెట్టి, సారిక, మానస ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రూపుదిద్దుకుంది. తెలుగు చిత్రం వచ్చే నెల 7న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో గురువారం టీజర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో దర్శకనిర్మాత శిరిన్ శ్రీరామ్ మాట్లాడుతూ 'ఐదు భాషల్లో సినిమా తీశాం. నాకు సహకరించిన టీమ్‌కు థాంక్స్' అని చెప్పారు. చాలా ఎమోషనల్ ఫిల్మ్ ఇదనీ, ప్రతి తల్లితండ్రులు తమ పిల్లలకు చూపించాల్సిన సినిమా అనీ సూపర్‌వైజింగ్ ప్రొడ్యూసర్ నిఖిలేశ్ చెప్పారు. హీరోగా తనకు ఇది మూడో చిత్రమనీ, మూడేళ్లు ఎన్నో కష్టాలు పడి శిరీన్ ఈ సినిమాను తీశారనీ అనురూప్‌రెడ్డి చెప్పారు.

చేతికి కట్టుతో...



ఐశ్వర్యారాయ్ బచ్చన్ కేన్స్ చలనచిత్రోత్సవంలో మరోసారి మెరవబోతున్నారు. గురువారం కూతురు ఆరాధ్యతో కలసి ఈ వేడుకల్లో పాల్గొనేందుకు బయల్దేరివెళ్లారు. తల్లీ కూతుళ్లు ఇద్దరూ గురువారం ముంబై ఎయిర్‌పోర్ట్‌లో కనిపించారు. చేతికి గాయం అయినప్పుడు ధరించే కట్టుతో ఐశ్వర్య కనిపించారు. దీంతో రెడ్‌కార్పెట్‌పై ఆమె ప్రదర్శనపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

భావోద్వేగాలతో అలరించే రాజు యాదవ్



'జబర్దస్త్' కమెడియన్ గెటప్ శ్రీను హీరోగా నటించిన చిత్రం 'రాజు యాదవ్'. ఈ సినిమాతో కృష్ణమాచారి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ప్రశాంత్‌రెడ్డి, రాజేశ్ కల్లెపల్లి నిర్మించిన ఈ చిత్రాన్ని ఈ నెల 24న విడుదల చేస్తున్నారు. సక్సెస్‌ఫుల్ నిర్మాత బన్నీ వాసు ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లో సినిమాను రిలీజ్ చేస్తుండడం విశేషం. 'మా సినిమా టీజర్, ట్రైలర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. సంగీత దర్శకుడు హర్షవర్ధన్ రామేశ్వర్ మంచి పాటలు అందించారు. లవ్, కామెడీ అంశాలతో పాటు హృదయాన్ని హత్తుకొనే భావోద్వేగాలతో సినిమా తప్పకుండా ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు నిర్మాతలు. ఈ చిత్రంలో అంకిత ఖరత్ కథానాయికగా నటించారు.

టీఎస్ ఎప్‌సెట్ ఫలితాలు రేపు!

హైదరాబాద్ సిటీ, మే 16 (ఆంధ్రజ్యోతి): టీఎస్ ఎప్‌సెట్ ఫలితాలను శనివారం విడుదల చేసేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికై తెలంగాణ ప్రభుత్వం ఈ నెల 7 నుంచి 11వరకు పరీక్షలు నిర్వహించింది. ఆయా పరీక్షలకు సంబంధించి విడుదల చేసిన 'ప్రాథమిక కీ' పై ఈ నెల 14 వరకు అభ్యర్థులు, అధ్యాపకుల నుంచి అభ్యంతరాలను స్వీకరించిన నిర్వాహకులు రెండ్రోజులుగా సబ్జెక్టుల వారీగా సమీక్షించ నిర్వహించి గురువారం ఫైనల్ కీని సిద్ధం చేశారు. శుక్రవారం సాయంత్రం 3.30 గంటలకు జేఎన్‌టీయూలో సెట్ కమిటీ సభ్యుల సమావేశం జరగనుంది. వారి ఆమోదం తీసుకొని శనివారం ఉదయం ఫలితాలను విడుదల చేసేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏసీబీకి చిక్కిన నర్సాపూర్ వ్యవసాయశాఖ ఏవో

నర్సాపూర్, మే 16: ట్రేడ్ లైసెన్స్ కోసం రూ. 30 వేల లంచం డిమాండ్ చేసిన మెదక్ జిల్లా నర్సాపూర్ వ్యవసాయశాఖ ఏవో అనిల్‌కుమార్ ఏసీబీ వలలో చిక్కారు. నిజామాబాద్ జిల్లా బోదన్ మండలం సాలురకు చెందిన వంగానరేన్ ఓ కంపెనీని ప్రారంభించేందుకు ట్రేడ్ లైసెన్స్ కోసం ఏవో అనిల్‌కుమార్‌ను కలిశారు. రూ. 30 వేలు లంచం కావాలని ఏవో డిమాండ్ చేయగా వంగానరేన్ విషయాన్ని ఏసీబీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గురువారం.. ఏవో అనిల్‌కుమార్ వంగానరేన్ నుంచి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని రిమాండ్‌కు తరలించారు.

వేడినీళ్లు పడి విద్యార్థినికి తీవ్ర గాయాలు

శంకర్‌పల్లి, మే 16(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఇక్ఫాయ్ యూనివర్సిటీ హాస్టల్‌లో ఓ విద్యార్థిని శరీరంపై వేడి నీళ్లు పడి తీవ్ర గాయాలయ్యాయి. వనస్థలిపురానికి చెందిన లేఖ్య.. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం దొంతాన్‌పల్లిలోని ఇక్ఫాయ్ వర్సిటీ కాలేజీలో బీబీఏ(ఎల్ఎల్‌బీ) థర్డ్ ఇయర్ చదువుతోంది. కళాశాల హాస్టల్‌లో బుధవారం రాత్రి లేఖ్య బాత్‌రూమ్‌లో గీజర్ వేడి నీటిని నేరుగా శరీరంపై పోసుకుంది. దీంతో ఆమె కాళ్లు, చేతులకు కాలిన గాయాలయ్యాయి. ఇక్ఫాయ్ యాజమాన్యం లేఖ్యను ఆస్పత్రికి తరలించింది. విద్యార్థినిపై యాసిడ్ దాడి జరిగిందంటూ సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న వార్తలు అసత్యమని నార్సింగ్ ఏసీపీ రమణాగౌడ్ తెలిపారు.


కూకట్‌పల్లి ప్రకాశ్ నగర్‌లో వరద నీటిలో నిలిచిపోయిన ఆటోను తోస్తున్న డ్రైవర్


కూకట్‌పల్లి ప్రశాంత్ నగర్‌లో సహాయక పనుల్లో నిమగ్నమైన డీఆర్ఎఫ్ సిబ్బంది

రాజధానిలో జడివాన

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టారు. ఫిల్మ్‌నగర్, శ్రీకృష్ణానగర్ బీబ్లాక్ ప్రాంతాల్లో పలు షాపుల్లోకి వదర నీరు చేరింది. మధురానగర్, ఫిలింనగర్, బేగంబజార్, మన్సూరాబాద్ డివిజన్ సాయినాథ్ కాలనీల్లో వరదనీరు ఇళ్లలోకి చేరడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల రోడ్లపై నీరు నిల్చి గంటలకొద్దీ ట్రాఫిక్ స్తంభించిపోయింది. వర్షాల నేపథ్యంలోనే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ అధికారులు సూచించారు. ఏదైనా సమస్యలు ఉంటే కంట్రోల్ రూమ్ నంబర్ 040-2111 1111, డీఆర్ఎఫ్ నంబర్ 90001 13667కు సంప్రదించాలని వెల్లడించారు.

పలు జిల్లాల్లోనూ వర్షాలు..

ఉమ్మడి రంగారెడ్డి, నల్లగొండ, మహబూబ్‌నగర్, కరీంనగర్, మెదక్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురిశాయి. ఇటు ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలుచోట్ల భారీ వర్షం పడింది. దీంతో పలు ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. పలుచోట్ల కాంటా వేసిన ధాన్యం బస్తాలుకూడా తడిసి ముద్దయ్యాయి. హనుమకొండ పట్టణంలో పలు లోతట్టు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వర్షపు నీరు నిలిచింది. వరంగల్, నిజామాబాద్ పట్టణాల్లో భారీ వర్షం పడటంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్‌లో పలుచోట్ల రోడ్లపై చెట్లు విరిగిపడ్డాయి. మునుగోడులో ఈదురుగాలులకు తోటల్లో మామిడి, నిమ్మకాయలు రాలిపోయాయి. కోహీర్ మండలం బిలాల్‌పూర్‌లో ఐదెకరాల అరటి తోట నేల కొరిగింది. పలుచోట్ల కూరగాయల పంటలు సైతం దెబ్బతిన్నాయి. చేవెళ్ల, కేశంపేట, యాచారం, దోమ, ఆలేరు, వలిగొండ మండలాల్లోని పలు కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ధారూర్ మండలంలో నాగారంలో 500 బస్తాలకు పైగా ధాన్యం తడిసింది.

పిడుగులు పడి ముగ్గురి మృతి..

పిడుగులు పడి వేర్వేరు చోట్ల ముగ్గురు మృతి చెందగా.. పలువురికి గాయాలయ్యాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం ఇందిరానగర్‌లోని భరత్‌నగర్‌కు చెందిన రైతు రుద్రారపు చంద్రయ్య(42) పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందాడు. వేములవాడ మునిసిపాలిటీ పరిధిలోని శాత్రాజుపల్లికి చెందిన కంబళ్ల శ్రీనివాస్ (30), రేగుల దేవయ్య రేగుల శ్రీనివాస్, కంబళ్ల కొమురవ్వ, కంబళ్ల ఎల్లయ్య చింతకాయ చెట్ల కాయలు దులిపేందుకు వెళ్లారు. ఈ నేపథ్యంలోనే భారీవర్షంతో పిడుగుపడి శ్రీనివాస్ మృతి చెందగా.. మిగతా వారు తీవ్రంగా గాయపడ్డారు. వారిని వేములవాడలోని ఆసుపత్రికి తరలించారు. కడ్తాల మండలం వాసుదేవ్‌పూర్‌లో మాడ్గుల మండలం కలకొండకు చెందిన పసునూరి ప్రవీణ్‌చారి (32), అతని మామ నాగోజు జంగాచారిపై పిడుగు పడింది. దీంతో ప్రవీణ్‌చారి మృతి చెందగా.. జంగాచారితో పాటు మరొకరు గాయపడ్డాడు. పరిగిలో వర్షానికి ప్రహరీ గోడ కూలి 15 మేకలు మృతి చెందాయి.

అప్రమత్తంగా ఉండండి: సీఎం

వర్షాల నేపథ్యంలో హైదరాబాద్ సహా అన్ని ప్రాంతాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. గురువారం సచివాలయం నుంచి అన్ని విభాగాల అధికారులతో ఆయన మాట్లాడారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

నేడు, రేపు వర్షాలు..

రాష్ట్రంలో శుక్ర, శనివారాల్లో వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ రెండ్రోజులు ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వివరించింది. బుదవారం తూర్పు విదర్భ దాని పరిసర ప్రాంతాల్లో కొనసాగిన ఆవర్తనం.. గురువారం మధ్యప్రదేశ్‌కు నైరుతి ప్రాంతాల్లో సగటు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో కేంద్రీకృతమై ఉందని తెలిపింది. దీని ప్రభావంతో తెలంగాణలో ఆగ్నేయ దిశ నుంచి గాలులు వీస్తున్నాయని పేర్కొంది.


చైతన్య పురి వద్ద నిలిచి పోయిన వాహనాలు


సిద్దిపేట మార్కెట్‌యార్డులో భారీ వర్షానికి తడుస్తున్న ధాన్యం రాశులు

కేసీఆర్‌ను ఓడించేందుకే కాంగ్రెస్‌ను గెలిపించారు

» బీజేపీ నేత ఈటల రాజేందర్



నల్లగొండ, మే 16: రాష్ట్ర ప్రజలు కేసీఆర్‌ను ఓడించేందుకు గత్యంతరం లేని పరిస్థితిలోనే కాంగ్రెస్‌ను గెలిపించారని మాజీ మంత్రి, మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నా రు. రాష్ట్రంలో అతి తక్కువ కాలంలోనే చీ కొట్టించుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, అలవి కాని హామీలిచ్చి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. గురువారం నల్లగొండలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే మళ్లీ మోటార్లు కాలిపోవడం, పంటలు ఎండిపోవడం, కరెంటు పోవడం వంటివి నిరంతరం జరుగుతున్నాయన్నారు. 10శాతం కమీషన్ ఇస్తేనే బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయని ఆరోపించారు. తెలంగాణలో బీఆర్ఎస్ ఎక్కడా లేదన్నారు. రాష్ట్రంలో బీజేపీ గణనీయంగా పుంజుకుందని, తమ పార్టీకి 12 ఎంపీ సీట్లు రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కడ చూసినా బీజేపీకి ఆదరణ ఉందని, మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయమని పేర్కొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డికి పట్టం కట్టాలని ఆయన కోరారు.

జనవరి నుంచి 27 ఎన్‌కౌంటర్లు అందులో 18 బూటకం

» మావోయిస్టు పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి వికల్ప్

చర్ల/మహబూబాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): చర్చలకు తాము సిద్ధంగా ఉన్నా ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాధానం రాలేదని మావోయిస్టు పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి వికల్ప్ ఆరోపించారు. వికల్ప్ పేరుతో గురువారం మావోయిస్టు పార్టీ లేఖను విడుదల చేసింది. మావోయిస్టు పార్టీని నిర్మూలనే లక్ష్యంతో ప్రభుత్వాలు పనిచేస్తున్నాయన్నారు. ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చి చర్చల వాతావరణం కలిపించాలని ప్రజా సంఘాలకు విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది జనవరి నుంచి బస్తర్ అడవుల్లో 27 ఎన్‌కౌంటర్లు జరిగాయని, అందులో 18 బూటకపు ఎన్‌కౌంటర్లు అని వికల్ప్ ఆరోపించారు. మొత్తం 107 మంది చనిపోయారని తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ (బీకే-ఏఎస్ఆర్) తరపున ఆజాద్ ఒక లేఖ విడుదల చేశారు. ప్రభుత్వ బలగాలు మూడున్నర నెలల్లో ఎన్‌కౌంటర్ల పేరుతో 60 మంది ఆదివాసీ మహిళలు, పిల్లలు, వృద్ధులను పొట్టనపెట్టుకున్నాయని పేర్కొన్నారు. ఆదివాసీలపై దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు.

లైంగిక వేధింపుల కేసులో... కామారెడ్డి డీఎంహెచ్‌వో అరెస్టు

కామారెడ్డి టౌన్, మే 16: లైంగిక వేధింపుల కేసులో కామారెడ్డి డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్‌ను పోలీసులు అరెస్టు చేసి కామారెడ్డి కోర్టులో హాజరు పరిచారు. విచారణ జరిపిన కోర్టు డీఎంహెచ్‌వోకు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసినట్టు తెలిసింది. రెండు రోజుల క్రితం దేవునిపల్లి పోలీస్‌స్టేషన్‌కు మహిళా మెడికల్ ఆఫీసర్లు వచ్చి డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్ తమపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని గురువారం ఆయన్ను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. కాగా.. లక్ష్మణ్‌సింగ్ వ్యవహారంపై జిల్లా స్థాయి అటవీశాఖ అధికారి అధ్యక్షతన మరో ఇద్దరు అధికారులతో విచారణ కమిటీని వేశారు. శుక్రవారం ఈ కమిటీ విచారణ చేపట్టనుంది.

'ఇఫ్కో' డైరెక్టర్‌గా మార గంగారెడ్డి

హైదరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్టేట్ మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి.. 'ఇఫ్కో' (ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్స్ కోఆపరేటివ్ లిమిటెడ్) డైరెక్టర్‌గా ఎన్నికయ్యారు. 21 డైరెక్టర్ పోస్టులకు ఢిల్లీలోని సంస్థ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఎన్నికల్లో పోటీ చేసిన గంగారెడ్డి విజయం సాధించారు. ఇఫ్కో చైర్మన్ దిలీప్ సంగానీ, ఎండీ ఉదయ్‌శంకర్ అవస్థీ ఈ మేరకు ఆయనకు నియామక పత్రం అందించారు. ఇఫ్కో నూతన పాలకవర్గ సమావేశం శుక్రవారం జరగనుంది. కాగా, ఇఫ్కో ద్వారా రాష్ట్రానికి అవసరమయ్యే ఎరువులు సకాలంలో రప్పించేందుకు కృషి చేస్తానని ఇఫ్కో డైరెక్టర్‌గా ఎన్నికైన మార గంగారెడ్డి తెలిపారు.

చేప పిల్లల పంపిణీని కొనసాగించాలి

» అన్ని జిల్లాల్లో 'ఫిష్ ఫెస్టివల్' నిర్వహించాలి

» ముదిరాజ్ మహా సంఘం రాష్ట్ర కన్వీనర్

పంజాగుట్ట, మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మత్స్యకారులకు ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం కొనసాగించాలని తెలంగాణ ముదిరాజ్ మహా సంఘం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ గుండ్లపల్లి శ్రీను ముదిరాజ్ సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. మృగశిర కార్తె రోజున హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లాల్లో 'ఫిష్ ఫెస్టివల్' నిర్వహించాలని కోరారు. గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో సంఘం రాష్ట్ర సమన్వయకర్త బొక్క శ్రీనివాస్ ముదిరాజ్, రాష్ట్ర యూత్ విభాగం అధ్యక్షుడు రంజిత్ ముదిరాజ్ తదితరులతో కలిసి మాట్లాడారు. తమకు అన్యాయం చేసిన కేసీఆర్ ప్రభుత్వాన్ని అసెంబ్లీ ఎన్నికల్లో కూల్చివేశామన్నారు. ముదిరాజ్ సామాజిక వర్గానికి మంత్రిమండలిలో ప్రాతినిధ్యం కల్పిస్తామని, బీసీ-డీ గ్రూపు నుంచి బీసీ-ఏ గ్రూపులోకి మారుస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారన్నారు. తమ సామాజిక వర్గం అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడడమే కాకుండా ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు, నామినేటెడ్ పదవుల్లో అవకాశం, మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ గెలుపు కోసం కృషి చేయడంపై రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మద్దతు తెలిపారు. సంఘం నాయకులు ఎస్.మహేష్ ముదిరాజ్, ఎం.వెంకటేష్ ముదిరాజ్, శేఖర్ ముదిరాజ్ పాల్గొన్నారు.


నాగార్జునసాగర్ ప్రధాన డ్యాంను పరిశీలిస్తున్న రాహుల్ బొజ్జ

'సాగర్' నిర్వహణ మరమ్మతులు త్వరగా పూర్తిచేయాలి

» అధికారులకు రాహుల్ బొజ్జ ఆదేశం.. నీటి నిల్వలపై ఆరా

నాగార్జునసాగర్, మే 16: నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్వహణ మరమ్మతు పనులను త్వరగా పూర్తిచేయాలని రాష్ట్ర నీటి పారుదల శాఖ ప్రధాన కార్యదర్శి రాహుల్ బొజ్జ ప్రాజెక్టు అధికారులను ఆదేశించారు. నీటి పారుదల శాఖ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టాక గురువారం మొదటిసారి ఆయన సాగర్‌ను సందర్శించారు. తొలుత హిల్‌కాలనీలోని విజయవిహార్ అతిథి గృహంలో ప్రాజెక్టు సీఈ అజయ్‌కుమార్, ప్రాజెక్టు ఇంజనీర్లతో సమావేశం నిర్వహించారు. వర్షాకాలం ప్రారంభంనాటికి పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. అనంతరం సాగర్ ప్రధాన డ్యాంపైకి వెళ్లి అక్కడ జరుగుతున్న నిర్వహణ పనులను పరిశీలించారు. క్రస్ట్‌గేట్లు, సూట్‌గేట్లు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి నీళ్లు వెళ్లే గేట్లను పరిశీలించారు. సాగర్ పైలాన్‌కాలనీలో ఎస్‌టీఐ పార్కులో ఉన్న మోడల్ డ్యాం వద్దకు వచ్చి ప్రధాన డ్యాంపై ఏపీ, తెలంగాణ భూభాగాల్లోని క్రస్ట్‌గేట్ల గురించి ప్రాజెక్టు ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. అలాగే సాగర్ ప్రాజెక్టు నీటినిల్వల సామర్థ్యం, ప్రస్తుత నీటి నిల్వల గురించి ఇంజనీర్లను అడిగారు. ఇటీవల టెయిల్ పాండ్‌లోని నీటిని ఏపీ తరలించడంపై ఆరా తీశారు. ఆ నీటి నిర్వహణ ఎవరి పరిధిలో ఉంటుందని జెన్‌కో అధికారులను ప్రశ్నించగా.. ఏపీ పరిధిలోని అంశమని అధికారులు తెలిపారు. ప్రస్తుతం సాగర్‌లో 504.80 అడుగుల నీరు మాత్రమే ఉండటంతో ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేయడంలేదని అధికారులు చెప్పారు. ఆయన వెంట సీఈ అజయ్‌కుమార్, జేఈ కృష్ణయ్య, ఏఈలు సత్యనారాయణ, భిక్షం తదితరులు ఉన్నారు.


చిత్రపటాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందజేస్తున్న హరీశ్వర్ రెడ్డి

రక్తంతో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటం

మద్దూర్, మే 16: నారాయణపేట జిల్లా మద్దూర్‌కు చెందిన టీపీసీసీ సోషల్ మీడియా కో- ఆర్డినేటర్ గంగుల హరీశ్వర్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాన్ని తన రక్తంతో గీయించి అభిమానాన్ని చాటుకున్నారు. గురువారం సీఎం నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ఆ చిత్రపటాన్ని ఆయనకు అందించారు. ఈ సందర్భంగా హరీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి ఒకే దఫాలో రూ. 4 వేల కోట్లు మంజూరు చేసి కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి గట్టి పునాది వేశారని, ఈ ప్రాంతవాసుల చిరకాల కోరిక అయిన నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతలకు శ్రీకారం చుట్టారని చెప్పారు. విద్య, వైద్యంతో పాటు రోడ్ల అభివృద్ధికి వెయ్యి కోట్లు కేటాయించడం కొడంగల్ చరిత్రలో నిలిచిపోతుందని కొనియాడారు. తమ ప్రాంతం పట్ల సీఎం చూపుతున్న ఆదరణకుగానూ ఈ చిరు కానుకను ఆయనకు అందించినట్లు హరీశ్ రెడ్డి తెలిపారు.

అప్పు తగ్గించుకుందాం!

(మొదటి పేజీ తరువాయి)

లేదన్నా రూ.10,000 కోట్లు ఆదా అవుతాయని, ఖజానాకు ఇది పెద్ద ఊరటనిస్తుందని ఆశపడుతోంది.

రెండు రకాల అప్పులు...

రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పులు రెండు రకాలు. కేంద్ర ప్రభుత్వ అనుమతితో, ద్రవ్య బాధ్యత, బడ్జెట్ నిర్వహణ(ఎఫ్ఆర్‌బీఎం) చట్ట నిబంధనలకు లోబడి చేసే బహిరంగ మార్కెట్ రుణాలు(ఓఎంబీ) ఒక రకం కాగా.. బడ్జెట్‌లో చూపాల్సిన అవసరం లేకుండా, ప్రభుత్వం ఇచ్చే గ్యారంటీలతో వివిధ ప్రాజెక్టుల కోసం కార్పొరేషన్లు తీసుకునే అప్పులు రెండో రకం. బడ్జెట్ రుణాలను ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా ఆర్థిక లోటును పూడ్చుకోవడానికి తీసుకుంటుంది. అంటే.. సంక్షేమ పథకాలు, ఇతర అభివృద్ధి పనుల కోసం చేసే వ్యయాలకు రాష్ట్ర రాబడుల సొమ్ము సరిపోనప్పుడు, బడ్జెట్ అప్పులతో పూడ్చుకుంటుంది. వడ్డీతో సహా ఆ అప్పులను ప్రభుత్వమే తప్పకుండా చెల్లించాల్సి ఉంటుంది. ఈ వివరాలను ఎప్పటికప్పుడు 'కాగ్'కు సమర్పించాల్సి ఉంటుంది. ఆ అప్పులపై పరిపూర్ణమైన ఆడిటింగ్ జరుగుతుంది. ఇక, బడ్జెట్‌తో సంబంధం లేకుండా చేసే కార్పొరేషన్ల అప్పులకు ప్రభుత్వం గ్యారంటీలు ఇస్తుంటుంది. ఇలాంటి అప్పులతోనే సమస్య వచ్చి పడుతోంది. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల కోసం 9 నుంచి 12 శాతం దాకా అధిక వడ్డీ రేట్లతో అప్పులు తెచ్చింది. అవే ఇప్పుడు సర్కారు మెడకు చుట్టుకున్నాయి. కార్పొరేషన్లకు ఆ అప్పులను తీర్చే ఆర్థిక తాహతు లేకపోవడంతో వాటిని ప్రభుత్వం చెల్లించాల్సి వస్తోంది. ఇలాంటి అప్పులు ప్రస్తుతం రూ.1,27,208 కోట్ల వరకు ఉన్నాయి. ఇందులో కాళేశ్వరం సాగునీటి పారుదల ప్రాజెక్టు కార్పొరేషన్ పేర రూ.79000 కోట్ల అప్పు ఉంది. ఈ కార్పొరేషన్ ద్వారా సేకరించిన అప్పుల్లోనే కొంత సొమ్మును పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు మళ్లించారు. ప్రస్తుతం ఈ రుణానికి సంబంధించి ప్రభుత్వం నెలకు దాదాపు రూ.1200 కోట్ల చొప్పున ఏటా రూ.14,406కోట్ల వడ్డీని చెల్లించాల్సి వస్తోంది. మిగతా కార్పొరేషన్ల అప్పు రూ.50 వేల కోట్లను కూడా కలుపుకొంటే.. రూ.2000 కోట్ల వరకూ నెలవారీ వడ్డీలకే పోతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వాటిపైనే దృష్టి సారించింది. ఇలాంటి ప్రాజెక్టులకు 4 శాతం వడ్డీలతో రుణాలిచ్చే అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు కోకొల్లలుగా ఉన్నాయని, వాటి వద్ద బ్యాంకుల్లో డబ్బు మూలుగుతుంటే.. గ్యారంటీలిచ్చి అప్పులు తీసుకునేవాడే లేడని అంటున్నారు. అందుకే అలాంటి అంతర్జాతీయ సంస్థలకు రాష్ట్ర అప్పులను బదలాయించాలని రాష్ట్ర సర్కారు యోచిస్తోంది.

రీస్ట్రక్చరింగ్ అంటే?

ప్రస్తుతమున్న అప్పులను అంతర్జాతీయ స్థాయిలో తక్కువ వడ్డీలకు రుణాలిచ్చే ఆర్థిక సంస్థలకు బదిలీ చేయడమే ఈ రీస్ట్రక్చరింగ్ విధానం. అయితే, రుణాల బదిలీకి అంతర్జాతీయ సంస్థలను కేంద్ర ప్రభుత్వం ఒప్పించాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభు త్వం తరపున పూచీ పడాల్సి ఉంటుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన కొత్తలో సీఎం రేవంత్‌రెడ్డి ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్‌తో హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. రుణాలను రీస్ట్రక్చర్ చేయించుకోవాలంటూ ఆయన ఇచ్చిన సూచన మేరకు రేవంత్ ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి దీనిపై మాట్లాడారు. తక్కువ వడ్డీలతో రుణాలిచ్చే సంస్థలను రుణాల బదిలీకి ఒప్పించాలని అడిగారు. అయితే, కార్పొరేషన్ల పేర తీసుకున్న అప్పులను అంతర్జాతీయ ఆర్థిక సంస్థలకు బదిలీ చేయాలంటే ఆ సంస్థలు రకరకాల వివరాలు అడుగుతాయి. గ్యారంటీ అప్పులను చెల్లించే స్తోమత ఆయా కార్పొరేషన్లకు ఉందని ప్రభుత్వం వాటిని సంతృప్తిపరిస్తేనే అప్పుల బదిలీకి అంగీకరిస్తాయి. ఉదాహరణకు.. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా దాదాపు రూ.5000 కోట్ల వార్షిక రాబడి ఉంటుందని అప్పట్లో బీఆర్ఎస్ ప్రభుత్వం అంచనా వేసింది. ఇదే విషయాన్ని వివిధ బ్యాంకులకు వివరించి అప్పులు తెచ్చారంటూ సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలోనే ప్రకటించారు. ఈ మేరకు.. పరిశ్రమలకు సరఫరా చేసే కాళేశ్వరం నీరు, వివిధ మున్సిపాలిటీలు, జీహెచ్ఎంసీకి సరఫరా చేసే నీటికి చార్జీల రూపంలో కార్పొరేషన్‌కు సొమ్ము వస్తుందని.. అది అప్పు, వడ్డీల చెల్లింపునకు ఉపయోగపడుతుందంటూ అంతర్జాతీయ సంస్థలకు ప్రభుత్వం వివరించనుంది. తద్వారా అంతర్జాతీయ సంస్థలు తక్కువ వడ్డీకే రుణాలను బదిలీ చేసుకుంటాయని ప్రభుత్వం భావిస్తోంది.

రాష్ట్రానికి మేలే

రుణాల రీస్ట్రక్చరింగ్‌తో రాష్ట్రానికి మేలు జరిగే అవకాశాలున్నాయని ఆర్థిక శాఖాధికారులు వివరిస్తున్నారు. నెలకు కనీసం రూ.700 నుంచి రూ.900 కోట్ల వడ్డీ ఆదా అయినా.. ఎంతో కొంత ఊపిరి పీల్చుకోవచ్చని వారు ఆశిస్తున్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో వివిధ దేశాలకు 'జపాన్ ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్ ఏజెన్సీ(జైకా)', 'ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్(ఏడీబీ)', 'ఇంటర్నేషనల్ బ్యాంక్ ఫర్ రీకన్‌స్ట్రక్షన్ అండ్ డెవలప్‌మెంట్(ఐబీఆర్‌డీ)', కొరియన్ బ్యాంకు వంటివి తక్కువ వడ్డీలకే రుణాలిస్తున్నాయి. వీటి వార్షిక వడ్డీ శాతాలు 2 నుంచి 4 వరకు ఉంటాయి. తీసుకునే రుణ కాల పరిమితి, రుణ గ్రహీత దేశం వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని, వడ్డీ రేట్లను నిర్ణయిస్తాయి. ఎంతైనా వడ్డీ చాలా తక్కువగా ఉంటుంది. అందుకే ప్రస్తుత వడ్డీల భారాన్ని తగ్గించుకోవడానికి ప్రభుత్వం వీటిపై దృష్టి సారించింది.

మేడిగడ్డకు రిపేర్లు చేయండి

ప్రభుత్వ పరిశీలనలో ఒప్పందంలోని నిబంధనలు, షరతులు.. వాటికి లోబడే చెల్లింపులు చేస్తాం

» మేడిగడ్డపై ఎల్ అండ్ టీకి రామగుండం సీఈ లేఖ

» అన్నారం, సుందిళ్ల నిర్మాణ సంస్థలకూ లేఖలు

హైదరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) నిపుణుల కమిటీ మధ్యంతర నివేదికకు లోబడి మేడిగడ్డ బ్యారేజీకి మరమ్మతులు చేయాలని ఎల్ అండ్ టీని నీటిపారుదల శాఖ కోరింది. ఈ మేరకు నిర్మాణ సంస్థకు రామగుండం చీఫ్ ఇంజనీర్ లేఖ రాశారు. మేడిగడ్డకు తదుపరి మరమ్మతులు చేయాలంటే కాంపోనెంట్ల వారీగా కొత్తగా ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుందని, ఆ మేరకు చెల్లింపులూ చేయాల్సి ఉంటుందని ఎల్ అండ్ టీ ఇప్పటికే ప్రభుత్వానికి స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే, ఒప్పందంలోని షరతులు/నిబంధనలను ప్రభుత్వం పరిశీలిస్తోందని, చెల్లింపులు కూడా దానికి లోబడే ఉంటాయని, వానాకాలం ముంచుకు వస్తుండటంతో ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ఆధారంగా మరమ్మతులకు ఉపక్రమించాలని చీఫ్ ఇంజనీర్ కోరారు. దెబ్బతిన్న బ్లాకులను తొలగించడం, పిల్లర్లకు ఇనుప పట్టీలు వేయడం లేదా రక్షణ చర్యలు తీసుకోవడం, గ్రౌటింగ్, ప్లింత్ శ్లాబ్‌ల మరమ్మతులు, గేట్లు తెరుచుకునేలా చర్యలు తీసుకోవడం వంటి ప్రక్రియలను తక్షణమే చేపట్టాలని వివరించారు. యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని తెలిపారు. బ్యారేజీలోని 6, 7, 8వ బ్లాకులకు చెందిన ఎలక్ట్రో రెసిస్టివిటీ టెస్ట్ (ఈఆర్‌టీ), గ్రౌండ్ పెనిట్రేటింగ్ రాడార్ (జీపీఆర్) టెస్టుల నివేదికల ఆధారంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్‌డీఎస్‌ఏ కమిటీ కూడా వానా కాలం లోపు బ్యారేజీల రక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని కోరిందని గుర్తు చేశారు. అలాగే, మేడిగడ్డ బ్యారేజీని ఎల్ అండ్ టీ నిర్మించగా.. అన్నారం బ్యారేజీని అఫ్కాన్స్-విజేత-పీఈఎస్ జాయింట్ వెంచర్; సుందిళ్లను నవయుగ-జీఎండబ్ల్యూ జేవీలు కట్టాయి. అన్నారం బ్యారేజీ మరమ్మతులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని, నిర్ణీత వ్యవధి పెట్టుకొని.. ఆలోపు పనులన్నీ పూర్తయ్యేలా చూడాలని అఫ్కాన్స్-విజేత-పీఈఎస్ జాయింట్ వెంచర్‌కు లేఖ రాయగా, సుందిళ్లపై కూడా నవయుగ-జీఎండబ్ల్యూ జాయింట్ వెంచర్‌కు లేఖ రాశారు.

వెండి ఆల్‌టైం రికార్డు

రూ.1,800 పెరుగుదలతో రూ.88,000కు కిలో ధర.. రూ.74,000 దాటిన పసిడి



న్యూఢిల్లీ: విలువైన లోహాలు మళ్లీ కొండెక్కాయి. ఢిల్లీ మార్కెట్లో కిలో వెండి ధర గురువారం రూ.1,800 పెరిగి సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.88,000కు చేరుకుంది. కాగా, 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం రూ.650 పెరుగుదలతో రూ.74,050 ధర పలికింది. అంతర్జాతీయంగా వీటి ధరలు పెరగడమే ఇందుకు కారణం. ఇంటర్నేషనల్ బులియన్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ ఒక్క రోజులోనే 21 డాలర్లు పెరిగి 2,386 డాలర్లకు ఎగబాకగా.. సిల్వర్ దాదాపు ఒక డాలర్ వరకు పెరిగి 29.55 డాలర్లకు చేరుకుంది. అమెరికాలో ద్రవ్యోల్బణం అంచనాల కంటే తగ్గిన నేపథ్యంలో ఫెడ్ రేట్ల తగ్గింపుపై మార్కెట్ వర్గాల్లో మళ్లీ ఆశలు పెరిగాయి. దాంతో బంగారం, వెండి మరింత ఎగబాకే అవకాశాలున్నాయి. త్వరలోనే ఔన్స్ గోల్డ్ 2,400 డాలర్లు, సిల్వర్ 30 డాలర్ల స్థాయిని దాటవచ్చని బులియన్ విశ్లేషకులు భావిస్తున్నారు. ఎందుకంటే, ఫెడ్ రేట్లు-గోల్డ్ డిమాండ్‌ది విలోమ సంబంధం. ఫెడ్ రేట్లు పెరుగుతున్న సమయంలో స్థిర ఆదాయాన్ని పంచే బాండ్లు, మార్కెట్ ఫండ్స్‌కు డిమాండ్ పెరుగుతుంది. దాంతో విలువైన లోహాల నుంచి పెట్టుబడులు వీటిలోకి మళ్లుతుంటాయి. కాగా, వడ్డీ రేట్లు తగ్గే సందర్భంలో బాండ్ల నుంచి పెట్టుబడులు ఈ లోహాల్లోకి మళ్లుతుంటాయి.

ఈసారి బులియన్ ర్యాలీలో బంగారం కంటే వెండి ఆకర్షణీయ రిటర్నులు పంచే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. గడిచిన కొన్నేళ్లలో వెండి విలువైన లోహం నుంచి పారిశ్రామిక లోహంగా మారిందని మోతీలాల్ ఓస్వాల్ సెక్యూరిటీస్ గ్రూప్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నవనీత్ దమానీ అన్నారు. ప్రపంచ పారిశ్రామిక హబ్ అయిన చైనా ఈ ఏడాది మూడో త్రైమాసికంలో మళ్లీ పుంజుకోనుందని, దాంతో వెండికి డిమాండ్ అనూహ్యంగా పెరగవచ్చని ఆయన పేర్కొన్నారు. కాబట్టి, ప్రస్తుత స్థాయితో

సిల్వర్ @ రూ.1,00,000

పోలిస్తే వెండి ధరలు వచ్చే ఏడాది కాలంలో మరో 15-20 శాతం మేర పెరిగి రూ.లక్ష మైలురాయిని దాటవచ్చని ఆయన అంచనా వేశారు. కాగా, మున్ముందు నెలల్లో బంగారం, వెండి సరికొత్త జీవితకాల గరిష్ఠాలకు చేరుకోనున్నాయని ఆర్‌ఓటీహెచ్ క్యాపిటల్ పార్ట్‌నర్స్ విశ్లేషకులు అంటున్నారు. ఏప్రిల్‌లో చవిచూసిన గరిష్ఠాలను కూడా అధిగమించిన నేపథ్యంలో మున్ముందు బంగారం ధరలు మరింత ఎగబాకనున్నాయని, ఔన్స్ 2,600 డాలర్ల స్థాయికి చేరుకోవచ్చని ఆర్‌ఓటీహెచ్ చీఫ్ టెక్నికల్ స్ట్రాటజిస్ట్ జేసీ వోహ్రా అంచనా వేశారు. ఒకవేళ సిల్వర్ 30 డాలర్ల స్థాయిని అధిగమిస్తే, మున్ముందు 35-37 డాలర్ల వరకు ర్యాలీ తీయవచ్చన్నారు.



మూడేళ్లలో రూ.37,000 కోట్ల పెట్టుబడులు

ఎలక్ట్రిక్ వాహనాలపైనే రూ.12,000 కోట్లు ఇన్వెస్ట్ .. మహీంద్రా గ్రూప్ భారీ ప్రణాళిక

న్యూఢిల్లీ: వచ్చే మూడు సంవత్సరాల కాలంలో వివిధ వ్యాపార విభాగాల్లో రూ.37,000 కోట్లు పెట్టుబడులు పెట్టాలని మహీంద్రా గ్రూప్ నిర్ణయించింది. ఇందులో అధిక భాగం ఆటో రంగంలోనే ఇన్వెస్ట్ చేయనున్నారు. మొత్తం 23 కొత్తవాహనాలు మార్కెట్లో ప్రవేశపెట్టాలని భావిస్తున్నట్టు కంపెనీ ఎండీ, సీఈఓ అనీష్ షా చెప్పారు. వాటిలో 9 ఐసీఈ (ఇంటర్నల్ కంబషన్ ఇంజన్, ఐసీఈ) ఎస్‌యూవీలు, ఏడు బ్యాటరీ విద్యుత్ వాహనాలు, ఏడు తేలికరకం వాణిజ్య వాహనాలు ఉంటాయని ఆయన అన్నారు. అలాగే 9 ఐసీఈల్లో ఆరు పూర్తిగా కొత్తవి కాగా మూడు ప్రస్తుతం ఉన్న మోడల్స్‌ను మరింత మెరుగుపరిచిన వెర్షన్లని ఆయన చెప్పారు. తాము ఐసీఈ మోడల్‌ను నిర్లక్ష్యం చేయబోవడంలేదని షా స్పష్టం చేశారు. ఆటో విభాగానికి తాము రూ.27,000 కోట్లు కేటాయించామని, అందులో రూ.14,000 కోట్లు ఐసీఈ విభాగంలోనే ఉంటాయని ఆయన తెలిపారు. ఇది కాకుండా ఎలక్ట్రానిక్ వాహన (ఈవీ) విభాగంలో రూ.12,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్టు చెప్పారు. నిధులపరంగా ఆటో విభాగం స్వయం సమృద్ధంగా ఉన్నదని, వెలుపలి నుంచి నిధులు సమకూర్చుకోవలసిన అవసరం లేదని తెలిపారు. వ్యవసాయ, సర్వీస్ విభాగాల్లో రూ.5,000 కోట్ల వంతున ఇన్వెస్ట్ చేయనున్నట్టు కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈఓ (ఆటో, వ్యవసాయ విభాగం) రాజేశ్ జెజూరికర్ తెలిపారు.

కన్సాలిడేటెడ్ లాభం 4 శాతం అప్

2023-24 ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం) రూ.35,452 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.2,754 కోట్ల నికర లాభం ఆర్జించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం క్యూ4లో కంపెనీ ఆదాయం రూ.32,456 కోట్లుండగా లాభం రూ.2,637 కోట్లుంది. అదే తేదీతో ముగిసిన ఆర్థిక సంవత్సరం మొత్తానికి కంపెనీ ఆదాయం 15 శాతం పెరిగి రూ.1,21,362 కోట్ల నుంచి రూ.1,39,078 కోట్లకు చేరగా లాభం 25 శాతం వృద్ధితో రూ.9,025 కోట్ల నుంచి రూ.11,269 కోట్లకు పెరిగింది. కంపెనీ ఆటోమొబైల్ విభాగం ఆదాయం క్యూ4లో రూ.20,908 కోట్లుండగా, ఆర్థిక సంవత్సరం మొత్తం మీద 24 శాతం వృద్ధితో రూ.76,156 కోట్లుగా నమోదైంది.

22,400 ఎగువకు నిఫ్టీ
సెన్సెక్స్ 676 పాయింట్లు జంప్

ముంబై: రోజంతా లాభ నష్టాల మధ్య ఊగిసలాడిన ప్రామాణిక ఈక్విటీ సూచీలు.. ఆఖరి గంటలో జోరుగా కొనుగోళ్లు జరగడంతో దాదాపు ఒక శాతం వరకు పెరిగాయి. గురువారం ట్రేడింగ్ ముగిసేసరికి, సెన్సెక్స్ 676.69 పాయింట్ల లాభంతో 73,663.72 వద్దకు చేరుకోగా.. నిఫ్టీ 203.30 పాయింట్ల వృద్ధితో 22,403.85 వద్ద ముగిసింది. అమెరికాలో ద్రవ్యోల్బణం అంచనాల కంటే తగ్గడంతో ఈ ఏడాది ఫెడరల్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేట్లను కనీసం రెండు సార్లైనా తగ్గించవచ్చన్న అంచనాలు మొదలయ్యాయి. దాంతో గ్లోబల్ మార్కెట్లతో పాటు సెన్సెక్స్, నిఫ్టీ కూడా ర్యాలీ తీశాయి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 25 లాభపడ్డాయి.

22 నుంచి ఆఫీస్ స్పేస్ ఐపీఓ: కో-వర్కింగ్ సేవల కంపెనీ ఆఫీస్ స్పేస్ సొల్యూషన్స్ లిమిటెడ్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ఈనెల 22న ప్రారంభమై 27న ముగియనుంది. పబ్లిక్ ఇష్యూలో విక్రయించనున్న షేర్ల ధరల శ్రేణిని కంపెనీ రూ.364-383గా నిర్ణయించింది. తద్వారా రూ.599 కోట్ల వరకు సమీకరించనుంది.

తగ్గిన కిమ్స్ హాస్పిటల్స్ లాభం

హైదరాబాద్ : గడచిన ఆర్థిక సంవత్సరం (2023-24) మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో కృష్ణా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్ హాస్పిటల్స్) కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.637.60 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.71.49 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం (2022-23) ఇదే కాలంలో సంస్థ రూ.580.81 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.98.67 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. సమీక్షా త్రైమాసికంలో బెడ్ ఆక్యుపెన్సీ తగ్గటం పనితీరుపై ప్రభావం చూపించిందని కిమ్స్ పేర్కొంది. కాగా మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ రూ.2,511.20 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.336 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గడచిన ఆర్థిక సంవత్సరంలో సన్‌షైన్, నాగ్‌పూర్ ఆస్పత్రులు మంచి పనితీరును కనబరచటం ఎంతగానో కలిసివచ్చిందని కిమ్స్ హాస్పిటల్స్ సీఎండీ బీ. భాస్కర్ రావు తెలిపారు.

వొడాఫోన్ ఐడియా నష్టం రూ.7,675 కోట్లు

న్యూఢిల్లీ: ఈ మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో వొడాఫోన్ ఐడియా నష్టం రూ.7,675 కోట్లకు పెరిగింది. వడ్డీ చెల్లింపులు, రుణ వ్యయాల భారం అధికమవడం ఇందుకు కారణమైంది. గత ఏడాదిలో ఇదే కాలానికి కంపెనీ నష్టం రూ.6,419 కోట్లుగా నమోదైంది. ఈ జనవరి-మార్చి కాలానికి సంస్థ ఏకీకృత ఆదాయం రూ.10,607 కోట్లకు పరిమితమైంది. కాగా, గత ఆర్థిక సంవత్సరం (2023-24) మొత్తానికి వొడాఫోన్ ఐడియా రూ.42,651.7 కోట్ల ఆదాయంపై రూ.31,238.4 కోట్ల నష్టాన్ని నమోదు చేసింది. ఈ మార్చి క్వార్టర్‌లో కంపెనీకి ఒక్కో వినియోగదారు నుంచి లభించే సగటు ఆదాయం (ఏఆర్‌పీయూ) వార్షిక ప్రాతిపదికన 7.6 శాతం పెరిగి రూ.146కు చేరుకుంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	74,020 ▲	67,850 ▲	92,500 ▲
ముంబై	73,438 ▲	67,269 ▲	86,230 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

17వ తేదీ			
హైదరాబాద్	550	విజయవాడ	540
వరంగల్	552	గోదావరి	540
చిత్తూరు	628	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	144	గోదావరి	154
వరంగల్	144	విజయవాడ	154
కరీంనగర్	144	గుంటూరు	154
మహబూబ్‌నగర్	144	ఒంగోలు	154
కర్నూలు	144	చిత్తూరు	160
విశాఖపట్నం	146		

పిట్టీ ఇంజనీరింగ్ లాభంలో 62% వృద్ధి

హైదరాబాద్: పిట్టీ ఇంజనీరింగ్ లిమిటెడ్ గడచిన ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో రూ.40.36 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2022-23 ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.2.4.84 కోట్లు)తో పోల్చితే నికర లాభం 62.42 శాతం వృద్ధి చెందింది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ మొత్తం ఆదాయం కూడా రూ.263.31 కోట్ల నుంచి రూ.359.32 కోట్లకు పెరిగింది. ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో రూ.5 విలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.1.50 డివిడెండ్‌ను కంపెనీ బోర్డు సిఫారసు చేసింది. మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ రూ.1,249.81 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.90.20 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది.

టెక్ మహీంద్రా మాజీ వైస్ చైర్మన్ వినీత్ నయ్యర్ కన్నుమూత

ముంబై: టెక్ మహీంద్రా మాజీ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ వినీత్ నయ్యర్ (85) మరిక లేరు. గురువారం ఉదయం ఆయన ఢిల్లీలో కన్ను మూశారు. ప్రమోటర్ల నిర్వాకంతో కుప్పకూలిన సత్యం కంప్యూటర్స్‌ను టెక్ మహీంద్రాలో విలీనం చేసి, ఆ కంపెనీకి కొత్త జవసత్వాలు సమకూర్చడంలో నాయర్ కీలక పాత్ర పోషించారు. హరియాణా క్యాడర్ ఐఏఎస్ అధికారి అయిన నయ్యర్ ప్రపంచ బ్యాంకులో భారత ప్రతినిధిగా కూడా పని చేశారు. ఆ సమయంలోనే మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఆహ్వానం మేరకు భారత్ వచ్చి ప్రభుత్వ రంగంలో గెయిల్ ఇండియాను స్థాపించి దేశవ్యాప్తంగా గ్యాస్ పైప్‌లైన్ల ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. తర్వాత ఐటీ రంగంపై ఉన్న ఆసక్తితో హెచ్‌సీఎల్ గ్రూప్‌లోనూ కొంత కాలం పని చేశారు.

కేశోరామ్ చైర్‌పర్సన్ మృతి: కేశోరామ్ ఇండస్ట్రీస్ చైర్‌పర్సన్ మంజుశ్రీ ఖైతాన్ (65) కన్నుమూశారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె గురువారం కోల్‌కతాలోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు. అసాధారణ నాయకత్వం, దాతృత్వంతో ఆమె కేశోరామ్ ఇండస్ట్రీస్‌ను తీర్చిదిద్దారని బీకే బిర్లా గ్రూప్ ఒక ప్రకటనలో తెలిపింది.

జెట్ నరేశ్ గోయల్ భార్య కూడా: జెట్ ఎయిర్‌వేస్ వ్యవస్థాపకుడు నరేశ్ గోయల్ భార్య అనితా గోయల్ (70) గురువారం మరణించారు. కొద్ది కాలంగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె గురువారం ముంబైలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్ను మూశారు. మెరైన్ లైన్ ప్రాంతంలోని చందన్‌వాడి స్మశాన వాటికలో గురువారం ఆమె అంత్యక్రియలు ముగిశాయి.

హైదరాబాద్‌లో రూ.40 కోట్లతో కొత్త ప్లాంట్

దీసావాలా రబ్బర్ ఇండస్ట్రీస్

హైదరాబాద్: రబ్బర్ సీలింగ్ రింగ్స్, రబ్బర్ గ్యాస్కెట్స్ తయారీ సంస్థ దీసావాలా రబ్బర్ ఇండస్ట్రీస్ (డీఆర్ఐ) హైదరాబాద్ సమీపంలోని కాళ్లకల్‌లో రూ.40 కోట్లతో కొత్త ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. వచ్చే ఏడాది ఈ ప్లాంట్ వాణిజ్యపరంగా అందుబాటులోకి రానుందని డీఆర్ఐ సహ వ్యవస్థాపకుడు, ఎండీ హునేద్ దీసావాలా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ముర్తజా దీసావాలా తెలిపారు. కంపెనీ ఇప్పటికే బాలానగర్‌లో మూడు ప్లాంట్లను నిర్వహిస్తుండగా తాజాగా కాళ్లకల్‌లో రూ.40 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన నాలుగో ప్లాంట్‌ను ప్రారంభించిందన్నారు. ఈ ప్లాంట్ అందుబాటులోకి రావటంతో కంపెనీ రోజువారీ ఉత్పత్తి సామర్థ్యం 7-8 టన్నుల నుంచి 25 టన్నులకు పెరిగిందని పేర్కొన్నారు. అయితే భవిష్యత్ డిమాండ్‌ను అందిపుచ్చుకోవటానికి ఇక్కడే ఐదో ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గడచిన ఆర్థిక సంవత్సరంలో కంపెనీ రూ.100 కోట్ల టర్నోవర్‌ను నమోదు చేసిందని, వచ్చే రెండేళ్లలో ఇది రూ.250 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు.

స్పోర్ట్స్

నేటి మ్యాచ్ | రాత్రి 7.30 గం. | వేదిక: ముంబై
ముంబై X లఖ్‌నవూ

అల్విదా.. సునీల్ ఛెత్రి



వచ్చే నెల 6న చివరి ఫుట్‌బాల్ మ్యాచ్

న్యూఢిల్లీ: భారత్‌లో ఫుట్‌బాల్‌కు ఎనలేని ఖ్యాతి తీసుకువచ్చిన సూపర్‌స్టార్, కెప్టెన్ సునీల్ ఛెత్రి రెండు దశాబ్దాల అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలకనున్నాడు. జూన్ 6న కువైట్‌తో జరిగే ఫిఫా వరల్డ్‌కప్ క్వాలిఫయర్ మ్యాచ్ అతడికి చివరిది కానుంది. ఈమేరకు అతడు ఎక్స్‌లో ఓ వీడియో విడుదల చేశాడు. '19 ఏళ్ల కెరీర్‌లో ఎన్నో మధుర జ్ఞాపకాలు. ఒత్తిడి, బాధ్యతలు, అంతులేని ఆనందం ఇలా ఎన్నో భావోద్వేగాలను అనుభవించాను. ఇన్నేళ్లపాటు భారత్‌కు ఆడతానని అనుకోలేదు. ఇక నా రిటైర్మెంట్ నిర్ణయాన్ని తల్లి, భార్యతో పంచుకున్నప్పుడు వారు కంటతడి పెట్టుకున్నారు' అని 39 ఏళ్ల ఛెత్రి తెలిపాడు. సిక్కింకు చెందిన ఈ స్టార్ ఆటగాడు 1984లో హైదరాబాద్‌లో జన్మించాడు. 2005లో జాతీయ జట్టు తరఫున అరంగేట్రం చేయగా, ఆడిన 150 మ్యాచ్‌ల్లో 94 గోల్స్ చేశాడు. ప్రస్తుతం ఫుట్‌బాల్‌లో కొనసాగుతున్న ఆటగాళ్లలో క్రిస్టియానో రొనాల్డో (128), మెస్సీ (106) తర్వాత ఛెత్రివే అత్యధిక గోల్స్ కావడం విశేషం. అతడి సారథ్యంలో భారత ఫుట్‌బాల్ జట్టు ఆసియన్ ఫుట్‌బాల్ కాన్ఫెడరేషన్ చాలెంజ్ కప్, శాఫ్ చాంపియన్‌షిప్, ఇంటర్‌కాంటినెంటల్ కప్‌లను దక్కించుకుంది. మరోవైపు ఛెత్రి రిటైర్మెంట్‌పై వివిధ క్రీడాప్రముఖులు సోషల్‌మీడియాలో స్పందిస్తూ అతడి సేవలను కొనియాడారు.


ఫైనల్లో నిఖత్

ఎలోర్డా కప్



అస్థానా (కజకిస్థాన్): వరల్డ్ చాంపియన్ నిఖత్ జరీన్ ఎలోర్డా కప్‌లో తన జోరు కొనసాగిస్తూ ఫైనల్‌కు దూసుకుపోయింది. అలాగే మరో ముగ్గురు భారత బాక్సర్లు మీనాక్షి (48కి.), అనామిక (50కి.), మనీషా (60కి.) కూడా టైటిల్ ఫైట్‌కు చేరడం ద్వారా కనీసం రజత పతకం ఖరారు చేశారు. గురువారం జరిగిన మహిళల 52 కేజీల సెమీఫైనల్లో తెలంగాణ బాక్సర్ జరీన్ 5-0తో కజకిస్థాన్‌కు చెందిన టొమిరిస్ మిర్జాకుల్‌పై సంచలన విజయం సాధించింది. అలాగే 48 కి.లలో మీనాక్షి 5-0తో గుల్నాజ్ (కజకిస్థాన్), 60 కి.లలో మనీషా 5-0తోనే అసెమ్ (కజకిస్థాన్)ను చిత్తు చేసి టైటిల్ ఫైట్‌కు చేరారు. 50 కి. విభాగం సెమీస్‌లో కజక్ ప్రత్యర్థి గుల్నార్ డిస్‌క్వాలిఫై కావడంతో అనామిక ఫైనల్లో అడుగుపెట్టింది. ఇక..సోను (63కి.), మంజూ (66కి.) సెమీస్ ఫైనల్లో ఓడి కాంస్య పతకాలతో సరిపెట్టుకున్నారు.

రిటైరయితే కొంతకాలం కనిపించను..



బెంగళూరు: కెరీర్‌కు వీడ్కోలు పలికిన తర్వాత కొంతకాలంపాటు ఎవరికీ కనిపించనని కోహ్లీ అన్నాడు. గతం గురించిన బాధ ఉండకూడదన్న కాంక్షే తనను నడిపిస్తోందని ఆర్సీబీ పోస్టు చేసిన వీడియోలో కోహ్లీ చెప్పాడు. 'ఏదో ఒకరోజు కెరీర్‌కు ముగింపు పలకక తప్పదు. దానినే తల్చుకుంటూ కూర్చునేకంటే చేయాల్సిన దానిపై దృష్టి పెడితే మంచిది. అందుకే 'ఫలానా రోజు అలా చేసుంటే బాగుండేది' అని అనుకుంటూ కెరీర్‌ను ముగించదల్చుకోలేదు. అసలు నేను వాటిని పట్టించుకోను. క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత కొంతకాలంపాటు ఎవరికీ కనిపించను. సుదీర్ఘవిరామం తీసుకొంటా. ఆ తర్వాతే భవిష్యత్తు గురించి ఆలోచిస్తా. అందుకే ఆడినంత కాలం అత్యుత్తమ ప్రదర్శన చేయాలనే కోరుకొంటా. ఆ స్ఫూర్తితోనే ముందుకు సాగుతాన'ని విరాట్ చెప్పాడు.

క్వార్టర్స్‌లో సాత్విక్ జోడీ

థాయ్‌లాండ్ ఓపెన్ బ్యాడ్మింటన్

బ్యాంకాక్: డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి, యువ షట్లర్ మీరాబ లువాంగ్ థాయ్‌లాండ్ ఓపెన్ క్వార్టర్స్‌కు దూసుకెళ్లారు. గురువారం జరిగిన ప్రీ క్వార్టర్స్‌లో సాత్విక్-చిరాగ్ జంట 21-16, 21-11తో చైనా ద్వయం జింగ్ వి హన్-గ్జి హవ్ నాన్‌పై వరుస గేముల్లో నెగ్గింది. మహిళల్లో అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో గెలిచి ముందంజ వేసింది. అయితే, రితుపర్ణ పండా-శ్వేతపర్ణ పండా జోడీ ఓటమిపాలైంది. పురుషుల సింగిల్స్‌లో మీరాబ 21-14, 22-20తో మ్యాడ్స్ (డెన్మార్క్)పై పోరాడి గెలిచాడు. కానీ, మహిళల విభాగంలో అస్మిత 15-21, 21-12, 12-21తో హన్ యి (చైనా) చేతిలో పరాజయం పాలైంది.

ఉప్పల్ మ్యాచ్ వర్షార్పణం

సన్‌రైజర్స్ ప్లేఆఫ్స్‌కు
టైటాన్స్‌తో మ్యాచ్ రద్దు



హైదరాబాద్: నాలుగేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్లేఆఫ్స్‌లో ప్రవేశించింది. మరోవైపు ఈ జట్టు మెరుపు ప్రదర్శనను చూడాలనుకుని తరలివచ్చిన ఫ్యాన్స్ ఉత్సాహాన్ని వరుణుడు నీరుగార్చాడు. గురువారం గుజరాత్ టైటాన్స్‌తో ఉప్పల్ స్టేడియంలో జరగాల్సిన ఈ మ్యాచ్ ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయింది. టాస్ వేయడం కూడా వీలు కాలేదు. అయితే 15 పాయింట్లతో రైజర్స్ మాత్రం బెర్త్ ఖరారు చేసుకుంది. ఇప్పటికే కోల్‌కతా, రాజస్థాన్ జట్లు ప్లేఆఫ్స్‌కు చేరిన విషయం తెలిసిందే. మధ్యాహ్నం నుంచే ఎడతెరిపిలేని భారీ వర్షంతో ఉప్పల్ మైదానం తడిసిముద్దయ్యింది. గ్రౌండ్‌స్టాఫ్ పిచ్‌తో పాటు దాదాపు అంతటా కవర్లు కప్పి ఉంచారు. సాయంత్రం 6.45కు వర్షం తగ్గినట్టు కనిపించడంతో కవర్లు తీసేసినా.. కాసేపటికే దట్టమైన మేఘాలు కమ్మడంతో వాటిని యథాస్థానంలో ఉంచాల్సి వచ్చింది. ఇక రాత్రి 7.30కు పూర్తిగా తగ్గడంతో పిచ్‌పై కవర్‌ను కూడా తీసేయడంతో కాస్త ఆలస్యంగానైనా మ్యాచ్ జరుగుతుందన్న అంచనా ఏర్పడింది. రాత్రి 8 గంటలకు టాస్ వేసేందుకు కూడా నిర్ణయించి మ్యాచ్‌ను 8.15కు ఆరంభించాలని చూశారు. కానీ ఆ సంబరం ఎంతో సేపు లేకుండా రాత్రి 7.50 నుంచి తిరిగి ఆరంభమైన వర్షం ఇక తెరిపినివ్వలేదు. దీంతో రాత్రి 10.11కు అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టుగా ప్రకటించారు.

టాప్-2లో ఉండాలంటే..

ప్లేఆఫ్స్‌లో ప్రవేశించిన సన్‌రైజర్స్‌కు టాప్-2లో నిలిచే అవకాశం కూడా ఉంది. ప్రస్తుతం కోల్‌కతా నైట్‌రైడర్స్ 19 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఆ జట్టు స్థానానికి వచ్చిన ప్రమాదమేమీలేదు. ఇక కేకేఆర్‌పై తమ చివరి మ్యాచ్‌లో నెగ్గితే రాజస్థాన్ 18 పాయింట్లతో రెండో స్థానం ఖరారు చేసుకుంటుంది. అప్పుడు హైదరాబాద్ చేసేదేమీ లేదు. కానీ ఆ మ్యాచ్‌లో ఆర్ఆర్ ఓడిపోయి.. ఇటు ఎస్ఆర్‌హెచ్ తమ ఆఖరి మ్యాచ్‌లో పంజాబ్‌ను ఓడిస్తే 17 పాయింట్లతో టాప్-2లో ఉండొచ్చు.

టిక్కెట్ల డబ్బు వాపసు

మ్యాచ్ రద్దయిన నేపథ్యంలో టిక్కెట్ల డబ్బును వెనక్కి ఇవ్వనున్నారు. ఈ మ్యాచ్‌కు మొత్తం 33,781 మంది ప్రేక్షకులు హాజరయ్యారు. ప్రేక్షకులు తమ టిక్కెట్లను సన్‌రైజర్స్ యాజమాన్యం తెలిపిన కేంద్రాల్లో ఇచ్చిన తర్వాత..బుకింగ్ ఫీజు, ఇతరత్రా పన్నులుపోను మిగతా మొత్తాన్ని తిరిగి చెల్లిస్తారు.

ఢిల్లీ అవుట్

లఖ్‌నవూకూ ఆశల్లేవ్
నాలుగో బెర్త్‌కు చెన్నై-ఆర్సీబీ పోటీ

సన్‌రైజర్స్ హైదరాబాద్, గుజరాత్ టైటాన్స్ మధ్య జరగాల్సిన మ్యాచ్ వర్షంతో రద్దు కావడంతో ఢిల్లీ క్యాపిటల్స్ కథ ముగిసింది. ఇప్పటిదాకా సాంకేతికంగా రేసులో ఉన్న ఈ జట్టు ఉప్పల్ ఫలితంతో అధికారికంగానే ప్లేఆఫ్స్ నుంచి వైదొలిగింది. ఢిల్లీ 14 లీగ్ మ్యాచ్‌లాడి 14 పాయింట్లతోనే ఉంది. అలాగే రాహుల్ నేతృత్వంలోని లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌కు కూడా అవకాశం లేదు. వీరికి మరో మ్యాచ్ ఉంది. ప్రస్తుతం ఆ జట్టు 12 పాయింట్లతో ఉన్నా నెట్ రన్‌రేట్ దయనీయంగా ఉంది. ఎల్ఎస్‌జీ చివరి లీగ్ మ్యాచ్‌ను గెలిచినా 14 పాయింట్లతోనే ఉంటుంది. ఈ జట్టుకన్నా చెన్నై-బెంగళూరు మెరుగైన స్థితిలో ఉన్నాయి. ఈ రెండు జట్ల మధ్యే నాలుగో బెర్త్ తేలనుంది. శనివారం బెంగళూరులో ఈ మ్యాచ్ జరుగుతుంది. సీఎస్‌కే 14 పాయింట్లతో, ఆర్సీబీ 12 పాయింట్లతో ఉన్నాయి. ఇందులో చెన్నై గెలిస్తే నేరుగా ప్లేఆఫ్స్‌కు వెళుతుంది. అటు ఆర్సీబీకి కేవలం గెలవడమే సరిపోదు. ఎందుకంటే డుప్లెసి సేన గెలిస్తే 14 పాయింట్లతోనే ఉంటుంది కాబట్టి వారి నెట్ రన్‌రేట్ చెన్నై కంటే మెరుగ్గా ఉండాల్సిందే. అంటే.. సీఎస్‌కేపై 18+ రన్స్ తేడాతోనైనా గెలవాలి లేదా ఛేజింగ్ అయితే లక్ష్యాన్ని 18.1 ఓవర్లలోపే (తొలి ఇన్నింగ్స్ స్కోరు 200 అనుకుంటే) ముగించాల్సి ఉంటుంది. అప్పుడే రెండు జట్లకు 14 పాయింట్లున్నా ఆర్సీబీ ముందుకెళుతుంది. అయితే ఈ మ్యాచ్‌కు కూడా వరుణుడి నుంచి ముప్పు పొంచి ఉంది. అదే జరిగితే 15 పాయింట్లతో చెన్నై ప్లేఆఫ్స్‌కు వెళుతుంది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.ర‌రే
కోల్‌కతా	13	9	3	1	19	1.428
రాజస్థాన్	13	8	5	0	16	0.273
హైదరాబాద్	13	7	5	1	15	0.406
చెన్నై	13	7	6	0	14	0.528
ఢిల్లీ	14	7	7	0	14	-0.377
బెంగళూరు	13	6	7	0	12	0.387
లఖ్‌నవూ	13	6	7	0	12	-0.787
గుజరాత్	14	5	7	2	12	-1.063
పంజాబ్	13	5	8	0	10	-0.347
ముంబై	13	4	9	0	8	-0.271

డబుల్స్, సింగిల్స్ బరిలో శ్రీజ

పారిస్ ఒలింపిక్స్ జట్టుకు ఎంపిక



న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో తలపడే పురుషులు, మహిళల టేబుల్ టెన్నిస్ జట్లకు వెటరన్ శరత్ కమల్, వరల్డ్ నెం.24 మనికా బాత్రా సారథ్యం వహించనున్నారు. అంతర్జాతీయ టీటీలో దూసుకొస్తున్న తెలుగు క్రీడాకారిణి ఆకుల శ్రీజ తొలిసారి విశ్వ క్రీడల జట్టులో చోటు దక్కించుకుంది. 25 ఏళ్ల హైదరాబాదీ మహిళల టీమ్, సింగిల్స్ విభాగాల్లో బరిలో దిగనుంది. పురుషుల జట్టులో శరత్‌గాక హర్మీత్ దేశాయ్, మానవ్ ఠక్కర్‌కు స్థానం లభించింది. మహిళల్లో మనికా, శ్రీజతోపాటు అర్చనా కామత్‌కు చోటు కల్పించారు. పురుషుల్లో సాథియన్, మహిళల్లో ఐహిక ముఖర్జీలను ప్రత్యామ్నాయ ప్లేయర్లుగా ఎంపిక చేశారు. పురుషుల సింగిల్స్‌లో శరత్, హర్మీత్, మహిళల సింగిల్స్‌లో మనిక, శ్రీజ తలపడతారు.

క్రికెట్ నా రక్తంలోనే ఉంది!

స్ప్రింట్ దిగ్గజం బోల్ట్



న్యూఢిల్లీ: క్రికెట్ తన రక్తంలోనే ఉందని దిగ్గజ స్ప్రింటర్ ఉసేన్ బోల్ట్ అన్నాడు. వచ్చే నెలలో జరగనున్న టీ20 వరల్డ్‌కప్‌కు బోల్ట్ ప్రచారకర్తగా వ్యవహరిస్తున్నాడు. 'నాన్న క్రికెట్‌కు వీరాభిమాని. అలా క్రికెట్ నా రక్తంలోనే ఉంది. చిన్నప్పుడు పేస్ బౌలర్ కావాలని అనుకొన్నా. కానీ, అది నెరవేర లేద'ని బోల్ట్ చెప్పాడు. పాకిస్థాన్ మాజీ పేసర్ వసీం అక్రమ్ ఇన్‌స్వింగ్ యార్కర్లు ఇప్పటికీ తనకు గుర్తున్నాయని బోల్ట్ చెప్పాడు. లారా, సచిన్ టెండూల్కర్ లాంటి దిగ్గజాలను ఎంతో అభిమానిస్తానని తెలిపాడు. ప్రస్తుత తరంలో కోహ్లీ అంటే ఎంతో ఇష్టమని బోల్ట్ చెప్పాడు.

నితీష్ @15 లక్షలు

ఏపీఎల్ వేలంలో గోదావరి టైటాన్స్ సొంతం



విశాఖపట్నం (స్పోర్ట్సు): ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్-3 టోర్నీ క్రికెటర్ల వేలం గురువారం ఇక్కడ నిర్వహించారు. విశాఖకు చెందిన ఐపీఎల్ స్టార్ కె. నితీష్‌కుమార్‌రెడ్డి ఏపీఎల్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. రూ.15.6 లక్షలకు మార్లిన్ గోదావరి టైటాన్స్ జట్టు నితీష్‌ను దక్కించుకొంది. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్‌కు ఆడుతున్న నితీష్..అద్భుత ఆటతీరును కనబరుస్తున్నాడు.

వచ్చేనెల 30 నుంచి టోర్నీ..: ఏపీఎల్ సీజన్-3 వచ్చే నెల 30 నుంచి జరగనుంది. విశాఖలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియం, కడప క్రికెట్ స్టేడియాలు వేదికలుగా జూలై 31 వరకు టోర్నీ నిర్వహిస్తారు. బెజవాడ టైగర్స్, ఉత్తరాంధ్ర లయన్స్, గోదావరి టైటాన్స్, రాయలసీమ కింగ్స్, వైజాగ్ వారియర్స్, కోస్టల్ రైడర్స్ జట్లు తలపడతాయి.

సహకార సంఘాలకు ఎన్నికలు

» పదవీ కాలం ముగిసిన సంఘాలకు నిర్వహణ: తుమ్మల

హైదరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): పదవీ కాలం ముగిసిన రాష్ట్రంలోని అన్ని రకాల సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. అలాగే, అకాల వర్షాల వల్ల ఏప్రిల్, మే నెలల్లో పంట నష్టపోయిన రైతులకు త్వరితగతిన పరిహారం చెల్లించేందుకు చొర వ తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశమైన మంత్రి తుమ్మల పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. పంట నష్టపోయిన రైతులకు ఇప్పటికే రూ.15కోట్ల మేర పరిహారాన్ని చెల్లించామన్నారు. ఏప్రిల్, మే నెలల్లో పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించేందుకు అవసరమైన వివరాలను త్వరితగతిన అందించాలని ఆదేశించారు. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన సమావేశాలు నిర్వహించి పంటల బీమా పథకం అమలుపై ఆదర్శ రైతు లు, రైతు సంఘాల ప్రతినిధుల అభిప్రాయాలను సేకరించాలన్నారు. వరి పొలాల్లోనే వరి కొయ్యలను కాల్చకుండా రైతులకు అవగాహన కల్పించాలని, వరికొయ్యలను కాల్చినవారికి జరిమానాలు విధించాలని ఆదేశించారు.

ఖర్గేకు కనీస అవగాహన లేదు: విశ్వేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, మే 16(ఆంధ్రజ్యోతి): ఐదు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు సామాజిక అవసరాలపై కనీస అవగాహన లేదని బీజేపీ సీనియర్ నేత కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే పేదలకు ఇప్పుడిస్తున్న 5 కిలోలకు బదులు 10 కిలోల బియ్యం పంపిణీ చేస్తామంటూ ఖర్గే చేసిన ప్రకటనపై కొండా స్పందించారు. సమాజం అవసరాలు ఏంటో కూడా తెలియకుండ ఖర్గే ప్రకటనలు చేయడం బాధాకరమన్నారు. నలుగురైదుగురు సభ్యులున్న ఒక కుటుంబానికి ఏడాదికి సగటున 80 కిలోల బియ్యం అవసరమని, కాంగ్రెస్ 120 కిలోలు ఇస్తామంటోందని పేర్కొన్నారు.

మోదీ వద్ద కేసీఆర్ మోకరిల్లారు: మహేందర్

రాజకీయ భవిష్యత్తు కోసం ప్రధాని మోదీ వద్ద కేసీఆర్ మోకరిల్లారని కాంగ్రెస్ నేత కేకే మహేందర్‌రెడ్డి మండిపడ్డారు. లోకసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ నేతలే బీజేపీకి ఓటు వేయాలని బహిరంగంగా ప్రచారం చేశారని విమర్శించారు. కవితను జైలు నుంచి విడిపించుకోవడానికి కేసీఆర్, బీజేపీ మధ్య లోపాయికారి ఒప్పందం కుదిరిందని, ఇందుకు ఆధారాలు తన వద్ద ఉన్నాయన్నారు. కేసీఆర్ కొడుకు కాకపోతే కేటీఆర్ ఎవరు? కౌన్.. కిస్కా..అని వ్యాఖ్యానించారు. కరీంనగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిశాల రాజేందర్‌రావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందే బీజేపీతో బీఆర్ఎస్ కుమ్మక్కైందని ఆరోపించారు. కేటీఆర్ అంటే కల్వకుంట్ల థర్డ్ క్లాస్ రామారావు అని, సిరిసిల్లకు ఆయన వలసపక్షి అని విమర్శించారు.

లాసెట్‌కు 49,671 దరఖాస్తులు

హైదరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): లాసెట్ దరఖాస్తుల సంఖ్య ఈసారి భారీగా పెరిగింది. దీంతో పరీక్ష సెషన్లను కూడా పెంచారు. గతేడాది లాసెట్‌కు 43,704 దరఖాస్తులు రాగా.. ఈ ఏడాది ఇప్పటికే 49,671 దరఖాస్తులు దాఖలయ్యాయి. అంటే దాదాపు 6 వేల వరకు ఎక్కువగా వచ్చాయి. రూ.2 వేల ఆలస్య రుసుంతో ఈనెల 20 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశముంది. ఇప్పటికే ప్రకటించిన షెడ్యూల్ మేరకు జూన్ 3న లాసెట్ పరీక్షలను రెండు సెషన్లలో పరీక్షలను నిర్వహించాల్సి ఉంది. తొలి సెషన్ పరీక్షలను ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు, రెండో సెషన్‌ను మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు నిర్వహించాలి. అయితే.. దరఖాస్తులు పెరగడంతో 3 సెషన్లలో పరీక్షలను నిర్వహించనున్నట్లు సెట్ కన్వీనర్ విజయలక్ష్మి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పైన పేర్కొన్న రెండు సెషన్లతో పాటు, అదనంగా సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు మూడో సెషన్ పరీక్షలను నిర్వహించనున్నారు.

కవిత బెయిల్ పై విచారణ 24కు వాయిదా

న్యూఢిల్లీ, మే 16 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం విధానం కుంభకోణంలో అరెస్టయి తిహాడ్ జైలులో ఉన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణను గురువారం ఢిల్లీ హైకోర్టు ఈ నెల 24కు వాయిదా వేసింది. ఆమె బెయిల్ పిటిషన్‌పై వైఖరి చెప్పాలని సీబీఐకి నోటీసులు జారీ చేసింది. తన అరెస్టు అక్రమమంటూ ఆమె దాఖలు చేసిన పిటిషన్‌పైనా సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. సీబీఐ కేసులో ట్రయల్ కోర్టు బెయిల్ నిరాకరించడాన్ని, ఈడీ కస్టడీలో ఉన్న తనను రిమాండ్‌కు పంపడాన్ని సవాల్ చేస్తూ కవిత హైకోర్టులో రెండు వేర్వేరు పిటిషన్లను దాఖలు చేశారు. మనీలాండరింగ్ కేసులో ఈడీ అరెస్టు చేసిన తరువాత జ్యూడీషియల్ కస్టడీలో ఉన్న తనను మళ్లీ సీబీఐ విచారించేందుకు ట్రయల్ కోర్టు ఉత్తర్వులు ఇవ్వడాన్నీ ఆమె సవాలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ స్వర్ణకాంత శర్మ ధర్మాసనం విచారణ జరిపింది. కవిత తరఫు న్యాయవాది విక్రమ్ చౌదరి వాదనలు వినిపిస్తూ ఆమె అరెస్ట్, రిమాండ్ అక్రమమని చెప్పారు. దీనిపై ప్రతివాది అయిన సీబీఐకి నోటీసులు ఇవ్వాలా అని న్యాయమూర్తి ప్రశ్నించడంతో ఇవ్వాలని ఆయన కోరారు. దీంతో కవిత పిటిషన్లపై స్పందించాలని సీబీఐకి న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. ఈడీ, సీబీఐ కేసులను కూడా ఒకే రోజు చేపడుతామని పేర్కొంటూ విచారణను 24కు వాయిదా వేశారు.

కులగణన తర్వాతే స్థానిక ఎన్నికలు: జాజుల

పంజాగుట్ట, మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సమగ్ర కులగణన జరిగిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలు నిర్వహిస్తే తాము రాజకీయంగా తీవ్రంగా నష్టపోతామన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లుగా తెలుస్తోందని, అయితే సమగ్ర కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే ఈ ఎన్నికలు నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డికి ఆయన విజ్ఞప్తి చేశారు.

నిర్మల్‌లో నకిలీ వైద్యుల గుట్టురట్టు

నిర్మల్, మే 16 (ఆంధ్రజ్యోతి): నిర్మల్‌లో నకిలీ వైద్యుల గుట్టురట్టయింది. ఎలాంటి అర్హత లేకపోయినా స్పెషలిస్టు వైద్యులుగా చలామణీ అవుతున్న పది మందిపై అధికారులు కేసులు నమోదు చేశారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్, తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ అధికారులు సంయుక్తంగా నిర్మల్‌లోని పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో గురువారం తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి అర్హతలు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా స్పెషలిస్ట్ డాక్టర్లుగా చెప్పుకుంటున్న 10మందిని ఈ తనిఖీల్లో గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు.

జూనియర్ ఎన్టీఆర్ ఇంటి స్థలంపై వివాదం

» హైకోర్టులో పిటిషన్

హైదరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): తన ఇంటి స్థలంపై వివాదం తలెత్తడంతో సినీ హీరో జూనియర్ ఎన్టీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీలోని 681 చదరపు గజాల స్థలం విషయమై సమస్య తలెత్తింది. తాను ఆ స్థలాన్ని సుంకు గీత అనే మహిళ నుంచి 2003లో కొనుగోలు చేశానని, చట్టప్రకారం అన్ని అనుమతులు పొంది అదే ఏడాది ఇంటి నిర్మాణం చేపట్టానని జూనియర్ ఎన్టీఆర్ చెబుతున్నారు. కానీ ఆ భూమిని ఎన్టీఆర్‌కు అమ్మిన వ్యక్తులు దానిని 1996లోనే తమ వద్ద తనాఖా పెట్టి రుణాలు పొందారంటూ ఎస్‌బీఐ, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్, ఇండస్‌ఇండ్, బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంకులు సర్ఫేసీ యాక్ట్ కింద డెట్ రకవరీ ట్రైబ్యునల్ (డీఆర్‌టీ)ను ఆశ్రయించాయి. విచారణ జరిపిన డీఆర్‌టీ.. బ్యాంకులకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. బ్యాంకుల నోటీసులను సవాల్ చేస్తూ తొలుత డీఆర్‌టీలో ఎన్టీఆర్ పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు విన్న డీఆర్‌టీ ఆ స్థలంపై బ్యాంకులకే హక్కులుంటాయంటూ తీర్పు ఇచ్చింది. దాంతో ఎన్టీఆర్ ఫిర్యాదు మేరకు భూమి అమ్మిన గీతపై కేసు నమోదు అయింది. మరోవైపు డీఆర్‌టీ తీర్పుపై ఎన్టీఆర్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ జే.శ్రీనివాస్‌రావు ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. డీఆర్‌టీ ఆర్డర్ కాపీ అందుబాటులో లేకపోవడంతో సమయం కావాలని జూనియర్ ఎన్టీఆర్ తరఫు న్యాయవాది కోరారు. తదుపరి విచారణను వెకేషన్ బెంచ్ ముందు పోస్టు చేయాలని విజ్ఞప్తి చేసినా అందుకు ధర్మాసనం నిరాకరించింది. విచారణను జూన్ 6కు వాయిదా వేసింది. కేసుకు సంబంధించిన అన్ని వివరాల డాక్యుమెంట్లను జూన్ 3లోగా అందజేయాలని ఆదేశించింది.

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో మళ్లీ భూమ్

స్థలాలు, ఓపెన్ ప్లాట్లు, అపార్ట్‌మెంట్లలోని ప్లాట్లు... ఇలా వేటికి ఎంత సవరించాలనేది శాస్త్రీయంగా నిర్ధారణ జరగాలని, ఈ విషయంలో రిజిస్ట్రేషన్ల శాఖ నిబంధనలను పక్కాగా పాటించాలని నిర్దేశించారు. రాష్ట్ర రాబడి పెంపుతోపాటు స్థిరాస్తి, నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించేందుకు వీలుగా భూముల మార్కెట్ ధరల సవరణ జరగాలని సూచించారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మన దగ్గర స్టాంప్ డ్యూటీ ఎంత ఉందో పరిశీలించాలని, దీనిని తగ్గించాలా.. పెంచాలా.. అనే దానిని అధ్యయనం చేయాలని ఆదేశించారు. సామాన్యులకు, చిన్న నిర్మాణాలకు ఇసుక కొరత రాకుండా చూడాలని, ఇసుక ఆదాయం పెరగాలంటే అక్రమ రవాణాను, లీకేజీలను అరికట్టాలని ఆదేశించారు.

గత ఏడాది ఆదాయం ఆశాజనకంగా లేదు

గతేడాది వచ్చిన ఆదాయం ఆశాజనకంగా లేదని సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై ప్రతి నెలా ఆదాయ పెంపును సమీక్షించుకోవాలంటూ అధికారులను అప్రమత్తం చేశారు. బడ్జెట్‌లో పొందుపర్చిన వార్షిక లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఏనెలకానెలా టార్గెట్‌ను నిర్దేశించుకుని రాబడిని సాధించేందుకు కృషి చేయాలని నిర్దేశించారు. ప్రధానంగా రాష్ట్రానికి రాబడి తెచ్చి పెట్టే జీఎస్టీలో ఎగవేతలు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. జీఎస్టీ వసూళ్లను పెంచేందుకు పక్కాగా ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్, ఆడిటింగ్ జరగాలని, జీఎస్టీ ఎగవేతదారులు ఎంతటి వారైనా ఉపేక్షించకుండా, నిక్కచ్చిగా పన్ను వసూలు చేయాలని తేల్చి చెప్పారు. వాణిజ్య పన్నుల శాఖలో ఇంతకాలం జరిగిన పొరపాట్లు పునరావృతం కారాదని, జీఎస్టీ రిటర్న్స్ పేరిట వెలుగులోకి వస్తున్న అవినీతి, అక్రమాలకు తావు లేకుండా వ్యవహరించాలని అధికారులను హెచ్చరించారు. గత ఆర్థిక సంవత్సరంలో ఎన్నికల సీజన్‌లో మద్యం అమ్మకాలు ఎక్కువగా జరిగినా.. లక్ష్యానికి అనుగుణంగా ఆదాయం పెరగకపోవటానికి కారణాలను సీఎం ఆరా తీశారు. అక్రమ మద్యం రవాణా, పన్ను ఎగవేతలు లేకుండా కట్టుదిట్టంగా చర్యలు చేపట్టాలని, శాఖాపరమైన లోసుగులు లేకుండా వ్యవహరించాలని ఆదేశించారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉద్యోగుల కొరత లేకుండా సర్దుబాటు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఇప్పటికీ చాలాచోట్ల కార్యాలయాలు అద్దె భవనాల్లో ఉన్నాయని, రిజిస్ట్రేషన్లకు వచ్చే వాళ్లు చెట్ల కింద నిలబడే ఉంటున్నారనే అంశం సమావేశంలో చర్చకు వచ్చింది. దాంతో, ప్రజోపయోగానికి సేకరించిన స్థలాలను గుర్తించి.. వాటిలో కొన్నిచోట్ల అధునాతనంగా మోడల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనాలను నిర్మించాలని, అందుకు సన్నాహాలు చేయాలని సీఎం చెప్పారు.

125 వచ్చినా.. అధికారం మాదే

కాంగ్రెస్‌కు మిత్రపక్షాలు మద్దతిస్తాయి.. కేంద్రంలో ఇండియా కూటమిదే ప్రభుత్వం

» బీజేపీకి 250 దాటినా చాన్స్ లేదు
» ఆ పార్టీకి నమ్మకమైన మిత్రులు లేరు
» ఆర్ఎస్ఎస్ అజెండానే బీజేపీ లక్ష్యం
» రిజర్వేషన్ల తొలగింపు, రాజ్యాంగం రద్దు కోసమే '400కు మించి' నినాదం
» నిఘావర్గాల వైఫల్యంతోనే 'పుల్వామా'
» సరిహద్దులపై ఉండాల్సిన నిఘాను ప్రతిపక్షాలపై పెట్టడంతో ఆ ఘటన
» సర్జికల్ స్ట్రైక్స్‌కు ఒక్క ఆధారమూ లేదు
» నేను ఏబీవీపీ పూర్వ విద్యార్థిని.. వాళ్ల సిలబస్ అంతా నాకు తెలుసు
» 'ప్రింట్' ఇంటర్వ్యూలో సీఎం రేవంత్



హైదరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల తర్వాత కేంద్రంలో ఇండియా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని.. కాంగ్రెస్‌కు 125 సీట్లు వచ్చినా సరిపోతుందని, కూటమిలోని భాగస్వామ్యపక్షాలు మద్దతు ఇస్తాయని సీఎం రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి రావాలంటే మాత్రం ఆ పార్టీకి 250కి పైగా సీట్లు రావాల్సి ఉంటుందన్నారు. 'బీజేపీ సొంతంగా మ్యాజిక్ ఫిగర్ (మెజారిటీ) దాటలేకపోతే.. మళ్లీ అధికారాన్ని కైవసం చేసుకునేందుకు ఆ పార్టీకి నమ్మకమైన మిత్రులెవరూ లేరు. కాంగ్రెస్ పరిస్థితి వేరు. మాకు మద్దతు పలికేందుకు అనేక మిత్రపక్షాలు సిద్ధంగా ఉన్నాయి' అని వివరించారు. న్యూస్ వెబ్‌సైట్ 'ప్రింట్‌'కు సీఎం రేవంత్‌రెడ్డి ఇంటర్వ్యూ ఇచ్చారు. బీజేపీ 400కు మించి సీట్ల నినాదంపై స్పందిస్తూ.. రిజర్వేషన్లను తొలగించాలని, రాజ్యాంగాన్ని మార్చాలనే లక్ష్యంతోనే ఈ నినాదాన్ని ఎత్తుకుందని సీఎం ఆరోపించారు. 'బీజేపీకి ఆర్ఎస్ఎస్ తల్లిలాంటిది. తల్లి చెప్పిన మాటలు పిల్లలు పాటిస్తారు. ట్రిపుల్ తలాక్ రద్దు, ఆర్టికల్-370 రద్దు, సీఏఏ, ఎన్నార్సీ వంటివన్నీ ఆర్ఎస్ఎస్ లక్ష్యాలు. వాటిని బీజేపీ నెరవేర్చింది. వీటి తర్వాత రిజర్వేషన్ల తొలగింపును, రాజ్యాంగం రద్దును ఆర్ఎస్ఎస్ లక్ష్యంగా పెట్టుకుంది. వీటిని నెరవేర్చాలంటే లోక్‌సభలో మూడింట రెండు వంతుల సీట్లు అవసరం. అందుకే బీజేపీ 400కిపైగా అనే నినాదాన్ని తీసుకొచ్చింది' అని రేవంత్ విశ్లేషించారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి రావటం దేశంలో ప్రజాస్వామ్యానికే ప్రమాదమన్నారు. తన విద్యార్థి జీవితం ఆర్ఎస్ఎస్ అనుబంధ విద్యార్థి సంఘం ఏబీవీపీతోనే ప్రారంభమైందని, వాళ్ల సిలబస్ ఏమిటో తనకు బాగా తెలుసని చెప్పారు. పాక్ భూభాగంలో సర్జికల్ స్ట్రైక్స్ జరగలేదన్న వ్యాఖ్యలకు తాను కట్టుబడి ఉన్నానని, అది జరిగిందనడానికి ఎలాంటి ఆధారాలు లేవన్నారు. పుల్వామా ఘటన కేంద్ర ప్రభుత్వ వైఫల్యం కాదా? అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. నిఘా వర్గాల వైఫల్యంతోనే ఈ దారుణ ఘటన జరిగిందని, భారత్-పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉండాల్సిన నిఘావర్గాల అధికారులను నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రతిపక్షాలను అంతం చేసేందుకు మోహరించటం వల్లనే పుల్వామా ఘటన జరిగిందని విమర్శించారు.

శత్రువుల ఎంపిక నా చేతుల్లో లేదు

'నాకు శత్రువులు ఉన్నారు. రాజకీయ ప్రత్యర్థులూ ఉన్నారు. శత్రువులు ఎవరుండాలని ఎంపిక చేసుకోవడం నా చేతుల్లో లేదు. పోరాడుతూ ముందుకెళ్లడమే నా పని' అని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ నిఖార్సైన, చాలా తెలివైన వ్యక్తి అని రేవంత్ పేర్కొన్నారు. రాహుల్ గురించి తెలుసుకోవాలంటే ముందుగా అదానీ, అంబానీల గురించి ఆయన ఆలోచనలు ఏవిటో తెలుసుకోవాలన్నారు. తెలంగాణలో పెట్టుబడులకు అదానీని తాను ఆహ్వానించడం తప్పేమీకాదని చెబుతూ.. 'అదానీ మా రాష్ట్రం నుంచి ఏమీ తీసుకెళ్లడం లేదు. నేనే ఆయన పెట్టుబడులు తీసుకుంటున్నా. రాష్ట్రంలోకి పెట్టుబడులు తీసుకురావటం కోసమే అదానీని, ఆయన కుమారుడిని సచివాలయంలో కలిశాను. అందులో తప్పేముంది? వారు భారత పౌరులే కదా!' అని సీఎం పేర్కొన్నారు. ప్రధాని మోదీని బడే భాయ్ (పెద్దన్న) అనడాన్ని సమర్థించుకుంటూ.. దేశంలోని ప్రతీ ముఖ్యమంత్రి దేశ ప్రధానిని పెద్దన్నలాగే భావిస్తారని, ప్రధాన మంత్రి సైతం కుటుంబ పెద్దగా రాష్ట్రాలకు సహకారం అందించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌తో, జాతీయస్థాయిలో బీజేపీతో, మోదీతో తమకు ప్రధానంగా పోటీ ఉందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు.

పీసీసీ ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ సమీక్షా సమావేశం

హైదరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 17 పార్లమెంట్ నియోజకవర్గాల్లో జరిగిన ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయావకాశాలపై టీపీసీసీ ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ సమీక్షించింది. గురువారం గాంధీభవన్‌లో మాజీ ఎమ్మెల్సీ దిలీప్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీతో పాటు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, పీసీసీ ఉపాధ్యక్షుడు వినోద్‌రెడ్డి, మాజీ మంత్రి పుష్పలీల, ఇతర సభ్యులతో పాటు ఆయా నియోజకవర్గ ఇన్‌చార్జీలు పాల్గొన్నారు. ఆయా నియోజకవర్గాల్లో పోలింగ్ సరళి, పార్టీ అభ్యర్థుల పని తీరు, విజయావకాశాలపై సమావేశంలో చర్చించారు.

'విద్యుత్ విచారణ' షురూ!

» యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్లాంట్ల నిర్మాణం, ఛత్తీస్‌గఢ్‌తో ఒప్పందంపై ఫిర్యాదుల స్వీకరణ
» నోటిఫికేషన్ ఇచ్చిన నర్సింహారెడ్డి కమిషన్

హైదరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్లాంట్ల నిర్మాణ పనులను నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టడం, అవసరం లేకున్నా ఛత్తీస్‌గఢ్‌తో విద్యుత్ ఒప్పందం చేసుకోవడం వంటి కారణాలతో జరిగిన నష్టంపై 10 రోజుల్లోగా (ఈ నెల 16 నుంచి) ఫిర్యాదు చేయాలని జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి కమిషన్ కోరింది. ఈ మేరకు గురువారం బహిరంగ ప్రకటన ఇచ్చింది. పోటీ బిడ్డింగ్ ద్వారా కాకుండా నామినేషన్ ప్రాతిపదికన ఛత్తీస్‌గఢ్‌తో విద్యుత్ ఒప్పందం చేసుకోవడం, సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో ప్లాంట్లు కడుతుండగా... దాన్ని కాదని సబ్ క్రిటికల్ టెక్నాలజీతో భద్రాద్రి థర్మల్ ప్లాంట్‌ను కట్టడం, కోల్‌బెల్ట్‌కు 179 నుంచి 388 కిలోమీటర్ల దూరంలో యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణం చేపట్టడంపై ప్రభుత్వం జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి నేతృత్వంలో కమిషన్‌ను ఏర్పాటు చేసిన విషయం విదితమే. ఈ మేరకు ఆయా ఒప్పందాల వల్ల జరిగిన నష్టంపై నివేదించాలని కమిషన్ సూచించింది. ఈ మెయిల్ (coi2024.power@gmail.)కు లేదా కమిషన్ కార్యాలయం, 7వ అంతస్తు, బీఆర్‌కేఆర్ భవన్, ఆదర్శ నగర్, హైదరాబాద్-500004 చిరునామాకు రాతపూర్వక ఫిర్యాదులను 5 లేదా 6 పేజీల్లో పంపాలని కోరారు. ఇక నివేదించే వారు లేదా ఎటువంటి రాజకీయాలతో సంబంధం లేకుండా, వ్యక్తులు లేదా అధికారులను టార్గెట్ చేసుకోకుండా ఫిర్యాదు చేయాలని కమిషన్ కోరింది. ఎవరైనా మౌఖిక సాక్ష్యాలు ఇవ్వాలని భావిస్తే వాటి ఉద్దేశం సూచించాలని, దీని కోసం తగిన సమయం ఇచ్చి, సాక్ష్యం తీసుకుంటామని కమిషన్ పేర్కొంది. కాగా, తెలుగు పత్రికల్లో ఇచ్చిన నోటిఫికేషన్ 3వ పేరాపై పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. దాంట్లో 'నివేదనలకు ఎటువంటి రాజకీయ సమస్యలు లేదా దాడులు లేకుండా సదరు వ్యక్తులు రూఢీపరుచుకోవాలి' అని ఉండడంపై పబ్లిక్ పాలసీ నిపుణుడు దొంతి నర్సింహారెడ్డి, కె.బాబూరావు అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలుగు అనువాదంలో లోపాల వల్ల పెడార్థం వచ్చేలా నోటిఫికేషన్ వచ్చిందని పేర్కొన్నారు. కాగా, ఫిర్యాదులకు 10 రోజులే అవకాశం ఇవ్వడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. కనీసం నెల రోజులైనా సమయం ఇవ్వాలని పలువురు సూచిస్తున్నారు.

బీఆర్ఎస్‌లో ఎమ్మెల్సీ చిచ్చు!

(మొదటిపేజీ తరువాయి)

సొంతం చేసుకుంది. అయితే ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో పాటు ప్రస్తుతం కీలక నేతలు పార్టీని వీడుతున్న నేపథ్యంలో ఎమ్మెల్సీ ఉపఎన్నిక బీఆర్ఎస్ ప్రతిష్ఠకు పరీక్షగా మారింది. దీంతో ఈ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు గులాబీ పార్టీ తీవ్ర కసరత్తు చేస్తోంది.

పల్లా పెత్తనంపై గులాబీ నేతల గుస్సా

జనగామ ఎమ్మెల్యేగా ఎన్నికైన పల్లా రాజేశ్వర్‌రెడ్డి.. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో ఈ ఉప ఎన్నిక జరుగుతుండగా ఈ సీటుపై కన్నేసిన పలువురు బీఆర్ఎస్ నేతలు గ్రౌండ్ వర్క్ చేసుకున్నారు. వరంగల్‌కు చెందిన వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్, కేయూ జాక్ నేత వాసుదేవరెడ్డితోపాటు కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్, నల్లగొండ జిల్లాకు చెందిన గీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్, చెరుకు సుధాకర్ కూడా టికెట్ ఆశించారు. అయితే అధినేత కేసీఆర్ మాత్రం అనూహ్యంగా రాకేశ్‌రెడ్డి పేరును ఖరారు చేశారు. దీంతో వరంగల్, నల్గొండ నేతల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఉద్యమ సమయం నుంచి పని చేస్తున్న తమను కనీసం సంప్రదించకుండా టికెట్ ఖరారు చేయడమేంటని గులాబీ నేతలు గుర్రుగా ఉన్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి తదితరులు తాము సూచించిన వ్యక్తికి టికెట్ ఇవ్వలేదంటూ వాపోతున్నారు. పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు కాపాడుకున్నామని, పల్లా కారణంగానే తమకు అధిష్ఠానం వద్ద ప్రాధాన్యం తగ్గుతోందని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ ఉపఎన్నికలో సమన్వయంపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ నెల 15న తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశానికి పలువురు నేతలు దూరంగా ఉన్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లితోపాటు ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బస్వరాజు సారయ్య, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు నాగుర్ల వెంకటేశ్వర్‌రావు, మర్రి యాదవరెడ్డి తదితరులు ఆ సమావేశానికి గైర్హాజరయ్యారు. వారంతా పలు వ్యక్తిగత కారణాలు చెప్పినా.. అభ్యర్థి ఎంపిక పట్ల అసంతృప్తితోనే దూరంగా ఉన్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇవి అధిష్ఠానంలో ఆందోళన కలిగిస్తున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికపై వీటి ప్రభావం పడే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.

టీఎస్ కాదు ఇక టీజీ.. గెజిట్ జారీ

హైదరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో మోటారు వాహనాల రిజిస్ట్రేషన్ ప్లేట్లపై రాష్ట్ర కోడ్‌గా టీఎస్ స్థానంలో టీజీ రాయాలని ఆదేశిస్తూ కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వ ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖ ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్‌ను ప్రచురించింది. సీరియల్ నంబర్ 29-ఎ కింద వాహనాలపై రిజిస్ట్రేషన్ గుర్తును టీఎస్ నుంచి టీజీగా సవరించినట్లు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు తెలిపింది. ఇకపై వాహనాలను టీజీ పేరుతోనే రిజిస్ట్రేషన్లు చేయాలని పేర్కొంది. తెలంగాణ రవాణా శాఖ మార్చి రెండోవారం నుంచే రాష్ట్ర కోడ్‌గా టీఎస్ స్థానంలో టీజీని మార్చి అమలు చేస్తోంది.

అయ్యో.. 'అమ్మ'..!

తల్లి అనంతలోకాలకు చేరినా.. తెగని ఆస్తి పంచాయితీ



అంబులెన్స్‌లో ఆక్సిజన్‌పై లక్ష్మమ్మ

» కుమారుడు, కుమార్తెల మధ్య గొడవ
» పంపకాలు కొలిక్కి వచ్చినా పైసలిస్తేనే తలకొరివి పెడతానంటూ కొడుకు పట్టు
» ఫ్రీజర్‌లోనే మృతదేహం.. సూర్యాపేట జిల్లాలో ఘటన

నేరేడుచర్ల, మే 16: నవమాసాలు మోసి, పురిటినొప్పులను భరించి.. తమను కని, పెంచిన ఆ తల్లి రుణాన్ని తీర్చుకోకపోగా.. శవం వద్దే ఆస్తి పంపకాల కోసం ఆమె కొడుకు, కూతుళ్లు తగవులాడుకున్న ఉదంతమిది..! చిన్నప్పుడు తల్లి వద్ద మారాం చేసి మరీ తనకు కావాల్సినవి సమకూర్చుకున్న ఆ కొడుకు.. ఇప్పుడు పైసలిస్తేనే తలకొరివి పెడతానంటూ మారాం చేస్తున్నాడు. దీంతో.. కూతుళ్లు తమ ఇళ్లకు వెళ్లిపోగా.. ఆ అమ్మ మృతదేహం రెండ్రోజులుగా ఫ్రీజర్లో ఉండిపోయింది. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం కందులవారిగూడెంలో ఈ దారుణం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కందులవారిగూడేనికి చెందిన వేం వెంకటరెడ్డి, లక్ష్మమ్మ(80) దంపతులకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలున్నారు. చిన్న కుమారుడు గతంలోనే చనిపోయారు. వెంకటరెడ్డి కొన్నేళ్ల క్రితం మృతిచెందారు. ఐదేళ్లుగా లక్ష్మమ్మ నేరేడుచర్లలోని చిన్న కుమార్తె వద్దే ఉంటున్నారు. ఇటీవల ఆమె ఇంట్లో కాలుజారి కింద పడ్డారు. దాంతో ఆమెను మిర్యాలగూడలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. ఆమె పరిస్థితి విషమంగా మారడంతో.. "ఇంటికి తీసుకెళ్లండి. ఆక్సిజన్‌పైనే ఆమె బతుకుతుంది. ఆక్సిజన్ పైపు తీసేస్తే.. చనిపోతుంది" అని వైద్యులు బుధవారం తేల్చిచెప్పారు. దీంతో లక్ష్మమ్మను ఆక్సిజన్‌తోనే చిన్నకుమార్తె తమ ఇంటి వద్దకు తీసుకెళ్లింది. రాత్రి 9గంటలకు ఇంటి ముందు ఉన్న వెంచర్ వద్ద అంబులెన్స్‌ను పార్క్ చేయించగా.. లక్ష్మమ్మ ఆక్సిజన్‌పై అందులోనే ఉండిపోయారు. ఈలోగా లక్ష్మమ్మ కుమారుడు అక్కడికి చేరుకుని.. పెద్దమనుషులతో పంచాయితీ పెట్టించారు. లక్ష్మమ్మను కందులవారిగూడెం తీసుకెళ్తానని చెప్పడంతో.. మిగతా కూతుళ్లు ఆస్తి పంపకాలు తేలే వరకూ అంబులెన్స్ కదిలేది లేదని పట్టుపట్టారు. చివరకు రాత్రి 11 గంటల సమయంలో లక్ష్మమ్మ కన్నుమూశారు. మృతదేహాన్ని కందులవారిగూడెం తరలించినా.. కొడుకు, కూతుళ్ల పంచాయితీ మాత్రం తీరలేదు. లక్ష్మమ్మ గతంలో రూ.21లక్షల మేర పలువురికి అప్పులిచ్చారు. ఆమె ఒంటిపై 20 తులాల బంగారు ఆభరణాలున్నాయి. లక్ష్మమ్మ వైద్య ఖర్చులు భరించిన చిన్నకూతురికి ఆ రూ.21 లక్షల్లోంచి రూ.6 లక్షలు ఇవ్వాలని ఒప్పందం చేసుకున్నారు. మిగతా రూ.15లక్షలను కొడుకు దక్కించుకున్నాడు. 20 తులాల బంగారు ఆభరణాలను ముగ్గురు కూతుళ్లు పంచుకున్నారు. అంతా సవ్యంగా సాగింద నుకున్న తరుణంలో కుమారుడు కొత్త పేచీ పెట్టాడు. తాను అంత్యక్రియల ఖర్చు భరించలేనని, తనకు డబ్బులిస్తేనే తలకొరివి పెడతానని భీష్మించుకు కూర్చున్నాడు. ప్రస్తుతం లక్ష్మమ్మ మృతదేహం కుమారుడి ఇంట్లో ఫ్రీజర్‌లో ఉంది. ఈ పేచీ ఎప్పుడు తెగుతుందోనని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దొడ్డు రకం వడ్లకూ బోనస్ ఇవ్వాలి

» రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసనలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



కరీంనగర్‌లో ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

దొడ్డు రకం వడ్లకూ బోనస్ ఇవ్వాలని, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రైతులకు ఇచ్చిన హామీలనుఅమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపట్టారు. అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కరీంనగర్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, హుజూరాబాద్‌లో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మానకొండూర్‌లో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, చొప్పదండిలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జగిత్యాలలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్, ఆసిఫాబాద్‌లో ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టారు. కోరుట్ల నియోజకవర్గంలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. పెద్దపల్లి, మంథని, రామగుండం, సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గ కేంద్రాల్లో బీఆర్ఎస్ నాయకులు నిరసన దీక్షలు చేపట్టారు. మంచిర్యాల, చెన్నూరులో బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో చేశారు. నల్లగొండ జిల్లాలోని దేవరకొండ, మిర్యాలగూడ, నాగార్జునసాగర్‌లో మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ నిరసనలు చేపట్టారు. భువనగిరి జిల్లాలోని సంస్థాన్ నారాయణపురంలో బీఆర్ఎస్ నేతలు నిరసన చేపట్టారు. వికారాబాద్ జిల్లా ధారూరు మండలంలోని గట్టేపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, పరిగిలో మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి, తాండూరు మండలంలోని చెంగోల్ కొనుగోలు కేంద్రం వద్ద రాజుగౌడ్ ఆధ్వర్యంలో నిరసనలు వ్యక్తం చేశారు. మేడ్చల్ జిల్లాలోని శామీర్‌పేటలోని రైతు సహకార సంఘం ముందు ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గంలోని శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఎమ్మెల్యే సబితారెడ్డి ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించారు.

అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలి

అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్.వీరయ్య డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని కోరారు. సన్న ధాన్యానికే బోనస్ చెల్లిస్తారన్న వార్తలతో ఇతర రకాల ధాన్యాన్ని సాగు చేసే రైతులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ధాన్యానికి రూ.500 చొప్పున బోనస్ చెల్లిస్తామన్న హామీ ఏమైందని బీజేపీ నేత బూర నర్సయ్యగౌడ్ నిలదీశారు. సన్న ధాన్యానికే బోనస్ అంటూ రైతులను కాంగ్రెస్ సర్కారు మోసం చేస్తోందని ధ్వజమెత్తారు.

ఆర్మూరులో జీవన్‌రెడ్డి మాల్ స్వాధీనం

(మొదటిపేజీ తరువాయి)

ఆర్మూర్ బస్టాండ్ సమీపంలో 7,059 చదరపు గజాల భూమిని విష్ణుజిత్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రైవేటు లిమిటెడ్‌కు బిల్డ్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ కింద 33 ఏళ్లకు లీజుకు ఇచ్చింది. అయితే, 2017లో ఆ స్థలాన్ని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సతీమణి రజిత రెడ్డి టేకోవర్ చేసుకొని జీవన్‌రెడ్డి మాల్, మల్టీప్లెక్స్‌ను నిర్మించారు. మాల్‌లోని పలు అంతస్తులను థర్డ్ పార్టీలకు లీజ్‌కు ఇచ్చారు. అయితే, గత అక్టోబరు నాటికే రూ.8.65కోట్ల బకాయిలు పేరుకుపోవడంతో ఆర్టీసీ అధికారులు పలుమార్లు నోటీసులు అందజేశారు. దీంతో తొలివిడతలో 1.50కోట్లు, డిసెంబరులో 2.40కోట్లను ఆ సంస్థ నిర్వాహకులు చెల్లించారు. అనంతరం ఆర్టీసీ జారీ చేసిన షోకాజ్ నోటీసులను సవాల్ చేస్తూ గత ఏడాది డిసెంబరులో విష్ణుజిత్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ నిర్వాహకులు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడంతో జనవరి, ఫిబ్రవరిలో రూ.2కోట్లను చెల్లించారు. మరో నెల రోజుల్లో మిగతా అద్దె చెల్లించాలని అప్పట్లోనే హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఆ గడువు పూర్తయినా రూ.2.51కోట్ల అద్దె బకాయిలను సదరు సంస్థ చెల్లించలేదు. దీంతో ఈనెల 9వ తేదీన ఆర్టీసీ అధికారులు మళ్లీ నోటీసులు జారీ చేశారు. అయినా నిర్వాహకులు స్పందించకపోవడంతో అద్దె ఒప్పంద నిబంధనల మేరకు విష్ణుజిత్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు టర్మినేషన్ ఆర్డర్ ఇచ్చి, జీవన్‌రెడ్డి మాల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసానికి హైకోర్టు ఓకే

» ఫలితం వెల్లడించకూడదని ఆదేశం

హైదరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణకు హైకోర్టులో నిరాశ ఎదురయింది. శనివారం ప్రవేశపెట్టదలచిన పెట్టిన అవిశ్వాస తీర్మానం, జిల్లా కలెక్టర్ జారీచేసిన అవిశ్వాస నోటీసులపై స్టే ఇవ్వాలంటూ ఆయన చేసిన వినతిని తిరస్కరించింది. చట్టబద్ధంగా అవిశ్వాస తీర్మానం నిర్వహించుకోవచ్చని, అయితే ఫలితాలను వెల్లడించరాదని పేర్కొంది. అవిశ్వాస సమావేశాన్ని అడ్డుకోవాలని కోరుతూ సత్యనారాయణ దాఖలు చేసిన పిటిషన్‌పై వెకేషన్ బెంచ్ జడ్జి జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి గురువారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ తెలంగాణ మున్సిపాలిటీస్ యాక్ట్ నిబంధనలకు విరుద్ధంగా అవిశ్వాస తీర్మానంపై నోటీసులు జారీచేయడం చెల్లదని తెలిపారు. ఈ సమావేశాన్ని అడ్డుకోవడంతోపాటు కొత్త చట్టం ప్రకారం రూల్స్ రూపొందించే వరకు చైర్మన్‌గా కొనసాగే అవకాశమివ్వాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. గతంలో వివిధ మున్సిపాలిటీల అవిశ్వాస తీర్మానాలకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌లు ఇదే హైకోర్టు కొట్టేసిందని పేర్కొంది. చట్టబద్ధంగా అవిశ్వాస తీర్మానం నిర్వహించుకోవచ్చని తెలిపింది. అయితే ఫలితాలను వెల్లడించరాదని పేర్కొంటూ విచారణను జూన్‌కు వాయిదా వేసింది.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి

» తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ అన్వేష్ రెడ్డి

హైదరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): విత్తన కంపెనీలు రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ అన్వేష్ రెడ్డి కోరారు. కొన్ని కంపెనీలు పత్తి, మిరప, సోయాబీన్, వరి తదితర పంటలకు సంబంధించిన నకిలీ విత్తనాలను రైతులకు అమ్మడంతో రాష్ట్రవ్యాప్తంగా గతంలో రైతులు నష్టపోయారని, ఇకపై కల్తీ విత్తనాలకు ఆస్కారం లేకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో విత్తనోత్పత్తి కోసం సాగు చేసే విధానంలో లోపాలను పట్టించుకోకపోవడంతో సమస్యలు ఉత్పన్నమైనట్టు పేర్కొన్నారు. ఎఫ్-1 విత్తనాలను ఇతర రాష్ట్రాలు, విదేశాలకు అమ్ముకుని ఎఫ్-2 విత్తనాలు తెలంగాణలో రైతులకు అమ్ముతున్నారని ఆయన ఆరోపించారు. ఈ పద్ధతికి స్వస్తి చెప్పి నాణ్యమైన విత్తనాలు స్థానిక రైతులకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. కొన్నేళ్లుగా కొందరు మహబూబునగర్ జిల్లా భూత్పూర్, హైదరాబాద్‌లోని రామంతాపూర్, వికారాబాద్, వరంగల్ వంటి ప్రాంతాల్లో నకిలీ విత్తనాలు అమ్మి రైతుల నష్టాలకు కారణమవుతున్నారని, ఇలాంటి వారు తీరు మార్చుకోవాలని అన్వేష్‌రెడ్డి హెచ్చరించారు.

రామనాథపురం ఆలయంలో రూ.కోటి నగలు మాయం

» పోలీసుల అదుపులో ఆలయ నిర్వాహకులు, సిబ్బంది

చెన్నై, మే 16 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని రామనాథపురంలో ప్రసిద్ధి చెందిన పురాతన పద్మాసిని తాయారు సమేత ఆదిజగన్నాథ పెరుమాళ్ ఆలయంలో రూ.కోటి విలువైన నగలు మాయమయ్యాయి. రామనాథపురం సేతుపతి సంస్థాన దేవస్థానం ఆధీనంలో ఉన్న పెరుమాళ్ ఆలయానికి కోట్లాది రూపాయల విలువైన నగలున్నాయి. ఆలయంలో స్వామివారికి అలంకరించే 952 గ్రాముల బంగారు, 1,199 గ్రాముల వెండి నగలు నాగపేటలో ఉన్న రామనాథపురం రాజప్రాకారంలోని ట్రెజరీలో భద్రపరచి రెండేళ్లకు ఒకసారి తనిఖీ చేస్తుంటారు. ఈ క్రమంలో రెండురోజుల క్రితం ట్రెజరీలోని లాకర్లను సంస్థాన నిర్వాహకులు పరిశీలించగా, అందులో నగలు కనిపించలేదు. దీనిపై నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఆలయ నిర్వాహకులు కృష్ణమూర్తి, దైవశిలై రామస్వామి, శ్రీనివాసన్, ఆలయ సిబ్బంది రాము, పాండి, సామిదురై, మహేంద్రన్‌ను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీకి ఓట్లు వేశారని..

తలలు పగలగొట్టారు

కర్రలు,రాడ్‌తో ఇంట్లోకి వెళ్లి హంతకదాడి

» తీవ్రంగా గాయపడ్డ తల్లి,పిల్లలు

» వైసీపీ నేత అండతో విశాఖలో దాడి



గాయపడిన మణికంఠ, ధనలక్ష్మి

విశాఖపట్నం/కంచరపాలెం, మే 16 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో వైసీపీకి ఓట్లు వేయలేదనే కక్షతో టీడీపీ సానుభూతిపరులపై దాడి చేసి దారుణంగా తలలు పగలగొట్టారు. మహిళలని కూడా చూడకుండా రాత్రివేళ ఇంట్లోకి చొరబడి మరీ కొట్టారు. ఈ ఘటన విశాఖ నగరంలోని కంచరపాలెంలోని బర్మా క్యాంపులో బుధవారం రాత్రి జరిగింది. బాధితుల కథనం ప్రకారం...సుంకరి ఆనందరావు, భార్య ధనలక్ష్మి (44), కుమార్తె నూకరత్నం (24), కుమారుడు మణికంఠ (26)లతో కలిసి ఉంటున్నారు. వీరికి టీడీపీ హయాంలో ఇల్లు వచ్చింది. దానికి సంబంధించిన శిలాఫలకం ఇంటి ముందు ఉంది. దానిని తీసేయాలని రెండిళ్ల అవతల ఉన్న పూతి ఆశ, బత్తుల కనకరత్నం తదితరులు గొడవ పడేవారు. ఇది కాకుండా మురుగు కాలువకు సంబంధించిన గొడవ కూడా ఉంది. ఇటీవల ఎన్నికల సమయంలో వైసీపీ వారు డబ్బులు ఇస్తారని, ఓటు వేయాలని ఆశా, కనకరత్నం...సుంకరి కుటుంబ సభ్యులను కోరారు. తాము తెలుగుదేశానికి ఓట్లు వేస్తామని సుంకరి కుటుంబ సభ్యులు చెప్పారు. బుధవారం రాత్రి ధనలక్ష్మి, ఆమె పిల్లలు ఇంటి ముందు ఉండగా, ఆశా కుటుంబానికి చెందిన లావేటి లోకేశ్ అనే యువకుడు మద్యం తాగి వచ్చి, అసభ్యకరంగా ప్రవర్తించాడు. వైసీపీకి ఓట్లు వేయలేదని నిందించాడు. లోకేశ్ పెద్ద కర్ర తీసుకువచ్చి ధనలక్ష్మి, నూకరత్నం, మణికంఠను తలపై గట్టిగా కొట్టి గాయపరిచాడు. ఇంతలో ఆశ...ఒక ఐరన్ రాడ్ తీసుకువచ్చి దాడి చేసింది. తలలు పగిలి రక్తస్రావం కావడంతో బాధితులు 108 ద్వారా కేజీహెచ్‌కు వెళ్లి చికిత్స తీసుకున్నారు. కంచరపాలెం పోలీసులు కేసు నమోదుచేశారు. లోకేశ్‌పై హత్యాయత్నం కేసు పెట్టి రిమాండ్‌కు పంపించారు. మరో నలుగురు పూతి ఆశ, బత్తుల కనకరత్నం, కోనేటి సాయిబాబు, బాయి భూలోక్‌లపై కేసు పెట్టినా వారెవరినీ అరెస్టు చేయలేదు. వీరికి వైసీపీ నేత అండగా ఉండటంవల్లే కేసును పోలీసులు సీరియస్‌గా తీసుకోలేదన్న ప్రచారం జరుగుతోంది. కాగా, ఈ ఘటనలో రాజకీయ కక్షలు లేవని, వ్యక్తిగత కక్షలే కారణమని కంచరపాలెం డీసీపీ మేకా సత్తిబాబు, ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి మీడియాకు చెప్పారు. అయితే, బాధితురాలు ధనలక్ష్మి మీడియాతో మాట్లాడుతూ, తాము టీడీపీకి ఓట్లు వేశామనే కక్షతోనే దాడి చేశారని ఆరోపించారు.

'విద్యుత్'పై అసత్య ప్రచారం చేస్తే ఖబడ్దార్

» ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే కుట్రలు

» సరఫరాకు సర్కారు ప్రాధాన్యత

» కరెంటు కోతలు ఎక్కడా లేవు

» గత ప్రభుత్వంలో సంస్థలు నాశనం

» అధికారం అడ్డంపెట్టుకొని దోపిడీ

» వారి ఆస్తులపై విచారణ జరిపించాలి

» గెజిటెడ్, నాన్‌గెజిటెడ్ ఆఫీసర్స్, రిటైర్డ్ ఉద్యోగ సంఘాల నేతలు

పంజాగుట్ట, మే 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విద్యుత్ సంస్థలపై అసత్య ప్రచారం చేస్తే ఊరుకోమని గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అండ్ రిటైర్డ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు హెచ్చరించారు. కొంతమంది బీఆర్ఎస్ నాయకులు విద్యుత్ సరఫరాపై తప్పుడు ప్రచారం చేస్తూ సంస్థల ప్రతిష్ఠను మరింత దిగజారుస్తున్నారని ఫెడరేషన్ అధ్యక్షుడు ఏ.శంకర్, సంయుక్త కార్యదర్శి డి.కోటేశ్వరరావు, జాతీయ ఓబీసీ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం అధ్యక్షుడు, రిటైర్డ్ సీజీఎం ఆళ్ల రామకృష్ణ పేర్కొన్నారు. గత ప్రభుత్వంలోని పెద్దలు, రిటైర్డ్ అధికారులను సీఎండీలు, డైరెక్టర్లుగా నియమించి సంస్థను నిలువు దోపిడీ చేశారన్నారు. పదోన్నతులు, పోస్టింగుల్లో పెద్దమొత్తంలో అవినీతికి పాల్పడ్డారని, అధికారాన్ని అడ్డుపెట్టుకుని వందల కోట్లు కూడబెట్టారని ఆరోపించారు. వారి ఆస్తులపై వెంటనే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి అవినీతికి పాల్పడ్డ వారి జాతకాలు వెలికితీసి శిక్షించాలన్నారు. దొడ్డిదారిన కారుణ్య నియామకాలు చేపట్టి అందినకాడికి దోచుకున్న వారిని వదిలిపెట్టవద్దన్నారు. ప్రస్తుతం విద్యుత్ సంస్థల సంక్షోభానికి నాటి ప్రభుత్వ పెద్దలు, అధికారులు అనుసరించిన విధానాలే కారణమన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటు తర్వాత కరెంట్ కోతలు లేవని, కానీ కొంతమంది బీఆర్ఎస్ నాయకులు కావాలనే విద్యుత్ సరఫరాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొచ్చేందుకు కుట్రలు పన్నుతున్నారని, హైదరాబాద్‌లోని మియాపూర్‌లో 220 కేవీ కేబుల్ కాలిపోవడం వెనుక వారి ప్రమేయం లేకపోలేదన్నారు. కేంద్ర విద్యుత్ శాఖ ఇచ్చే గ్రేడింగ్‌లో 2014కు ముందు ఏ-గ్రేడులో ఉన్న విద్యుత్ సంస్థల రేటింగ్ ప్రస్తుతం సీ-గ్రేడ్‌కు పడిపోయిందని, ఇందుకు కారణం గతంలో ఇక్కడ పనిచేసిన సీఎండీలు, డైరెక్టర్లేనని ఆరోపించారు. 2014కు ముందు డిస్కంలకు నామమాత్రంగా ఉన్న ప్రభుత్వ బకాయిలు ప్రస్తుతం రూ.41 వేల కోట్లకు, విద్యుత్ సంస్థల మొత్తం అప్పులు రూ.1,63,583 కోట్లకు చేరడానికి గత ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో జీతాల కోసం ఎదురుచూడాల్సి వచ్చిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఒకటో తేదీన జీతాలు ఇస్తుంటే గత పాలకులు విమర్శలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రస్తుత ప్రభుత్వం విద్యుత్ సరఫరాకు ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందని, రాష్ట్రంలో కరెంట్ కోతలు ఎక్కడా లేవన్నారు. 2017లో గాంధీ ఆస్పత్రిలో కరెంట్ పోయి ఐదుగురు శిశువుల మృతికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోకపోగా, ఆ తర్వాత వారిని అందలం ఎక్కించారని ఆరోపించారు. గతంలో విద్యుత్ సంస్థల్లో పనిచేసిన ఒక్కో అధికారి అవినీతితో కోట్లకు పడగలెత్తారని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటేనే విద్యుత్ సంస్థలు నిలబడుతాయన్నారు. గతంలో నాటి ప్రభుత్వ పెద్దల మెప్పుకోసం కొంతమంది అసోసియేషన్ల నేతలు ఉద్యోగులకు ఏ మాత్రం సంబంధం లేని వ్యవహారంలో సీఎం రేవంత్‌రెడ్డి మాటలకు వ్యతిరేకంగా ధర్నాలు చేసిన విషయం గుర్తు తెచ్చుకోవాలన్నారు. ప్రస్తుతం కొంతమంది నేతల వ్యవహార శైలి గత పాలకులకు అనుకూలంగా ఉండటం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు.

టీచర్ల పదోన్నతులు, బదిలీలు చేపట్టాలి

» ప్రభుత్వానికి ఉపాధ్యాయ సంఘాల అభ్యర్థన

హైదరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి) : కోర్టు అభ్యంతరాలు తొలగిపోయినందున టీచర్ల పదోన్నతులు, బదిలీలను వెంటనే పూర్తి చేయాలని ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వాన్ని కోరాయి. ఈ మేరకు పీఆర్‌టీయూ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కమలాకర్ రావు, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, యూటీఎఫ్ ప్రతినిధులు చావ రవి, జంగయ్య, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు రాష్ట్ర అధ్యక్షుడు సి. జగదీశ్, ఇతర ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు గురువారం విద్యా శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశంను కలిసి వేర్వేరుగా వినతి పత్రాలను అందజేశారు. భాషా పండితులకు టెట్-2 రాయాల్సిన అవసరం లేదని కోర్టు స్పష్టం చేసిందని గుర్తు చేశారు. కాగా, గత పీఆర్‌సీలో ఫిట్‌మెంట్ విషయంలో అన్యాయం జరిగిందని, ఈసారైనా 40 శాతం తక్కువ కాకుండా నిర్ణయించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు రాష్ట్ర అధ్యక్షుడు సి. జగదీశ్ కోరారు. ఈ మేరకు పిఆర్‌సి కమిషనర్ శివశంకర్‌ను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు.

నాడు మోసం.. నేడు మొసలి కన్నీరు

» రైతుల విషయంలో కేసీఆర్ వైఖరిదే

» కాంగ్రెస్ నేత మహేశ్ కుమార్ గౌడ్

అధికారంలో ఉండగా రైతులను మోసం చేసిన కేసీఆర్ పదవి పోగానే రైతుల కోసం ధర్నాలంటూ మొసలి కన్నీరు కార్చుతున్నారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు ధాన్యం విషయంలో ధర్నాలు చేయడం సిగ్గనిపించడం లేదా? అని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఘోర ఓటమి ఎదురైనందున ఉనికి కోసం రైతుల కోసం ధర్నాలంటూ నాటకమాడుతున్నారని మండిపడ్డారు. ఖమ్మంలో మిర్చి రైతులకు బేడీలు వేసికొట్టుకుంటూ తీసుకెళ్లిన విషయాన్ని రైతులు ఇంకా మరిచిపోలేదని, కేటీఆర్ కనుసన్నల్లో జరుగుతున్న ఇసుక మాఫియాను అడ్డుకున్న నేరెళ్ల రైతులపై దాడులు చేశారని అన్నారు. 'పంట నష్టపోయిన రైతులను కేసీఆర్ ఏనాడూ పరామర్శించలేదు, పట్టించుకోలేదు. పదవి పోగానే ధర్నా చేస్తే రైతులు ఆదరిస్తారు' అని అనుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల పట్ల చిత్తశుద్ధి ఉందని, మార్చిలోనే ఐకేపీ సెంటర్లు తెరిచి గత ప్రభుత్వం కంటే ఎక్కువ ధాన్యం కొనుగోలు చేశామన్నారు.

ఉపాధిలో తెలంగాణకు రెండోస్థానం

» ఏప్రిల్‌లో కూలీలకు 3.29 కోట్ల పనిదినాలు

» నిర్దేశిత లక్ష్యానికి మించి కల్పన : కేంద్రం

హైదరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలకు నిర్దేశిత లక్ష్యానికి మించి పనిదినాల కల్పనతో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే రెండోస్థానాన్ని దక్కించుకుంది. ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉంది. ఈ మేరకు కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ గురువారం వివరాలను విడుదల చేసింది. ఏపీ, తెలంగాణ తర్వాత స్థానాల్లో ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, బిహార్ ఉన్నాయి. ఏప్రిల్ నెలలో తెలంగాణలో ఉపాధి కూలీలకు 2.25 కోట్ల పనిదినాలు కల్పించాల్సి ఉండగా... 3.29 కోట్ల పని దినాలను కల్పించినట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ తెలిపింది. ఏప్రిల్ 1 నుంచి మే 15వ తేదీ వరకు తీసుకుంటే 4.49 కోట్ల పని దినాలను కల్పించినట్లు పేర్కొంది. ఇదే కాలవ్యవధిలో ఏపీలో 6.99 కోట్ల పని దినాలను ఉపాధి కూలీలకు కల్పించినట్లు తెలిపింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను తెలంగాణలో 8 కోట్ల పనిదినాలకు ఆమోదం ఉంది. ఇప్పటికే నాలుగున్నర కోట్ల పనిదినాలు పూర్తవటంతో ఏడాది మొత్తంలో అధికారులు ఇలాగే లక్ష్యానికి మించి పనులు కల్పిస్తారా? లేదా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏడాదంతా ఇదే తరహాలో అత్యధిక పనిదినాలు కల్పించాలని కూలీలు, ప్రజాసంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ • శుక్రవారం 17 మే 2024
diksuchi@andhrajyothy.com

• సైన్స్ విద్యార్థుల కోసం •

టెన్త్, ఇంటర్ తరవాత What Next

(నిన్నటి పేజీ తరువాయి)

ఫిషరీస్



సైన్స్, ఆర్ట్స్, బిజినెస్‌ను ఒక్కచోట చేరిస్తే అది ఫిషరీస్‌గా చెప్పవచ్చు. ప్రపంచంలో మత్స్య సంపదను ఎక్కువగా ఉత్పత్తి చేస్తున్న మూడో అతిపెద్ద దేశం భారత్. మన దేశానికి 7500 కిలోమీటర్ల విశాలమైన సముద్ర తీరం ఉంది. దీనితోపాటు దేశంలో కూడా అపారమైన నీటి వనరులు ఉన్నాయి. వీటన్నింటి కారణంగా ఈ రంగంలో అవకాశాలు విస్తారంగా కనిపిస్తాయి. ఫిషరీస్ రంగంలో ఉద్యోగాల విషయానికి వస్తే ఫామ్ మేనేజర్లు, హేచరీ మేనేజ్‌మెంట్, పోస్ట్ హార్వెస్ట్ మేనేజ్‌మెంట్- ప్రాసెసింగ్, ఫిషరీ ఇన్‌స్పెక్టర్, ఫిషరీ వర్కర్ తదితరాలు ప్రధానంగా ఉంటాయి. ఫిషరీ రంగంలోని టెక్నికల్ ఫీల్డ్‌లోకి వెళ్లాలనుకునేవారు బైపీసీతో ఇంటర్ పూర్తిచేసి ఉండాలి. తెలుగు రాష్ట్రాల్లో ఏపీకి సంబంధించి ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీ ఉంది. నెల్లూరు జిల్లా ముత్తకూరులో ఉన్న ఫిషరీష్ కాలేజీకి ఎంతో చరిత్ర ఉంది.

తెలంగాణలోని పీవీనరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ పరిధిలో కూడా ఒక కాలేజీ ఉంది.

కోర్సులు అందిస్తున్న సంస్థలు

- Central Institute of Freshwater Aquaculture, Kausalyaganga, Bhubaneswar-751002, Orissa, E-mail: cifa@ori.nic.in, Website: www.stpbh.soft.net/cifa
- Central Inland Fisheries Research Institute, Barrackpore-700120, West Bengal, E-mail:cifri@vsnl.com, Website:www.icar.org.in
- Central Marine Fisheries Research Institute P.B.No. 1603, P.O.Tatapuram, Kochi-682014, Kerala, E-mail:mail@cmfri.com, Website:www.cmfri.com
- Central Institute of Fisheries Technology, Willington Island, Matsyapuri, Kochi-682029, Kerala, E-mail:root@cift@ker.nic.in
- Central Institute of Fisheries Education, (Indian Council of Agricultural Research) Seven Bungalows, Versova, Mumbai-400061, Maharashtra, E-mail:root@cife, bom.nic.in
- Central Institute of Brackishwater Acquaculture, 141, Marshal's Road, Egmore, Chennai- 600008, Tamil Nadu E-mail:ciba@tn.nic.in
- TamilNadu Veterinary and Animal Sciences University, Vapery High Road, Chennai-600007, Tamil Nadu
- Madurai Kamaraj University, Madurai-625021, Tamil Nadu Website: www.mkuuniversity.org
- University of Calcutta, Senate House, 87/1 College Street, Kolkata-700073, West Bengal E-mail: admin@calcuniv.in Website: www.caluniv.ac.in
- National research Centre on Coldwater Fisheries, P.B.No. 28, Roop Nagar, Haldwani, Nainital-263139, Uttarakhand
- G.B. Pant University of Agriculture & Technology, Faculty of Science, Pantnagar, Udhamsingh Nagar, Uttarakhand-263145, Website:www.ac.in
- National Bureau of Fish Genetics Resources, Radheswamy Bhavan 351I28, Dariyapur Talkatora Road, Rajendra Nagar Lucknow-226004, Uttar Pradesh
- Rajendra Agricultural University, Pusa, Samastipur-848125, Bihar
- Assam Agricultural University, Jorhat, Assam Website: www.aau.ac.in
- Orissa University of Agriculture and Techonlogy, Bhubaneswar-751003, Orissa E-mail: auatmain@hotmail.com Website:www.ouat.ac.in
- School of Industrial Fisheries, Kochi-682016, Kerala. E-mail: indfish@md3.vsnl.net.in
- University of Mumbai, Mumbai, Maharashtra, Website:www.mu.ac.in



బయో ఇన్ఫర్మాటిక్స్

బయో ఇన్ఫర్మాటిక్స్ అనేది ఇంజనీరింగ్ డిసిప్లిన్. మాలిక్యులర్ బయాలజీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీల సంగమం ఇది.

బయో ఇన్ఫర్మాటిక్స్ కోర్సు అందించే కొన్ని సంస్థలు

- After 10+2: B.tech (Bio informatics)- Vellore institute of technology, (Deemed university), Vellore- 632014 (Tamil Nadu). www.vit.ac.in. Course: B.tech (Bio informatics). Eligibility: 10+2 PCM/B (50 percent agg). Selection JEE(MAIN Entrance).

Jawaharlal Nehru university:
Bio informatics centre, New Delhi.

- **Course:** Advanced post-graduate diploma in Bio informatics (reaching & research programme). www.jnu.ac.in.
- The course is aimed at training biologists (after M.Sc or equivalent in the areas of IT, computational biology, mathematical methods and structural bioinformatics.

IIT Kharagpur:

- **Course:** Masters in medical sciences & technology (3 years) to impart engineering skills to medical graduates and train them for state- of - the - art medical research in the frontier areas of bioinformatics, genetic engg. immunotechnology, telemedicine, etc. Eligibility: MBBS (60 percent agg) with maths at 10+2. Selection: a 2-hour objective type entrance test based on MBBS syllabus. www.iitkgp.com

University of Pune,
Bioinformatics centre, Pune

- **Course:** M.Sc in Bioinformatics entrance test advanced diploma in Bio informatics (1 year). Eligibility: Master's in vet Sc, agriculture, pharma, MBBS, MCA, BE or B.tech (50 percent seats for SC/ST and 30 percent for women). www.bioinfo.ernet.in/1-diploma.


Osmania University, PGRR centre for distance education, Hyderabad

- **Course:** Post graduate diploma in Bioinformatics: Master's degree (MSc or above) in any branch of bio / life / agri / pharma / vet / medical environ science including bio-physics (55 percent). www.boseinst.ernet.in
- University of Hyderabad, PO central university, Hyderabad website: (www. uohyd. ernet.nic.in). Cource: Adv. Post-graduate diploma in Bio- informatics (2-sem). Eligibility: Master's degree (Bio / agri / phys + course in computer application or masters in comp science (55 percent) with sound knowledge of molecular biology).

ఫార్మసిస్టులు

టెన్త్, ఇంటర్ అర్హతలతో ఫార్మసీలో డిప్లొమా, డిగ్రీ, పీజీ కోర్సులు చేయవచ్చు. భారతదేశంలో ఫార్మసీ ఇండస్ట్రీ వంద సంవత్సరాల పురాతనమైనది. దేశవ్యాప్తంగా 25,000కు మించి మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్లు ఉన్నాయి. వీటిలో ఐదోవంతు బల్క్ డ్రగ్ యూనిట్లే. ఎంపిసి లేదా బైపీసీతో ఇంటర్ పూర్తిచేసినవారు నాలుగు సంవత్సరాల బ్యాచిలర్ ఆఫ్ ఫార్మసీ(బిఫార్మసీ) కోర్సులో చేరడానికి అర్హులు. స్వయం ఉపాధి కోసం మెడికల్ షాపుల నిర్వహణ లేదా ఆస్పత్రుల్లో ఫార్మసిస్టుల ఉద్యోగాల అర్హతల కోసం రెండు సంవత్సరాల డిప్లొమా ఇన్ ఫార్మసీ కోర్సు చేయొచ్చు. బిఫార్మసీ చేసినవారు మాస్టర్స్ ఇన్ ఫార్మసీ కోర్సు చేయొచ్చు.

అగ్రికల్చర్, సంబంధిత రంగాలు



వ్యవసాయానికి సంబంధించిన డిగ్రీ కోర్సుల్లో చేరాలంటే కనీసం 50 శాతం మార్కులతో బైపీసీ పూర్తిచేయాలి. అగ్రికల్చర్ అలాగే సంబంధిత ఇతర కోర్సులను తెలుగు రాష్ట్రాల్లోని సంబంధిత యూనివర్సిటీలు అందిస్తున్నాయి.

- అగ్రికల్చర్, హార్టికల్చర్
- ఎన్విరాన్‌మెంట్ - పౌల్ట్రీ ఫార్మింగ్
- ఫారెస్ట్రీ అండ్ వైల్డ్ లైఫ్
- రూరల్ అండ్ మేనేజ్‌మెంట్
- వెటర్నరీ సైన్స్

హెల్త్‌కేర్ ఇండస్ట్రీ

ఇంటర్ బైపీసీతో పూర్తి చేసినవారు ఎంబిబిఎస్ కోర్సులో చేరవచ్చు. సుప్రీంకోర్టు ఉత్తర్వులు, కేంద్రప్రభుత్వ ఆదేశాల మేరకు మెడిసిన్, డెంటల్ కోర్సుల్లో చేరాలంటే 'నీట్' ర్యాంకు తప్పనిసరి. నాలుగున్నర సంవత్సరాల ఎంబిబిఎస్ కోర్సు మూడు ఫేజులు, తొమ్మిది సెమిస్టర్లుగా ఉంటుంది. సాధారణంగా ఒక్కో సెమిస్టరుకు 120 వర్కింగ్ డేస్ గ్యాప్ ఉంటుంది. ఎంబిబిఎస్ పూర్తిచేసిన ప్రతీ విద్యార్థి 12 నెలల ఇంటర్న్‌షిప్‌నకు వెళ్లాల్సి ఉంటుంది. ప్రధానంగా ఈ కింది రకాల మెడిసిన్ శాఖలు ఉంటాయి.

- మెడిసిన్(అల్లోపతి) అండ్ డెంటిస్ట్రీ,
- హోమియోపతి
- ఆయుర్వేద
- యునాని
- నేచురోపతి

ఫ్లోరీ కల్చర్

కమర్షియల్‌గా పూల సాగు చేయడమే ఫ్లోరికల్చర్. తెగులును తట్టుకునేలా, ఎక్కువ పూలు పూసేలా మొక్కలను తయారు చేయడమే ఫ్లోరికల్చరిస్టుల పని. హార్టికల్చర్‌లో భాగంగా ఉన్న ఇది తరవాతి కాలంలో ప్రత్యేక విభాగంగా మారింది. బీఎస్సీ హార్టీకల్చర్/అగ్రికల్చర్‌ను మన దేశంలో చాలా సంస్థలు అందిస్తున్నాయి. ఎంసెట్‌లో మెరిట్ ద్వారా మన రెండు రాష్ట్రాల్లో ఉమ్మడిగా ప్రవేశం పొందవచ్చు.

ఫ్లోరీ కల్చర్‌ను అందిస్తున్న కొన్ని సంస్థలు

- National Botanical Research Institute
- G.B Pant University of Agriculture & Technology
- Institute of Himalayan Bioresource Technology

నర్సింగ్

కనీసం 45 శాతం మార్కులతో (ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే 40 శాతం) ఇంటర్ బైపీసీతో చేసినవారు బిఎస్సీ నర్సింగ్ చేయవచ్చు. జనరల్ అభ్యర్థులు 17 నుంచి 25 సంవత్సరాల లోపు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే 30 సంవత్సరాల లోపు ఉండాలి.

- ఫిజికల్ అండ్ ఆక్యుపేషనల్ థెరపిస్ట్స్
- ఆర్థటిక్ అండ్ ప్రాస్తటిక్ టెక్నాలజిస్టులు

సైన్స్‌తో ఇంటర్ పూర్తి చేసినవారు ఈ కోర్సు చేయవచ్చు. డిప్లొమా అయితే రెండు సంవత్సరాలు, డిగ్రీ అయితే నాలుగున్నర సంవత్సరాలు ఉంటుంది.

- స్పీచ్ థెరపీ అండ్ ఆడియోలజిస్టులు

మూగ, చెవిటి సమస్యలతో బాధపడేవారికి ట్రైనింగ్ ఇచ్చే కౌన్సిలర్లు వీరు. సైన్స్‌తో ఇంటర్ పూర్తిచేసినవారు 3 సంవత్సరాల డిగ్రీ కోర్సులో చేరవచ్చు.

- మెడికల్ టెక్నాలజిస్టులు/రేడియోగ్రాఫర్లు /ఆప్టోమెట్రిస్టులు

సైన్స్‌తో ఇంటర్ పూర్తిచేసినవారు మూడేళ్ళ డిగ్రీ కోర్సుల్లో చేరవచ్చు. ఒక సంవత్సరం చేసినవారికి సర్టిఫికెట్, రెండు సంవత్సరాలు చేసినవారికి డిప్లొమా ఇస్తున్నారు.

బయలాజికల్ సైన్స్

ఇందులో చాలా రకాల స్పెషలైజేషన్లు ఉన్నాయి. ఇంటర్, డిగ్రీల్లో బైపీసీ, బీజెడ్‌సీ గ్రూపు తీసుకుని పీజీ, పిహెచ్‌డీలలో ఇక్కడ పేర్కొన్న రకాల్లో స్పెషలైజేషన్ చేయవచ్చు. అనాటమిస్టులు(మనుషులు, జంతువుల కణాలు, కణజాలాలు, అవయవాల పరిశీలన), అక్వాటిక్ బయాలజిస్టులు (నీటి లోపల జీవించే మొక్కలు, జంతువుల అధ్యయనం), ఆగ్రానమిస్టులు (సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పంటల పెంపకం, పరిశోధన), బయోకెమిస్టులు (జంతువుల జీవరసాయన చర్యల పరిశోధన), బయోఫిజిస్టులు (నరాలు, కణాలు, మెదడు మొదలైన అన్నింటి భౌతిక లక్షణాల పరిశీలన), సైటాలజిస్టులు (మొక్కలు, జంతువుల పెరుగుదల, పనితీరు మొదలైనవి పరిశోధన), క్యూరేటర్(మ్యూజియాలలో అతి విలువైన జీవజాలాల పరిరక్షణ), ఎకనామిక్ బాటనిస్ట్(వాణిజ్య పంటల పరిశోధన), ఎకాలజిస్టులు(మనుషులు, జంతువులపై ప్రకృతి ప్రభావం పరిశీలన), ఎంటమాలజిస్టులు(మొక్కలకు హాని కలిగించే కీటకాలపై పరిశోధన), జెనెటిక్స్(జన్యు, వంశపారంపర్య లక్షణాలపై పరిశోధన), కీపర్ హార్‌బేరియం(మొక్కల్లో లోపించిన ఎరువులను అందిస్తూ-పరిశీలించడం), మైక్రో బయాలజిస్టులు(బ్యాక్టీరియల్ స్టడీ), మాలిక్యూలర్ బయాలజిస్టులు (మాలిక్యూల్ బయాలజీ స్టడీ), మ్యూకాలజిస్టులు (ఫంగస్‌కు సంబంధించి ప్రత్యేక అధ్యయనం), అర్నిథాలజిస్టు(పక్షుల అధ్యయనం), నెమటాలజిస్టు(రౌండ్‌వార్మ్ అధ్యయనం), ఫిష్ కల్చరిస్టు(చేపల పెంపకం), ఫిజియాలజిస్టు(మొక్కల భాగాల, కణజాలాల పరిశీలన), పేథాలజిస్టు (రోగకారక క్రిముల అధ్యయనం), ఆర్కిడాలజిస్టు (ఆర్కిడ్ జాతి మొక్కల సంరక్షణ), పారా సైటాలజిస్టు(పరాన్న జీవుల అధ్యయనం), ప్లాంట్ బ్రీడర్, పాలి ఎకటాలజీ, ఫార్మకాలజీ, రీజనల్ బోటనీ, సిస్టమాటిక్ బోటనీ, టాక్సానమీ (జంతు, వృక్ష వర్గీకరణ శాస్త్రం), టాక్సికాలజీ, వైల్డ్‌లైఫ్ బయాలజీ, జువాలజీ. బయోటెక్నాలజిస్ట్, జెనెటిక్ సైంటిస్ట్, బయో కెమిస్ట్, మైక్రో బయాలజిస్ట్, ఆంత్రో పాలజిస్టులుగా ఉద్యోగాలుంటాయి.

డెయిరీ టెక్నాలజీ

భారత దేశంలో ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్న రంగాల్లో డెయిరీ ఒకటి. ప్రపంచ పశు సంపదలో భారత్ వాటా ఎక్కువే. మన దేశానికి విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించిపెడుతున్న రంగాల్లో డెయిరీ కూడా ఒకటి. అయితే ఈ రంగం ఇప్పటికీ సంప్రదాయ వ్యక్తుల చేతుల్లోనే ఉంది. చైనా, మెక్సికో లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు కూడా ఇందులో దూసుకుపోతుంటే మనం మాత్రం కొంత వెనకబడి ఉన్నామని చెప్పుకోక తప్పదు. మన దేశంలోని కొన్ని సంస్థలు డెయిరీ టెక్నాలజీలో కోర్సులను అందిస్తున్నాయి. చాలావాటిలో చేరడానికి ఇంటర్ పూర్తి చేసినవారు అర్హులు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఏపీ - తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ, తెలంగాణ - హైదరాబాద్(రాజేంద్రనగర్)లోని పీవీ నరసింహారావు తెలంగాణ స్టేట్ వెటర్నరీ యూనివర్సిటీ డైరీ టెక్నాలజీలో కోర్సులను ఆఫర్ చేస్తున్నాయి.

డెయిరీ టెక్నాలజీని అందిస్తున్న కొన్ని సంస్థలు

- National dairy research institute (NDRI), Karnal, Haryana. It offers four year B.Tech.
- Seth MC college of dairy science, Gujarat agricultural university, Anand, Gujarat. It offers B.Sc in dairy technology.
- College of dairy science, Rajasthan agricultural university, Udaipur. It offers 5 years B.Tech degree.
- Sanjay Gandhi institute of dairy science and technology, Rajendra agricultural university, Pusa, Bihar. It offers four and a half year B.Sc degree in dairy technology. Being a domicile of Bihar is a must for the 25 seats available.
- Faculty dairy technology, West Bengal university of Animal & Fishery sciences, Mohanpur campus, krishi vishwa vidyalaya. It offers four year B.Tech. in dairy technology. The institute has 30 seats.



- ఆంధ్రజ్యోతి ఎడ్యుకేషన్ డెస్క్

(ఎంపిక చేసిన కొన్ని కాలేజీల లిస్టును మాత్రమే ఇక్కడ ప్రచురించాం. కాలేజీల చిరునామాలు, ఫోన్ నంబర్లు కొన్ని సందర్భాల్లో మార్పు ఉండవచ్చు.)

లిటిల్స్



రాజుగారి ముఖం

కృష్ణదేవరాయలు రాజ్యంలో దేవుడు అనే ఓ వ్యక్తి ఉండేవాడు. అతని పేరు దేవుడే కానీ.. అతనికి మనిషికి ఉండే కష్టాలన్నీ ఉండేవి. దీంతో అతను తప్పుగా తన తల్లిదండ్రులు దేవుడు పేరు పెట్టారని బాధపడేవాడు. ఎవరైనా సరే దేవుడు ముఖం చూస్తే వారికి ఇబ్బందులే అని ఆ ఊరంతా పుకారు వచ్చింది. దీంతో ఊరిలోని జనాలంతా నమ్మారు. అసలు ఈ విషయం నమ్మకూడదనే విషయం కూడా వారికి తెలీదు. అతని ముఖం చూస్తే చెడ్డ జరుగుతుందని అందరిమాట.


ఈ మాట రాయల వారి చెవిన పడింది. రాయలవారు సాహసికులు. ఇలాంటి మాటలు చెవిన పట్టించుకోరు. ఎలాంటి సమస్యలు రావు అని అనుకున్నాడు. ఒక రోజు ఉదయాన్నే రాయలవారు వేటకు వెళుతుండగా దేవుడు ముఖం చూశాడు. దేవుడు నవ్వుతూ వెళ్లిపోయాడు. ఈ రోజు రాయల వారు అంతే అన్నారు పక్కన ఉండేవారు. రాయలవారు వేటకు వెళ్లారు. అదృష్టవశాత్తూ పులి నోట చిక్కాల్సినది పోయి ప్రాణాలతో బతికి బట్ట కట్టాడు. దీంతో కోపంగా ఇంటికి వచ్చాడు. 'ఈ దేవుడును ముందు ఉరితీయండి' అని ఆజ్ఞాపించాడు. దీంతో దేవుడును బంధించారు. కారాగారంలో ఉన్న దేవుడును చూడటానికి ఆమె భార్య వచ్చింది. 'ఇక జీవితం ఇంతే. శుభం' అన్నాడు. 'నువ్వు తప్పు చేయలేదు. నీ ముఖం చూస్తే ఆయనకు సమస్య వచ్చిందని.. ఇలా చేస్తే ఎలా?' అంటూ ఏడ్చింది. ఆ దేవుడు ఉంటే నువ్వు బతుకుతావు దేవుడూ అన్నది. ఆమె బాధను రామలింగ కవి చూశారు. విషయం అడిగి తెలుసుకున్నారు.

మరుసటి రోజు దేవుడిని ఉరివేయాలి. దేవుడు భార్య రామలింగడి కవి స్నేహితురాలు కూడా. తన బాధను చెప్పుకుని ఎలాగైనా కాపాడాలని వేడుకుంది. రామలింగకవి ఓ ఉపాయం పన్నాడు. మరుసటి రోజు దేవుడికి ఉరి. అందరూ వెళ్లారు. రామలింగ కవి అక్కడే ఉన్నాడు. ఆకు మీద రాసిన అక్షరాలు చదివిన తర్వాత అతన్ని ఉరి వేయండి అన్నాడు తలారిని. సైనికులు కూడా ఆ అక్షరాలను చదివారు. ఇందులో ఇలా ఉంది.. 'మీరు ఎవరైనా సరే ఉదయాన్నే రాయలవారి ముఖం చూస్తే ఉరి తప్పదు' అని. అందరూ ఆశ్చర్యంతో వణికిపోయారు. ఆ అక్షరాలను రాయలవారు చదివారు. 'అయ్యా.. మిమ్మలను చూడటం ఇతని చావుకు వచ్చింది అంటే.. మీరు దురదృష్టవంతులా? ఇతనా?' అని అడిగాడు. రాయలకు విషయం అర్థం అయింది. సిగ్గుపడ్డాడు తన అజ్ఞానానికి.









డైలీ సుడోకు - 309

	9				1	7		
		1	2		4			9
3	8				7			
	1			6		8		
			7		5			
		7		2			5	
			8				2	6
8			5		6	4		
		3	4				8	

సుడోకు - 308 సమాధానం

8	2	9	5	7	1	6	4	3
5	6	3	2	9	4	1	7	8
1	4	7	8	3	6	5	2	9
9	1	6	3	4	7	8	5	2
7	3	8	6	5	2	4	9	1
4	5	2	1	8	9	3	6	7
3	8	4	9	2	5	7	1	6
6	9	5	7	1	3	2	8	4
2	7	1	4	6	8	9	3	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
శుక్రవారం • 17 మే 2024
cinema@andhrajyothy.com

థియేటర్ల బంద్ నిజం కాదు



రెండు తెలుగు రాష్ట్రాల్లో సింగిల్ స్ర్కీన్ థియేటర్లను మూసివేస్తున్నారంటూ వస్తున్న వార్తల్లో నిజం లేదని తెలుగు చలనచిత్ర పరిశ్రమలోని అపెక్స్ బాడీలు తెలుగు ఫిల్మ్ ఛాంబర్, తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్, తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి, తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ గురువారం స్పష్టం చేశాయి. ఈ మేరకు ఆ సంస్థలు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. థియేటర్లను మూసి వేస్తున్నట్లు ఒక సంఘం నిర్ణయం తీసుకుందంటూ వస్తున్న వార్తలను ఆ సంస్థలు ఖండించాయి. 'ఇప్పటివరకూ థియేటర్ల యజమానులు కానీ, వారికి సంబంధించిన సంఘాలు గానీ మాకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు. ఇదంతా అబద్ధపు ప్రచారం మాత్రమే' అని స్పష్టం చేశాయి. 'కొన్నాళ్లుగా వసూళ్లు తక్కువ రావడం వల్ల కొంతమంది థియేటర్ల యజమానులు వ్యక్తిగతంగా నిర్ణయం తీసుకుని ఉండవచ్చు, అపెక్స్ బాడీలకు దీంతో సంబంధం లేదు' అని పేర్కొన్నాయి. సింగిల్ స్ర్కీన్ థియేటర్లను మూసివెయ్యాలనే నిర్ణయం తీసుకునే ముందు ఎగ్జిబిటర్లు తమను సంప్రదించలేదని ఫిల్మ్ ఛాంబర్ తెలిపింది.



కేన్స్‌కు ఐశ్వర్య కళ

ప్రతిష్ఠాత్మక 77వ కేన్స్ చలనచిత్రోత్సవాల్లో బాలీవుడ్ నటి, మాజీ ప్రపంచసుందరి ఐశ్వర్యారాయ్ బచ్చన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గురువారం ఆమె రెడ్‌కార్పెట్‌పై నడిచారు. బ్లాక్ అండ్ వైట్ దుస్తుల్లో చిరునవ్వులు చిందిస్తూ వేడుకకు ప్రత్యేక కళ తెచ్చారు. ఫ్రాన్స్‌లో జరుగుతోన్న ఈ వేడుకల్లో ఐశ్వర్యతో పాటు కియారా అద్వాణీ, శోభితా ధూళిపాళ, అదితీరావ్ హైదరీ పాల్గొన్నారు.

చేతికి కట్టుతో...



ఐశ్వర్యారాయ్ బచ్చన్ కేన్స్ చలనచిత్రోత్సవంలో మరోసారి మెరవబోతున్నారు. గురువారం కూతురు ఆరాధ్యతో కలసి ఈ వేడుకల్లో పాల్గొనేందుకు బయల్దేరివెళ్లారు. తల్లీ కూతుళ్లు ఇద్దరూ గురువారం ముంబై ఎయిర్‌పోర్ట్‌లో కనిపించారు. చేతికి గాయం అయినప్పుడు ధరించే కట్టుతో ఐశ్వర్య కనిపించారు. దీంతో రెడ్‌కార్పెట్‌పై ఆమె ప్రదర్శనపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

పెద్ద హిట్ అవుతుంది

'ఈ సినిమాకు అరుణ్, నాగ బలం. నేను ఇంతవరకూ దర్శకుల్ని పరిచయం చేశాను. తొలిసారిగా నాగను నిర్మాతగా ఇంట్రడ్యూస్ చేస్తున్నాను. ట్రైలర్ చూస్తే టీమ్ పడిన కష్టం తెలుస్తుంది.

ఇది న్యూ ఏజ్ లవ్ స్టోరీ అవుతుంది. ఈ నెల 25న వస్తున్న మా సినిమా పెద్ద హిట్ అవుతుందని ఆశిస్తున్నా' అన్నారు దిల్ రాజు. ఆశిష్, వైష్ణవి చైతన్య జంటగా నటించిన హారర్ థ్రిల్లర్ 'లవ్ మీ' ట్రైలర్‌ను గురువారం విడుదల చేసిన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి ఈ సినిమాను నిర్మించారు.

దర్శకుడు అరుణ్ భీమవరపు మాట్లాడుతూ 'యుద్ధం చేయడం కంటే ప్రేమించడానికి గట్స్ కావాలి. మనిషి ప్రేమను పొందడమే కష్టం అనుకుంటే దెయ్యాన్ని ప్రేమించడం ఇంకెంత



కష్టమో ఆలోచించండి. ఆశిష్ ఈ పాత్రను అద్భుతంగా పోషించాడు. గంగాదేవిలాంటి పాత్రను వైష్ణవి చేశారు. ఈ ప్రపంచాన్ని ప్రేమే నడిపిస్తోంది. 'వై' అనే క్వశ్చన్ లేకుండా 'వావ్' అనుకుని ఈ సినిమాను చూసి ఎంజాయ్ చేయండి' అన్నారు.

'ఇంత మంచి సినిమా చేసే అవకాశం కల్పించిన దర్శకనిర్మాతలకు కృతజ్ఞతలు. మా సినిమాతో మళ్లీ థియేటర్లు కళకళలాడతాయి' అన్నారు ఆశిష్. ఈ చిత్రంలో డిఫరెంట్‌గా, టఫ్‌గా ఉండే పాత్రను పోషించానని వైష్ణవి చైతన్య చెప్పారు.



కెరీర్‌లో స్పెషల్ ప్రాజెక్ట్

కాజల్ అగర్వాల్ లీడ్ రోల్ పోషించిన 'సత్యభామ' చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమైంది. నవీన్‌చంద్ర కీలక పాత్ర పోషించిన ఈ సినిమాకు సుమన్ చిక్కాల దర్శకుడు. బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మాతలు. త్వరలోనే ఈ చిత్రం విడుదల కానుంది. ఈ నేపథ్యంలో బుధవారం హైదరాబాద్‌లో మ్యూజికల్ ఈవెంట్‌ను నిర్వహించి, అందులో 'వెతుకు వెతుకు' పాటను రిలీజ్ చేశారు. చంద్రబోస్ రాసిన ఈ పాటను సంగీత దర్శకుడు కీరవాణి పాడడం విశేషం. సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకాల తన టీమ్‌తో పాటలు పాడి హోరెత్తించారు. లైవ్ ఆర్కెస్ట్రాలో సింగర్స్ పాడిన పాటలకు ఈవెంట్‌కు హాజరైన ఆడియన్స్ ఎంజాయ్ చేశారు. ఈ సందర్భంగా కాజల్ మాట్లాడుతూ 'నా కెరీర్‌లో 'సత్యభామ' ఓ స్పెషల్ ప్రాజెక్ట్. ఇటువంటి పాత్ర చేయడం కెరీర్‌లో తొలిసారి. నేను ఓ బిడ్డకు జన్మ ఇచ్చిన తర్వాత నటించిన సినిమా ఇది. షీ సేఫ్ యాప్‌ను ఉపయోగించి సేఫ్‌గా ఎలా ఉండాలో చిత్రంలో చూపించాం. యువతులంతా క్షేమంగా ఉండాలనే కథలోని పాయింట్ నన్నెంతో ఆకట్టుకుంది.' అన్నారు.

తప్పని తెలిసినా చేయక తప్పదు

కాంద్రకోట మిస్టరీ అంటూ యథార్థ సంఘటనల ఆధారంగా రూపుదిద్దుకుంటున్న చిత్రం 'నింద'. వరుణ్ సందేశ్ హీరోగా నటించిన ఈ



చిత్రాన్ని రాజేశ్ జగన్నాథం స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ సినిమా టీజర్‌ను నటుడు నవీన్ చంద్ర రిలీజ్ చేసి, యూనిట్‌కు అభినందనలు తెలిపారు. 'జీవితంలో కొన్నిసార్లు తప్పని తెలిసినా చేయక తప్పదు' అనే డైలాగ్‌తో మొదలైన ఈ టీజర్‌లో ఎన్నో కోణాలు ఉన్నాయి. ప్రేమకథతో పాటు మర్డర్ మిస్టరీ అంశాలు ఉన్నట్లు కనిపించింది. టీజర్‌లో విజువల్స్ సహజంగా ఉన్నాయి. థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌ను ఫీల్ అయ్యేలా నేపథ్య సంగీతం సాగింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోందనీ, త్వరలోనే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామనీ నిర్మాత చెప్పారు. ఆనీ చిత్రంలో కథానాయికగా నటించింది.

రాజ్ తరుణ్ కొత్తగా కనిపిస్తారు



రాజ్ తరుణ్ హీరోగా నటించిన చిత్రం 'పురుషోత్తముడు'. హాసినీ సుధీర్ హీరోయిన్‌గా పరిచయమవుతున్న ఈ చిత్రానికి రామ్ భీమన దర్శకుడు. డాక్టర్ రమేశ్ తేజావత్, ప్రకాశ్ తేజావత్ నిర్మాతలు. త్వరలో ఈ సినిమా విడుదల కానున్న నేపథ్యంలో బుధవారం సాయంత్రం టీజర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రాజ్ తరుణ్ మాట్లాడుతూ 'ఈ సినిమాకు కావాల్సినంత ఖర్చు పెట్టి, సినిమా బాగా వచ్చేలా చూశారు నిర్మాత రమేశ్. అలాగే దర్శకుడు రామ్, నేను ఒక అండర్‌స్టాండింగ్‌తో వర్క్ చేశాం. జూన్ 6న సినిమాను విడుదల చేయాలనుకుంటున్నాం. సెన్సార్ పూర్తయ్యాక విడుదల తేదీ ప్రకటిస్తాం' అని చెప్పారు. 'సినిమా తీయాలన్నది నా 30 ఏళ్ల కల. దర్శకుడు రామ్ చెప్పిన కథ నచ్చి వెంటనే ప్రారంభించాం. నా సోదరుడు ప్రకాశ్, నా సతీమణి, పిల్లలు ప్రొడక్షన్ వ్యవహారాలు చూసుకున్నారు. ఓ మంచి సినిమా ప్రేక్షకులకు అందిస్తున్నాం' అన్నారు నిర్మాత రమేశ్. దర్శకుడు రామ్ భీమన మాట్లాడుతూ 'రాజ్ తరుణ్‌ని తెరపై కొత్తగా ప్రజెంట్ చేసే సినిమా ఇది. ప్రేక్షకులకు ఐ ఫీస్ట్‌లా ఉంటుంది. బడ్జెట్ గురించి ఆలోచించకుండా పెద్ద ఆర్టిస్టులను ఇచ్చి సహకరించిన నిర్మాతలకు నా కృతజ్ఞతలు' అని చెప్పారు.

ఐదు భాషల్లో 'ప్రేమించొద్దు'



బస్తీ నేపథ్యంలో సాగే యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్ 'ప్రేమించొద్దు'. అనురూప్ రెడ్డి, దేవా మలిశెట్టి, సారిక, మానస ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రూపుదిద్దుకుంది. తెలుగు చిత్రం వచ్చే నెల 7న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో గురువారం టీజర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో దర్శకనిర్మాత శిరిన్ శ్రీరామ్ మాట్లాడుతూ 'ఐదు భాషల్లో సినిమా తీశాం. నాకు సహకరించిన టీమ్‌కు థాంక్స్' అని చెప్పారు. చాలా ఎమోషనల్ ఫిల్మ్ ఇదనీ, ప్రతి తల్లితండ్రులు తమ పిల్లలకు చూపించాల్సిన సినిమా అనీ సూపర్‌వైజింగ్ ప్రొడ్యూసర్ నిఖిలేశ్ చెప్పారు. హీరోగా తనకు ఇది మూడో చిత్రమనీ, మూడేళ్లు ఎన్నో కష్టాలు పడి శిరీన్ ఈ సినిమాను తీశారనీ అనురూప్‌రెడ్డి చెప్పారు.

భావోద్వేగాలతో అలరించే రాజు యాదవ్



'జబర్దస్త్' కమెడియన్ గెటప్ శ్రీను హీరోగా నటించిన చిత్రం 'రాజు యాదవ్'. ఈ సినిమాతో కృష్ణమాచారి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ప్రశాంత్‌రెడ్డి, రాజేశ్ కల్లెపల్లి నిర్మించిన ఈ చిత్రాన్ని ఈ నెల 24న విడుదల చేస్తున్నారు. సక్సెస్‌ఫుల్ నిర్మాత బన్నీ వాసు ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లో సినిమాను రిలీజ్ చేస్తుండడం విశేషం. 'మా సినిమా టీజర్, ట్రైలర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. సంగీత దర్శకుడు హర్షవర్ధన్ రామేశ్వర్ మంచి పాటలు అందించారు. లవ్, కామెడీ అంశాలతో పాటు హృదయాన్ని హత్తుకొనే భావోద్వేగాలతో సినిమా తప్పకుండా ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు నిర్మాతలు. ఈ చిత్రంలో అంకిత ఖరత్ కథానాయికగా నటించారు.